# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, జూన్, 2016 ₹ 25

ISSN 2454–4329



కుశలమా?

# మిసిమి
మాసపత్రిక

"All that we are is the product of what we have thought"
*- Dammapada*

**సంపుటి 27** **జూన్** **సంచిక 6**

*ప్రధాన సంపాదకుడు*
చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*
వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకుడు*
కాండ్రేగుల నాగేశ్వరరావు

సాంకేతిక సహాయకులు
పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుద్రముద్దీన్ జీ షాన్, వెల్దండ రమేష్,
వేముల రాణి, సారిక నిర్మల

*సంస్థాపక సంపాదకులు*
**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*
**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
**e-magazine : www.kinige.com/misimi**
**http://facebook.com/misimimaasapathrika**
**https://twitter.com/MISMIMONTHLY**

ప్రతి : ₹ 25/– సంవత్సరానికి : ₹300/–
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

LIBRARY OF CONGRESS LCCN 91-903060

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329


# ఈ నెల...


వేదిక ........ 5

తెలుగు సాహిత్యంలో సంచలనం –
తెన్నేటి హేమలత ........ 7
*– ఆర్.ఎస్. భరద్వాజ*

'విద్య' అంటే ప్రతిభా శిక్షణ ........ 18
*– ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

త్యాగమే ఊపిరిగా – బాధలే బాటలుగా... ........ 24
*– పిల్లుట్ల హనుమంతరావు*

అన్నమయ్య సంకీర్తనల్లో – అభ్యుదయ దృక్పథం ........ 30
*– ఆచార్య కోసూరి దామోదర నాయుడు*

మూర్తిదేవీ పురస్కార గ్రహీత –
ఆచార్య కొలకలూరి ఇనాక్ ........ 35
*– ప్రొ. రావినూతల సత్యనారాయణ*

వీనుల విందు – లలిత సినీ సంగీతం ........ 40

కవి కోకిల 'హలధర నాగ్' ........ 46
*– ఉమాదేవి అద్దేపల్లి*

మావుళ్ళయ్య ........ 53
*–ఎ.కె.*

నేనెరిగిన చంద్రాపూర్ ........ 54
*– కొసరాజు వెంకటేశ్వరరావు*

క్రోమోసోమ్ కథనమ్ – 10 ........ 60
*– ము.పా.సా.*

ఆ మనుషులేరి? ........ 64
*– మహీధర రామశాస్త్రి*

రెడ్ ఇండియన్లు : వ్యథాకవిత్వం ........ 68
*– నాగరాజు రామస్వామి*

నన్నెచోదుని జానుతెనుగు ........ 74
*– డా. జి. నాగయ్య*

పుష్పాంజలి కథలు : స్త్రీల సమస్యలు ........ 79
*– డా. పి. వరలక్ష్మి*

రాణీ చిన్నమాంబ ........ 86
*– డా. ఎమ్.వి. భారతలక్ష్మి*


కాంక్రీట్‌ను మైనంలా మలచిన – జహాఁ హదీద్ ........ 93
*– కాండ్రేగుల నాగేశ్వరరావు*

వేదిక ........ 95


*చిత్రకారుడు :*
*ముఖచిత్రం* : గర్ల్ విత్ పెరల్
*రెండవ అట్ట* : కుశలమా?
*మూడవ అట్ట* : కుశలమే!
*నాల్గవ అట్ట* : డెల్ఫ్ వీధి
జాన్ వెర్మీర్
*వివరాలు : 50 వ పుటలో...*

**మా**నవ చరిత్రలో యుద్ధాలు ఎప్పుడూ జరుగుతునూ ఉన్నాయి. ఆయుధాలే మారుతుంటాయి. అలాగే మానవ నాగరకతలో హింస నిరంతరమూ ఉంటూనే ఉంది. పనిముట్లే మారుతున్నాయి. సాంఘిక జీవితంలో దొంగలూ - బందిపోట్లూ ఎప్పుడూ ఉంటూనే ఉన్నారు. ఎటొచ్చీ పేరులే మారుతున్నాయి. అతివాదులనీ, ఉగ్రవాదులనీ, టెర్రరిస్టులనీ మరో ఇస్టులనీ, పేరు మార్పులే - వీరంతా ప్రభుత్వాలకు, చట్టాలకు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగించేవారే. ఇందుకు ప్రపంచంలో ఏ ప్రాంతమూ మినహాయింపు కాదు.

మరోవైపు చూస్తే చట్టాల పరిధిలో ప్రభుత్వాలను, ప్రజాధనాన్ని కొల్లగొట్టే ప్రబుద్ధులకు కొదవేమీలేదు. ఎటొచ్చీ వీరికి ప్రసార మాధ్యమాలలో ప్రచారం ఎక్కువగా లభిస్తుంది. ఇప్పుడు ఇలాంటివారే సినిమా కథానాయకులుగా తెరకెక్కుతున్నాయి. అంటే ఒకప్పటి విలన్సే ఇప్పటి హీరోలు. నాగరకత పూర్తివర్తులాకారంగా తిరుగుతోంది!



కవికోకిల

మొన్నీమధ్య కేంద్ర ప్రభుత్వం ప్రదానం చేసిన 'పద్మా'లలో అర్హులు - అనర్హులూ ఎవ్వరనేది ఇప్పుడు చర్చ కాదు. కాని ఒకే ఒక 'కవికోకిల' (పు. 46) గురించి ఎంతమంది విన్నారు? ఇలాంటివారి గురించి ప్రచారం ఏది?

సిద్ధాంతాలు - ఎలా భ్రష్టుపట్టిపోతాయో - ఎవరిని బలి తీసుకుంటాయో - హనుమంతరావు 'బాధలే బాటలు' చదివితే ఆశ్చర్యం - ఆవేదన కలుగుతాయి (పు. 24).

ఏ వాదాలను అడ్డుపెట్టుకోకుండా - తన రచనా కౌశలంతో సంచలనం సృష్టించిన తెన్నేటి హేమలత గురించి ప్రత్యేక వ్యాసం ఇస్తున్నాం - మొదటిసారిగా (పు. 7).



ఆత్మహత్యలను నివారించవచ్చు - వ్యవసాయంలో కాని, విశ్వవిద్యాలయం కాని - కాని అందుకు చొరవచూపే వ్యక్తుల అవసరం ఎంతైనా ఉంది. 'మావుళ్ళయ్య' (పు. 53) చదవండి -

అమెరికా వెళ్తే - ఒక నగరం చూస్తే చాలు - అన్ని నగరాలు అలాగే ఉంటాయి - అది ఆధునిక భవన నిర్మాణ శిల్పానికి ఒక కితాబు! అలాంటి వాస్తుశిల్పానికి వన్నెతెచ్చిన జహా హదీద్ వివరం చదవండి - (పు. 93).

-సంపాదకులు

# వేదిక

మిసిమి ఏప్రిల్ సంచికలో గీతం–సంగీతం చాలా మనోజ్ఞంగా వుండి, చాలా నిష్ఠుర సత్యాలను వెలికితీసింది.

వంటచేయడం రాకపోయినా భోజనపదార్థంయొక్క బాగోగులు చక్కగా నిర్ణయించవచ్చును. అదేవిధంగా పాట యొక్క బాగోగులు చెప్పడానికి కూడా సంగీతంలో పాండిత్యం అవసరం లేదు. కళ్ళను వర్షింపజేసేదే సిసలైన, అసలైన సంగీతం.



ఆకెళ్ళ మల్లికార్జునశర్మ

ప్రాథమిక వ్యాకరణం తెలియకపోతే భాషను సక్రమంగా వినియోగింపలేము. అందుచేత భాషను ప్రాథమిక వ్యాకరణంతో కలిపే నేర్పుతారు. అదేవిధంగా విశ్వజనీనమైన సంగీత భాషను కూడా యీ విద్వాంసులు ప్రాథమిక వ్యాకరణంతోబాటుగానే నేర్చుకొనేవిధంగా చేసివుంటే బాగుండేది. పాశ్చాత్యదేశాలవారు యీ అదృశ్యవిద్యయొక్క ఔన్నత్యాన్ని గుర్తించి యీ విద్యాభ్యసనాన్ని ప్రామాణీకరించి బి.టెక్., ఎమ్.టెక్., స్థాయి కోర్సులనుకూడా నిర్వహించే స్థాయికి చేరగా మనవారు అట్లు సక్రమంగా ప్రామాణీకరించుకొనలేకపోవడమేగాక యీ విద్య నభ్యసించిన గ్రాడ్యుయేట్లు, పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, డాక్టరేట్లలో చాలామంది దీనిలోగల వర్ణాలను కనీసం సమ, విషమగతులలోకూడా సక్రమంగా పాడలేని/వాయించలేని స్థాయిలోనే మిగిలిపోవడం మన జాతి దౌర్భాగ్యం కాదా!

మన భారతదేశంలో చాలా శాస్త్రాల సూక్ష్మాల విషయంలో గోప్యత పాటింపబడి అత్యంత కృషి చేసినవారికి మాత్రమే అది లభ్యమయ్యేలా రూపొందించబడ్డాయి. వీటిలో యీ సంగీతశాస్త్రం కూడా 10, 15 సం11లు గురుకులాభ్యాసం చేసినవారికి మాత్రమే యీ సంగీతం లభించేవిధంగా యీ సంగీతబోధనాపద్ధతి చాలాకాలం క్రితమే యీ విద్యలో నిష్ణాతులైనవారిచే రూపొందించబడి అదే సాంప్రదాయం కొనసాగింపబడుతూ వస్తోంది. ఈ సాంప్రదాయం నిరాటంకంగా కొనసాగడానికిగాను యీ సంగీత ప్రాథమిక వ్యాకరణానికి చెందిన లయ సూక్ష్మాలనుగాని, స్వర సూక్ష్మాలనుగాని, సంగీత రచనలను స్వరపరచి వ్రాయడాన్నిగాని, పాడడాన్నిగాని దాదాపు నిషేధించడం జరిగి కొంతమంది సంగీత విద్వాంసులు ధనసంపాదన కొరకు స్వరపరచిన సంగీత రచనలతో సంగీత గ్రంథాలను వ్రాసినాగాని వాటితోబాటుగా వాటినే పాడి రికార్డుచేసిన క్యాసెట్లుగాని, సీడీలుగాని, డీవీడీలుగాని విద్యార్థులకు అందకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకున్నారు పాపం! అంతా గురుముఖతః నేర్చుకోవలసినదే. గత్యంతరం లేదు.

త్యాగరాజాదులు యీ సంగీతాన్ని ఆధ్యాత్మిక సాధనకు మాత్రమే వినియోగించి ఆ విధంగా ఆ సర్వేశ్వరునిపై రచించిన అనేక కృతులను యిక్కడే వదలిపోయారు. ఆ కాలంలోకూడా రాజస్థానాలలో సంగీతవిద్వాంసులనేకమంది వున్నాగాని పండితుడైన రాజునూ, రాజసభలోగల యితర పండితులనూ తమతమ సంగీత ప్రదర్శనలద్వారా మెప్పించడం వరకే వారు దీనిని వినియోగించారు. కాని, ఆ రాజుల రోజులుపోయిన తర్వాత యీ సంగీత ప్రదర్శకులంతా సామాన్య ప్రజాభీష్టానికి అనుగుణంగా తమ సంగీత ప్రదర్శనలను రూపుదిద్దుకోవలసి వచ్చి, యీ ప్రజానీకానికే యీ విద్యాబోధన చేయడంలో అధ్యాపక అవతారం కూడా యెత్తవలసి వచ్చి, దీనిలోని ఆధ్యాత్మికత పూర్తిగా నామమాత్రావశిష్టమై లౌకికత వెర్రితలలు వేసి యితర సాంప్రదాయ విద్యలవలె సామాన్య ప్రజానీకానికి అతి సులభంగా అందకుండా చాలాకాలం చాలా శ్రమను పడగలవారికి మాత్రమే లభించేవిధంగానూ, యీ విద్వాంసులకు మాత్రం చాలా అనుకూలంగా వుండేవిధంగానూ యీ సంగీత విద్వాంసులచేతనే "బ్రహ్మపదార్థం"లా రూపొందింపబడిందని రమారమీ 40 సం11లకుపైగా సాగుతూ వస్తున్న నా తీవ్రపరిశోధనలలో నిర్ద్వంద్వంగా ఋజువై అమితమైన బాధను కలిగించింది. దీనిమూలంగా అత్యంత విలువైన విద్యార్థుల కాలమూ, శారీరకశ్రమా, ధనమూ అన్యాయంగా కరగిపోవడం బాధాకరం కాదా?

నా యీ పరిశోధనలలోనే యీ సంగీత ప్రదర్శకులంతా పరభాగ్యోపజీవులేగాని అధ్యాపకత్వానికి యేమాత్రమూ పనికిరారనే నిజం వారికికూడా తెలియదనీ, సమాజంలో యెవరికీకూడా అసలే తెలియదనీ, నేనుకూడా ప్రదర్శకుడిగా

ఆకోవకు చెందినవాడినే అయినాగాని మరొకప్రక్కన పూర్ణకాలిక అధ్యాపకుడిగాకూడా పనిచేయవలసి వచ్చి కొంతవరకు మాత్రమే నిజాయితీగా సామాజికసేవలనుకూడా చేయగలిగాననీకూడా ఋజువైనది.
కాని, ప్రభుత్వ సంగీత విద్యాలయాలలో నా 35 సం॥ల అధ్యాపక జీవితంలో విద్యావిషయిక పర్యవేక్షణ అనబడేదేదీ ఎప్పుడూ లేక పోవడంచేత బేఫికరుగా రిటైరవగలిగినాగాని, రిటైరైన 5 సం॥ల తర్వాత 2001లో నేనుకూడా అధ్యాపకుడిగా పనికిరాననే విషయం ఆ సర్వేశ్వరుడు ఋజువుచేసి నాలో సమూల మార్పులనుదెచ్చి చరిత్రలో ప్రప్రథమమూ, అనన్య సామాన్యమూ, అతిసులభమూ, అతి త్వరితమూ అయిన సంగీతాభ్యసన పద్ధతిని అనుగ్రహించడం జరిగినది. నిజానికి అప్పటినుండియే నా నిజమైన అధ్యాపక జీవనానికి పునాది యేర్పడి నా ప్రతిభ సమాజానికి నిజాయితీతో వినియోగపడిందని చెప్పాలి.
2001 నుండి యీ నూతన సంగీతాభ్యసన పరిణామక్రమం ప్రారంభమై క్రమక్రమంగా యీ సంగీత విద్వాంసుల దురాగతాలన్నీ బయటపెడుతూ (అవసరమైతే వీటిని ససాక్ష్యంగా ఋజువు చేస్తాను) సామాన్య ప్రజానీకంలోని సంగీత విద్యార్థులందరకూ అతి త్వరితంగా ఒక సంవత్సర కాలంలోనే అతిసమర్థవంతంగా సంగీతప్రదర్శన నీయగలగడమేగాక యిదేవిధంగా యితర విద్యార్థులనుకూడా రూపొందించగలిగే అధ్యాపకునిగాకూడా తీర్చిదిద్దగలిగే విధానం అతి సమర్థవంతంగా అమలుచేయబడుతూ మన జాతి అభ్యున్నతికి అమితంగా దోహదం చేస్తోంది. కాని, ప్రతిదినమూ 4 గంటలకాలం సాధన చేయగల 10 సం॥లలోపు వయస్సుగల చిన్నారులకు మాత్రమే యిది ఫలిస్తుంది.
వంట వండడంకాని, మోటారు సైకిలును నడపడం గాని నేర్పే గురువు, ఆ విద్యార్థిచేతనే దానికి సంబంధించిన పనులను చేయిస్తూ ఆ విద్యలను నేర్చుకునే విధంగా చేయాలనీ అదేవిధంగా యీ సంగీతవిద్యనుకూడా 99% పనులను విద్యార్థియే స్వయంగా చేస్తూ యీ విద్యను నేర్చుకుంటే ఒక సంవత్సరంలోగానే దీనికి సంబంధించిన వ్యాకరణం నేర్చుకుని సమర్థవంతంగా చిన్న కచేరీలు కూడా చేయగలడని తెలియవచ్చి దానికి తగినట్లుగా విద్యార్థికి తోడ్పడేవిధంగా రికార్డు చేసిన సీడీలతోబాటుగా అందజేసిన 5 సంగీత గ్రంథాలతోపాటుగా రమారమీ 1000 వీడియోలను youtube.com/user/msakellaకు అనుసంధానించగా వాటిని వినియోగించుకుని ప్రపంచవ్యాప్తంగా గల అనేకమంది విద్యార్థులు, అధ్యాపకులు కూడా లాభపడుతూ వుండడం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది.
నిజానికి మన కర్ణాటక సంగీతం ప్రపంచంలో గల అన్ని సంగీతాలకంటే అత్యంత విజ్ఞానవంతమైనది. దీనిలో సరిగమల గమకాలు కూడా అంతే విజ్ఞానవంతమైనవి. నిజానికి యీ గమకాలు, వండే పదార్థంలోని ఉప్పులాంటివి. ఏమాత్రమూ ఎక్కువ తక్కువలు లేకుండా వుండాలి. కాని, హిందూస్తానీ సంగీతజ్ఞులవలె స్వచ్ఛస్వరాలను శ్రుతిలో మేళవించి పాడే సహజ సామర్థ్యము మన సంగీతజ్ఞులకు అతి తక్కువస్థాయిలో వుండడం వలన మనవారిలో చాలామంది యీ గమకాలను క్లిష్టమైన యితర విషయములతోపాటుగా జతచేసి ప్రదర్శిస్తూ వారి పబ్బం గడుపుకొంటూండగా ఆ సహజ పాండిత్యం కలవారు మాత్రం వీటితోబాటుగా స్వచ్ఛస్వరాలకూ, జనరంజకత్వానికీ మాత్రమే ప్రాముఖ్యం కలిగిన సినీసంగీత పాటలను కూడా పాడుకొనగలిగి సమాజంలో అందరి మన్ననలనూ చూరగొంటున్నారు.
సూటిగా చెప్పాలంటే ఉద్రేకాన్ని రేకెత్తించే వెలయాలి బాహ్యసౌందర్యంగాని, డిటెక్టివ్ నవలలోని ఆసక్తిని రేకెత్తించే కథా సంవిధానంగాని, "చెంగావి రంగుచీర కట్టుకున్న చిన్నది–అహ దీని జిమ్మదియ్య" వంటి జుగుప్సాకరమైన ద్వంద్వార్థాలతో విరాజిల్లే సినీపాటలు గాని ఎక్కువమందిని ఆకర్షించవచ్చునుగాని, సంసారస్త్రీకి గల పవిత్రత, శీలసంపదలుగాని, భారత భాగవత రామాయణాది పద్య గద్య కావ్యాలకుగల ఆధ్యాత్మిక సంపదగాని, ఆచంద్రతారార్కంగా ప్రపంచంలోని యే దేశంలోనైనా ఒకేవిధంగా పాడుకొని ఆనందించే త్యాగరాజాది మహాభక్తుల శాస్త్రీయ సంగీత రచనలైన భక్తికీర్తనలుగాని తక్కువమందినే ఆకర్షించినాగాని వీటి విలువ, పవిత్రత, మానసికశాంతులు అలౌకికాలుకదా!

ఆకెళ్ల మల్లికార్జునశర్మ
ఫోన్: 990 882 2992




# తెలుగు సాహిత్యంలో సంచలనం - తెన్నేటి హేమలత


తెన్నేటి హేమలత

- ఆర్.ఎస్. భరద్వాజ

**ప్రవేశిక :**

లత అనగానే పాఠకుల స్మృతిలో నిర్భీతి అనే విశేషణం మెదులుతుంది! "ఏమంటే ఏం ముంచుకు వస్తుందో, ఏం వ్రాస్తే ఏం వివాదం అవుతుందో?" అన్న భయంలేని అతి కొద్దిమంది రచయితల్లో ప్రముఖంగా పేర్కొనదగిన రచయిత్రి లత. కీర్తీ, అపకీర్తీ సమపాళల్లో మోసిన తెలుగు రచయితలు గుడిపాటి వెంకటాచలం మరియు శ్రీమతి లత! ఒకప్పుడు వారి రచనలు శిష్ట కుటుంబాలలోని యువతీ యువకులు చదువుట సహితం తప్పుగా పరిగణించబడినది. ఆ ఇద్దరు రచయితలు సెక్స్ విశృంఖలంగా వారి రచనలలో చొప్పిస్తారని అప్రతిష్ట! సూక్ష్మంగా పరిశీలిస్తే, ఆ విషయం లత విషయంలో సమంజసం కాదేమో అన్న భావన పఠితల హృదయాలలో తప్పక కలుగక మానదు. "జాగ్రత్తగా గమనించి అర్థం చేసుకోవలసిన విషయం లత వ్రాసిన నవలల్లో స్త్రీ వ్యక్తిత్వ వైశిష్ట్యానికి కాక, జీవితంలో అనుభూతి వైవిధ్యాన్ని కూడా సాహసంతో అన్వేషిస్తున్నట్లు పాత్ర చిత్రణం జరిగిపోయింది. సంప్రదాయానికి మారుతున్న స్త్రీకి అనివార్యంగా సంభవించే ఘర్షణ పదేపదే గుర్తుకు తెస్తూ, పాత్ర చిత్రణం చేస్తుంది లత" అంటారు ఆర్.యస్. సుదర్శనం. లత నవలలు వివాహం విధించిన ఆంక్షలను ధిక్కరించి జీవితంలో అపజయం పాలయ్యారనుకునే స్త్రీల పట్ల సానుభూతిని కలిగిస్తాయి. ఆధునిక కాలంలో క్రొత్తగా దొరికిన అవకాశాలను, స్వేచ్ఛను ఏంజేసుకోవాలో అర్థం కాక, తమ జీవిత లక్ష్యం ఏమిటో తేల్చుకోలేక, సంఘర్షణ పడే స్త్రీల పాత్రలను సృష్టించారు రచయిత్రి లత. సభ్యసమాజం పతితలని అసహ్యించుకొనే స్త్రీలలో ఉండే మానవత్వాన్ని పరిచయం చేశారు లత తమ రచనల ద్వారా. *రక్తపంకం, గాలిపడగలూ - నీటిబుడగలూ, సప్తస్వరాలు, ప్రేమరాహిత్యంలో స్త్రీ* మొదలైన నవలల్లో ఆమె వివాహ సంబంధాలలో కపటత్వానికీ, వైరుధ్యాలకూ బలైపోతున్న స్త్రీల జీవన స్థితి గతులను పాఠకుల కళ్ళకు గట్టినట్లుగా చిత్రించారు.

1974 లో రంగనాయకమ్మగారు వ్రాసిన *రామాయణ విషవృక్షం* అనే గ్రంథాన్ని ఖండిస్తూ లతగారు 1977లో రామాయణ *విషవృక్ష ఖండన* అనే మరో పుస్తకాన్ని రచించారు. ఈ రెండు పుస్తకాల మీదా హోరాహోరీ చర్చలు జరిగాయి. చర్చలలో ఆనాటి ప్రముఖ రచయితలూ, పాఠకులూ (స్త్రీలు, పురుషులూ) ఇరువైపుల వాదోపవాదాలలో పాల్గొన్నారు. తెలుగు సాహిత్యంలో జరిగిన ఒక చారిత్రాత్మక సంఘటన ఇది! ఈ వాదోప వాదాలలో పాల్గొన్న ప్రముఖ రచయిత కొడవటిగంటి కుటుంబరావు *రామాయణ విషవృక్షం, ఒక పరిశీలన* అన్న మరో పుస్తకం రచించారు. లతగారిని ఒక వివాదస్పద రచయిత్రిగా చిత్రించుటలో పైసంఘటన ఎక్కువగా ఉపకరించింది. ఏది ఏమైనా, లతకు రచయిత్రిగా రావలసిన ఖ్యాతి లభించలేదని, ఆమె రచనలపై నిష్పాక్షిక మూల్యాంకనం జరుగలేదనే అభిప్రాయంతో ఏకీభవిస్తున్నారు ఈ వ్యాస రచయిత. ప్రస్తుత వ్యాసంలో లత జీవిత విశేషాలను, ఆమె రచించిన కొన్ని ముఖ్య రచనల విశ్లేషణ క్లుప్తంగా పాఠకుల ముందుంచడమైనది. విజ్ఞులైన **మిసిమి** పాఠకులు నా యీ ప్రయత్నాన్ని హర్షిస్తారని ఆశిస్తాను.

**లతగారి జీవిత విశేషాలు :**

లతగారు విజయవాడలోని హనుమాన్‌పేట, తెన్నేటివారి వీధిలో మేనమామల ఇంటియందు 15 నవంబరు 1932వ సంవత్సరంలో జన్మించారు. నిభానుపూడి విశాలాక్షి, నారాయణ రావుగారలు ఆమె తల్లిదండ్రులు. లతగారికి

ప్రకాశరావు అనే ఒక తమ్ముడున్నాడు. లతగారి స్వగ్రామం కృష్ణాజిల్లాలోని నిమ్మలూరు. లతగారికి తల్లిదండ్రులు పెట్టిన పూర్తి పేరు జానకీరామ కృష్ణవేణి హేమలత! లతగారి తాతగారైన ప్రకాశరావు సంపన్న కుటుంబీకులు. ఆయన కాంగ్రెసు సంస్థలో జేరి, పట్టాభి సీతరామయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు గార్లతో జాతీయోద్యమంలో ప్రవేశించి, కరిణీకానికి రాజీనామా ఇచ్చారు. అంతేకాక, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1931లో కారాగారవాసులైనారు. లతగారి తండ్రిగారైన నారాయణరావు గారి జీవితం భోగలాలసమైనదని ప్రతీతి! అందుకే లత జీవితం కొంతవరకు సాంప్రదాయబద్ధంగానే త్యాగం, భోగం సమపాళాల్లో పరుగులుతీసి, వైరాగ్యము - విలాసము ఆమె రచనలో, అనుభూతిలో, పరిశీలనలో ద్యోత్యకమవుతుంటవి. లత గారాబంగా పెరిగిన బాలిక. మాతామహులైన తెన్నేటి లక్ష్మీకాంతంగారు ఆమెను అల్లారు ముద్దుగా పెంచారు. లత బాల్యం బందరు, విజయవాడ, మద్రాసులలో గడిచింది. లత స్కూలు చదువు అయిదో క్లాసు వరకే అయినా ఇంట్లో తండ్రి శిక్షణలో తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషు గ్రంథాలు చక్కగా అభ్యసించారు. తండ్రి మరణించే సమయానికి లత వయసు 32. తండ్రి మీద గౌరవంతో తమ్ముని తనే చదివించి పెద్దజేశారు.

లతగారికి 1941వ సంవత్సరం ఆమె తొమ్మిదవయేట తెన్నేటి అచ్యుతరామయ్య గారితో వివాహమైంది. ఆమెకు అదృష్టవశాత్తు ఆమె భావాల్ని అర్థం చేసుకొని, సానుభూతితో పాటు, ప్రోత్సాహాన్ని సైతం లభింపజేసే, భర్త లభ్యం కావటం విశేషమని చెప్పక తప్పదు. ఆమె తన జీవన సహచరునిలో భర్తని మాత్రమే కాదు, అపార కరుణామయుడైన, ఆప్తుని, స్నేహితుని సైతం చూడగలిగింది. భర్త ఆరోగ్యం క్షీణించడం ఒక ప్రక్క, ఇద్దరు పిల్లలు, మొదటి కొడుకు నారాయణరావు 1956లో, రెండవకొడుకు మోహనవంశీ 1963లో సిజేరియన్ ఆపరేషన్ ద్వారా పుట్టడంతో ఆమె తీవ్రమైన మానసిక క్షోభకు, అదే విధంగా ఆర్థిక ఇబ్బందులకు లోనయ్యారు. తను మొదటి నుంచి చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడానని (అంతరంగ చిత్రం)లో ఆవిడే స్వయంగా చెప్పుకున్నారు. శతాధికంగా రచనలు చేసి, దాదాపు నాలుగు దశాబ్దాల పాటు తెలుగు పాఠకుల్ని ఉక్కిరి బిక్కిరి చేసిన గొప్ప రచయిత్రి తెన్నేటి హేమలత, తన అభిమాన, ఆరాధకులను విచారగ్రస్థులను చేసి, 1977లో 65 సంవత్సరాల ప్రాయంలో కన్నుమూశారు. తెలుగు నవలా సాహిత్యాకాశం నుండి ఒక తార రాలిపోయింది!

**లత సాహిత్య ప్రస్థానం :**

పూవు పుట్టగానే పరిమళిస్తుందనేది ఒక సామెత! అన్నిపూలూ కాకపోయినా, కొన్నిమాత్రం పుట్టగానే పరిమళిస్తాయి! పరిమళమిచ్చే పుష్పాలున్నవి కాని, సువార్ణానికి ఉండే విలువ వాటికి లేదు! సువర్ణానికి విలువ వుంది కాని, తావిలేదు! విశిష్ట పువ్వునకుండే తావి, మేలిమి బంగారానికి ఉండే విలువ సంతరించుకొనిన సార్థక నామధేయ హేమలత! ఆమె తన ఎనిమిదవ ఏటనే ఒక చిన్న కథ వ్రాసింది! ఒక రాజకుమారిని కెంపు అను పేరుగల ఆంగ్లేయుడు చెరపట్టగా, మరో హిందూ రాకుమారుడు ఆ ఆంగ్లేయుని ఎదిరించి ఆ రాకుమారిని విడుదల చేయడం ఆ చిన్న కథలోని ఇతివృత్తం! దీనిని బట్టి లత రచనా కుశలతకు పునాదులు బాల్యంలోనే స్థిరంగా నెలకొల్పబడినవని మనం భావించవచ్చు. తన పద్దెనిమిదవ యేట "శిలాహృదయం" అనే నాటిక వ్రాశారు. దానిని హైదరాబాద్ దక్కన్ రేడియో వారు 1953 లో ప్రసారం చేశారు. అలా రేడియో నాటికలతో రచయిత్రిగా జీవితం ప్రారంభించిన లత తర్వాత మూడేళ్ళకి "ఊహాగానం" అనే శీర్షిక నిర్వహించే స్థాయికి ఎదిగారు. ఊహాగానం శీర్షిక ద్వారా లత వివిధ సాహితీ మూర్తులను పరిచయం చేశారు. ఆ శీర్షిక వ్రాస్తున్న కాలంలోనే హేమలత ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో ఎనౌన్సరుగాను, స్క్రిప్ట్ రైటరుగాను చేరారు. దాదాపు పదిసంవత్సరాల కాలం ఆ ఉద్యోగంలో ఉన్నారు. ఆ ఉద్యోగం ఆమె రచనా కౌశల్యానికి పదును పెట్టింది. ఒకవైపు చక్కటి సంభాషణలు, నాటికలు, నవలలు, నాటకాలు, కథలు, వ్యాసాలు ఇలా వివిధ సాహిత్య ప్రక్రియలలో రాణించే అవకాశం ఆమెకు కలిగించింది. ఆ కాలంలో ఆకాశవాణి కేంద్రాలు రచయితలకు, కళాకారులకు నిలయంగా ఉండేవి. అందువలన పరస్పర పరిచయాలు, స్నేహాలు పెంచుకోవడానికి వీలుండేది. ఆ విధంగా లతగారికి సాహితీ రంగంలో హేమాహేమీలందరితో సన్నిహితం ఏర్పడింది.

లతగారు తమ నవలల్లో స్త్రీ పురుష సంబంధాలకే ప్రాముఖ్యతనిచ్చారు. స్త్రీ పురుష సంబంధాలలోని సంక్లిష్ట సందర్భాలను, వైరుధ్యాలను, ఎంతో సానుభూతితో

చిత్రించారు. "గాలిపడగలూ - నీటిబుడగలూ" నవలికతో మొదలైన ఆవిడ సాహితీ వ్యాసంగం నిరంతరంగా సాగింది. ఆవిడ మాటల్లోనే "నేను 105 నవలలు, 700 రేడియో నాటకాలు, 100 చిన్న కథలు, 10 రంగస్థల నాటకాలు, 5 సంపుటాల సాహిత్య వ్యాసాలు, 2 సంపుటాలు సాహిత్య విమర్శలు మరియు ఒక సంపుటి లత వ్యాసాలు, ఇంకా 25 "చరిత్రకందని ప్రేమకథలు అనే కవితలు వ్రాశాను". ఆమె రచనలు విలక్షణ భావజాలంతో సుసంపన్నమైనవి. ఆమె రచనల్లో, ఆలోచనా విధానంలో అసాధారణమైన వైవిధ్యం మనకు కనబడుతుంది. ఆ రోజుల్లో రచనా వ్యాసంగంతో చెప్పుకోదగిన ఆదాయం ఆర్జించే రచయితలలో లతగారొకరు! తెలుగు దేశంలో ఇదిఒక పెద్ద గర్వ కారణంగా భావించాలి! లతగారి రచన లన్నిటి గురించి సూచన ప్రాయంగా కొన్ని మాటలు వ్రాసినా అది ఒక మహాగ్రంథంగా తయారవుతుంది. వ్యాస రూపంలో ఆ పని అసంభవం. అందుచేత, కొన్ని ముఖ్యమైన రచనలు మాత్రం స్థూలంగా చర్చించడమైనది.

**గాలిపడగలూ - నీటిబుడగలూ :**

ఇది 1953లో అచ్చైన లతగారి మొదటి నవల, 96 పేజీల పుస్తకం. ఆమె మాటల్లో "ఈ నవల పతిత స్త్రీల బ్రతుకుల ఫోటోగ్రఫి". ఇందులోని ఇతివృత్తం ఈ క్రింది విధంగా సాగుతుంది. రాజమ్మ అనే ఒకానొక ప్రౌఢ స్త్రీ ఒక మానినీ మాన విక్రయశాల (వ్యభిచారగృహం) నిర్వహిస్తూ, తొమ్మిదిమంది యువతులతో వ్యాపారం చేస్తూ ఉంటుంది. ఆ యువతుల్ని ఒక రక్షక భటుడూ, బజార్లో లేకిగా తిరిగే రౌడీ, ఒక కవీ, విద్యార్థులూ, కొందరు పెద్దమనుష్యులుగా చలామణి అయ్యేవారంతా, భౌతికంగా వారిని ఆరాధిస్తూ (అనుభవిస్తూ) మానసికంగా అసహ్యించుకుంటారు! ఈ యువతులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించినందులకు రాజమ్మకు లభించే నెలసరి ఆదాయం ఒక గజిటెడ్ ఆఫీసరు జీతంతో సమానంగా ఉండేది! రాజమ్మ గృహంలో నివసించే యువతులలో క్షత్రియ కులానికి చెందిన సీత అనే యువతి ఒకర్తె. ఒక యువకుని దుష్ట ప్రేమకు బలై, రాజమ్మ ఆశ్రయంలోకి వస్తుంది. ఇలా ఉండగా, పంతులు అనే ఒక సంఘ సంస్కర్త వ్యభిచార నిర్మూలనకు కంకణ బద్ధుడై, తన కాలాన్ని, శ్రమనూ, సంపత్తినీ వెచ్చించి, పతిత జనోద్ధరణ ఆశ్రమాన్ని స్థాపించి నడుపుతుంటాడు. అందులో బాల్య వితంతువైన పార్వతి, మరొక ఇద్దరు అభాగ్య స్త్రీలూ ఉంటారు. ప్రజల ప్రోత్సాహం లేక పంతుల ప్రయత్నం విఫలమౌతుంది.

ఇలా ఉండగా, సీత మళ్ళీ మామూలు జీవితం గడపాలనే ఆశయంతో, పంతులు, పార్వతి యొక్క సహాయ సహకారాలతో తాలుకా ఆఫీసులో గుమాస్తాగా పనిజేసే, సుబ్బారావును పెండ్లి చేసుకుంటుంది. ఒక సంవత్సరము పాటు అతనితో కాపురముచేసి ఒక కొడుకును కంటుంది. సుబ్బారావు సీతను పంతులు, పార్వతీ కలిసి సమకూర్చిన అయిదువేల రూపాయలకు ఆశపడి పెండ్లి చేసుకున్నాడే కాని, ఆమెను ఇష్టపడి కాదు. తర్వాత, తర్వాత అనుమాన దృష్టితో ఆమెను హింసించుటయేకాక, పుట్టిన పిల్లవానికి తను తండ్రిని కాదని సీతను నానాకష్టాలు పెడతాడు. సీతకు అవమానము, తిరస్కారమే లభిస్తుంది. అందుచేత ఆమెకు మరల వ్యభిచారమే శరణ్యమౌతుంది. అలాగే, సుశీల అనే యువతి సినిమాలో నటించి, సంపాదనతో పాటు పేరు ప్రతిష్టలు గడించాలనే ఆశతో ఒక extra supplier చేతిలో కీలు బొమ్మగా మారి, విధిలేక, వేశ్యగా జీవనం గడుపుతుంది.

పేరుకు హుందాగా జీవిస్తున్నామంటూ సంఘంలోని పెద్దమనుష్యులు మద్రాసులో సహస్రనామం అనేవాడు స్థాపించిన ఫ్రెండ్స్‌సర్కిల్ అనే సంస్థలో జేరి, అనేక దుండగాలు చేస్తారు. మితిమీరిన విలాస జీవితానికి అలవాటుపడి, ధనార్జన ఆవశ్యకము కాగా శ్రీమంతుల్ని ఆశ్రయించే గృహిణి, ఒక ప్రైవేటు డాక్టరు వద్ద చాలీచాలని జీతంతో నర్సుగా పనిజేస్తూ, జీవితావసరాల కోసం వికృత ప్రేమకైనా లొంగిపోయే మళయాళీ యువతి ప్రేమా, గౌరవ ప్రదమైన పనిచేసుకుని జీవించడానికి ఆస్కారముండి కూడా, శ్రమించడానికి ఇష్టపడక, తేలికగా ధనం లభ్యమయ్యే పడుపు వృత్తిని చేబట్టినవారు కొందరు మనకు ఈ నవలలో కనిపిస్తారు! అందుకే అంటారు రచయిత్రి "కొందరు పొట్ట గడవక పతితలవుతారు. మరికొందరు పొగరు కోసం పతితలవుతారు" అని. ఏ పని చేయలేని నిర్భాగ్యులు శీలం అమ్ముకుని జీవిస్తూ ఉంటారు. దరిద్రంవల్ల, మోసగింప బడటంవల్ల స్త్రీ చెడిపోతుంది. అంతేగాక, భర్తతో పోట్లాడి, మతి పోగొట్టుకుని, కోపావేశంతో ఇల్లు విడిచి ఒక స్నేహితుని వెంట శేషించిన రాత్రి గడిపిన పంకజవతి అనే మహిళ కూడా ఈ నవలలో దర్శనమిస్తుంది!

సామాన్యంగా పడుపు వృత్తిలో జీవించే వారి ఆయుర్ధాయం పది సంవత్సరాలు మాత్రమేనని రచయిత్రి

వెల్లడిస్తూ, హీనమైన మొగ పిశాచాలు తమ వికృతమైన కామవాంఛలు సిగ్గు, ఎగ్గు, బిడియమూ, అభిమానం లేని దుష్టచతుష్టయమైన రచయితా, డాక్టరు, సినిమా ప్రొడ్యూసరు, లాండులార్డు వంటి వర్గములోనూ, జ్వరతీవ్రతలో భరింపరాని వేడిగా ఉండే యువతీ శరీరాలను ఆపేక్షించే చెట్టియారులోనూ, ఆరుపౌన్ల మంచు ముక్కలతో యువతి శరీరాన్ని శీతలపరచి, సంతసించి దరికి వచ్చే యూరోపియన్‌లోనూ, దేవాలయంలోని అమ్మవారి నగలూ, చీరా తెచ్చి, వాటితో అలంకరించి, తల విరబోసుకోమని చెబుతూ ఒక కాలు మడచి, ఇంకో కాలు క్రిందకు వ్రేళ్ళాడేసి, ఒక చేతితో అభయ ముద్రను, మరొక చేతితో పువ్వును ధరింపజేసి ... అమితమైన ఉద్రేకంతో పతితులైన యువతుల మీదకొచ్చే పూజారిలోనూ, విలయ తాండవం సల్పిన వైనం హృదయ విదారకంగా వర్ణించారు లతగారు. చివరలో ఈ నవలలోని సీత పాత్ర మరణిస్తుంది. సీత చావు పాఠకులకు బాధ కలిగిస్తుంది. అయితే, సీత చావు సమస్యా పరిష్కారానికి ఉపకరించదు. అదే సీత, సిద్ధాంత విజయం కోసం పోరాడి మరణిస్తే, బాగుండేది! ఒక విధంగా ఆలోచిస్తే, రచయిత్రి తను చర్చించిన సమస్యకు ఎటువంటి పరిష్కారమూ సూచించలేదు.?

గాలిపడగలూ – నీటిబుడగలూ ప్రచురణ తెలుగునాట ఒక తుఫాను రేపింది! తెలుగు పాఠక లోకాన్ని పెనునిద్దర నుండి మేల్కొలుపు పాడింది. తెలుగు సాహిత్యంలో తొలిసారిగ వేశ్యలూ, ముఖ్యంగా రూపాయికీ, అర్థ రూపాయికీ తమ శరీరాల్ని పణంగా పెట్టి విటుల క్రూర హింసలు భరించి, రోగాల పాలయి, రోడ్డువార హేయంగా కుక్క చావులు చచ్చే ఆడవాళ్ళ జీవితాలను అరటిపండు ఒలిచి చేతబెట్టినంత విపులంగా చిత్రించిన తొలి మహిళా రచయిత్రి లతగారు. మగవాళ్ళు బాధ్యతలు విస్మరించి గాలిలో విశృంఖలంగా తేలిపోయే గాలిపడగల్లాంటివారనీ, వారివల్ల స్త్రీల జీవితాలు నీటిబుడగల్లా చితికిపోతాయనీ లతగారు ఈ నవల ద్వారా ప్రతిపాదించారు. ఈ నవల శిష్టజనులు తమ ఇళ్ళలో బహిష్కరించేవారు. ఈ నవలమీద ఘాటైన విమర్శలు వచ్చాయి. "స్త్రీ అయి లత ఇలా వ్రాయడమా?" "ఇన్ని సంగతులు ఈమెకు ఎలా తెలిశాయి?" "ఇంత అసహ్యంగా, పచ్చిగా వ్రాయట మేమిటి'?' ఇవేగాక, వీటికి అనుబంధంగా లక్షప్రశ్నలు, కోటి నిందలు విమర్శల రూపంలో గుప్పించారు. అనేకులు! "ప్రయోజనాన్ని ఆశించి చేసే రచన ఫోటోగ్రఫీ వంటిది ... వీరేశలింగం పంతులుగారు వితంతు వివాహాల్ని ప్రోత్సహించే నిమిత్తం బాలవితంతువుల ప్రవర్తనని వర్ణించారు. అందులో ఎన్నో అశ్లీలాలు చోటు చేసుకున్నవి... అందుకని పంతులుగారు పండితులుకారని గాని, అశ్లీలాన్ని వారి అనుభవాలే అనిగాని అనలేము ... గాలిపడగలూ – నీటిబుడగలూ వ్రాసినందుకు నేను సిగ్గు పడను" అని జవాబు ఇచ్చారు లత. మరో సంగతి, రచయితకూ, జీవితానికీ, రచనకూ పరస్పర సంబంధముందని, ఇదొక నిరంతర చక్రభ్రమణమంటూ, జీవన కుసుమం వికసించీ, వికసించకుండానే, వడలి నశించిపోతున్న ఈ అభాగ్య యువతుల కర్మకు కర్తలెవరని, సంఘ నిర్మాణంలో ఏ లోటు ఉండటం మూలాన, ఇన్ని బ్రతుకులు బజారుపాలవుతున్నవని ప్రశ్నిస్తుంది రచయిత్రి లత!

సహజంగా మనకు కుళ్ళు చూడటం నచ్చదు. మన సంఘంలో ఇంత కుళ్ళు ఉన్నదని ఒప్పుకోవడానికి మన మనసొప్పదు. అందుచేత కుళ్ళుమాట వదిలేసి, ఆ విషయాన్ని బహిరంగంగా వెల్లడించిన రచయిత్రి మీద విరుచుక పడ్డారు విమర్శక మహాశయులు! వారు ముఖ్యంగా లేవదీసిన ప్రశ్నలు రెండు – మధ్యతరగతి కుల స్త్రీకి ఇలాటి సెక్సు విషయాలు ఎలా తెలిశాయి? స్త్రీ అయిన లత ఇంత విపులంగా సెక్సు గురించి ఎలా వ్రాయగలిగింది? ఈ రెండు ప్రశ్నలకూ లత సమాధానము – "చూచాను కనుక వ్రాశాను. రెండోది నా చేతిలో కలం చిత్రకారుని చేతిలో కుంచె వంటిది. నేను చూచిన దృశ్యాన్ని నా కలం చిత్రించింది..." అంతేకాదు తాను వ్రాసిన సెక్సు వెగటు కలిగించేదే కాని, ఉద్రేకమూ, ఉత్సాహమూ కలిగించేది కాదు. అంటారామె! ఈ నవలలో రచయిత్రే ప్రేక్షకురాలు రచయితా రెండూను!

**ఎడారి పువ్వులు :**

ఇటీవల కాలంలో వచ్చిన మంచి నవలలో ఒకటిగా ఎడారి పువ్వులు నవలను ప్రశంసించింది ఆంధ్రజ్యోతి పత్రిక తన విమర్శలో. ఆకాశవాణి హైద్రాబాదు Year's Best అనే ఆంగ్ల కార్యక్రమంలో మాట్లాడుతూ ఆ సంవత్సరపు ఉత్తమ నవలగా అభివర్ణిస్తూ *ఎడారి పువ్వులులో* పార్వతి, కామాక్షి, సత్యవతి పాత్రలు స్త్రీత్వంలోని వైవిధ్యాన్ని చూపిస్తున్నాయి అంటారు శ్రీ అబ్బూరి రామకృష్ణారావుగారు. ఈ నవల కథాకేంద్రం విజయవాడ పట్టణం. "జీవితం ఒక ఎడారి – బ్రతుకు ఎడారిలోని సరస్సు. ఆ సరస్సులో రెండు కలువ

పువ్వులు స్త్రీ – పురుషుడు అంటూ మొదలవుతుంది నవల కథాగమనం. ఈ నవలలో ఒక పాత్ర పార్వతి మాత్రం పవిత్రంగా జీవిస్తూ గౌరవ మన్ననలను పొందుతుంది. ఈమె పరిసర ప్రభావితం కాకపోవడం ఒక గొప్ప సాధన. *ఎడారి పువ్వులు* నవలలో రచయిత్రి వాడిన సహజమైన అలంకారాలు రమ్యంగా ఉండి, పఠితలనెంతో ఆకర్షిస్తాయి. *ఎడారి పువ్వులు* నవలను రచయిత్రి వారి సోదరులైన డా. గాలి బాలసుందరరావు గార్కి అంకితమిచ్చారు.

**మోహనవంశి :**

భగవద్గీతకు అనేకమంది ప్రముఖులు టీకా, తాత్పర్యాలు వ్రాశారు. తిలక్, గాంధీజీ, రాజాజీ మొదలైనవారు గీతలో నిక్షిప్తమైన సారాన్ని మనముందుంచారు. కాని, లత వ్రాసింది ఒక నవల! ఒక సృజనాత్మక రచన. కథ అలాగే వుంచి, ప్రసంగాలు చొప్పించి, పాత్రలు సృష్టించి శ్రీకృష్ణుడి గీతాసారము పూర్తిగా మోహనవంశిలో వుంచాలని యత్నించారు రచయిత్రి లతగారు. మోహనవంశి అనే నవలలో రేపల్లెలో పదేళ్ళ వయసున్న గొల్లపిల్లలతో ఆటలాడుకున్న దశనుండి, సమరాంగణములో అర్జునుడికి కర్తవ్య బోధన చేసేవరకు కృష్ణుడి జీవిత చరిత్రను తనకు తోచిన, తనదైన వ్యాఖ్యానంతో లతగారు వర్ణించారు. నిస్సందేహంగా ఇది ఒక రమణీయమైన కల్పన! కృష్ణుని రసమయమైన జీవిత పరమార్థము ఆధ్యాత్మిక సంపన్నముగా పరిణతి చెందినట్లు భగవద్గీత ద్వారా మనకు స్పష్టమగుచున్నది. లత తన నవల మోహనవంశీని గురించి వ్రాస్తూ “ఈ మోహనవంశి నా ప్రాణం. జన్మజన్మాంతరాల పుణ్యంతో ఈ జన్మలో లభించిన రాగరంజితమైన హృదయముతో దీన్ని వ్రాశాను. దీనిలో ప్రతి అక్షరాన్నీ నేనే – ప్రతి పాత్రనూ నేనే – నేను కానిది ఇందులో ఏదీ లేదు. ఇది వరకు కృష్ణచరితం చాలామంది వ్రాశారు. వారందరూ భగవంతుడే మానవుడిగా అవతారం ఎత్తాడని వ్రాశారు – నేను అలా వ్రాయలేదు – మానవుడే భగవంతుడయితే ఎలావుంటుందో వ్రాశాను”. లత తానే రాధగా ఊహించుకొని, రాధలో లీనమై కృష్ణుడిని ఆరాధించి ఈ మోహనవంశి రచించానని వెల్లడించింది. ఇందులోని భావాలన్నీ తనవేనని నిక్కచ్చిగా చెప్పింది ఆమె!

ఈ నవలలోని స్త్రీ పాత్రలు విచిత్రముగా కనిపిస్తాయి! తపతి, నీరజ, చంద్రిక, నాగిని, జాంబవతి, రుక్మిణి, సత్యభామ,కుబ్జ కృష్ణుని చుట్టూ అల్లుకుపోతారు. రాధ కృష్ణుడిలో పూర్తిగా లీనమైపోతుంది. సత్యవతి, కుంతి, కృష్ణ (ద్రౌపది), తమ స్త్రీ జీవితాలలోని ఆంతర్యాలు వెల్లడిస్తారు. వ్యాసుడు, భీష్ముడూ సంఘ ధర్మాలు ప్రవచిస్తారు. ముఖ్యముగా ఈ పాత్రలన్నింటిలోను కనిపించేది సంపూర్ణ స్వేచ్ఛ. స్వేచ్ఛకు ప్రాధాన్యతనిచ్చే సంఘధర్మాలు చాటారు. ఇవి సర్వ సమ్మతమైన ఆర్య సంప్రదాయాలని, గౌరవ ప్రదమైన ఈ సంప్రదాయాలు, ఈ అభ్యుదయ యుగంలో పాటించవలసిన విధి విజ్ఞానులదని రచయిత్రి వాదం. సంఘంలో స్త్రీని మగవాడి సగం సొత్తుగా చేసి, వ్యక్తిత్వాన్ని హరించిన నేరం మనిషిదేనని, ఈ నేరం కాల పరిస్థితులవల్ల, మధ్యకాలంలో వచ్చినదే కనుక, పురాతన చరిత్ర పరిశీలించి, పురాతన అర్థధర్మాలను పాలించడం, పాటించండనడం అభ్యుదయ యుగకర్తల ధర్మమని లత అభిప్రాయం. *మోహనవంశి* లతగారి ఎనిమిదవ నవల. ఎనిమిది సంఖ్య చిత్రమైనది. భగవానుడు వంశీమోహనుడు దేవకి సంతానంలో ఎనిమిదవవాడు! అంతేకాదు ఈ నవల వ్రాయునపుడు లతగారి వయసు ఇరువదిఎనిమిదట! ఈ రచనను మంగళంపల్లి బాలమురళీకృష్ణగారికి అంకితమిచ్చారు రచయిత్రి.

**జీవన ప్రవంతి :**

“జీవన ప్రవంతిలో ఒక బిందువు ఇంకిపోతుంటే మరొక బిందువు కలుస్తుంది. కానీ ఎప్పుడూ కొన్ని మహానదులు నిర్ణీత మార్గాన నిశ్చలంగా పురోగమిస్తూ ఉంటాయి. ఆ మార్గమే అన్ని కాలాలకూ, మనష్యులకూ వర్తించే సమధర్మ సత్యము”. జీవన ప్రవంతి అనే ఈ నవలలో మూడు తరాలకు చెందిన పాత్రలు, వారి మనస్తత్వాలు, జీవిత విశేషాలు, చర్చింపబడినవి. జీవన ప్రవంతి అప్రతిహతంగా సాగిపోవటమే సృష్టి రహస్యం. అయితే, తరతరానికి మానసిక చిత్తప్రవృత్తులలో బేధం కనిపిస్తుంది. ఒకవిధంగా ఆలోచిస్తే, దీనికి పరిస్థితులే కారణంగా భావించవచ్చు. అలాగే, అభివృద్ధి చెందుతున్న విజ్ఞానశాస్త్ర ప్రభావం మానవ వికాసంపై తప్పక ప్రతిఫలిస్తుంది. కృష్ణయ్యగారు (నవలలోని ఒక పాత్ర) ఉంచుకున్నటువంటి సభారంజని పాత్ర జాలిగొలిపేది! ఉంచుకోవడాన్ని సమర్థింపజూడటం ఏమంత మంచిపని కాదు. ఒక విధంగా ఆలోచిస్తే, నిర్దయతో సమీక్షించే సంఘ దృక్పథానికి, బలి అయిన ఒకానొక విషాదమూర్తి సభారంజని. అలాగే, కృష్ణయ్య పెద్దకొడుకు ప్రసాదరావు ఒక మహ్మదీయ

యువతి బాషాను ప్రేమిస్తాడు. కాని పెండ్లి చేసుకోలేకపోతాడు. అతని మానసిక బలహీనతకు గురైన బాషా యువతరాన్ని బాధ్యతారహిత ప్రవర్తనకై హెచ్చరిక చేస్తూంటుంది. వంచనకు గురైన బాషాకంటే, వంచించిన ప్రసాదరావు సంఘం దృష్టిలో పెద్దమనిషి! ఇక మూడవ తరానికి చెందిన ప్రసాదరావు కొడుకు రాజా వరాలనే అందమైన అమ్మాయిని చేరదీస్తాడు. కాని సంప్రదాయం అనే తెరమాత్రం వారిమధ్య మిగిలే ఉంటుంది! ప్రసాదరావు మేనల్లుడు వెంకటరత్నం సహృదయుడైన ఒక రచయిత. ఈ నవలలోని ప్రతిపాత్రనూ నిశితంగా విమర్శిస్తాడు. ప్రసాదరావు పెద్దకూతురు పూర్ణ. అత్యంత రూపవతి. కాని, ఆమె బాల్యవితంతువు. సహజమైన దేహావసరాలను అధిగమించలేక, డాక్టరు రేణును ఆశ్రయిస్తుంది! వెంకటరత్నానికి పూర్ణ అంటే ఇష్టం. కాని, ఆమె యెడల తామరాకుపై నీటిబిందువు వైఖరిని అనుసరిస్తాడు! తియ్యని కబుర్లతో కవ్విస్తాడే కాని, అంతకుమించి మరేవిధమైన ప్రేమ కలాపాలలోనికి వెళ్ళేప్రయత్నం చేయడు. అప్పుడే అనిపిస్తుంది, పూర్ణలాంటి వారికోసమై వీరేశలింగం పంతులువంటి సంఘసంస్కర్తల ఆవశ్యకత ఇంకా వుందని. జీవన స్రవంతిలో వెంకటరత్నం పాత్ర ద్వారా రచయిత్రి చెప్పించిన మాటలు అద్భుతంగా ఉన్నాయి. నవల చదువుతున్నంతసేపూ రాజా పాఠకుల కళ్ళకు కనిపిస్తున్నట్లుంటాడు ఆ వర్ణనలో. అలాగే పాప (రాజా కూతురు) వెంకటరత్నం మామయ్యతో ఆఖర్ని అన్నమాటలు పఠితల గుండెల్ని పిండివేస్తాయి. వరాల (మరోపాత్ర, రాజా ప్రేమికురాలు) వంటి స్త్రీలు నేటికీ ఉన్నారా? అని ఆశ్చర్యం కల్గుతుంది. కాలంతోపాటు ప్రజల ఆలోచనలూ, అభిరుచులు ఎలామారుతున్నవో, రచయిత్రి పూర్ణ పాత్ర ద్వారా చెప్పించారు. లతగారు ఈ నవలను శ్రీ మల్లాది నరసింహశాస్త్రి గారికి అంకితమిచ్చారు. కృతిని స్వీకరిస్తూ "జీవన స్రవంతిలో బాషా గాథ నన్ను కదిలించి వేసింది. వరాలు, సభారంజనమ్మ, పూర్ణ – సజీవ మూర్తులుగా పాఠకుల మనసులలో చిరస్థాయిగా నిలిచిపోగల నైపుణ్యంతో చిత్రించారు. రచనలో నిగ్రహం, భాషలో ప్రౌఢత్వం కనిపిస్తున్నాయి" అంటారు శాస్త్రిగారు. ఆంధ్రప్రభ జీవన స్రవంతిని గురించిన విమర్శలో అందులోని పాత్రలైన రాజా, వరాలు, వెంకటరత్నంని మెచ్చుకుంటూ, ప్రతిభా, వ్యుత్పత్తి ఉన్న రచయిత్రిగా లతగార్ని అభివర్ణించారు.

**వారిజ :**

లతగారి నవలలలో పాఠకుల అభిమానాన్ని ఎక్కువగా చూరగొన్న మరో రచన *వారిజ*. కథ కంటే అనుభవమూ, అభిప్రాయము అగ్రస్థానం ఆక్రమించుకొనిన నవల *వారిజ*. నవలలోని ప్రధాన పాత్ర వారిజ అనే ఒక అమ్మాయి. ఆమె ఒక హిందు – ఫ్రెంచి యువతిగా అభివర్ణింపబడింది. ఈ నవలలోని ఇతర ముఖ్య పాత్రలు : నళినీకాంతరావు, రామలక్ష్మి (ప్రముఖ రచయిత్రి), మోహనమూర్తి (విఖ్యాత గాయకుడు), సత్యనారాయణశాస్త్రి (పేరున్న డాక్టరు, మనోవైజ్ఞానికుడు), రమణమూర్తి (శాస్త్రి సోదరుడు, వృత్తిరీత్యా ప్లీడరు), కాత్యాయని (నర్సు).

ఏదైతే లభించడం కష్టసాధ్యంగా ఉంటుందో దానికై ఆక్రందించడం మానవ సహజ లక్షణం, అలాగే ఎవరి స్వేచ్ఛకైతే అడ్డులుండవో వారి శోకానికి కూడా హద్దులుండవు! వారిజ అలాంటి యువతి. ఎన్నో మహాకావ్యములలోని కథనములన్నీ యథార్థం కావు. రచయిత్రి లతగారు లోకజ్ఞానం దృష్టిలో పెట్టుకొని శిల్ప నిర్వహణకు సరిపడు ఘట్టంలను సమకూర్చుకొనినారు. హిందూ – ఫ్రెంచి యువతి వర్జీనియా (వారిజ) తెలుగు దేశంలో నివసిస్తూ, తన తల్లికి మొదటి భర్త ద్వారా కల్గిన ఇద్దరు కుమారులను మద్రాసులో కలుస్తుంది. వాళ్ళే శ్రీయుతులు సత్యనారాయణశాస్త్రీ, రమణమూర్తి సోదరులు. వారిజ మొదట శాస్త్రిని కలిసినప్పుడు వారు సోదరీ సోదరులన్న విషయము తెలియదు. కాని, శాస్త్రిని మొదటిసారి కలిసినప్పుడే "మిమ్మల్ని ఎక్కడో చూచానండీ" అన్నది. "బహుశా పూర్వ జన్మలోనేమో" అని నవ్వాడు అతను. వెళ్తూ "మళ్ళీ రెండు రోజుల్లో వస్తాను, ఈ లోగా నన్ను ఏజన్మలో చూచారో జ్ఞాపకం తెచ్చుకొండి" అని వెళ్ళిపోయాడు. అతని వెళ్ళిపోయిన తర్వాత వారిజ చాలాసేపు ఆలోచించింది. ఎక్కడ చూచిందీ గుర్తు రాలేదు.

కొన్ని రోజుల తర్వాత, ఒకనాటి సాయంత్రం ఒక యువకుడు తనున్న మేడమీదకు వచ్చి ఒక చీటీ అందజేస్తాడు. అందులో వారిజగారూ! నేను రాలేక పోతున్నందుకు క్షమించండి. ఊరికి వెడుతున్నాను. పదిరోజుల్లో వచ్చి మిమ్మల్ని చూస్తాను. సత్యనారాయణశాస్త్రి" అని ఉంది. ఆ చీటీ తెచ్చిన యువకుడు రమణమూర్తి. తొలి కలయికలోనే శాస్త్రీ – వారిజ ఒకరివైపు ఒకరు ఆకర్షితులవుతారు. తర్వాత కాలంలో తరుచుగా కలుసుకుంటారు. వారిజ శాస్త్రిని

ప్రేమిస్తుంది. అతనిని వివాహం చేసుకోవాలని కూడా వాంఛిస్తుంది. అయితే ఆకస్మికంగా వారిజ తన తల్లి చనిపోయే ముందు తనపేర వ్రాసిన ఉత్తరం చదువుతుంది. అందులో శాస్త్రి పేరు, రమణమూర్తి పేరు వ్రాసి, వారు వారిజకు అన్నయ్యలని తెలియపరుస్తుంది. ఆ విషయం తెలుసుకున్న వారిజ శాస్త్రికి దూరమైపోతుంది. వారిజ మోహనమూర్తి అనే కళాకారుని కలియుట తటస్థిస్తుంది. మోహనమూర్తి అందచందాలే కాక, అతని సున్నిత మనస్తత్వం ఆమెలో ఏదో మృదుభావాన్ని స్పదింపజేస్తుంది. వారిజ అతనిని ఆరాధిస్తుంది!

నవలలో అసలు ఇతివృత్తానికి ఇరువైపులా అనేక పిట్ట కథలు, సంఘటనలూ, ఆశలూ, ఆవేశాలతో తలమునకలు పడే స్త్రీమూర్తులు తారసిల్లుతారు! భూతకాలమూ, భావికాలమూ లేని పురుషుడికి మిగిలివున్న వర్తమానాన్ని కూడా ఖైదు చేసే స్త్రీ వారిజ. "చాంచల్యమా, నీ పేరే స్త్రీ" అన్న షేక్స్పియర్ మహాకవి ఉద్ఘాటనకు రుజువుగా నిలిచిన అద్భుతమైన చైతన్యమూర్తి అని చెప్పక తప్పదు. సానుభూతి సంతరించుకొంటూ ఆదర్శప్రాయురాలైన స్త్రీపాత్ర. ఎంతటి ఉత్తమ సృష్టి! ... అటువంటి స్త్రీ లత రచన వారిజలో కనిపిస్తుంది. నవల ముగింపు పూర్వజన్మ స్మృతులతో అద్భుతంగా పరిణమిస్తుంది. నేను యుగయుగాలనాటి స్త్రీని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ జీవిస్తూనే వున్న అద్భుత చైతన్య మూర్తిని" అని ముగిస్తుంది వారిజ.

**నీలినీడలు :**

ఈ నవలలో సంధియుగంలో భారత స్త్రీ సాంఘిక దురాచారాలకు నలిగిపోయిన వైనం అతి చక్కగా చిత్రింపబడినది. ఇందులోని కథ సాధారణమైనదే! ఆంధ్రదేశంలో ఒక పల్లెటూరిలో ఆదిలక్ష్మి, చంద్రశేఖరం అనే దంపతులు ఉంటారు. వారి ఇంటిపేరు త్రివేదులవారు. చంద్రశేఖరంగారికి ఆస్తిపాస్తులు బాగానే ఉన్నాయి. పశువులు, వ్యవసాయం, పెద్ద లోగిలీ అన్నీ బాగానే ఉన్నాయి. చాలామంది పిల్లలు పుట్టి పోయిన తరువాత, ఆ దంపతులకు త్రివేదుల సీతారామశాస్త్రి (తరువాతి కాలంలో తన పేరు త్రివేదిగా మార్చుకున్నాడు) అనే కొడుకు పుట్టాడు. అతను పెరిగి పెద్దవాడై, మద్రాసులో ఆంగ్ల విద్యాభ్యాసం చేశాడు. ఈ లోపల సీతారామశాస్త్రికి వివాహం అవటం, పిల్లలు పుట్టటం జరిగిపోయింది. ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. శాస్త్రి సహజంగా తెలివైనవాడు గనుక, అతనిని ప్రభుత్వం పై చదువులకు అమెరికా పంపింది. అమెరికా వెళ్ళే సమయానికి అతని కొడుకు నెల పిల్లవాడు. మూడేండ్ల తర్వాత శాస్త్రి (త్రివేది) స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. తల్లీతండ్రీ పెద్దవాండ్లైనారు! తండ్రి కొడుకును స్టేషనునుండి తీసుకురావటానికి పాలేరును బండితో పంపాడు. సీతారామశాస్త్రి ఇప్పుడు ఎస్.ఆర్. త్రివేదిగా మారాడు! నవనాగరీకుడు! విదేశాల నుండి వచ్చినవాడవటంచేత పాశ్చాత్య నాగరికతకు అలవాటుపడుటయేకాక, ఆ జీవన విధానంపై మోజు పెంచుకున్నాడు! తన పిల్లలు తనను డాడీ అని పిలవాలనీ, ఎక్కడికైనా పోతున్నప్పుడు టాటా చెప్పాలని భావించే త్రివేది తన భార్య విద్య నేర్చుకుంటేనేగాని ఏలుకోనంటాడు! దీనితో త్రివేది భార్య మగని మెప్పుకోసం చదువుకునే నిమిత్తం మద్రాసు వెళ్తుంది.

త్రివేది తల్లితండ్రుల్నీ, తన సంసారాన్ని పల్లెటూరిలో వదలి ఢిల్లీలో ఉన్నతోద్యోగం చేస్తూ, క్లబ్బులో విలాస జీవితం కొనసాగిస్తుంటాడు! ఆ క్లబ్బులో సభ్యులైన మిసెస్ జాధవ్, గులాబీ పుష్పాంజలి, నర్తకి సితార త్రివేదికి సన్నిహితులౌతారు! బ్రాహ్మణ కుటుంబానికి చెందిన త్రివేది శాఖాహారాన్ని పూర్తిగా మాని మాంసాహారిగా మారుతాడు!

త్రివేది అందమైనవాడు. అతడిపై మోజుకొద్దీ, అతనిని ఆకర్షించాలనీ మిసెస్ జాధవ్, పుష్పాంజలి పోటాపోటీలు పడుతుంటారు! నర్తకి సితార కేవలం ఒక శ్రేయోభిలాషిగా మాత్రమే త్రివేదిని మన్నిస్తుంది. సితార ఒక భగ్నహృదయ. ఆమెకు లోకంపై సానుభూతి, జాలి ఎక్కువ. వివాహితుడై కూడా పతనమౌతున్న త్రివేదిని తరచూ హెచ్చరిస్తుంటుంది. త్రివేది మొదట గులాబి పుష్పాంజలిని ప్రేమించి పెండ్లి కూడా చేసుకోవాలని అనుకుంటాడు. కాని, మిసెస్ జాధవ్ వైపు కూడా ఆకర్షితుడౌతాడు. అది గమనించిన పుష్పాంజలి ప్రతీకారచర్యగా మరో క్లబ్బు మెంబరైన రామచంద్ర కలేల్కార్ అనేవానితో ఆప్యాయత నటిస్తుంది. ఇలా ఉండగా, మగని మెప్పుకోసమై చదువుటకై మద్రాసు వెళ్ళిన త్రివేది భార్య పల్లెలోని పిల్లలను వదలి ఉండలేక, మనోవ్యాధికి గురై, చదువు చాలించి అత్తమామల వద్దకు వచ్చేస్తుంది.

భార్యకి జబ్బుగా ఉందని తెలిసి, త్రివేది, నర్తకి సితార పల్లెటూరికి బయలుదేరుతారు. చివరకు ఒక అయ్యవార్లంగార్లు త్రివేది భార్యకు సన్యాసదీక్ష ఇవ్వగా, ఆమె, నర్తకి సితారా

సర్వం పరిత్యజించి తిరిగి రాకుండా ఎటో వెళ్ళిపోతారు. త్రివేది తన తల్లితండ్రులు, పిల్లలతో ఢిల్లీ చేరుకుంటాడు. పుష్పాంజలి, రామచంద్ర కలేల్కారుల వివాహ ఆహ్వానపత్రిక అక్కడ పడివుంటుంది. అది చూచిన త్రివేది నిరుత్సాహంతో కనీసం తన జీవితానికి మిసెస్ జాధవ్ అయినా దక్కుతుందేమోనని ... అయితే, తన అసభ్య ప్రవర్తనవల్ల భర్త దండనకు గురైన మిసెస్ జాధవ్ ఆత్మహత్య చేసుకుని, త్రివేదికి మిగిలిన చివరి ఆశ కూడా కూల్చివేస్తుంది. పశ్చాత్తప్త హృదయుడైన త్రివేదికి కనువిప్పు కల్గుతుంది! ఈ నవలలో పాశ్చాత్య నాగరికత, హిందూ నాగరికతల మధ్యగల ఘర్షణ అతి చక్కగా చిత్రించారు రచయిత్రి లతగారు. పాశ్చాత్యులు తమది నీలరక్తమని, ఉన్నతమని గర్వించే ప్రవృత్తి నిరాధారమేనని, వారి నీలినీడల ప్రభావం పరిసరాల్ని కలుషితం చేసి ఆశాంతిదాయకమవగలదని లతగారు ఈ నవలలో వ్యాఖ్యానించారు.

**డాక్టరు వనమాలి :**

ఈ నవల ఇదివరకు చర్చించిన నవలలవంటిది కాదు. ఈ నవలలో చిత్రితమైన డాక్టరు వనమాలి, మహాగొప్ప వైద్యుడు, జ్యోతిర్వేత్త, ఇతర శాస్త్రాలతో పరిచయమున్న తాత్వికుడు. ఆయనకు తెలుగు కావ్యాలతోపాటు, ఆంగ్ల సాహిత్యంలో సహితం చక్కని పరిజ్ఞానము ఉంది. అంతేకాదు, పరకాయ ప్రవేశ విద్యలాంటి తాంత్రిక విద్యలలో సహితం ప్రవేశమున్నవాడు! డా. వనమాలి పాత్ర విశిష్టత ఆయన ఒకే జీవితంలో రెండు శరీరాల్ని ఆశ్రయించినవాడు! డా. వనమాలి భౌతికంగా మరణించినప్పటికీ, జూనియర్ వనమాలి (మూర్తి) శరీరం ఆయన ఆత్మకు ఆశ్రయం ఇస్తుంది! అంటే జూనియర్ వనమాలి అసలు వనమాలి శక్తి, సామర్థ్యాలతోపాటు ఆయన గుణగణాలన్నీ పుణికిపుచ్చుకొని ఒక మహత్తర కార్యం (కుష్టురోగ నవారణకు మందు కనిబెట్టుట!) సాధిస్తాడు. అది ఆయనకు ప్రపంచ ఖ్యాతిని ఆర్జిస్తుంది! ఈ నవలలోని మరో ప్రముఖపాత్ర సీత. ఆమె తన పదహారేళ్ళ వయసులోనే కోరికనే ప్రేమ అని భ్రమపడి, అది పొందడానికి అడ్డదారిలో పడి మోసపోయి, సెక్స్ అంటే భయంపుట్టి మత్తుమందులను కోరుకుంటుంది. చివరకు డా. వనమాలి ఆమెను వివాహం చేసుకుంటాడు. సీతకు అక్రమంగా పుట్టిన పిల్లను, తన స్వంత కూతురిగా ప్రేమించి, పెంచి పెద్దదానిని చేస్తాడు. ఆమె పేరు మహేశ్వరి. కొంత కాలానికి సీత ఆకస్మికంగా గ్యాస్ లీకేజి వలన కాలి మరణిస్తుంది. డా. వనమాలికి నీల అనే యువతితో ద్వితీయ వివాహము జరుగుతుంది. నీల చాలా అందగత్తె. వయసు 25కు మించదు. ఇంగ్లండులో పేరాసైకాలజీ, క్లైయిర్ వాయిన్స్, హిప్నాటిజం మొదలైన విద్యలలో నిపుణురాలు! ఆమె ఇప్పుడు భారతీయ వైద్యశాస్త్రమైన ఆయుర్వేదం, ఆంగ్లవైద్యశాస్త్రమైన ఎం.బి.బి.ఎస్. రెండూ చదవాలనే ప్రయత్నంలో ఉంది. ఆమె డా. వనమాలి మేధస్సుకు ఆకర్షితురాలై వయోబేధాన్ని సహితం విస్మరించి ఆయనను వివాహం చేసుకుంటుంది.

డా. వనమాలి దంపతులు సీత కూతురైన మహేశ్వరికీ, డా. పాణికి వేదవిహితంగా వివాహం చేస్తారు. డా. వనమాలి తన కుమార్తెకు తన భవిష్య జీవితాన్ని గురించి కొంత తెలియజేస్తాడు. అందుచేత ఆయన మరణాంతరం, జూనియర్ వనమాలి అచ్చు తండ్రివలె వ్యవహరించుట ఆశ్చర్యాన్ని కలిగించినా, తండ్రి ఆత్మే జూనియర్ వనమాలి శరీరం ఆశ్రయించిదన్న విషయం కొంతవరకు నమ్మక తప్పలేదు. ఆమెకు, పాణికి జన్మించిన పిల్లకు సీత అని పేరు పెట్టారు. ఆమె తనభర్త డా. వనమాలిని మరో జన్మయెత్తి కూడా గుర్తుపడుతుంది! ఈ విషయాలన్నిటికీ హేతువులు, కల్పనలు ఇస్తూ, ఇవి అసంభవం కాదని భారత రామాయణాల సాక్ష్యాలతో రసవత్తరమైన నవల పాఠకుల ముందుంచారు రచయిత్రి లతగారు. ఇందులో పేర్కొనబడిన విశేషాలు పఠితల ఉత్కంఠను పెంచి, ఏకబిగిని నవలని చదివిస్తాయి.

**స్వర్ణసీత :**

రామాయణం కల్పిత కథ అని కొందరంటే, కాదు నిజంగా జరిగిన చారిత్రాత్మక సత్యమని మరికొందరి అభిప్రాయము. కొంతవరకు అలాంటి అభిప్రాయాన్నే వ్యక్తపరుస్తారు రచయిత్రి లతగారు తమ నవల స్వర్ణసీతలో! ఎంతోమంది వ్యాఖ్యాతలు రాముని అవతార పురుషునిగా భావించి, రామాయణాన్ని భక్తి, ప్రపత్తులతో నిత్యపారాయణ చేస్తారు. స్వర్ణసీత అనే నవల సీతకథ. దేశంలోని రామాయణాలలో చాలావాటిని పరిశీలించి, వానిలో పేర్కొనబడిన విషయాలను తమ హేతువాద సామర్థ్యంతో జోడించి ఒక విధమైన రాజకీయ దృక్పథంతో రచించారు ఈ నవల లతగారు. లతగారి నమ్మకాల ప్రకారం, శ్రీరాముడు మహోన్నత మానవుడై, దైవమైనాడు! భారత సామ్రాజ్ఞి సీత

రాజకీయ పీటముళ్ళలో ఇరుక్కొని, ఒట్టి అబలగా అగ్నిప్రవేశించిన అమాయకురాలిగా చిత్రించబడినది. ఈ నవలలో పేర్కొనిన సీత పౌలస్త్యునికి, మండోదరి ద్వారా జన్మించిన కుమార్తె! ఆమె లంకారాజ్యానికి వారసురాలు అవుతుందేమోనన్న భయంతోను, ఆమె అపూర్వ సౌందర్యవతి అనే అసూయతోను, ఆమె జన్మ లంకవినాశనానికి నాంది అని, ఆమె లంకానగరంలో పెరుగుట రావణుని పతనానికి దారి తీస్తుందనే వితండ వాదనతో అన్నయగు రావణుని నమ్మించింది సూర్పణఖ. ఆ కారణంగా సీతను బాల్యదశలోనె జనక మహారాజుకు పెంపకమిచ్చి మిథిలానగరికి పంపించేస్తాడు రావణుడు. స్వర్ణసీత నవల కథనం ప్రకారం శ్రీరాముడు రావణునికి జామాత. సీతాకళ్యాణం రాజకీయాలతో కూడిన సంఘటన. ఈ పుస్తకంలో చిత్రితమైన కౌసల్య ఆంధ్రుల ఆడపడిచు! దశరథుని ప్రేమించి పెళ్ళి చేసుకుంటుంది.

ఈ నవలలోని కథ రామ, రావణ యుద్ధానంతరము మొదలై, సీతారాములు శిలాతోరణ పర్వత ప్రాంతమునకు వానప్రస్థమునకు వెళ్ళుటతో ముగుస్తుంది. ఈ నవలలో పేర్కొనబడిన కొన్ని విషయాలు చాలామందికి తెలియనివి. అందువలన క్లుప్తముగా పేర్కొనడమైనది. రామాయణ యుద్ధానంతరం, శ్రీరాముడు ఆర్యావర్తానికి (భారతదేశానికి) చక్రవర్తి అవుతాడు. సీత జగద్ధాత్రి. శ్రీరాముని కులపాలిక – రాజ్యసభ అధ్యక్షురాలు – న్యాయాధికారిణి, మహారాణి. ఇదివరలో ఏ రామాయణములోను శ్రీరాముని నిత్య జీవితమును గురించిన వివరణ లేదు. ఆయన నిత్యజీవితం, ఆహార వివరాలు, పరిపాలనా విధానం, ఆయన ప్రజాసామ్య వ్యవస్థకు వేసిన పునాదులు మరియు ఇతర వివరాలు చర్చించారు లతగారు. ఇది రచయిత్రి భావనా పటిమను వ్యక్తపరుస్తుంది. అంతేకాదు, సూర్పణఖ, ఆమె కుమారుడైన శంబూకుడు, చ్యయనుడు ఇంకా కొందరు కలిసి, సీతను శ్రీరాముని తుదముట్టించుటకు పూనిన రాజకీయ కుట్ర, రాజ్యంలో అరాజకత్వాన్ని సృజించి, రాజకీయ విప్లవాన్ని తేవాలనే వారి ప్రయత్నాలు విపులంగా వివరించారు లతగారు. ఇంకోవిషయం : సీత పురిటికి వాల్మీకి ఆశ్రమం వెళ్ళవలయునన్న నిశ్చయం సీత కోరిక పైననే జరిగింది. శ్రీరాముడు సీతను త్యజించి అడవిపాలు చేశాడన్న అపనింద ఇచ్ఛాపూర్వకంగా చేసిన రాజకీయ నిర్ణయం! అది సీతాదేవి సమ్మతితోనే జరిగింది. అంతేకాదు, అదే సమయాన సీత నాయనమ్మ కైకసి, అమ్మ మండోదరి, చెల్లెలు మరీచి, శ్రీరామభక్తుడు హనుమ, వాల్మీకి ఆశ్రమం చేరారు. ఆదిశక్తి, శివపత్ని అయిన పార్వతీదేవి సీతకు పురుడుపోసి, కవల పిల్లలకు కుశలవులని నామకరణం చేసి, ఆశీస్సులందించి తిరిగి కైలాసానికి వెళ్తుంది.

మహారాజ్ఞి సీత కవలలతో అయోధ్యానగరం వస్తుంది. రాజమాతలైన కౌసల్య, సుమిత్ర, కైకేయీలు ఆమెకు స్వాగతమిస్తారు. ఇవ్వన్నీ కూడా వాల్మీకి రామాయణంలో పేర్కొనని విశేషాలు. స్వర్ణసీత రచనలో, అనేక ఇతర రామాయణాల (చ్యవనుడు రచించిన కథ, బౌద్ధ రామాయణం, జైన రామాయణం, మరాఠీ రామాయణం మొదలైనవి) నుండి విషయ సేకరణ జరిగినదనుట నిర్వివాద విషయం. స్వర్ణసీత తప్పక చదువవలసిన రచన. ఈ నవలలో రచయిత్రి అనేక నూతన విషయాలు చర్చించారు.

**ప్రేమరాహిత్యంలో స్త్రీ :**

లతగారి నవలలో పేర్కొనదగిన మరోగొప్ప రచన *ప్రేమరాహిత్యంలో స్త్రీ*. ఇందులోని ముఖ్యపాత్ర సుగుణ అనే యువతి. ప్రేమరాహిత్యం అనేమానసిక రుగ్మతకు లోనవుతుంది. ఆమె జీవితంలో గాఢంగా ప్రేమిస్తుంది. కాని, ఆమెకు దానివలన అనుభూతి కలుగదు. ఆ కారణాన ఆమెలో ప్రేమంటే విరక్తితోపాటు, అసహ్యం కూడా కల్గుతుంది. అంతేకాదు, రహస్యం మీద, అడ్వెంచర్ మీద అమిత ఆసక్తి ఉత్పన్నమవుతుంది. సుగుణలో ఈ మానసిక రుగ్మతకు దారితీసిన కారణాలు చక్కగా చిత్రించారు రచయిత్రి లతగారు ఈ నవలలో. ప్రత్యేకంగా పేర్కొనదగిన విశేషాలు లతగారు నవలలో ప్రవేశపెట్టిన పాత్రలు గోపాలరావు, నిర్మలరావు, గౌతమరావు, మురారి, తాయారు, కాళింది మొదలైనవి. సుగుణచేత తృణీకరింపబడిన గోపాలరావు ఆత్మహత్య చేసుకుంటాడు! గోపాలరావు చావుకు కారణమైన సుగుణ మనస్తాపానికి గురవుతుంది. తదుపరి జీవితంలో సుగుణ, నీరజరావు, గౌతమిరావులవైపు ఆకర్షితురాలై, వారి ప్రేమానుభూతిని పొందలేక భగ్నహృదయగా మారుతుంది. ఆమె వివాహం మురారితో జరుగుతుంది. కాని సుగుణ మురారిని హృదయపూర్వకంగా ప్రేమించ జాలదు. ఆమెకు అతని ద్వారా ఒక కూతురు పుడుతుంది. సుగుణ మానసిక రుగ్మత పెరిగి, ఆమె పిచ్చిదైపోతుంది. డాక్టరు మనోవైజ్ఞానిక



ఎడమ నుంచి కుడికి : రంగనాయకమ్మ, పాకాల యశోదరెడ్డి, రాఘవమ్మ బ్రహ్మానందరెడ్డి, భానుమతి, ఇల్లిందుల సరస్వతీదేవి, జానకీరాణి తురగా, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, తెన్నేటి హేమలత

శాస్త్రంప్రకారం ఆమెకు చికిత్స చేయడంలో విఫలుడౌతాడు. ప్రేమరాహిత్య జబ్బుకు చికిత్స రోగి వాంఛించిన ప్రేమికునితో కలియుటయే! గోపాలరావు జీవించిలేడు కావున అది సంభవము కాలేదు. అదియే ప్రేమరాహిత్యం!

పైన పేర్కొనిన రచనలేగాక, *మిగిలిందేమిటి?, ఆదిమధ్యాంతరాలలో, రాగజలధి, దీపకళిక, పథవిహీన, వనకిన్నెర, అవమానిత, చరిత్రశేషులు, శత్రుబంధం* మొదలైన నవలలు లతగారికి కీర్తిప్రతిష్టలు ఆర్జించి పెట్టినవి. ఒక్క పథహీన నవలకే, అది ఆంధ్రప్రభలో సీరియల్‌గా ప్రచురితమైనప్పుడు లతగారికి ఆ పుస్తకాన్ని గురించిన ప్రశంశలేమి, విమర్శలేమి పాఠకుల నుండి 7000, ఉత్తరముల రూపంలో అందినాయట! అంతేకాదు, బుచ్చిబాబు వంటి గొప్ప రచయిత లతగారు వ్రాసిన మిగిలిందేమిటి? నవలను అనేక కోణముల నుండి పరిశీలించి, ఒకపెద్ద ఉత్తరాన్ని రచయిత్రికి వ్రాశారు. అలాగే, లతగారి రచనలను ప్రశంసిస్తూ ఆచంట జానకిరాం వంటి అనేక రచయితలు ఆమెకు ఉత్తరాలు వ్రాశారు. అంతేకాదు, తెలుగు పత్రికలే కాక, Indian Pen, Literary News Bulletin, Illustrated Weekly వంటి ఆంగ్ల పత్రికలు ఆమె రచనలను చర్చిస్తూ అభిప్రాయాలను వ్యక్తపరచాయి.

లతగారి రచనలలో నవల ఎక్కువ ప్రాధాన్యత వహించియున్నది. ఆమె నవలలో ఎక్కువ సాంఘిక సమస్యలే చాలావరకు చర్చింపబడినవి. లతగారు ఎన్నుకొనిన సాంఘిక సమస్యలలో ప్రేమ, కామము, ప్రేమతో కూడిన కామము, కామంతో కూడిన ప్రేమ, ఆ సాఫల్యతకై విరహం, చిత్తశుద్ధి, చిత్తచాంచల్యము, వ్యక్తి జీవితంలో పొందే జయాపజయాలు అనేక భంగిమలలో పరిశీలింపబడి, ప్రదర్శించబడినవి. ఆమె పాత్రలను మలచుటలో పడే ఆవేదన, ఘర్షణ, చైతన్యము, ఇవన్నియు స్వేచ్ఛకై పరితపించునట్లు వెల్లడించును. సూక్ష్మపరిశీలకులు ఆమె రచనా చిత్రణలో ప్రేమకంటే స్వేచ్ఛకు ఎక్కువ విలువ ఇచ్చినట్లు అభిప్రాయన్ని వ్యక్తపరచారు. భౌతిక పతనంకంటే, మానసిక పతనమును చాలా తీవ్రమైనదిగాను, ప్రమాదకరమైనదిగాను, లతగారు హెచ్చరించుచున్నట్లు ఆమె రచనల సమగ్ర సమీక్షలో తేటతెల్లమవుతుంది.

లతగారి నవలల్లో వస్తువైవిధ్యమే కాదు, అసాధారణ భావుకత కనిపిస్తుంది. ఎందుకు ఇలాగే జరగాలన్న వేదన పాఠకులకు అవగతమవుతుంది. *"నిజంగా జీవితానికి అర్థమేమిటో ఎవరికీ తెలీదు. గొప్ప తాత్వికులు అని మనం ఎవరిని అంటున్నామో వారు కూడా తమ అనుభవాల్నీ, ఆలోచనలనీ, అనుభూతులనీ మథించి తమకు తోచిన వ్యాఖ్యానం మాత్రమే చెప్పారు. కాని, అవే వేదవాక్కుగా తీసుకునేవారుంటే వుండవచ్చు. కాని, వాటిని ప్రశ్నించేవారు కూడా ఉండకూడదని నియమమేమీలేదు".* లతగారు వానిని ప్రశ్నించారు. ఆవిడలో ఒకవైపు తిరుగుబాటు తత్వమూ, మరోవంక సాంప్రదాయముపట్ల గౌరవము కనిపించుట కొందరు పరిశీలకులకు విడ్డూరంగా తోచవచ్చు. కాని, సూక్ష్మంగా పరిశీలించి చూస్తే, ఆవిడా మనము కూడా నిత్యజీవితంలో ఎదుర్కొనే అనేక సంఘర్షణలు పరస్పర విరుద్ధమైనవీ, క్లిష్టతరమైనవీ ఆమె తన రచనల ద్వారా చర్చకు పెట్టారని అర్థమౌతుంది!

లతగారు ప్రేమకథలూ, సినిమా డైలాగులు (సన్నజాజి అనే సినిమాకు) వ్రాశారు! 1958 నుండి 1963 వరకూ ఆంధ్రప్రభ వారపత్రికలో ధారావాహికంగా అయిదేళ్ళపాటు ప్రచురించిన *ఊహాగానం* శీర్షిక అనేకమంది పాఠకుల మన్ననలను పొందింది. ఊహాగానం ద్వారా లతగారు పతితులకు, దగాపడిన వారికి అపార సానుభూతిని ప్రదర్శించి, సాహిత్యంలో ప్రధానాంగమైన జనహిత ప్రయోజనమును సాధించారు. ఈ శీర్షిక ద్వారా నివేదనను,

పరిశీలనను, చింతలను, ఆదేశాన్ని, ఏ సాహిత్య ప్రక్రియతోను మిళితము చేయక, సూటిగా పాఠకునికి అందించుటకు ప్రయత్నం చేశారు. అయితే, నిర్వివాదముగా ఇదియే తాను ప్రతిపాదించు సిద్ధాంతమని ఉద్ఘాటించుచూ *ఊహాగానం* రచన సాగించలేదు. ఆమెకు నచ్చిన ప్రతి సిద్ధాంతములోని భాగమును సేకరించి, స్వీకరించి, ప్రచారము చేశారు. అలాగే, ఆమెకు అంగీకారము కాని భావములను, ప్రతిపాదనలను నిశితంగా విమర్శించుచూ, తిరస్కారము చూపెట్టారు. మూడు భాగాల్లో ప్రచురితమైన *ఊహాగాన* సంపుటిని, తన తండ్రిగారైన నిభానుపూడి నారాయణరావుగారికి అంకితం చేశారు. లతగారు గేయ రచయిత్రి కూడా! ఆవిడ రచించిన సంగీత నాటకాల్లోని గేయాలు ఆకాశవాణి ద్వారా అప్పుడప్పుడూ ప్రసారమయ్యేవి.

తన రచనలనుగూర్చి ముచ్చటిస్తూ "నాకు *జీవితం నిజం. ఒక యదార్థం. ఆ నిజాన్ని చిత్రించడానికి నా కలం ఒక బ్రష్. నేనో పెయింటర్ని. అక్షరాల చిత్రకారిణిని. నా చిత్రాలు ఏ రంగుల సమన్విత్వాలో, స్ఫూర్తిమంతాలవునో కాదో నిర్ణయించేది కాలం" అంటారు లతగారు. ఆవిడ ఇంకా ఇలా అంటారు "లోకాన్ని ఉద్ధరించాలని నేను రచనలు చెయ్యలేదు. ప్రకృతి మాతృకగా ప్రపంచ చిత్రాన్ని చిత్రించే చిత్రకారిణిని నేను. రచయితలు రాజకీయ వాదుల్లాగా కొట్టుకోవడం మంచిదికాదు. అరసం – విరసం ఉద్యమాల మీద నాకు సానుభూతి లేదు".*

**బిరుదులు, సత్కారాలు, అవార్డులు :**

లత జీవితం విలక్షణమైనది. ఆమె తన జీవిత కాలంలో అనేక ప్రముఖ రచయితల మన్ననలందుకొనుటయేగాక, వేలకొలది పాఠకుల అభిమానం చూరగొన్నది. ఇరవయ్యో శతాబ్దపు తెలుగు రచయిత్రులలో ఆమె ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలపరచుకొన్నారు. లతగారు 1963లో గృహలక్ష్మి స్వర్ణకంకణం అవార్డు పొందారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 1977లో కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వారి Extraordinary Woman of the Year Award 1981లో అందుకున్నారు. అంతేకాదు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. అదిగాక, మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యురాలుగా ఎన్నుకోబడ్డారు. తర్వాత 20 సంవత్సరాలపాటు గౌరవ సభ్యురాలిగా వ్యవహరించారు. సాహిత్య అకాడమీలో కార్యవర్గ సభ్యురాలిగా, ఉపాధ్యక్షురాలిగా సేవచేసి, బెజవాడ గోపాలరెడ్డి, దేవులపల్లి రామానుజరావు, దివాకర్ల వెంకటావధాని వంటి ప్రముఖుల మన్ననలను అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయమువారి ఉత్తమ రచయిత్రి పురస్కారం ఆమెను వరించింది. అలాగే సుశీలా నారాయణరెడ్డి సాహిత్య అవార్డు అందుకున్నారు. లతగారు అరడజను సాహిత్య పత్రికలకు గౌరవ సంపాదకురాలిగా ఉన్నారు. ఆవిడ రచనలు కొన్ని ఆంగ్లంలోనికి, ఇతర భారతీయ భాషల్లోనికి అనువదింపబడ్డాయి.

**ముగింపు :**

లతగారిని శరత్‌తోను, చలంతోను పోలుస్తారు. ఆవిడ శరత్‌బాబును విపరీతంగా అభిమానిస్తారు! శరత్‌చంద్రుడు లతగారిలో తిరిగి జీవించారని కొంతమంది అభిప్రాయం. లతగారు సృజించిన కొన్ని పాత్రలు శరత్‌చంద్రుని నవలలోని పాత్రలను పోలి ఉంటాయి. కొన్ని సందర్భాలో శరత్ భావాలు కనిపిస్తాయి. "చలానికీ, లతకు పోలికలున్నట్లు దేశం బహిరంగంగానే అభిప్రాయపడటమే కాదు, నిందించడం కూడా జరిగింది. చలంగారి శైలిలో ఉన్న పటుత్వం లతగారి శైలిలో కనిపించదు. అలాగే, లతగారి శైలిలోని ఉదాత్తత చలంగారి రచనల్లో కనిపించదు. ... ప్రసిద్ధ ఆంగ్ల పత్రిక ఇలస్ట్రేటెడ్ వీక్లీ లతను గురించి వ్రాస్తూ – *"శరత్‌లోని సిక్‌మెంటాలిటీ, చలంలోని క్రూయెల్టీ లేని రచయిత్రి"* అని ఆమె సాహితీ తత్వాన్ని ఒక్కమాటలో విశదీకరించింది!

లతగారు తన్ను తాను అభివర్ణించుకున్న విధానం *"ఈ లత గొప్పదో, కాదో కాలం, చరిత్ర నిర్ణయిస్తాయి. కాని ఆమె విచిత్రమైన వ్యక్తి. విశ్వనాథవారి కిన్నెరసాని, కృష్ణశాస్త్రి ఊర్వశీ, చలం చిత్రించిన అరుణ, గురజాడవారి మధురవాణి, శ్రీదేవి తీర్చిన ఇందిర, బాపిరాజుగారి శశికళ, రావూరి మలచిన పార్వతి, బుచ్చిబాబు కూర్చిన అమృతం* లతలో వివిధ పాళల్లో మేళవించి ఉన్నాయనిపిస్తుంది" అని అంటుంది.

ఆర్.ఎస్. భరద్వాజ
హైదరాబాద్.
ఫోన్ : 961 852 4702

# 'విద్య' అంటే ప్రతిభా శిక్షణ

*- ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ*

ఏ దేశ నాగరకత ఎదుగుదలకైనా ప్రధాన కారణం, ఆ దేశంలోని విద్యా వ్యవస్థే అన్నది అందరూ అంగీకరించే సత్యమే. విద్యే అభివృద్ధికి పునాది.

ఏ దేశ నాగరకత అయినా అధోముఖం పట్టడానికి, ఆ దేశం అభివృద్ధి సాధించకపోగా, అభివృద్ధి వ్యతిరేక దిశలో నడవడానికి, ముఖ్యకారణం - ఆ దేశ అవసరాలకు అనుగుణమైన, సరయిన, 'విద్యా విధానం', 'విద్యాతాత్త్విక దృక్పథం' లేకపోవడమేనన్న సత్యాన్ని మాత్రం అందరూ అంగీకరించరు. అంత కంటె దురదృష్టం మానవ నాగరకతలో మరొకటి లేదు.

అసలు నాగరకత అంటేనే విద్య. నాగరకత గురించి తెలియచెప్పేదే విద్య. 'విద్యా కార్యక్రమాలు' నడుస్తుండడం వేరు. 'విద్యాతాత్త్విక విధానం' ఉండడం వేరు. కార్యక్రమాలు (ప్రోగ్రామ్స్) ప్రణాళిక (పాలసీ)ను అనుసరించి ఉంటాయి. ప్రణాళికలు అధికార స్థానాలచేత రూపొంది, అమలులోకి వస్తాయి. వాటికి భూమికగా ఒక తాత్త్విక విధానం ఉండడమనేది అనివార్యమైన ఆవశ్యకం. అయితే అధికార స్థానాలు తరచు బౌద్ధికమైన ఆవశ్యకాలు పాటించవు. భౌతిక-రాజకీయ ఆవశ్యకాలనే పరిగణనలోకి తీసుకొంటాయి.

ప్రతి విధాన రూపకల్పన ఒక తాత్త్విక రచన, తాత్త్వికతా స్వరూపం. తత్త్వం చరిత్ర సారం. తత్వమంటే సమాజానికి అతీతంగా పోయేవారి నీడన వేదాంతచర్చ అనే భావన సగటున ఇంకా విద్యాధికుల్లోనే వైదొలగలేదు. సాక్షాదనుభవాల మాటున అంతర్లీనంగా ఉన్న భావాల, వాటి అనుబంధాల సమన్వయమనే దృష్టి చాలామందికి లేదంటే అతిశయోక్తికాదు.

తర తరాల అనుభవాలు తార్కిక సంకలనే చరిత్ర. ఊరూ, పేర్లతో నిమిత్తం లేకుండా, దాని సారాన్ని చూడడమే తత్వదర్శనం. ఇది పిడివాదమూ కాదు, గడ్డ కట్టిన గతమూ కాదు. గతం తాలూకు అనుశాసనమూ కాదు. ప్రతి తరంలోనూ, ఆ తరానికి సంబంధించిన సవాళ్లను, అవసరాలను అనుశీలిస్తూ, ఆ తరాన్ని దాటిన శాశ్వత మౌల్యాలను అన్వేషిస్తూ, వాటితో వర్తమానాన్ని సమన్వయిస్తూ, నియత కాలికమైన జీవనానుభవాన్ని సార్వకాలికంగా చూసే తార్కిక పంథా-తత్త్వ శాస్త్రం (ఫిలాసఫీ). ఆ దృష్టితో దాన్ని చూసినప్పుడు, మొత్తం జీవితాన్ని పర్యాలోచించే ఫిలాసఫీ ఎంత ముఖ్యమో, జీవితంలోని ప్రతిరంగానికి సంబంధించి ఒక తాత్త్విక అవగాహన, ఫిలాసఫీ కూడా అంతే ముఖ్యం.

మన విద్యావ్యవస్థకు సంబంధించి, మనకంటూ ఒక 'తాత్త్విక విధానం' ఉందా? అనేది ఇప్పుడు వేసికోవలసిన మౌలికమైన ప్రశ్న !

ఆలోచింప చేయడంతో నిమిత్తం లేకుండా, పూర్వుల సూక్తులను, సూత్రాలను యధాతథంగా వల్లె వేయించి, అప్పచెప్పించటమనేది ఒకప్పటి మన పద్ధతి. పసి వయసులో నేర్చుకోవటమనేది అతి బలంగా ఉంటుంది. ఏదనిపిస్తే దాన్ని అనుకరించి నేర్చుకోవటమనేది, అతి సహజంగా, సహజాతంగా సాగేపని, ఆట. అందుకే ఆ ఆటలో భాగంగా, మాటను కూడా బట్టీ పట్టిస్తే, అది గాఢంగా వంట (ఒంట) పడుతుందనేది అప్పటికి తెలిసిన శాస్త్రీయ సత్యం. అలాగే విద్యను నేర్పించారు. అందువల్లే, ఏ రాతల్లోకి యెక్కని వేదాదులను సహస్రాబ్దులుగా అలానోట బట్టుకొని వచ్చారు. అయితే మౌఖిక ప్రసారంలోని విద్యను కాపాడుకొని రావడంలో అదెంత బలమైన పాత్రను నిర్వహించిందో, అలాగే పెత్తందారీ వ్యక్తుల ప్రయోజనాలను కాపాడే ఆలోచనారాహిత్యపు ఎదుగుదలలో కూడా వేల సంవత్సరాల పాటు అది అంతే బలమైన పాత్రను నిర్వహించింది.

అప్పచెప్పటం, చెప్పి చెప్పటం కాదు విద్య విశ్లేషించి చూడడం, వీలైతే కొత్తను నిరూపించి చెప్పడం విద్య.

సామ్రాజ్యవాదం బలపడేకొద్దీ ఆ విద్య కూడా పెత్తందారీ శక్తులకే పరిమితమై పోయింది. ఉత్పత్తి వర్గాలకు వృత్తివిద్యలైతే, పెత్తందారీ వర్గాలకు వైజ్ఞానిక విద్యలు

నియతమయ్యాయి. పెత్తందారీ వర్గాల్లోకూడా సామాజిక పెత్తందారీని ఒక వర్గం చేజిక్కించుకోగా, సాంస్కృతిక పెత్తందారీ మాత్రమే మరొకరికి దక్కింది. ఉన్నదాన్ని కొంగ్రొత్త తిప్పి చెప్పటం, మరింత ఘనంగా మెరుగులు దిద్ది చెప్పటం తప్ప, కొత్త ప్రస్థానాలు సాగించే లక్ష్యం పూర్తిగా దెబ్బతింది. సామాజిక పెత్తందారీకి సాంస్కృతిక పెత్తందారీ లోబడి యుండక తప్పని స్థితి కనుక, అప్పచెప్పటం, తిప్పిచెప్పటమే లక్ష్యంగా, మౌఖిక వారసత్వమే పెద్ద సంపదగా సగటు విద్యా విధానం సాగింది. వర్తమానం, భవిష్యత్తులకంటె గతం మీదనే మానవుని మేధ కేంద్రీకృతమై దాన్ని వైభవీకరించడమే లక్ష్యంగా పెట్టుకొంది. జమీందారీ యుగం వచ్చాక కొత్త సంచలనం, సందడి, కళ, కళోత్తేజం కలిగాయి. కాని, విద్యా విధానంలో, దాని తత్త్వంలో మౌలికమైన మార్పేమీ రాలేదు. ప్రాయికంగా జమీందారీ యుగం కూడా, సామ్రాజ్యవాదంలో ఓ చిన్నపాయగా సాగిందే. మౌలిక తత్త్వంలో మార్పులేదు.

ఆంగ్లేయ అధికారం వేర్లుని నిలిచాక, ఆధునిక సరళ విద్యా విధానం, ప్రాథమిక, ద్వితీయ, ఉన్నత స్థాయిలోని మూడంచెల విద్యా విధానం మొదలయింది. వారి ప్రయోజనాలకు అనుగుణమైన విధానమనే 'స్వదేశీ' విమర్శను అటుగా ఉంచి, ఆ సార్వత్రిక విద్యా విధానంలోని ఉదార మానవతావాదాన్ని మన్నించి చూడాలి. బ్రిటీషు విద్యాతత్త్వంలోని ముఖ్య లక్షణం ఆ ఉదార మానవతావాదమే. లోకవ్యవహారానికి సంబంధించిన జ్ఞానం, అవగాహన అందరికీ సమంగా అందాలనే ఆదర్శ సంకల్పం. పాశ్చాత్య విద్యా విధానానికి ప్రాయికంగా ప్లేటో ఆదర్శ రాజ్యంలో పేర్కొన్న ప్రణాళికే ప్రాతిపదిక. అయితే తరువాతి కాలంలో, ముఖ్యంగా పారిశ్రామిక విప్లవ కాల పరిసరాల్లో ఏర్పడ్డ ఉదార మానవతా వాదంలో ఓ విచిత్రం ఉంది. అది పై వాళ్ళు క్రిందివాళ్ల పట్ల చూపే సానుభూతితో కూడుకొన్నట్టిది. ఆ తేడాను మరచి ఏకతా భావనను ఏ కొందరో సాధిస్తే, ఎక్కువ మంది సానుభూతి పేరిట, ఆ తేడా స్పృహను పాటించేవారే, పరోక్షంగా ఆ తేడా స్పృహకీ ఈ సానుభూతి వాదం ఎక్కువ ఉపకరించింది... కనుక ఓ ఆదర్శాన్ని స్వీకరించడం కాదు. దానికి సంబంధించిన సామాజిక లక్షణాలన్నిటినీ స్పష్టంగా నిర్దేశించుకొని, నిర్వచించుకొని, వాటిని ఆ వ్యవస్థలో అంతర్భాగంగా, సహజ సిద్ధంగా ఇమిడిపోయేలా చూడాలి. అలా సహజసిద్ధమై పోయేవాటినే మనం ఆ వ్యవస్థ మూలతత్త్వంగా 'తాత్త్విక విధానం'గా మన్నిస్తాము. ఆంగ్లేయు విద్యా విధానానికైనా అది ఒనగూడిందా అనేది శేషప్రశ్న.

1870 నాటి డబ్ల్యు.బి. ఫార్‌స్టర్ (W.B. Forster) విద్యాచట్టం ఫలితంగా, ఇంగ్లాండులో దేశమంతటా ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పే అవకాశం ఏర్పడింది. అదొక చారిత్రక పరిణామం. పెత్తందారీ శక్తుల విప్లవాలకు సమాధానం. సామాన్య జన చేతనకు సంకేతం. అప్పటి నుంచి విద్యా విధానం పట్ల విమర్శకులు పెరగడంతోపాటు, పిల్లల మనస్తత్త్వం, వారి ప్రాధాన్యం పట్ల పెస్టాలజ్జీ (Pestolazzi) వంటి మేధావుల తాత్త్విక ఆలోచనలు ప్రభావవంతమైన స్థానాన్ని ఆక్రమించాయి. ఎన్నో ప్రయోగాలు జరిగాయి. జర్మనీలో అంటు గట్టిన 'కిండర్ గార్డన్' వంటివి వచ్చి చేరాయి. ఈ ప్రయోగాల్లో భాగంగా ఛార్లెట్ మాసెస్ అనే పుణ్యాత్మురాలు 'హోమ్ ఎడ్యుకేషన్' (గృహవిద్య) విధానాన్ని ఆవిష్కరించింది. గృహవిద్య అంటే ఇంటి పనులు, లేదా పనులతో పాటు విద్య అని కాదు. ఇంట్లోనే విద్య అని అర్థం. పాఠశాలల పరిమితుల్ని వివరిస్తూ, అంతకంటె ఇంట్లోనే తల్లిదండ్రుల మార్గదర్శనంలోనే సరైన విలువలతో కూడిన విద్య లభిస్తుందనేది ఆమె దృక్పథం. తల్లి నుంచే పిల్లలు మొదట నేర్చుకొంటారు. తరువాత పరిసరాల నుంచి తమ పిల్లలు తెలివితేటలు, నైపుణ్యాలు తల్లిదండ్రులకు తెలిసినంతగా ఇతరులకు తెలిసే అవకాశం లేదు. కనుక వారి శిక్షణలోనే పిల్లల విద్య నేర్చుకొంటే, బాగా నేర్చు కోవడమేకాదు, వారాశించే సంస్కృతి విలువలకు ప్రతినిధులవుతారు. పాఠశాలలు వారికి మార్గదర్శనాలు, సామగ్రి సదుపాయాలు అందించే కేంద్ర సంస్థలు కావాలి. ఆమె 1886లో ప్రచురించిన 'హోమ్ ఎడ్యుకేషన్' అన్నది పెద్ద సంచలనాత్మక రచన. ఆ క్రమంలో ఆమె వెలువరించిన ఆరు పుస్తకాలు కూడా అతి విలువైన రచనలు. విద్యా విధానంలో ఎన్నో ముఖ్యమైన మార్పులకు ప్రేరణలు. ఆరింటిలో ఆఖరుది 'ఫిలాసఫీ ఆఫ్ ఎడ్యుకేషన్' (1) మొదటి పుస్తకంలోనే ఆమె నిర్భయంగా, సతార్కికంగా చెప్పినమాట "We do not have a philosophy of Education" అని దాన్ని క్రమంగా నిర్వచించే లక్ష్యంలో వచ్చినవే ఆ ఆరుపుస్తకాలు. ఆమె తన అనుభవాలను, ఆలోచనలను కలబోసి, ఒక 'తాత్త్విక విధానాన్ని' రూపొందిస్తూ, అందులో భాగంగా 16 మార్గదర్శక

సూత్రాలను నిర్వచిస్తుంది. అందులో మొదటిది – ప్రతి పిల్లవాడూ, నీలాగే ఒక ప్రత్యేకమైన వ్యక్తి – అనే సత్యం. తరచూ మనం ఆ సత్యాన్ని గుర్తించడం. మనలాగే, వాళ్లకూ ఒక వ్యక్తిత్వముంటుందనే భావనే రాదు. వ్యక్తిత్వమంటే గడ్డకట్టిన భావసమూహమూకాదు, లేకుంటే ఒక చట్రంలో యిమిడి వుండే ప్రవర్తనా వైఖరీ కాదు. అది నిత్యం పరిణామశీలమైంది. ఆ పరిణామానికి మార్గదర్శనమిస్తూ తోడ్పడేదే విద్య. 'విద్య అంటేనే ఆలోచించడాన్ని ఎదిగించడం' అనేది రెండో సూత్రం. 'నువ్వు నేర్పించకపోయినా, పిల్లవాడు స్వయంగా ఆలోచిస్తాడు. అయితే నిదానంగా ఆలోచిస్తాడు. నువ్వు నేర్పేదంతా దానిన మరింత క్రమబద్ధంగా, శీఘ్రగతిలో చేయడాన్నే' అంటుంది మాసెట్. నిజం చెప్పొద్దూ, ప్రాథమిక విద్య అనే మాటేమిటి, బియ్యేలు, ఎమ్మేలు చదివి ఎం.ఫిల్., పిహెచ్.డి. స్థాయికి వస్తున్న వాళ్లలో కూడా చాలామంది, చాలా చాలా ఎక్కువమంది, స్వంతంగా ఆలోచించగలిగే స్థాయిలో ఉన్నారా? అన్నది సమాధానంలేని ప్రశ్నే అవుతుంది. వారి ననడం ఎందుకు? వారికి నేర్పించే మాస్టార్లయినా ఆలోచిస్తున్నారా అనేది కూడా సమాధానంలేని ప్రశ్నే. ఆ ప్రశ్నతోనే నిమిత్తం లేని వ్యవస్థ మనది... ఆధునిక విద్యావ్యవస్థలోని అతి కీలకమైన లోపం ఇదంటూ పందొమ్మిదవ శతాబ్ది చివరిలోనే ఛార్లెస్ మాసెన్ ఎలుగెత్తి చెప్పింది. జర్మన్ నుంచి దిగుమతయిన 'కిండర్ గార్టన్' మాటలు ఎద్దేవా చేస్తూ 'పిల్లలేం తోటలో మొక్కలా? వాటిని అలా ఇలా పెరగనివ్వకుండా కత్తిరించి క్రమబద్ధం చేసి పెంచడానికి ! అసలు వ్యక్తులుగా పుట్టినవారికి ఈ మొక్కలతో పోలికేమిటి? దాని పేరిట ఈ నామకరణమేమిటి?' అంటూ నిలదీస్తుంది. వ్యక్తంటేనే 'ఒక ప్రతిభాత్మక చైతన్య స్వరూపం, ఆ ప్రతిభను అందంగా తీర్చిదిద్దు' అంటుంది.

ఆంగ్లేయులు తమ దేశంలో ఆధునిక విద్యా విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు వెలిబుచ్చిన ఆందోళన ఇది. ఆ విద్యా విధానాన్నే ఇక్కడా వారు ప్రవేశపెట్టారు. దాన్నే ఆధునిక భారతం యధాతథంగా అనుసరిస్తోంది. అయితే ఆ ఆందోళనను గురించి ఆలోచించిందా? 'ఆలోచించడం' లక్ష్యంగా చదువులను నేర్పిస్తోందా?... 'అనుభవంలోకి వచ్చే అంశాలనే చిన్న పిల్లలు ఆలోచిస్తారు, కనుక పాఠంలో చెబుతున్న వాటిని వారి అనుభవంలోకి తెండి' అన్న ఆమె సూత్రాన్ని అప్పటి వాళ్లు ఎలా ఎద్దేవా చేశారో, 'సాక్షి' సంపుటాల్లోని జంఘాలశాస్త్రి ఉపన్యాసమే ఒక తార్కాణం. ఇప్పటికీ మనలో చాలామందికి జంఘాల దృష్టి వదల్లేదు. ఇక ప్రతిభామూలతత్త్వాన్ని, ఆలోచించడమనే లక్ష్యాన్ని గురించి ఆలోచించడమెక్కడ?

'నవో నవోన్మేషశాలినీ ప్రతిభామతా' అన్నది గొప్ప సూత్రం. కొత్తను ఎప్పటి కప్పుడు స్ఫురింప చేసేది ప్రతిభ. అదోశక్తి, నిపుణత, ట్యాలెంట్ అన్నా, ఇంటిలిజెన్స్ అన్నా అదే, మూలశక్తి 'ఇంటిలిజెన్స్' అయితే, దాని బహిర్వ్యక్తీకరణ 'ఇమాజినేషన్' – రెండూ తెలుగు (సంస్కృతం)లోని 'ప్రతిభ' అనే మాటలో ఇమిడేవే. ప్రతిని భాసింపచేసే ప్రజ్ఞ ప్రతిభ.

దురదృష్టమేమిటంటే ఈ ప్రతిభకూడా కొందరిసొత్తేనని ప్రచారం చేయడం విద్యను గతంలో పెత్తందారీ శక్తులు తమవరకే పరిమితం చేసుకోవడం ఒక ఎత్తు. 'ప్రతిభ' జాతిగతం, పుట్టుకతో వచ్చేశక్తి అని నమ్మింపచేయడం మరో ఎత్తు. అది అన్నింటికంటె దుర్మార్గమైంది.

ప్రతిభ గురించి పరిశోధించిన తొలితరం వారిలో ప్రముఖుడూ, 'స్టాన్‌ఫర్డ్ – బైనెట్ స్కేల్ ఆఫ్ ఇంటెలిజెన్స్'ను రూపొందించిన ప్రతిభామూర్తి లీవిస్ టెర్మన్ (Lewis Terman-1921) ఇంటెలిజెన్స్ అంటే ability to think abstractly అని నిర్వచించాడు. మనకు అగుపించే లేదా మన అనుభవంలోకి వచ్చే భిన్న భిన్న వస్తువుల వెనుక – అంటే మూర్తి రూపాల వెనుక – ఒక అంతర్గత సంబంధం ఉంటుంది. దాన్ని అంటే ఆ అమూర్తభావాల సంపుటిని గ్రహించే సామర్థ్యాన్ని ఆయన ప్రతిభ అన్నాడు. జీవశాస్త్రం, తత్వం, తర్కం మూడింటిని కలిపి అసంఖ్యాక బాటల్ని అధ్యయనం చేసిన జీన్‌పీగెట్ (Jean Piaget - 1952) అనే స్విట్జర్లాండుకు చెందిన మనస్తత్వవేత్త "ability to adopt to one's surroundings" అని నిర్వచించాడు. 1944లో డేవిడ్ వెష్లర్ (David Weshler) ఇచ్చిన – The ability to "act purposefully, to think rationally, and to deal effectively with the environment" అనే నిర్వచనాన్ని సర్వసమగ్ర నిర్వచనంగా చాలామంది అంగీకరిస్తారు. ఆమెరికాలోని మనస్తత్వవేత్త రాబర్ట్ జె. స్టెర్న్‌బెర్గ్ ఆయన సహచరులూ కలిసి దాదాపు 476 మంది స్త్రీ పురుషులను – వివిధ వర్గాల వారిని, వయోభావాల వారిని – 140 మంది పరిశోధకులను కలిసి అభిప్రాయసేకరణ చేశాక, వివిధ రీతుల్లో మనం వ్యవహరించే ప్రతిభా వ్యవహారమంతా మూడు

ప్రధాన రీతులుగా అభివ్యక్తమవుతున్నదని వర్గీకరించారు. అవి : 1. వాస్తవికంగా సమస్యా – పరిష్కార సామర్థ్యం (వివిధ భావాల – ఐడియాల మధ్య సంబంధాన్ని గుర్తించడం వల్ల కలిగేది) 2. వాచిక సామర్థ్యం (అవగాహనతో సాగే పఠనాసామర్థ్యం) 3. సామాజిక భాగస్వామ్య సామర్థ్యం (ఏదైనా మాట్లాడడానికి, చేయడానికి ముందు ఆలోచించేది). మిగిలినవన్నీ కొంచెం హెచ్చు తక్కువగా ఈ మూడురీతుల్లో ఇమిడిపోతాయని పేర్కొన్నారు.

అంటే – ప్రతిభ అనేది అగుపించే వస్తువులు లేదా తారసపడే అనుభవాల వెనుక ఉన్న అంతర్గత భావ సంబంధాల అవగాహన. దాన్ని ఆవిష్కరించే శక్తి ఆలోచన అంటే లోచన (కన్ను – కంటితో చూడగలిగేది)కు మూలమైన దాన్ని చూడగలిగే చూపు – లోచూపు – అనే కదా అర్థం. ఆలోచనకు కూడా మూలం ప్రతిభే. కనుక ఆలోచనాశక్తిని పెంపొందింప చేయడమే విద్యాలక్ష్యం అనే మాటకు అర్థం ప్రతిభను పెంపొందింప చేయడమనే. కనుక విద్య అంటే = ప్రతిభాశిక్షణ అని అర్థం.

ఇది జాతి గతమా? కొందరికి మాత్రమే లభించే వరమా? ఈ ప్రశ్నలకు తన అనుభవాల ద్వారా సమాధానం చెప్పిన సుప్రసిద్ధ వయొలిన్ విద్వాంసుడు షిసూచి సుజికీ రచన, ప్రపంచ వ్యాప్తంగా ఈ రంగంలో ఆసక్తి ఉన్న అందరి దృష్టినీ ఆకర్షించింది. దాని ఆంగ్లానువాదం "Nurtured By Love" పేరిట 1969 మే నెలలో మొదటి సారిగా ముద్రణ పొంది 1979 డిసెంబరు నాటికి 15 పునర్ముద్రణలు పూర్తిచేసికొంది. ఆయన జపాన్‌లో స్థాపించిన 'టాలెంట్ ఎడ్యుకేషన్ స్కూలు' ప్రపంచ ప్రసిద్ధిని పొందింది. పై పుస్తకానికి ఇచ్చిన ఉపనామం – ఏ న్యూ అప్రోచ్ టు ఎడ్యుకేషన్ అని ! ప్రేమతో ప్రతిభను పెంపొందించవచ్చు అనే ఆయన సూత్రం అందరూ అమోదించేదే. అయితే దానికి సంబంధించిన విధానతంత్రం ఎలా? టెక్నిక్స్ ఏమిటి? అనే దాని పట్లనే స్పష్టమైన అవగాహన ఉండదు. ఆ అవగాహననే పై పుస్తకం అందిస్తున్నది. వాటిన్నిటినీ వివరించడానికి ఇది అనువైన స్థలం కాదు కాని, ప్రతిభ విషయంలో ఆయన పరిశీలించిన కొన్ని ఆసక్తికరమైన అంశాలను మాత్రం ఇక్కడ ప్రస్తావించవచ్చు.

ఆయనకు మొదటగా అమితమైన ఆశ్చర్యాన్ని, ఆసక్తిని కలిగించిన విషయం జపాన్‌లో చిన్న పిల్లలందరూ జపనీస్ భాషనే మాట్లాడుతున్నారు. ఎలా ఎవరు నేర్పించారు? ఎలా నేర్చుకున్నారు? ఒక భాషను కొత్తవారికి నేర్పించాలంటే కొన్ని మాసాలో, సంవత్సరాలో పడతాయి కదా ! ఇన్నేళ్ళుగా మనం ఇంగ్లీషుతో తంటాలు పడుతున్నా మన ఆంగ్ల పరిజ్ఞానం అంతంతమటుకే కదా!... వాళ్లెలా అంత సులువుగా వారికివారే, నేర్చేసుకున్నారు?... ఈ నేర్చుకొనే ప్రజ్ఞ స్వరూప స్వభావాలేమిటి?

ఆ తరువాత ఆయన స్వయంగా ఒక ప్రయోగ సందర్భాన్ని పరిశీలించారు. వారి టోక్యో షినగావా శాఖలో జరిగినది. దాని అధిపతి మియాజవా... ఆయనొక పెంపుడు చిలకను తెచ్చి 'నేను పీకో మియాజనా... నేను పీకోమియాజనా...' అని పలకమంటే అంటే అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయేలా అది పీకో మంచి పిట్ట... పీకో మంచి పిట్ట అంది. ఇదెలా సాధ్యం అన్నదానికి మియాజనా తను అనుభవాన్ని వివరించారు. చిలక పుట్టగానే, పసికందుగా ఉండగానే, మాటలు నేర్పడం మొదలుపెట్టాలి. మొదట దానికి 'పీకో' అనే మాటను, రోజుకు ఏభైసార్లు నేర్పడం మొదలుపెట్టారు. రెండు నెలల్లో 3000 పర్యాయాలు అభ్యాసం చేయించాక, అది స్వయంగా 'పీకో' అనసాగింది. ఓపిగ్గా అన్నివేల పర్యాయాలు అప్పచెప్పించే అభ్యాసం చేయించకపోతే, దానికి ఆ మాట అనే సామర్థ్యం వచ్చి ఉండేదికాదు. విత్తనం భూమిలో పడ్డాక, మొలకెత్తడానికి అనువైన పరిస్థితి, తగినంత కాలం కావాలంటాడు సుజికో. 3000 పర్యాయాలు 'పీకో' చెప్పించి, అది దాన్ని చక్కగా పలికే స్థితి వచ్చాక, 'మియాజవా' అనే మాటను చేర్చి నేర్పడం మొదలు పెట్టారు. ఈ మారు 'పీకో మియాజవా' అనే మాటను రోజుకు పదిహేను మార్లు నేర్పిస్తే, రెండు నెలలకే చెప్పగలిగింది. ఆ తరువాత మరికొన్ని మాటలు, మరింత వేగంగా నేర్చుకొంది. చాలా మాటలు 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్'ను లయబద్ధంగా పలకడం వంటివి నేర్చుకొంది. మధ్యలో నేర్పకపోయినా మరొకటి కూడా నేర్చుకొంది. అదేమిటంటే, దానికి నేర్పుతున్నప్పుడు ఓ మారు జలుబుచేసి మియాజవా అప్పుడప్పుడు దగ్గేవారు, ఆ దగ్గును కూడా నేర్చుకొంది. దొంగ!... ఇక్కడ సుజికో రెండు సూత్రాలు ఆవిష్కరిస్తాడు. 1. ఇందాకా అన్నట్లు, నేర్పించే వారికి గాఢమైన ప్రేమ, అపేక్ష మంచి ఓపిక ఉండాలి. 2. మొలకెత్తడమయ్యాక, పెరగడం సులభంగా, వేగంగా

జరుగుతుంది. అంటే ఒక సామర్థ్యం, మరో సామర్థ్యాన్ని పెంచుతుంది. అలా సామర్థ్యం వెంట సామర్థ్యాన్ని పెంచుకొంటూ పోవడమే ప్రతిభ. దానికి తగ్గ దోహదం చేసే అపేక్ష, ఓపిక పెద్దవాళ్ళలో లేనప్పుడే, పిల్లల్లో ప్రతిభా దారిద్ర్యం పట్టుకొంటుంది. ఈ పెద్దవాళ్ళు ఇద్దరే, అటు తల్లిదండ్రులు, ఇటు అధ్యాపకులు. ఇద్దరూ తమను తాము ప్రశించుకొని, సరిదిద్దుకొంటే పిల్లల్లో ప్రతిభా దారిద్ర్యం మాట లేదు. వాళ్లకు తమకు తోచినట్లు తాము నేర్చుకోవటమే ఆట.

సుజికోగారు చెప్పిన మరో రెండు ఉదంతాలు కూడా గుర్తుంచుకోదగ్గవి. ఓ మారు మిత్రులు ఇంట్లో సరదాగా అందరూ కలుసుకొన్నప్పుడు ఈయన ఎదురుగ్గా కూర్చున్న దంపతుల చేతుల్లో వాళ్ల చిన్నమ్మాయి, అయిదు నెలల పాప ఉంది. వాళ్లక్క ఆరేళ్ల పాప.ఆ అమ్మాయి ఇంట్లో వివల్డీ ఎ – మైనర్ కన్సెర్టో రికార్డు వింటూ దాన్ని ఎప్పుడూ అభ్యాసం చేస్తుంటుందట. ఈ పసిపాప కూడా దాన్ని వింటుందట. ఈ దృశ్యం పసిపాప మనస్సు మీద ఎలాటి ప్రభావం చూపిందో పరిశీలిద్దామనుకొంటాడు సుజికీ. వయొలిన్ అందుకొని ఆ అమ్మాయి ఎదురుగ్గా అనేక రకాల ట్యూన్లు వాయిస్తాడు. ఆ అమ్మాయి దేనిపట్ల పెద్ద ఆసక్తి చూపదు. కాస్సేపయ్యాక వాళ్లక్క నిత్యం అభ్యాసం చేసే నవ్వు వివల్డీ ఎ మైనర్ వాయిస్తాడు – ఆ అమ్మాయి కళ్లు విస్ఫారిత మవడమే కాకుండా ముఖంలో నవ్వు, సంతోషం క్రమంగా పెరగడం స్పష్టంగా అగుపిస్తుంది. ఈయన కొత్త కొత్త విన్యాసాలు చూపే కొద్దీ ఇంకా ఆసక్తిగా ఆనందంగా వినసాగింది. నాలుగేళ్ల తర్వాత మట్సుమోటో అనే చోట ఓ పెద్ద సంగీతోత్సవం, కేవలం పిల్లలదే, జరుగుతుంది. దాదాపు 150 మంది బుల్లి వయొలినిస్టలతో అందులో పాల్గొన్నారు. వివల్డీ ఎ – మైనర్ కన్సెర్టో అందులో ఓ నాలుగేళ్ల పాప, ఎంతో తదేకంగా తన మనసూ, ఆత్మను అందులో తల్లీనం చేసి వాయిస్తుండడం చూసి, ఆ అమ్మాయి ఎవరని వాకబు చేశాడు సుజికీ. ఆ పాప ఎవరో కాదు, నాలుగేళ్ల క్రితం తాను చూసిన ఐదునెలల పాప అని తెలిసి ఆశ్చర్యపోతాడు. మరో ఆరేళ్లకు ఆ అమ్మాయి స్వయంగా స్వరకల్పన చేస్తూ, తాను రాసిన పాటను, నొటేషన్‌తోపాటు ఆయనకు పంపి, ఆయన ఆశీస్సులను అభ్యర్థిస్తుంది. తర్వాత తానూ గొప్ప సంగీత విద్వాంసురాలవుతుంది. ఈ ఉదంతం పేర్కొని మరో రెండు ముఖ్య సూత్రాలను చెబుతాడు సుజికీ... ప్రతిభ పెంపొందడానికి, సరైన ప్రేరణ, పరిసరాలు (ఎన్విరాన్‌మెంట్) కావాలి. ఈ ఎన్విరాన్‌మెంట్ అనేది కేవలం భౌతికమైంది కాదు, మానసికమైంది, 'ఎమోషనల్' అని గుర్తించడం చాలామందికి తెలియదు.

ఆయన పేర్కొన్న మరో ఉదంతం మన భారతదేశంలో నలభై ప్రాంతాలలో జరిగిందే. 1941లో డెన్వర్, ఏల్ విశ్వవిద్యాలయాల్లోని ఇద్దరు ప్రొఫెసర్లకు చాలా విలువైన సమాచారం అందుతుంది. దాన్ని డా॥ పుమియోకిదా తన 'చైల్డ్ సైకాలజీ'లో కథనం చేయగా, సుజికీ పేర్కొన్నాడు. కలకత్తా వాయవ్య భాగంలోని ఓ అడవి ప్రాంతంలో, తోడేలు పెంపకంలోని ఇద్దరు మానవ శిశువులను, ఆడపిల్లలను, ఓ పూజారి గుర్తించి తనతో తీసుకువచ్చి అమల, కమల అని పేర్లు పెడతాడు (అప్పట్లో కొన్ని తెగల్లో ఆడపిల్లలను అలా అడవిపాలు చేసే అలవాటు !) పెద్దమ్మాయికి ఏడేళ్ళు, చిన్నమ్మాయికి రెండేళ్లు. తొమ్మిదేళ్లపాటు పరిశీలనలో పెట్టారు. ఎప్పటికప్పుడు ఫోటోలు తీస్తూ వచ్చారు. మొదట్లో వారి తల, ఎద, భుజాలు దట్టమైన వెంట్రుకలతో కప్పబడి ఉండేవి. వాటిని కత్తిరించాకే, వారు మానవ శిశువులుగా అగుపించారు. కాళ్లూ, చేతులూ నాలుగింటిపై నడిచేవారు. కుక్కల్లా వేగంగా పరుగెత్తేవారు. వారి వేగాన్ని ఇతరులు అందుకోలేకపోయారు. కాళ్లు చాలా బలంగా, భుజాలు చాలా విశాలంగా పెరిగాయి. ఆహారం కూడా కుక్క పిల్లల్లాగే అలాగే నోటితో తీసుకొనేవారు. పెద్దమ్మాయి కనులలో తోడేలు వైఖరి మరీ పెరిగిపోయి వుంది. తల, చర్మం, శరీరం కూడా ఆ వైఖరికి బాగా లోనయివుంది. కోపం వస్తే, ముక్కులు విచ్చుకొని, కుక్కలా మొరిగేది. తింటున్నప్పుడు ఎవరైనా అడ్డువస్తే, గోళ్లతో రక్కేది. పగలంతా నిద్రపోయేది, రాత్రిళ్లు మెలుకువగా చురుగ్గా ఉండేది. తోడేళ్ల మధ్య ఉన్నట్లే, సరిగ్గా రాత్రి పది, ఒంటి గంట, మూడు గంటలప్పుడు ప్రతి రాత్రి ఊళలు వేసేది. తొమ్మిదేళ్లపాటు మానవుల మధ్య పెరిగినా ఆ అలవాటు మారలేదు. ఆ గొంతు విచిత్రంగా అటు మానవుల్లాను, ఇటు జంతువుల్లాను కాకుండా ఉభయ లక్షణాలు కలిగి ఉండేది. పదహారవ ఏట మరణించేదాకా, మానవవైఖరి ఆమెను పెద్దగా ప్రభావితం చేయలేదు.

ఈ ఉదంతాన్ని పేర్కొని 'Could you call this inherited' అంటూ సూటిగా ప్రశ్నిస్తారు సుజికీ.

ఛార్లెట్ మాసిన్ కూడా తన రచనలో 1828 మే 28న

న్యూరెంబెర్గ్ గ్రామంలో ఓ చెప్పులు కుట్టేవారి ఇంటిముందు బయల్పడి 'నూరెంబెర్గ్ ఛైల్డ్'గా ప్రసిద్ధి పొందిన కోపెన్ హోసెర్ ఉదంతాన్ని పేర్కొంటుంది. 'పరిసరాలు – ప్రతిభ' మీద క్రూరమైన పరిశోధనకు తలపడ్డవారెవరో ఒక శిశువును తీసుకెళ్లి, ఒక కలుగులో పెట్టి మానవ శిశువులందరికీ దూరంగా పెంచి, 16వ ఏట, ఆ వింత బాలుణ్ణి తెచ్చి, నడిరాత్రి నూరెంబెర్గ్‌లో వదిలివెళతాడు. మానవుల ప్రవర్తనా వైఖరి ఏ మాత్రం రాని ఆ పిల్లవాణ్ణి ఊరి ప్రజలందరూ తమ గ్రామం పిల్లవాడిగా భావించి క్రమంగా మానవ ప్రవర్తనా రీతిని నేర్పుతూ, భాష–జ్ఞాన సామర్థ్యం పెంచడానికి లండన్‌లోని ప్రొఫెసర్ డామర్ శిక్షణలో ఉంచుతారు. మూడేళ్లు ఎంతో ఓర్పుతో, నేర్పుతో శిక్షణ ఇస్తే, కోపెన్ హోసెర్ కనీస వ్యవహార సామర్థ్యాన్ని సాధిస్తాడు ! తర్వాత ఎన్నో ప్రసిద్ధ రచనలకు, సినిమాలకు ఈ ఉదంతం ప్రేరణ అయ్యింది.

ఈ రెండు ఉదంతాల్లోని మౌలిక ప్రశ్న – సుజికీగారు అడిగిందే, ఈ తెలివి తేటలనండి, ప్రతిభ అనండి, ఇది జాతి వారసత్వంగా పొందేదా ! పరిసరాల ప్రభావంతో సరైన ప్రేరణలతో పొందేదా?

మనం తరచూ ఈ ప్రశ్న వేసికోము. జాతి పెత్తనాలు కొనసాగే సమాజంలో, చదువుపట్ల తాత్పర్యం, ప్రేమ, ఓర్పు, నేర్పులేని తల్లిదండ్రులు+అధ్యాపకులతో అసలు మనం విద్యాలక్ష్యమైన ఆలోచించడం – క్రమంగా, వేగంగా ఆలోచించడం, ప్రతిభాలక్షణం అనే అంశాన్ని అంతగా పట్టించుకోమన్నది యథార్థం. దేశం వెనక్కు పోవడానికి అవినీతి, స్వార్థం పెచ్చు పెరగడంతోపాటు, తగినంత నైపుణ్యాలు చూపకపోవడం, అప్రతిభ, అసమర్థత ప్రధాన కారణాలు కావడం లేదా! ఇవన్నీ దేని ఫలితాలు? సంస్కారాలను పెంచే శక్తి ఏది? ఎక్కడ సరైన విద్యా సంస్కృతి వుండదో, అక్కడ మరే సంస్కృతి వుండదు. సంస్కృతి అనేది మతం తాలూకు అలిఖిత దస్తావేజుకాదు. వర్తమానం నుంచి భవిష్యత్తులోకి నడిపే ఆలోచన. ఆలోచన అంటే లోచనం చూసేదాని మూలాలను చూసేది, మనశ్శక్తి, మరో మాటలో ప్రతిని భాసింపచేసే ప్రతిభ.



ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ
(పూర్వ ఉపకులపతి, ద్రవిడ
విశ్వవిద్యాలయం, కుప్పం)
హైదరాబాద్.
gangisetty.ln@gmail.com

## షోపెన్ హోవర్ – మంచిమాటలు

- తనలో ఉన్న ఆనందాన్ని అనుభవంలోకి తెచ్చుకోవటం కష్టం. కాని తన వెలుపల ఉన్న ఆనందాన్ని అనుభవించటం అంతకంటే కష్టం.
- మర్యాద ప్రదర్శించటం మంచి లక్షణమనిపించుకుంటుంది. ముక్కుసూటిగా మాట్లాడితే మూర్ఖుడంటారు. పరుషవాక్కులతో ఎందుకు అందర్నీ శత్రువులను చేసుకోవటం! మర్యాద సత్తురూపాయిలాంటిది. ఎంత ఖర్చుపెట్టినా నష్టం లేదుగద.
- మరొకర్ని అనుకరించటానికి ప్రయత్నిస్తే స్వంత అస్తిత్వాన్ని కోల్పోతాం.
- పుస్తకాలు చదవాలనుకున్నవాళ్ళు, మొదట చెత్త పుస్తకాలు చదవకుండా ఉండటమెలాగో తెలుసుకోవాలి. ఒక పుస్తకం బెస్ట్‌సెల్లర్ అయిందంటే అది మూర్ఖులకోసమే ఉద్దేశించబడిందని స్పష్టం కావటం లేదా?
- మనిషిలో దైవత్వం ఉందనటానికి ఋజువు అతనిలోని సెన్స్ ఆఫ్ హ్యూమర్ మాత్రమే.
- సైన్సుకూ, తత్వశాస్త్రానికీ తేడా లేదు. ఈ రెండింటిలోనూ విశ్వాసానికి తావులేదు. స్వానుభవమూ, తార్కికత మాత్రమే నిగ్గుతేల్చుతాయి.
- పుస్తకాలు లేని నాగరికతను ఊహించలేం. పుస్తకాలు మార్పులకు చోదకశక్తులు. కాలమనే ఎల్లలు లేని సముద్రంలో దారి చూపించే లైట్‌హౌజ్‌లు. అవి మన సహచరులు. గురువు. ఇంద్రజాలికులు. మానవజాతి సమిష్టి సంపదకు నిక్షేపాలు, చైతన్యానికి అక్షరరూపాలు.
- గులాబీలున్న చోటల్లా ముళ్ళుంటాయి గాని ముళ్ళున్నచోటల్లా గులాబీలుండవు.
- నాలోని రహస్యం నాలోనే దాచుకుంటే, అది నాకు బందీగా ఉంటుంది. నలుగురికీ చెబితే దానికి నేను బంధీనవుతాను.
- జీవితం నశ్వరం అని దిగులు పడతాంగాని అదే మనకు దేవుడిచ్చిన నిజమైన వరం.

# త్యాగమే ఊపిరిగా - బాధలే బాటలుగా...

*- పిల్లుట్ల హనుమంతరావు*

*తెలుగు సాహిత్యంలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్న పుస్తకం చలం రాసిన మైదానం. స్త్రీ, పురుషుల మధ్య ప్రేమ భావన ముఖ్యమని దీనితో భౌతిక పరమైన కామం ఒక విడదీయరాని బంధమని గాఢంగా నమ్మిన చలం, స్వేచ్ఛా ప్రణయమనే భావనను తాను నమ్మటమేకాక అదొక విలువగా తన నవలలలో ప్రచారం చేశాడు. ఈ స్వేచ్ఛా ప్రణయంలో అసూయకు స్థానం లేదు. మైదానం నవలలో భర్తను వదిలి వెళ్ళిన రాజేశ్వరి అమీర్‌ను ఎంతగా ప్రేమిస్తుందంటే అతను మరొకామెను ప్రేమించినా, తన ముందే శృంగారం జరిపినా, అమీర్ తనను ప్రేమించకుండా వుండలేడు అన్నంతగా! ఆరోజులలో చలం నమ్మిన స్వేచ్ఛా ప్రణయాన్ని ఆచరణలో పెట్టినవారిలో పురుషులే కాదు స్త్రీలు కూడా వున్నారు. అందులో ఒక ముఖ్య వ్యక్తి రత్నమ్మ. చలం కాకినాడలో వున్న రోజులలో ఆమెకు చలంకు మధ్య శృంగార పరమైన సంబంధం ఏర్పడింది. దీని ఫలితంగా ఆయన బ్రహ్మసమాజాన్ని వీడవలసి వచ్చింది. చలం స్వీయ చరిత్రలో ఆమె గురించి ఎక్కువ వివరాలు లేవు. తరువాతి కాలంలో రత్నమ్మ ఏమయినట్టు?....*

*- సం.*

నేను ఇంటర్ పాసయినదాకా నా జీవితం ప్రశాంతంగానే నడిచిందని చెప్పాలి. అప్పటికి నాకు 16 సంవత్సరాలు. తిలక్ మహాశయుడు దేహం చాలించటం (01-08-1920), గాంధీ మహాత్ముడు సత్యాగ్రహం, సహాయ నిరాకరణోద్యమాలు సాగించటం ఒకేసారి జరిగాయి. తిలక్ మరణంపై పరశురాముడు తన బలాన్ని అందించి అవతారం చాలించాడని కొందరు, “తిలకుక్ష్మాపాలుడు మిమ్ము చూపి చనియె, మహాత్మ!'' అని కొందరం అనుకుంటూ, పాడుకుంటూ ఉండేవాళ్ళం. ఒకనాడు గుంటూరులో మహాసభ జరిగింది. కీర్తిశేషులు, పూజ్యులు శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రి గారు (స్వామి సీతారామ్) ఉదాత్తమైన భాషలో గొప్ప ఆవేశంతో స్వాతంత్ర్య సమర ఉద్యమం గురించి మాట్లాడేసరికి సుమారు వెయ్యిమంది విద్యార్థులు స్కూళ్ళను బహిష్కరిస్తామని అక్కడే శపథం చేసి కంకణం ధరించారు. వారిలో నేను ప్రప్రథముణ్ణని ఇప్పటికీ గర్విస్తున్నా!

ఆ విద్యార్థులందరినీ కాంగ్రెసు ఆఫీసుకు రావలసిందని శ్రీ శాస్త్రిగారు చేసిన ఆజ్ఞను నాతోపాటు సుమారు పదిమంది మాత్రమే శిరసా వహించారు, తక్కినవారు తిరిగి స్కూళ్ళలో ప్రవేశించారు. శాస్త్రిగారి శిష్యత్వం కింద, గ్రామాలకు వెళ్ళటం, ఉపన్యాలివ్వటం మొదలుపెట్టాం. తరువాత శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారి వెంట సత్తెనపల్లి తాలూకా, పల్నాడు తాలూకాలు పర్యటిస్తూ, మహాత్మాజీ సందేశాన్ని గ్రామాలకు అందచేస్తూ ఉండేవాళ్ళం.

ఆ రోజులలో కడప జిల్లా అన్ని విధాలా వెనుకబడి ఉండేది, ఖూనీలు చేయడంలో తప్ప! అక్కడ ప్రచారకులు లేరు. తగినవారిని పంపమని గుంటూరు, కృష్ణాజిల్లా కాంగ్రెస్ సంఘాలకు కడపవారు రాసినందువల్ల నన్ను గుంటూరు నుంచి, ప్రతాపగిరి రామమూర్తిని కృష్ణాజిల్లా నుంచి పంపారు.

ఈ సందర్భంలో మా ఇద్దరికీ ఏర్పడిన మైత్రి గాఢమైంది. అతడు గొప్ప మేధావి, సరసుడు, సహృదయుడు, ఆవేశపరుడు. చాలా చిన్నతనంలోనే బ్రహ్మసమాజంలో చేరటంచేత మహర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు, వేమూరు రామకృష్ణారావుగారు మొదలైన మహనీయుల మన్ననలను పొందాడు. సంఘసంస్కర్త మాత్రమే కాకుండా, బ్రహ్మసమాజంలో చేరి, యజ్ఞోపవీతం కూడా విసర్జించటంవల్ల పూర్వాచార పరాయణులైన అతని తల్లిదండ్రులకు,

అత్తమామలకు దూరమయ్యాడు. అందువల్ల వారు రామమూర్తి చదువుకు డబ్బు పంపటం మానివేశారు. కాని బ్రహ్మసమాజంలోని అతని స్నేహితులు మొక్కపాటి రామమూర్తి, గుడిపాటి వెంకటచలం మొదలగువారు చేసిన ధన సహాయంచేత విద్యను ఆపవలసిన పనిలేకుండా సాగిపోయింది.

రామమూర్తికి, నాకు కాంగ్రెసు వారు జీవనభృతి నిమిత్తం చెరి పదిహేను రూపాయలు ఇచ్చేవారు. ఆ ముప్ఫది రూపాయలతో మేం కాలం వెళ్ళబుచ్చుతూ ఉండేవాళ్ళం. పొద్దున బయలుదేరి ఊరూరా ఉపన్యాసాలిచ్చుకుంటూ, మేమంటే భయంలేక ఎవరైనా ఇంత అన్నం పెడితే తిని, లేకపోతే ఇంత శెనగపప్పో, వేరుశనగకాయలో తిని. మిగతా కడుపు నీళ్ళతో నింపి, మొత్తంమీద రాత్రికి ఇంటికి చేరేవాళ్ళం. మా ఇద్దరికి గాంధీగారి మనుషులని పేరు పెట్టారు గ్రామాలలో జనం. గాంధీ మహాత్ముడి గురించి వింత కథలు గ్రామాల్లో ప్రచారంలోకి వచ్చాయి. ఆ కథలన్నీ మూఢంగా నమ్మటంచేత గాంధీ ఒక దేవుడని, పదకొండో అవతారమని భక్తి విన్యాసాలతో పూజించటం మొదలుపెట్టారు. 'జైల్లో పెడితే తాళాలు తీయకుండానే ఆయన బజారులో తిరుగుతూ ఉంటాడట, నిజమేనా?' అనీ, 'తుపాకులతో కాలిస్తే తూటాలు ఆయన మెళ్ళో పూలదండగా పడేదనే మాట నిజమేనా!' అనీ – ఈ విధంగా మమ్మల్ని అడుగుతూండేవాళ్ళు, పురాణాలు ప్రతిరోజూ పారాయణచేసే మన దేశంలో ఆ విధంగా మహాత్ముణ్ణి తలచడంలో ఆశ్చర్యమేముంది? వారి విశ్వాసానికి, భక్తికీ భంగం కలుగచెయ్యరాదని మాకు తోచి, "నిజమే"నని అంటూ ఉండేవాళ్ళం. "మిమ్మల్ని స్వయంగా పంపించాడట, నిజమేనా!" అంటే, "ఊఁ" కొట్టేవాళ్ళం. లేకపోతే కొన్నిచోట్ల మాకు నీళ్ళు పుట్టేవి కావు.

ఒకరోజున ఒక పల్లెలో ఉపన్యాసాలిచ్చి పొద్దుపోయి కమలాపురం చేరి నేను నిద్రపోతూండగా, నిశిరాత్రి ఇద్దరు వ్యక్తులు రైలు దిగి వెతుక్కుంటూ వచ్చి నిద్రలేపారు ప్రతాపగిరి రామ్మూర్తిని. నాకు మెలకువ వచ్చింది కాని, పడుకునే ఉన్నా "ఎవరు?" అని రామ్మూర్తి అడిగిన ప్రశ్నకు, ఆ వ్యక్తులలో ఒకరు – "నేను, మొక్కపాటి రామ్మూర్తిని. ఈ మూల్గుతున్న వ్యక్తి రత్నమ్మగారు!" అన్నాడు. ఆమె ఎవరో ప్రతాపగిరికి గుర్తు తగల్లా. ఆమెను కూర్చోమని, "మై డియర్ బ్రదర్! ఎక్కడనుంచి రాక?" అనే ప్రశ్నకు మొక్కపాటి – "చెప్పటానికి సవాలక్ష గ్రంథమవుతుంది!" అని చెప్పి ఇలా అన్నారు – "మనం కాకినాడలోనూ, రాజమండ్రిలోనూ కాలం గడిపినప్పుడు స్వేచ్ఛా ప్రేమను గురించి మాట్లాడుకుంటూ ఉండేవాళ్ళం. దానిని బయలుదేరతీసింది అసలు నేను. దాన్ని ప్రచారంలోకి తెచ్చింది గుడిపాటి. చాలా వాదోపవాదాలు జరుగుతూ ఉండేవి. నీవు మాతో ఏకీభవించకుండా తటస్థంగా ఉండేవాడివి. రోజులు గడిచినకొద్దీ స్వేచ్ఛా ప్రేమలో గొప్ప సత్యమున్నదనీ, వివాహ సంప్రదాయం మానవుని స్వేచ్ఛకు చాలా భంగకరమనీ, దానివల్ల జాతి యావత్తూ నశించిపోతుందని పెద్దవాళ్ళ దగ్గర వాదించి, పండితుల చేత ఒప్పించా, అందులో గొప్ప తత్త్వం ఉన్నదని, నేను ప్రపంచానికి చాటదలిచి గ్రంథం మొదలుపెట్టాను. ప్లేటో ఈ తత్త్వాన్ని దాని తార్కిక నిరూపణ స్థాయికి తీసుకుని వెళ్ళకుండా, మధ్యలో దాన్ని అర్థం చేసుకోలేక అయోమయం చేశాడు."

ఇదంతా వింటూ ప్రతాపగిరి ఎదురు ప్రశ్న లేకుండా ఊఁ కొడుతూ "తర్వాత ఏం జరిగిందీ?" అన్నాడు – ఈ వింత వేదాంతం యొక్క ఫలితాలు ఎట్లా పరిణమించాయో తెలుసుకోవాలని ఆతురతతో.

"నా భార్యకు ఎంత బోధించినా 'నిన్ను నేను వదిలిపెట్టను' అన్నది. తరతరాల నుంచీ పట్టిన బూజు ఇప్పట్లో వదలదనుకున్నాను. గుడిపాటి ప్రభృతులు ఆచరణలో పెట్టేశారు. నేను నా భార్యను వదిలి, ఈ రత్నమ్మ గారిని ప్రేమించా. ఆమె ఈ నూతన భావాలను, ఈ తత్త్వాన్ని బాగా అర్థం చేసుకున్నది కనుక ఆమె నన్ను ప్రేమించింది. రానురానూ ఊళ్ళో పరిస్థితులు విషమించాయి. మా తత్త్వం అర్థంగాని కొంతమంది పూర్వాచార పరాయణులు, సనాతనులు రౌడీలకు డబ్బిచ్చి మమ్మల్నిద్దర్నీ చావమోదించారు. ఆ కుట్రలో నా మామగారికి కూడా కొంత సంబంధం ఉన్నట్లు నాకు అనుమానం. 'తెల్లవారితే ఊళ్ళో కనబడ్డారా, చంపేస్తాం!' అన్నారు ఆ రౌడీలు. వాళ్ళలో కొంతమంది పట్టభద్రులు కూడా ఏడ్చారు. అందుచేత ఆ రాత్రే బయలుదేరి ప్రతి మహోద్యమానికి ఆదిలో అట్లాంటి అంతరాయాలు రావటం సహజం అనే విశ్వాసంతో బళ్లారి వెళ్ళాం.

"అక్కడొక కమిటీ హైస్కూల్ హెడ్‌మాస్టారు నా స్నేహితుడవటంచేత ప్రయత్నిస్తే ప్రెసిడెంటుతో చెప్పి ఒక మాస్టారీ ఉద్యోగం ఇప్పించాడు. ఏడెనిమిది మాసాలు

సుఖంగానే వెళ్ళిపోయింది. ఇంతలో ఆ ప్రెసిడెంట్, హెడ్‌మాస్టారుతో – "ఈ మొక్కపాటి రామమూర్తి మన స్కూల్లో ఒక్క నిముషం ఉండటానికి వీలు లేదు. ఒక నెల జీతం ఇప్పించి పంపించు బయటికి!" అన్నాడు. "పాపం, నా స్నేహితుడు – "ఇతడు చాలా తెలివిగలవాడు. మన స్కూలు బాగుపడుతుందని పిలిపించా!" అంటూ ఎంత చెప్పినా వినక ఒక తట్టెడు ఉత్తరాలు హెడ్‌మాస్టార్ ముందు కుమ్మరించాడు. "అవి అన్నీ రాజమండ్రి నుంచి వచ్చిన జాబులు. వాళ్ళు నన్ను పసిగట్టి వెంటాడుతూనే ఉన్నారు. హెడ్‌మాస్టారు తన స్థితికే భంగం వస్తుందని భయపడి నన్ను మొన్నటి రోజున ఉద్యోగంలో నుంచి విడుదల చేశారు. ఊరంతా పాక్కింది. అక్కడ ఒక నిముషం కూడా ఉండటానికి వీల్లేదనిపించి వెంటనే బయలుదేరి వచ్చేశాము – రత్నమ్మ గారికి 15 లంఖణాలు. ప్రాణం శల్యగతమై ఉన్నప్పటికీ, మీ అన్న ప్రతాపగిరి సుబ్బారావు (బళ్లారి ప్లీడరు) ద్వారా నీ ఆచూకి తీసి ఈ కష్ట దశలో నీకంటే నన్ను ఆదుకునేవాళ్ళు లేరని ఇక్కడకు వచ్చి పడ్డాము" అన్నాడు.

మేము ఇంటికి వచ్చినప్పుడల్లా రత్నమ్మగారికి ఉపచారాలు చేస్తూ, మందులిప్పిస్తూ శ్రమ పడేవాళ్ళం. మొక్కపాటి రామ్మూర్తి సౌజన్యం, మేథ, సర్వతోముఖమైన పాండిత్యం, తెనుగు, ఆంగ్ల భాషల్లో అనర్గళంగా మాట్లాడే తీరు అద్వితీయమైనది. ఇంత మెత్తని మనసు అని చెప్పడానికి అలవికానిది. రత్నమ్మగారికి కొంత దేహారోగ్యం ఏర్పడిన తరువాత వారిద్దరూ మాతో గ్రామంలో ప్రచారం కోసం వస్తుండేవారు. మార్గమధ్యంలో తన వేదాంతాన్ని బయటికి తీసి నూరిపోయాలని ఎంతో శ్రమ పడేవారు. నాకంటే చాలా పెద్ద అవటంవల్ల చనువుతో మాట్లాడేటప్పుడు చక్కని హాస్యం కూడా వుండేది. ఎంత నూరిపోసినా నాకు ఆ ప్రేమతత్త్వం మింగుడుపడేది కాదు. నేను చిన్న కావటంవల్ల నామీద బాగా పారవలసిన మంత్రం అయినప్పటికీ మొక్కపాటికి రాజమండ్రిలో జరిగిన దేహశుద్ధి జ్ఞాపకం రావటంవల్ల స్వేచ్ఛా ప్రేమంటే ఉలిక్కిపడేవాడిని. ఆయన వాదాలకు నేను బదులు చెప్పక మౌనం వహించి, ఇంత మంచివాడికి ఈ పరిస్థితేమిటి? అని జాలివేసేది.

'ఈ హనుమంతరావు బుద్ధిమంతుడు. పైకి రావలసినవాడు. ఇటువంటి మంచి భావాలను ఈ వయసులో గ్రహించలేకపోతే మున్ముందు అసలు ఎక్కవు. వీడి ద్వారా గుంటూరు పరగణా అంతటా ఈ భావాలను ప్రచారం చేయిద్దామనుకుంటే వీడు మొరాయిస్తున్నాడు. చూడబోతే వట్టి మట్టి బుర్రేమిటి, చెప్మా!" అని నా మీద మొక్కపాటికి జాలి. ఈ విధంగా ఒకరిని చూసి ఒకరు జాలిపడుతూ సుమారు నాలుగు మాసాలు గడిపాం. రత్నమ్మగారి ఆరోగ్యం పూర్తిగా బాగుపడింది. ఇద్దరూ మద్రాసు ప్రయాణం కట్టారు. వాళ్ళు వెళ్తుంటే కళ్ళంబడి నీళ్ళు వచ్చాయి. అసలు నాకు అది జబ్బనుకోండి.

రత్నమ్మగారు – "నీవు నాకు ప్రాణభిక్ష పెట్టావు తండ్రీ! నీవు చేసిన ఉపచర్యలు ఎవరు చేస్తారు" అంటూ మమ్మల్ని వదిలిపెట్టి వెళ్ళలేక కొంత కంటతడి పెట్టుకున్నది. మొక్కపాటికి నా మీద కలిగిన ప్రేమ, వాత్సల్యానికి చిహ్నంగా మన దేవేంద్రనాథ్ ఠాగూర్ గారి స్వీయచరిత్ర బహూకరించి, తనను మరచిపోవద్దని గాఢాలింగనం చేసుకున్నాను. వారిద్దరూ మద్రాసు వెళ్ళిన తరువాత ఏమయ్యారో నేను మళ్ళీ వినలేదు. కొంతకాలం జైలు జీవితం గడిపి బయటికి వచ్చాం. ఎచట చూసినా నిస్పృహ. ఆ తర్వాత తిరిగి దేశసేవలో మునిగి, పొదల మధ్య దేశం మరమ్మత్తును ప్రారంభించాను.

స్కూళ్లను బహిష్కరించినవారికి మంచినీళ్ళు పుట్టవని తెలుసుకుని 1928 జూలైలో ఎనిమిదేళ్ళు పూర్తిగా చదువు మానేసిన తర్వాత నా సోదరుని ధనసహాయంతో గుంటూరు ఏ.సి. కాలేజీలో మూడవ సంవత్సరంలో ప్రవేశించా. 1930 ఏప్రిల్ పరీక్షలలో బి.ఏ. పాసై, జూలైలో మద్రాసు కాలేజీలో ప్రవేశించాను ఎఫ్.ఎల్. క్లాసులో.

నా తమ్ముడు లక్ష్మీనారాయణ శాస్త్రి పచ్చయప్ప కళాశాలలో మూడవ సంవత్సరంలో ప్రవేశించాడు. మేము మాంబళంలో బరోడా వీధిలో కొన్నాళ్ళు, స్టేషనుకు ఎదురుగా బర్మాహౌస్‌లో కొన్నాళ్ళు ఉండేవాళ్ళం. జయంతి సుబ్రహ్మణ్యం – ఇతడు రాజమండ్రి కాపురస్తుడు. జయంతి గంగన్న గారి కుమారుడు మాకు స్నేహితుడయ్యాడు. ఇతడు టి.నగర్‌లో పానగల్ పార్క్ దగ్గరలో మెయిన్‌రోడ్డు మీద ఆయన భార్యతో కాపురముంటూ ఉండేవాడు. ఆమెది చామనఛాయ, లావుపాటి మనిషి. ఎప్పుడూ మందహాసంతో తొణికిసలాడే మొహం. కార్పొరేషన్ ఆయుర్వేద ఆసుపత్రిలో డాక్టరుగా పనిచేస్తూ ఉండేది. సుబ్రహ్మణ్యం ఎల్.ఎం.పి. పాసై, వైద్యం చేసుకుంటూ ఇంటివద్ద ఉండేవాడు. ప్రతిరోజూ సాయంత్రం మౌంట్‌రోడ్‌దాకా షికారుకెళ్ళి వస్తూ ఉండేవాళ్లం, మా

సోదరులం ఇద్దరం. డాక్టరు రంగాచారి గారు వారి రోల్స్‌రాయిస్ కారును మౌంట్ రోడ్‌మీద నిలిపి, గుఱ్ఱమంత కుక్కను వెంటేసుకుని గబగబా నడుస్తూ పానగల్ పార్క్ దాకా వచ్చి, తిరిగి వెళ్తూ ఉండేవారు. ఆయన ఆ కాస్తా దేహ పరిశ్రమ కోసం నడిచేవాడన్నమాట! మేముకూడా రోడ్డుకు అవతలివైపుగా ఆయనతో సమానంగా నడవలేక, పరుగెత్తుతూ ఉంటే మమ్మల్ని చూసి ఆయన నవ్వుతూ ఉండేవారు. ఒకప్పుడు సుబ్రహ్మణ్యానికి గ్యాస్టిక్ అల్సర్ ఏర్పడి, చాలా రక్తం వమనం చేసుకున్నాడు. నాలుగు రోజులు డాక్టర్లను తీసుకువచ్చి, వైద్యం చేయించాం. ఎక్కిళ్ళు మొదలుపెట్టి ఏ మందులు ఇచ్చినా తగ్గలా. పెద్ద డాక్టరు కూడా నయం చేయలేకపోవడంవల్ల ఆయాసం ఎక్కువై ప్రమాదస్థితిలో ఉన్నాడని భయపడ్డాం.

డాక్టరు రంగాచారిగారు మమ్మల్ని చూచి రోజూ నవ్వుతూ ఉండటంవల్ల మేము పిలిస్తే వస్తాడనే ధైర్యంతో వారితో చెప్పి సుబ్రహ్మణ్యాన్ని చూపించాం. ఒక నిముషం ఏకాగ్రచిత్తంతో అతని ఎక్కిళ్ళను పరిశీలించి, వెంటనే మజ్జిగరసం తెమ్మని, తన చేత్తో అందించాడు సుబ్రహ్మణ్యానికి – తాగిన తరువాత అయిదు నిముషాలలోపలనే ఎక్కిళ్ళు పూర్తిగా కట్టుకున్నాయి. అంతవరకు అక్కడే ఉన్నారు. అటువంటి డాక్టరు 'న భూతో న భవిష్యతి' – అప్పటి నుండి సుబ్రహ్మణ్యం మాకు ఎక్కువ సన్నిహితుయ్యాడు.

ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటలు మొదలు ఎనిమిది గంటల దాకా అతని ఇంటి ఆవరణలో మేమందరం చేరేవాళ్ళం. గంటి చంద్రశేఖరశాస్త్రిగారు సుబ్రహ్మణ్యానికి స్నేహితుడవడం వల్ల ఆయన కూడా మాతోపాటు అక్కడ సమావేశమవుతూ ఉండేవారు. సుబ్రహ్మణ్యం ఆరుగంటల లోపలనే వంట తయారుచేసి ఆయన భార్య వచ్చేసరికి అన్నీ సిద్ధం చేసేవాడు. ఆమె ఆస్పత్రి నుండి రాగానే మేము జరిపే బాతాఖానీలో పాల్గొంటూ ఉండేది. ఎంతో లోకానుభంతోను, విజ్ఞానంతోను సంభాషించేది. ఇదీ మా ఇద్దరి దినచర్య.

నేను ఒకరోజున మాటవరుసకు అన్నా – "మొక్కపాటి రామమూర్తి అనే అతడు కమలాపురంలో నేను కాంగ్రెసు సేవ చేసే రోజుల్లో నాకు స్నేహితుడయ్యాడు. ఆయనతోపాటు రత్నమ్మగారనే ఒకామె బళ్లారి నుంచి జబ్బుతో చిక్కి శల్యమై వచ్చింది. ఆమెకు నేను, ప్రతాపగిరి రామమూర్తి ఇద్దరం చాలా ఉపచారాలు చేశాం. తర్వాత వారిద్దరు మద్రాసు వచ్చేశారు. దరిమిలా ఆయన ఎక్కడ ఉన్నాడో నాకు తెలియలేదు. మద్రాసులో ఉంటే ఆయనను చూడాలని చాలా కుతూహలంగా ఉంది. ఎక్కడున్నారో తెలిస్తే చెప్తావా, సుబ్రహ్మణ్యం!"

ఈ విషయం సుబ్రహ్మణ్యం భార్య విని, విననట్లుగా అంతవరకూ ఎంతో మందహాసంతో ఉన్న మొహం హఠాత్తుగా వెలవెలపోతూ లేచి ఇంట్లోకి వెళ్ళిపోయింది. అప్పుడు చాలామంది స్నేహితులమున్నాం అక్కడ. సూర్యాస్తమయమయింది. కొంచెంసేపు నిశ్శబ్దంగా తనకేదో పని ఉన్నదని స్నేహితులందరినీ పంపేసి పానగల్లు పార్కుకు మమ్మల్ని తీసుకునివచ్చి జనసమ్మర్దం లేని ఏకాంత స్థలంలో ఈ విధంగా చెప్పటం మొదలుపెట్టాడు సుబ్రహ్మణ్యం.

"నా పూర్వపు వాసననుబట్టి నేను కూడా బ్రహ్మ సమాజంలో ఉండేవాడిని. ఎల్.ఎం.పి. మూడవ సంవత్సరంలో చదువుతున్నానప్పుడు. మెడికల్ హాస్టల్‌లో ఉండేవాణ్ణి. మొక్కపాటి రామమూర్తి చిన్నప్పటినుంచి నాకు స్నేహితుడు. అందుచేత నన్ను వెతుక్కుంటూ రామమూర్తి, రత్నమ్మగార్లు ఇక్కడకు వచ్చారు. బహుశః కడప జిల్లా కమలాపురంలో నుంచి అనుకుంటాను. 'ఇద్దరు స్నేహితులు చాలా సహాయం చేశారు కమలాపురంలో. రత్నమ్మగారిని బతికించారు వాళ్ళే!' అంటూ చెప్పేవాడు. నేను స్టాన్లీ మెడికల్ హాస్టల్ భోజనం, వసతి మానేసి, మేము ముగ్గురం కలిసి తంబుచెట్టి వీధిలో ఒక పెద్ద గది తీసుకున్నాము.

"కొద్దికాలమైన తర్వాత రామమూర్తి మద్రాసు రెసిడెన్సీలో ఉద్యోగం సంపాదించాడు. కొంతకాలం బాగానే గడిచింది. ఒడిదుడుకులు లేకుండా. నాతో రామమూర్తి స్వేచ్ఛా ప్రణయం గురించి నిరంతరం చర్చిస్తూ ఉండేవాడు. సినిమాకు పోయినా అదే, బీచ్‌కి పోయినా అదే! తీరిక ఉన్నప్పుడల్లా ఈ బంధరహితమైన ప్రేమను గురించి చర్చ తప్ప వేరే మాటలు లేవు. 'ఒకరు ప్రేమించిన స్త్రీకి గాని, పురుషునికి గాని ఇతరుల మీద మనసు మళ్ళితే సహించి ఊరుకోవటం దుస్సాధ్యం కదా! నిశ్చలమైన ప్రేమతో కాలం గడపటం, అలా గడపమని బోధించటం మంచిదిగాని, నీ ఇష్టం వచ్చినట్లు విచ్చలవిడిగా, స్వేచ్ఛగా ప్రేమించమని ఒక సిద్ధాంతం లేవదీసి, దానిని ఒక పెద్ద స్థాయికి తీసుకువెళ్ళటం మంచిది కాదని, అది లైసెన్సు కింద పరిణమిస్తుంద'ని ఎంతో వాదించా. కాని రామమూర్తి అద్భుతమైన మేధావి అవటంవల్ల, అతని వాగ్ధాటి అనర్గళం

అయినదవటంచేత అతని ఎదుటమాత్రం ఎవరం కాదనలేకపోయాం.

"ఈ వాదోపవాదాల్లో రత్నమ్మగారు కూడా పాల్గొంటూ ఉండేవారు. అతని వాదనతో ఆమె ఏకీభవిస్తూ ఉండేది. ఎంత స్వేచ్ఛ ఇచ్చినప్పటికీ ప్రేమకు మారే స్వభావం లేదని ఆమె అంటూ రామ్మూర్తిని సమర్థిస్తూ ఉండేది. ఈ విధంగా ఒక సంవత్సరం జరగక మునుపే ఆమె అంతరంగికంగా నన్ను ప్రేమిస్తున్నట్లు నాకు గోచరమైంది – క్రమేణా స్పష్టమైంది. నేను అంగీకరించకుండా నా వ్యతిరేకతను కూడా స్పష్టం చేశాను. "సుతారామూ నా కిష్టం లేదు. మీ ఇద్దరికి నేను ద్రోహం చేయటం అవుతుంది" అని నొక్కి చెప్పేవాడిని. నేను చదువుకోని మూర్ఖుడల్లే ప్రవర్తిస్తున్నానని నా మీద రామమూర్తితో నేరాలు చెబుతూ ఉండేది రత్నమ్మగారు. క్రమేణా కాలంతోపాటు నా మనుసులో కూడా మార్పు వచ్చేసింది. స్వేచ్ఛ, ప్రేమ బీజాలు నా మనసులో కూడా మొలకెత్తడం ప్రారంభించాయి. నేను కూడా ప్రేమించా రత్నమ్మగారిని. అదొక పండగరోజల్లే భావించాడు రామమూర్తి – నేను కూడా వారితోపాటు ప్రేమతత్త్వోపాసన మొదలెట్టినందుకు.

"నేనూ రత్నమ్మగారు భార్యాభర్తలకంటే ఎక్కువ స్వేచ్ఛగా సంచరిస్తూ ఉండేవాళ్ళం. మేమలా మెలగటం రామమూర్తికి చాలా ఇష్టమైనట్లు ఆయన అంటూ ఉండేవాడు కొంతకాలం. ఆయనలో ఏ విధమైన మార్పు ఉన్నట్లు తోచలా చాలా రోజులు. కాని క్రమేణా నేను ఊహించలేని మార్పు ఆయనలో కలిగింది. మా ఇద్దరి పరస్పరానురాగం ఆ మార్పుకు కారణమని అనుకోవడానికి వీల్లేకుండా మా ప్రవర్తనమీద ఏవగింపు చూపకపోగా, మా సుఖమే ఆయన సుఖం, మా ఆనందమే ఆయన ఆనందమైనట్లుగా భావిస్తూ ఉండేవాడు.

"ఇట్లా కొంతకాలం జరిగిన తర్వాత ఒకనాటి ఉదయం మేము ముగ్గురం పడుకున్న గదిలోనే రామమూర్తి మరణించి ఉండటం మాకు పిడుగుపడ్డట్టయింది. మా దుఃఖానికి మేర లేదు. కారణం ఏమాత్రం ఊహించలేకపోయాం. కొద్దిసేపట్లోనే పోలీసులు నన్ను రత్నమ్మగారిని జైలులో ఉంచారు. అక్కడున్న పుస్తకాలు, కాగితాలు, పోలీసు అధికారులు వశం చేసుకున్నారు. రామమూర్తి మరణించిన గదిలో మేమిద్దరంతప్ప ఇతరులెవ్వరూ లేకపోవటంచేత మాకు మరణశిక్ష తప్పదని భయపడ్డాం. రామమూర్తి రాసిన ఉత్తరాలు దొరకటంవల్ల మేము నిర్దోషులమని రెండు మాసములు రిమాండ్‌లో ఉంచిన తర్వాత పోలీసువారు మమ్మల్ని విడుదల చేశారు. రామమూర్తి పోలీసు కమీషనరుకు స్వయంగా రాసిన ఉత్తరంలో ఇలా ఉంది – 'నాకు జీవితం మీద అసహ్యమేర్పడ్డ కారణంగా పొటాషియం సైనేడ్ తిని ఆత్మహత్య చేసుకుంటున్నా. నా మరణానికి నేను బాధ్యుణ్ణి. ఇతరులకు ఎట్టి సంబంధంలేదు.'

ఇతర స్నేహితులకు రాసిన ఉత్తరాల్లో ముఖ్యాంశాలివి – "స్వేచ్ఛా ప్రణయం అనే సిద్ధాంతం చాలా ఉత్కృష్టమైనదని, ఆచరణయోగ్యమైనదని నేను మనసారా నమ్మి, దానిని ప్రచారంలోకి తీసుకుని రావటంలో చాలా కష్టాలు పడ్డా. ప్రతి గొప్ప ఉద్యమానికి ఆరంభ దశలో కష్టాలు, అవాంతరాలు రావటం సహజమేనని అనుకున్నా. నేను ఈ ప్రేమ సిద్ధాంతాన్ని దృఢంగా నమ్మి ఉండటంచేత నేను ప్రేమించిన వ్యక్తి ఇంకొకరిని ప్రేమిస్తే నాకు ఎలాంటి క్రోధం కాని, మాత్సర్యం కాని రాకుండా అంచెలంచెలుగా ఉండేలా మనోధైర్యం ఇవ్వమని భగవంతుణ్ణి వేయినోళ్ల ప్రార్థించా, సుబ్రహ్మణ్యం, రత్నమ్మల సుఖజీవనం నన్ను చలింపచేయకుండా చాలా ప్రయత్నం చేశాను.

"అప్రయత్నంగా నా మనస్సులో ఈర్ష్య జనించి, నన్ను కానరాకుండా దహింపచేసింది. రత్నమ్మ లేని జీవితం నాకు అంధకారమవటంచేత వారిద్దరి సుఖానికి నేను ఏ విధంగానూ ఆటంకం కలుగచేయడం ఇష్టంలేక, ఈ రెంటి సమన్వయం నా ఆత్మహత్యతో తప్ప వేరే లేదని భావించి ఈ జీవితాన్ని అంతమొందిస్తున్నా. *ఈ స్వేచ్ఛా ప్రణయం అనే పిచ్చి సిద్ధాంతాన్ని నమ్మి, పెంచి పెద్ద చేసినందుకు అది* ***Frankenstein's Monster*** *మల్లే నన్నే అంతం చేసింది. నా అనుభవంలోనే ఈ సిద్ధాంతం వెర్రితలలు వేసింది."*

"మేము నిర్దోషులుగా బయటపడ్డ కొంత కాలానికి నేను ఎల్.ఎం.డి. పాసయ్యాను. రత్నమ్మగారు ఎల్.ఐ.ఎం. పాసయ్యారు. ఇద్దరం వివాహం చేసుకుని సుఖంగా కాపురం చేస్తున్నాము. ఇప్పుడు నాతో కాపురం చేస్తున్నది ఆ రత్నమ్మ గారే. ఆమెను నీవు ఇన్నాళ్ళనుండి గుర్తుపట్టలేకపోవటం చాలా ఆశ్చర్యంగా ఉంది. స్వేచ్ఛాప్రణయ సిద్ధాంతానికి తన జీవితాన్ని అంకితం చేస్తానంటూ రామమూర్తి అన్నమాట ఒక విధంగా నిజమైంది. అది ఆచరణ యోగ్యం కాదని నిరూపించటానికి ఆయనే బలైపోయాడు."

రాత్రి సుమారు పది గంటలదాకా ఈ కబుర్లు చెబుతూనే ఉన్నాడు సుబ్రహ్మణ్యం. తరువాత నా గదికి వెళ్ళాను. రాత్రల్లా ఈ ఆందోళనవల్ల నిద్రపట్టలేదు.

వారం రోజులదాకా నేను, నా తమ్ముడు సుబ్రహ్మణ్యం గారింటికి వెళ్ళకపోతే రత్నమ్మగారు కబురు చేశారు. మేము వెళ్తూనే ఆమె తటాలున వచ్చి, నమస్కారం చేసి, “కమలాపురంలో నేను చావు బతుకులలో ఉంటే నాకు ఉపచారాలు చేసి, నన్ను బతికించిన హనుమంతరావుగారు మీరేనా? ఎంత వైపరీత్యం?! ఈ సంవత్సరన్నరనుంచి పోల్చుకోలేకపోయాను. మీరు అప్పుడు బాల్యంలో ఉన్నారు. నేను చాలా నీరసించి, బక్కచిక్కి ఉన్నాను. మొన్న డాక్టరుగారికి అంత జబ్బుచేస్తే సహాయం చేశారు. మీ ఋణం నేను తీర్చుకోలేను!” అని ఏమోమో అంది.

సుబ్రహ్మణ్యం, రత్నమ్మగార్లు ఆదర్శమైన దంపతులు. ఎంత స్వేచ్ఛ ఉన్నా, ప్రేమకు మారే స్వభావం లేదని ఆమె ఎప్పుడో అన్నమాట సత్యమైనట్లు నిరూపించింది. వారిద్దరి ప్రణయ యాత్ర ఇంత కల్లోల భూయిష్టంగా నడిచిందని చాలామందికి తెలియదు.



పిల్లుట్ల హనుమంతరావు, శ్రీమతి శారద.

*హనుమంతరావు, మహాత్మాగాంధీ పిలుపుతో ఉత్తేజితుడై స్వతంత్ర సమరంలోకి దూకి, త్యాగపరమైన జీవితాన్ని గడిపారు. ఆయన తాను వ్రాసిన డైరీ ఆధారంగా తన ఆత్మకథను* **‘త్యాగమే ఊపిరిగా, బాధలే బాటలుగా...’** *ప్రచురించారు. అందులో జాతీయ పోరాట వివరాలతోపాటు, మొక్కపాటి రామ్మూర్తి రత్నమ్మల గురించి మీరు చదివిన వివరాలు ఉన్నాయి.*

(అరుదుగా లభించే ఈ పుస్తకాన్ని మాకందించిన పతివాడ సూర్యనారాయణగారికి కృతజ్ఞతలు)

*మొక్కపాటి రామమూర్తి 1927 సం॥లో రాజమండ్రి సెంట్రల్ జైలు సూపరిండెంట్ పనిచేశారు. (మహీధర రామశాస్త్రి గారి సమాచారం) మొక్కపాటి రామమూర్తి, తల్లావఝ్ఝల పతంజలిశాస్త్రికి బంధువు - వీరి ఛాయాచిత్రం కోసం ఎంతగానో ప్రయత్నించాం - అలాగే రత్నమ్మగారిది కూడా పాఠకులు ఎవరైనా పంపితే ప్రచురించగలం.*

*- సం.*

---

## షోపెన్ హోవర్ మంచిమాటలు

- డబ్బుంటే పుస్తకం కొంటాంగాని, వాటిని చదవటానికి అవసరమైన కాలాన్ని కొనలేంగద. పుస్తకాలు చదవడమంటే వాటి విషయ సూచికలు చదవటం కాదు (ఇప్పుడైతే వాటి వెనక పేజీ మేటర్ చదవటం కాదు అని చెప్పుకోవాలి!).
- మన దుఃఖానికి కారణం ఇతర్లతో మనకున్న పరిచయాలే. మన సంబంధాలలో ఎంతో కొంత లౌక్యం ప్రదర్శిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం లేదు.
- తన రచనల్ని ఆషామాషీగా తీసుకునే రచయిత, తన ఆలోచనలకు విలువ లేదని అంగీకరిస్తున్నాడన్న మాట.
- అసూయ మానవ సహజం కావచ్చుగాని, పక్కవాడి కష్టాలను చూసి ఆనందించటం మాత్రం రాక్షస లక్షణమే.
- వేడిచేస్తే మైనం కరిగినట్టుగా, మర్యాదలు ప్రదర్శిస్తే ఎవరైనా కరిగిపోతారు.
- ఆత్మవిశ్వాసం లేనివాడికి, ఆరోగ్యం ఎంత బాగున్నా ఉపయోగమేమి?
- ప్రతిభ ఉన్నవాడు ఇతర్లు చెయ్యలేని పని చెయ్యగలడు. కాని జీనియస్ ఎవరూ ఊహించని పనిచేస్తాడు.
- వాస్తవానికి మూడు దశలు : మొదట దాన్ని చూసి అందరూ నవ్వుకుంటారు. తరువాత వ్యతిరేకిస్తారు. చివరికి ఇది అందరికీ తెలిసిన విషయమేగదా అని అంగీకరిస్తారు.

# అన్నమయ్య సంకీర్తనల్లో - అభ్యుదయ దృక్పథం

- కోసూరి దామోదర నాయుడు

'అభ్యుదయ' శబ్దం అందరికి పరిచితమయిందే. దీనికి శుభం, మంగళం, ప్రగతి, పురోగతి అని అర్థం చెప్పుకోవచ్చు. తెలుగు సాహిత్యంలో సాళ్వాభ్యుదయం, రామాభ్యుదయం లాంటి కావ్యాలున్నాయి. ప్రబంధాలలోని 'అభ్యుదయ పరంపరారభివృద్ధి'గా అనే సమాసం కనిపిస్తుంది. అయితే ఎవరి ప్రగతి, ఎవరి పురోగతి అన్నది ప్రశ్నార్థకం. సమాజపరంగా వాడుతున్నాం. కాబట్టి కార్మిక, కర్షక, శ్రామికులకు సంబంధించినదిగా చెప్పవచ్చు. ఆధునిక తెలుగు సాహిత్యంలో సామాజిక చైతన్యం, శ్రామిక జనపక్షపాతం, వాస్తవికత, పీడితజనపక్షం, సమాజ నిర్మాణం మొదలైన అంశాల్ని అభ్యుదయం సూచిస్తుంది. ప్రాచీన సాహిత్యంలో ఈ అభ్యుదయం ఎవరికి అన్నది ప్రశ్నార్థకం. చందన తాంబూల సత్కారాలతో కవికి, అంకితం పుచ్చుకున్నవారికి అని అనేకరకాల సమన్వయాలున్నాయి. కాని ఈ అభ్యుదయం లౌకికమా, పారలౌకికమా అనే సందేహాలున్నాయి. ప్రాచీన సంప్రదాయ సాహిత్యమంతా లౌకిక అభ్యుదయం కోరినా దానిని పక్కన పెట్టి పారలౌకిక అభ్యుదయాన్ని లక్ష్యంగా పెట్టుకొన్నది. అయితే ఆధునిక కవిత్వంలోని అభ్యుదయాన్ని భౌతిక పునాదుల ఆధారంగా అర్థం చేసుకోవాలి. "సమకాలీన జీవన పరిస్థితులకు, నైతిక సందర్భాలకు, ఐహిక ఆముష్మిక సిద్ధాంతాలకు, వైజ్ఞానిక విశేషాలకు అనుగుణంగా, అనుకూలంగా తమకు అవసరమయిన మార్పులతో విలసిల్లేదే అభ్యుదయ రచన అని" పి.వి. రాజమన్నార్ భావించారు. అభ్యుదయ కవిత్వానికి శ్రీ శ్రీ, ఆరుద్ర, చలంలాంటివారు ఎన్ని నిర్వచనాలు ఇచ్చినా తాళ్ళపాకవారి రచనలకు రాజమన్నార్ లాంటి ప్రముఖుల అభిప్రాయాలను స్వీకరించడం సబబు అనిపిస్తుంది.

తెలుగు సాహిత్యంలో వెలువడిన రచనలలో సమకాలీన సాంఘిక చారిత్రక పరిస్థితుల నేపథ్యం గుర్తించడం అవసరం. తాళ్ళపాక కవుల నాటికి విజయనగర సామ్రాజ్యం ఎదుగుతూవుంది. క్రమంగా శైవ ప్రభావం సన్నగిల్లుతూ వైష్ణవాభినివేశం క్రమంగా బలపడుతున్నది. పరమ వీరశైవాచారులు కూడా విష్ణు సంబంధి కథల వర్ణనలకు అర్రులు చాస్తున్నారు. దక్షిణం నుండి ప్రాకిన రామానుజమతం అనేక మతాలద్వారా, రాజాశ్రయాల ద్వారా క్రమంగా అల్లుకొంటూ వుంది. జ్ఞాన, కర్మ మార్గాల కంటె సులభతరమైన భక్తివైపు సమాజం పరుగులిడుతూవుంది. రాజాస్థానాలున్నా దేవస్థానాలు సమాజ కార్యకలాపాలకు ప్రముఖ కేంద్రాలవుతున్నాయి. అప్పటివరకు తెలుగులో క్షేత్రమహాత్మ్యకావ్యాలు, సంస్కృతానువాదాలున్నాయి. శైవులు మొదలు పెట్టిన 'దేశికవిత' నిట్టూర్పులు విడుస్తూ వుంది. తన కాలం నాడు పద్యకవిత్వానికి పరమాదరం వున్నా, పండిత సత్కారమున్నా పదకవితలపట్ల నిరాదరణలున్నా, పుల్లవిరుపు ఎకసెక్కాలున్నా అన్నమయ్య తన కాలం నాటికి ఏది అవసరమో గుర్తించాడు. పద్యాన్ని, పదాన్ని సమానంగా అభిమానించాడు. అన్నమయ్య శ్రీవేంకటేశ్వర శతకం పద్యాత్మకం. అలభ్యమైన 'వెంకటాచల మహాత్మ్యం' కూడా పద్యాత్మకం కావచ్చు. అలాగే రామాయణం. అన్నమయ్య కుమారుడు పెదతిరుమలయ్య రచనలు చాలావరకు పద్యాత్మకాలే. ఈ పద్య పద ఆధిక్య సమరంలో ఈ రెండింటికి 'పంక్తి భోజనం'లో సమాన గౌరవం అందించడం అన్నమయ్య అభ్యుదయ ధోరణులలో మొదటి మెట్టు.

అన్నమయ్య తొలిరచన శ్రీవేంకటేశ్వర శతకం. పేరు స్వామిది. మకుటం స్వామిది. అయినా వర్ణనలన్నీ అలమేలుమంగకు సంబంధించినవే. ఇది భక్తి శృంగార శతకం. తెలుగులో అప్పటి దాకా ఈ రకం శతకాలు లేవు. అందువల్లనే అన్నమయ్య 'తొలిభక్తి శృంగార శతక పితామహుడయ్యాడు'. ఇది రచనా పరంగా సాగించిన అభ్యుదయమనక తప్పదు. ఈ శతకం తిరుమల ఉత్సవాలలో గరుడోత్సవం లాంటి వాటిని కూడా విశదీకరిస్తుంది. అలమేలు మంగ అభినవ రూప సౌందర్యలీలా విశేషాలను ప్రకటిస్తుంది. మధురభక్తిని స్పష్టం చేస్తుంది. కుటుంబ

జీవితంలోని సొగసుల్ని రసికతను చవి చూపుతుంది. ఈ విధంగా తరువాతి శృంగార భక్తి శతకాలకు మార్గదర్శకం కావడం అభ్యుదయమే.

అన్నమయ్యకు ముందు పదాలున్నాయి. పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్ర'లో ఎన్నోపదాలను పేర్కొన్నాడు. అలాగే శైవ సంబంధి పదాలున్నాయి. జానపద గేయ రీతులున్నాయి. అన్నమయ్య వాటిని పరిశీలించాడు. శృంగార, ఆధ్యాత్మ యోగ సంకీర్తనలని విడగొట్టుకున్నాడు. మారుతున్న కాలానికి అనుగుణంగా వీటి అవసరాన్ని గ్రహించాడు. తన కాలంనాటి నాథపంథా, ఆళ్వారుల పంథా, అనేభక్తి ఉద్యమాలను గుర్తించాడు. ఒక విశిష్ట ప్రయోజనం కోసం అన్నిటిని సమన్వయం చేయడం అవసరమని భావించాడు. మడిగట్టుకొని తిరువీధులకే పరిమితమైన రామానుజ వైష్ణవానికి విస్తృత సమన్వయం అవసరమని భావించాడు. తన కాలంనాటి అనేక సంప్రదాయాలను – విఠల, గోరక్షనాథ, చెన్నకేశవ, రాధామాధవ హనుమాది సంప్రదాయాలను వైష్ణవంలో ఇమిడించి అనేక సంకీర్తనలు పాడి అభేదం స్పష్టం చేసాడు. వైష్ణవ వేషభాషలెందుండినా తనకు ఆమోదమనడంలోని విశాల దృక్పథం గుర్తించదగ్గది. అంతమాత్రాన రామానుజ మతాన్ని తృణీకరించలేదు. ఆళ్వారులను గౌరవిస్తూ వారి దారిలో నడుస్తున్నానని నమ్మకం కల్గించాడు. ఇది ఆనాటికి అన్నమయ్య సాధించిన వినూత్న అభ్యుదయం.

*కవుల్ని స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఆస్థానకవులు. ఆస్థానేతర కవులు. ఆస్థాన కవులు లౌక్యులు. సుఖజీవనలాలసులు. పుచ్చుకొనేది దానమయినా సత్కారమనే పేరుతో సమర్థించుకోగలిగిన సమర్థులు. సాటి కవులతో సంఘర్షణలున్నా తమస్థానాన్ని పదిలం చేసుకొన్న చాకచక్యంగల నిపుణులు. అయితే ఈ స్థితిని తలదన్నినవారున్నారు. 'ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి' అని ఈసడించుకొన్నవారున్నారు. అన్నమయ్య తనకు తానై సాళ్వనరసింగని ఆస్థానంలో చేరలేదు.* సాళ్వనరసింహరాయలే అన్నమయ్య ఆశీస్సులు అందుకొంటే ఫలిత ముంటుందని భావించాడు. కాని చివరకు అన్నమయ్య 'నరహరి కీర్తన నానిన జిహ్వ ఒరుల నుతింపగ నోపదు జిహ్వ' అంటూ ఆవలయం నుండి బయటపడ్డాడు. అన్నమయ్య కుమారులకు అచ్యుతరాయలు ప్రాపకం వున్నా, ఆలయ అభివృద్ధివరకే వారిని వాడుకోవడం, గ్రామాలు దానాలు పుచ్చుకున్నా వాటిని స్వామికే సమర్పించడం 'అభ్యుదయ' దృక్పథాలలో ఒకటి. ప్రత్యేకించి వీరు ప్రవేశపెట్టిన కల్యాణోత్సవాలు, వనభోజనోత్సవాలు, ఉరిఅడి పండుగలు సామూహిక ఉత్సవాలు కావడం వల్ల 'సమాదరణ' అవకాశం కలిగింది.

తెలుగు సాహిత్యం విశిష్టమనడంలో సందేహంలేదు. తెలుగు కవులలో చాలమంది గ్రామీణవ్యవస్థనుండి పైకి వచ్చినా వారే. కాని వారు రాసిన కావ్యాలన్నీ అనువాదాలు అనుకరణలు కావడంవల్ల సిసలైన గ్రామీణజీవితం వ్యక్తంకాలేదు. ఈ రంగంలో ఎఱ్ఱన్న, పోతన్నలే మిన్న. తరువాతి ప్రబంధకవులు నగరానికి అలవాటు పడి గ్రామాలను, గ్రామసౌందర్యాన్ని మరచిపోయారు. కాని అన్నమయ్య మరచిపోలేదు. రైతును, వ్యవసాయాన్ని గుర్తించి అభిమానించిన కవి. 'కాపులముమేము' అని గర్వంగా తచెప్పుకొన్నవారు వీరు. 'పొలమును' నమ్ముకొన్న వారు గనుక మహావిష్ణువు అవతారాలను 'పొలమునకు' అన్వయించినారు. వ్యవసాయానికి మొదట అవసరమయినది పశుసంపద. కనుక ఎద్దులను ప్రస్తావించి శ్రీవేంకటేశ్వరుని బోడెద్దుగా వర్ణించి అవతారకీర్తనలు చేశారు. అటవీభూముల్ని సాగుభూమిగా మార్చే విధానాన్ని 'పొత్తుల పాపమనేటి పోడునరికివేసి' అనే చరణాలతో చెప్పారు. అలాగే ఫలవంతమైన వ్యవసాయాన్ని కూడా ఆనందంగా 'కాయముల కాణాచి కాఫలము'లో వర్ణించారు. అంతేకాదు కొండల పొడవుల కుప్పల్ని, పండిన పంటల్ని, నిండినరాశుల్ని, కొలుచులయిన గాదెల్ని వర్ణించి వీటివల్ల సామాజిక జీవనంలో వచ్చిన మార్పుల్ని, రమ్యగృహాలు, కూరిమిసంపదలు, పల్లెల్లోస్వేచ్ఛాహంచారం, సంపాదించిన ధనరాశిని వర్ణించడం ఒక విశేషం. ఈ నాడు మనం చెప్పుకొనే కర్షక కార్మిక వర్గసంక్షేమం గుర్తించినవారు తాళ్ళపాక కవులు. ఇంకా గ్రామీణుల ఆంగిక అభినయాలు అతిమనోహరాలు. వాటిలో ముసిముసినవ్వుల మోపులకట్టె, నెత్తికొప్పువాడు, నిరుదకన్నుల తోడి నివ్వెరగులు', నీరాకగోరి వాకిట నిలుచున్నది ఇలాంటివి ఉదాహరణలుగా చెప్పవచ్చు.

సమాజంలోని వారి మనస్తత్వం ఏకాకారం కాదు. కొందరు సాత్త్వికులు. కొందరు రాజస్వభావం కలవారు. మరికొందరు తామసులు. తిరగబడటం నానాయాగీచేయడం తామసులకు సహజం. తనస్థితిని నిలుపు కోవడంకోసం కుయుక్తులుపన్నడం, తన భావాల్ని ఇతరులమీద రుద్దడం,

ఒప్పించేలా ప్రయత్నించడం రాజసస్వభావులనైజం. సహనం, సర్దుకుపోవడం సాత్త్వికుల లక్షణం. అయినా తనకళ్ళముందు జరుగుతున్న అన్యాయాన్ని, అక్రమాన్ని చూచి స్పందించిన వాడు అన్నమయ్య. అతడు నందకాంశసంభవుడు కనుక పదాలకరవాలాలతో విరుచుకుపడ్డాడు. రాజ్యంకోసం అన్నదమ్ములు కొట్లాడుకోవడం, చంపుకోవడం చూసి అసహ్యించుకొన్నాడు. ప్రజాభ్యున్నతని పట్టించుకోని రాజుల్ని 'తావులేలే రాజులకు దయకొంత పుట్టదాయె" అని తెగడినాడు. ఆదర్శజీవితం గడపవలసిన యతుల్ని వారిఐశ్వర్యాన్ని చూచి వన్నెసెడియతులు ధనవంతులైరి' అని వారి బండారాన్ని బయట పడేసినాడు. కళ్ళముందే బోయ దొరలు అమాయకుల్ని కత్తులకెర చేస్తుంటే తల్లడిల్లి కన్నీరు కార్చినాడు. రాజ్యమేలేవారు ప్రజల్ని బుకాయించడానికి పెళ్ళిళ్ళు చేసుకొని సమర్థించుకొంటే యద్దేవా చేశాడు. మేదరింటి లంజెవోయి మేదినీశు తగులంగ కొందరికి పట్టిన అదృష్టాన్ని గ్రంథస్థం చేశాడు. సతిరాణివాసమైతే జాతికులమెంచరట'.

సమాజంలో వృత్తులు శరీరానికి రక్తనాళాలవంటివి. ఆలయం, ఆలయ పరివారగణం, ఆలయసేవనకు సంస్కృతికాదు. ప్రత్యేకించి గ్రామీణవృత్తులు పరస్పరాశ్రితాలు. కులవృత్తిని నిలుపుకొంటున్న సామాజిక సేవకులు. సుఖభోగలాలసతకు అలవాటుపడిన సమాజం, వీరిని మరచిపోవడం దురదృష్టం. అయితే అన్నమయ్య వీరిని మరచిపోలేదు. నేతకు సంబంధించిన వన్నెనూలు, గంజి, కండెలు, పసిడినీరు, అలుకల అల్లిక, కుచ్చులు కట్టడం. సంతలలో అమ్మడం లాంటివి వర్ణించినాడు. 'కొనరో కొనరో మీరు కూరిమి మందు', శ్రీహరి పాదతీర్థమే చెడనిమందు' పుడమి ధరుడు మాకు భువనేషదములో మందుల వ్యవహారాలు, ఆ మందులను సేవించి ధన్యులయిన వారిని వర్ణించాడు. అలాగే తలారులను, ఉప్పు అమ్మేవారిని, బొమ్మలాట వారిని, మేదరివారిని, పాములాడిస్తూ బతికేవారిని, వెట్టిచాకిరివారిని పేర్కొన్నాడు. ఈ వృత్తుల వారిని పేర్కొనే సందర్భాలలో వారి వృత్తిని ఆధ్యాత్మికంగా అన్వయించడం అన్నమయ్య ప్రత్యేకత.

సమాజంలో ఎన్నో కులాలు, మతాలు, వర్ణాలున్నాయి. ఒకప్పుడు ఇవి పని విభాగం కారణంగా ఏర్పడ్డవి. కాని కాల క్రమేణ వీటిమధ్య అంతరం పెరిగింది. ఒకరు అధికులని, మరొకరు హీనులని అవాంతరభేదం పెంచుకొంది. ఈ అంతరాన్ని భక్తి సాధనతో తగ్గించడానికి సమంచేయడానికి వీరశైవులు, భక్తకవులు ప్రయత్నించారు. అన్నమయ్య తన సంకీర్తనలలో 'వట్టి నటరాజసాలు వర్ణాశ్రమములు, జాతియిందేదంత్య జాతి యిందేది, తగిన జన్మముఅంపు తమ చక్కదనాలింపు జగతి వారికి వారి జాతులింపు' అన్నాడు. అలాగే అనేక సంకీర్తనల్లో గొల్లలు, చెంచులు, బోయలు, ఎరుకలు మొదలగు వారి వేషభాషల్ని రమ్యంగా వర్ణించాడు. కావ్యాలలో ప్రబంధాలలో అన్నమయ్య తరువాతనే ఈ కులాలవర్ణన అరణ్యప్రాంత వర్ణనలలో చోటుచేసుకొన్నదనడం వాస్తవం. బోడితల, గోచి, జంధ్యాలు వేసుకున్న బాపడిగా నరసింహుని కీర్తించాడు. సంధ్యావిధులు పాటించేవారు, వేదపారాయణులు, ఆత్మనతతంబు కీర్తించేవారే బ్రాహ్మణులన్నాడు. మీసాలు, వీపుబరువు, పొలాలలో సంచారము, పొట్టి పొట్టి అడుగులు, నెమలి చుంగులు కలవాడు అయిన బోయడు శ్రీహరి దశావతారములుగా అన్నమయ్య కీర్తించాడు. కులాలను గుర్తించడమే గాకుండా ఆ కులాలను గౌరవిస్తూ తాను చేపట్టిన భక్తిమత ప్రచారంలో భాగస్వాములను చేయడం అభ్యుదయంలోని మరోమైలురాయి.

మానవ స్వభావాలను పరిశీలించి ఇంతగా పదస్థం చేసినవారు తెలుగు సాహిత్యంలో మరొకడు లేడు. ఇది రచనలోని 'అభ్యుదయ పంథా'. సమాజంలోని రకరకాల వ్యక్తుల్ని, వారు ఆయాసన్నివేశాలలో ప్రవర్తించే విధానాన్ని గుర్తించడం, పరిశీలించడం, అనుభవించి అందంగా చెప్పడం అందరికీ చేతనయిన విద్యకాదు. అన్నమయ్య ఆ విద్యలో ఘటికుడని పించుకున్నాడు. ఉదా. తల్లిమీద ప్రీతి కొంతకాలానికి తనయులు కలిగితే వుండదట. పెక్కు మగల మధ్య పెరిగిన ఒక సతి వుంటే అందరిచూపు ఆవిడమీదేనట. పతిలేని వానికి జరిగినదే ఆలట.

అన్నమయ్య మానవులందరూ ఒక్కటే అని చెప్తూ–

*"బ్రహ్మమొకటే పరబ్రహ్మమొక్కటే / కందువగు హీనాధికము లిందులేవు / అందరికీ శ్రీహరే అంతరాత్మ / ఇందులో జంతుకులమంతా నొక్కటే / అందరికీ శ్రీహరే అంతరాత్మ నిండార రాజు నిద్రించు నిద్రయు నొక్కటే / అందనేబంటు నిద్రించు అదియు నొకటె / మెండైన బ్రాహ్మణుడు మెట్టుభూమి యొక్కటే / చండాలుడుండేటి సరి భూమి యొకటే / కడగి యేనుగు మీద కాయు నెండొకటె / పుడమి శునకము మీద*

*పొలయు యెండొకటె / కడు పుణ్యులను పాపకర్మలను సరిగాన జడియు శ్రీ వేంకటేశ్వర నామమొక్కటే!"* (2-385)

చక్రవర్తి అయినా – నిరుపేద అయినా నిద్రలోపొందే సుఖం ఒక్కటేనని, బ్రాహ్మణుడైనా దళితుడైనా మట్టిలో కలిసేఒక్కచోటేనని అంటాడు. బ్రహ్మ పరబ్రహ్మల మూలకారణమైంది ప్రకృతి. అందుకే బ్రహ్మం ఒక్కటే సమాన తత్త్వం కలది. జాతి కుల మత భేదం లేని సమాజాన్ని కోరుతున్నాడు. సమస్త ప్రాణికోటి యొక్క అంతరాత్మ శ్రీహరేనంటాడు. ఛండాలుని అతి తక్కువ కులంగా భావిస్తారు. అటువంటి వ్యక్తులు వుండేటిభూమి ఒక్కటే. సమస్త జీవులపై ప్రసరించు కాంతి ఒక్కటే. భౌతిక ప్రపంచంలో అంతరాలు, అంతరాత్మ భగవంతుడే. ప్రకృతి నుండి మానవుడు నేర్చుకోవలసింది, తెలుసుకోవలసిన విశేషాలు ఎన్నోవున్నాయి. సమస్త ప్రపంచంలో సమానత్వాన్ని గుర్తుచేసిన వాడు అన్నమయ్య. ప్రతి మనిషి అభ్యుదయం కావాలంటే నైతిక విలువలు పాటించాలని భోదిస్తున్నాడు. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' అన్న సంకీర్తన చాలు పారలౌకికాభ్యుదయ వాదిగా అన్నమయ్యను చెప్పవచ్చు.

*"ఏ కులజుడేమి ఎవ్వడైన నేమి / అకట నాతడె హరినెరిగినవాడు పరగిన సత్య సంపన్నుడైన వాడే / పరనింద సేయ తత్పరుడు గాని వాడు / జగతిపై హితముగ జయించువాడే/ పగలేక మతిలోన బ్రతికినవాడు / తెగి సకలము నాత్మదెలిచిన వాడే తగిలి వేంకటేశు దాసు డయినవాడు"* (1-292)

మనదేశంలో చాలామటుకు కులమే ప్రధానంగా భావించుకుంటారు. భగవంతుని దృష్టిలో ఏ కులస్థుడైనా ఏమి ఎటువంటివాడైనా ఏమి కడజాతివాడే విష్ణువును తెలుసుకున్నవాడు అని చెప్పడం అన్నమయ్యలో కడజాతి వానిపట్ల వున్న అభ్యుదయదృక్పథం ఏమిటో తెలుస్తుంది. సత్యసంపన్నుడైనా పరులను నిందించనివాడే గొప్పవాడు. సమస్తజీవుల్ని దయతోచూచువాడు. పరులను నేరుగా చూడక తనను తానుగా గుర్తించి నిర్మలమైన ధర్మబుద్ధితో పరులకు హితము చేయువాడు. పగలేని బుద్ధి, సకలజ్ఞానం, భగవద్భక్తి కలవాడు పరులమైనా ఒక్కటే. కులరహిత సమాజంలో అందరూ సమానులేనని సమన్వయజ్ఞాన పూర్ణుడు అన్నమయ్య.

ఇలా మరో సంకీర్తనల్లో–

*'ఎక్కువ కులజుడైనా హీనకులజుడైన*
*నిక్కమెరిగిన మహానిత్యుడే ఘనుడని'* (1-318)

అంటున్నాడు. జీవుడు–ఆత్మ–పరమాత్మ తత్త్వంలో మనిషి నిమగ్నమై హితాహిత జ్ఞానం కలిగి వుంటాడు. భగవత్ ప్రేరణనకు అనుకూలంగా నడచుకున్నవారిని తన దరికి చేర్చుకుంటాడు. పార లౌకికంలో ఒకానొక స్థాయికి చేరుకొని తాను, భగవంతుడు వేరుకాదనే భావం అన్నమయ్యలో వుందన్న అభిప్రాయం మానవులందరూ గ్రహించాలని అందరి అభ్యుదయాన్ని కోరుతున్నాడు.

*"పురుషోత్తముడవు నీవు పురుషాధికుడనేను*
*ధరలో నాయందు మంచితనమేది'* **(2-53)**

అన్న సంకీర్తనలో స్వామివారిని ఆత్మీయంగా స్తుతించిన కీర్తనిది. తనవాళ్ళను, లోకప్రజలను వదలవద్దని వేడుకుంటూ. అందరి అభ్యుదయాన్ని కోరుతున్నాడు.

*"అప్పులేని సంసారమైన పాటే చాలు / తప్పులేని జీతమొక్క తామరైన చాలు / కంతలేని గుడిసొక్క గంపంతైనా చాలు చింతలేని అంబలొక్క చారడే చాలు / జంతగాని తరుణి యే జాతైనా చాలు / వింతలేని సంపదొక్క వీసమే చాలు'*

(1-114)

మానవ జీవతంలో ప్రతిమనిషి అప్పులేని సంసారం కోరు కోవాలంటాడు. నిత్యజీవితంలో వ్యక్తి తప్పు చేయ కుండుట రంధ్రాలు లేని గుడిసె ఒక్కటుంటే చాలు. చింతలేని అంబలి తాగితేచాలు. పవిత్రమైన సంపాదన పిసరంతయిన చాలు. అన్నిటికంటె మనిషికి గొప్ప సంపాదన అష్టైశ్వర్యాలలో ఒకటి స్త్రీ. అటువంటి స్త్రీ ఏజాతి ఏ కులం అయినా సరే' అని భోదించడం సర్వకుల సమానత్వాన్ని తెలియజేస్తుంది.

*'పరమాత్ముడొక్కడే పరమ పావనుడు గన*
*పరి పూర్ణుడనెడి యీ భావమే చాలు*
*జాతులన్నిటి నాత్మ సర్వేశ్వరుడు*
*యిలలోన శ్రీ వేంకటేశ్వరుని కరుణచే*
*వెలసి రతః జ్ఞానంబు విడువకు మనసా"* **(2-136)**

అన్న సంకీర్తనలో మన హిందూ జీవన దర్పణంతో పాటు, చారిత్రక వికాసాన్ని తెలుపుతుంది. హిందూమతంలోని నేటికి సాంఘిక పురోగమనానికి అడ్డుతగులుతోంది. హిందూమతంలోని లొసుగులతోపాటు సంప్రదాయసంబంధ దోషాలున్నాయి. అట్టి దోషాల్ని తొలగించాలని 15వ శ॥ నాడే అన్నమయ్య అభ్యుదయవాదిగా మనకు కనిపిస్తున్నాడు. ఆధ్యాత్మిక చింతనలోని సామాజిక మార్పుతోపాటు భగవంతుని గూర్చి జీవాత్మ పరమాత్మల తత్వాలకే ప్రాధాన్యత

ఇవ్వడం కనిపిస్తుంది. పరమాత్ముడు ఒక్కడే పవిత్రమైనవాడు. సంపూర్ణుడనే భావముంటే చాలు. త్రిగుణ మనేభావం మనజీవన విధానంలో ఇది అసహాయంగా వుంది. అని అంటూ శరీరాన్ని పనికిరాని వస్తువుగా భావించాడు. ముట్టుకోవద్దనే భావం కొన్ని జాతుల మధ్య నేటికీ వుంది. అటువంటి వారిని తిరస్కరించి సర్వేశ్వరుడే ఆత్మయని పేర్కొన్నాడు. కరుణ అనే భావం తెలిసి కొంటే నీ సంశయం తీరి అందరి అభ్యుదయాన్ని కోరుకుంటావని అంటున్నారు.

*'కొంచెమును ఘనమును గనుగొననేల హరిందలంచు పంచమహాపాతకుండె బ్రాహ్మణోత్తముండు / పరమగు వేదాంత పఠన దొరికియు / సరా హరిందలంచలేని సన్యాసికంటె / మరిగి వసుతరము తినెడి మాలయైె ననువాడె / పరమాత్మ గొలిచినను బ్రాహ్మణోత్తముండు'*

అంటూ బ్రాహ్మణత్వానికి కొత్త భాష్యం చెప్పాడు. మత జీవనాన్ని, దైవారాధనను సరళతమం చేశాడు. అన్నమయ్య లాంటి పద కవులు రాజాశ్రయం కోరలేదు. అందుకే నిర్భయంగా కొత్తభావాలు చెప్పగలిగాడు. రాజరికంపట్ల విముఖత వ్యక్తం చేశాడు.

*"నరహరి కీర్తన నానిన జిహ్వ / వొరులనుతింపగా నోపదు జిహ్వ / ముర హరు పదముల మొక్కిన శిరము / పరుల వందనకు ఒరగదు శిరము"*

అని అన్నమయ్య ఆత్మగౌరవాన్ని, విశిష్టవ్యక్తిత్వాన్ని ప్రకటించి శ్రీవేంకటేశ్వరుణ్ణి అత్యున్నతుడుగా ఆరాధించాడు.

భావ వ్యక్తీకరణలో వినూత్నపోకడలు అన్నమయ్యలో కొట్టవచ్చినట్లు కనిపిస్తాయి. శృంగారపరంగా చెప్పినా వాటిని వెంటనే ఆధ్యాత్మికంగా మలచే 'నవ్యత' ఇతరులలో కనిపించదు. అలాగే విరహం కారణంగా వెలదికి వేసవికాలం, నిట్టూర్పుల గాలికాలం, చెమటలు వానాకాలం, మైపులకలు పైరుకాలం, కోరికలు మంచుకాలం, ఎడమాటల వసంతకాలం వచ్చిదనడంలో 'కాలాతీత' అని వ్యంగ్యం.

స్త్రీని రాశులతో పోల్చడం సాహిత్యంలో ఒక అన్నమయ్యపదాలలోనే కనిపిస్తుంది. నవరత్నాల పేర్లు కవులకు తెలిసినా కృష్ణునికి అనుసంధానిస్తూ సమన్వయించడం అన్నమయ్యలోనే. 'ముద్దుగారేయశోద ముంగిట ముత్యము వీడు' కీర్తన ఆణిముత్యమనక తప్పదు. అన్నమయ్య అభ్యుదయ ధోరణికి అతడు ప్రయోగించిన భాష దర్పణంలాంటిది. ఆ వాగ్గేయకారుడు పండితుల మెప్పుకోసం సంస్కృత సంకీర్తనలు నిరసించాడు. కన్నడ శైలిఏమో అనేరీతిలో 'తిరుమలగిరిరాయ' అనే కీర్తనం రాశాడు. తమిళానికి వైష్ణవానికి ఉన్న పొత్తు చెడగొట్టగుండా తమిళపదాలను ప్రత్యేకించి వైష్ణవపరిభాషల్ని – తిరుమంజనం, తిరుప్పళ్ళి, ఎళుచ్చి, తిరువారాధనం, పల్లాండు పల్లాండు–తళిగె, తిరుకాప్పు, తిరుమేన్‌లు ప్రయోగించాడు.

తెలుగుభాషపైన సవారిచేసే సంస్కృతాన్ని గౌరవిస్తూ వాటికి సమానంగా తెలుగుపదాలను సృష్టించాడు. క్షీరాన్నం అనడానికి బదులు 'పాలకూడు'. శైత్యోపచారానికి బదులు 'చలిమందు' – పక్షపాతము అనడానికి బదులు 'బలపక్షము' నఖక్షతము అనడానికి బదులు 'గోరితాకుడు' గ్రీష్మోత్సవం అనడానికి బదులు 'కోడె తిరునాళ్ళు' అలాగే కొత్త కవి సమయాలు కొత్త పదబంధాలు. అడబాల అని ఒక వింత ప్రయోగం. తమిళంలో అడుప్పు అంటె పొయ్యి పొయ్యిదగ్గర వుండే బాల, వంటగత్తె అని అర్థం. మనం నవ్వులను మూటలు గట్టడం అని అంటాం. కాని అన్నమయ్య 'నవ్వులతిత్తి' 'గట్టి' అన్నాడు. స్త్రీ విద్యకు అంతంత మాత్రమే ప్రోత్సాహం వున్న కాలంలో భార్యచేత కృతి రచన చేయించడం అన్నమయ్య అభ్యుదయతత్వానికి దర్పణం. అన్నిటా అన్నమయ్య మొదటివాడే తొలిశృంగార శతక కవి. తొలి సంకీర్తనలక్షణ రచయిత. తొలివేంకటాచల మహత్త్య కృతికర్త. 'అక్షరాణా అకారోస్మి' అన్నట్టు అన్నమయ్య అన్నిటా అలమేలు మంగపతి.

భగవంతుని పాదాలకు తాను చేసిన పూజలుగా ఆ మహనీయుడు పేర్కొన్న సంకీర్తనలు ఆయనకే కాక ఇతర భక్తులకు కూడా తారకమంత్రాలైనాయి. ఆంధ్రవాఙ్మయానికే ఓ అపూర్వమైన శోభను సమగూర్చినాయి. అందుకే తరించి ఇతరులు తరించడానికి త్రోవచూపిన ధన్యజీవి అన్నమయ్య.

అన్నమయ్య భక్తుడుగా కాకుండా, జీవితాన్ని తరచిచూసిన ఒక వేదాంతిగా, దేశదేశాలు తిరిగి ఒక అనుభవశాలిగా తన అనుభవసారాన్ని సంకీర్తనల్లో నింపాడు. ఆ సంకీర్తనల్లో తెలుగుదనంవుంది. పుష్టికరమైన సాహిత్యముంది. మనిషిని కదిలించే రసపోషణవుంది. భక్తివుంది. ప్రభోదం వుంది. మొత్తం మీద కమ్మని తెలుగుభాష వుంది. అందుకే అన్నమయ్య పండితపామరులందరికీ ఆరాధ్యుడైనాడు. తద్వంశీయులు 'హరియవతార మితడు అన్నమయ్య' అని అన్నారు. త్రికరణశుద్ధిగా అన్నమయ్య అభ్యుదయకవి.


**ఆచార్య కోసూరి దామోదరనాయుడు**

**తిరుపతి. ఫోన్ : 944 164 5601**

# మూర్తిదేవీ పురస్కార గ్రహీత –

# ఆచార్య కొలకలూరి ఇనాక్

*– రావినూతల సత్యనారాయణ*



కొలకలూరి ఇనాక్

ఇరవైయవ (20) శతాబ్ది మొదటినుండి భారతదేశంలో వచ్చిన ఆధునికతా వేగంలోని మూలసూత్రం, దేశంలోని అందరు మానవులూ ఒక సమానమైన సాంఘిక స్థాయిని పొందాలనే దృక్పథం. మానవతకి అవరోధమైన ఆర్థిక, రాజకీయ, సాంఘిక, సంస్కృతిక, లైంగిక – మొదలైన అన్నిరకాల దోపిడి నుండి వ్యక్తి విముక్తం కావాలి. ఇలా విముక్తం కావాలనే ద ృక్పథానికి సంబంధించిన అనేక ఆలోచనా ప్రవంతుల సమ్మేళనమే ఈ శతాబ్ది సాహిత్యాన్ని నడిపిస్తున్నది. అందులోనూ వర్గ వైరుధ్య వినాశనం, అసమానతల్ని పోగొట్ట గలదనేది ముఖ్యమైన సిద్ధాంతం. ఈ సిద్ధాంతమే 20వ శతాబ్దపు మరియు తర్వాత కాలానికి చెందిన పురోగామి సాహిత్యానికి నేపథ్యం. అందులోని భాగాలుగ భౌతికవాదం, హేతువాదం, సామ్యవాదం, స్త్రీవాదం, దళితవాదం మొదలగు వానిని పరిగణించాలి. పైన పేర్కొనిన అన్నివాదాలు అన్ని దశాబ్దాలలో ప్రముఖంగా కనబడక పోయిన, సామాజిక పురోగమనానికి తమవంతు పాత్రను నిర్వహించాయి.

దళితుల జీవితాలను చిత్రించేది, దళితులకు మెరుగైన, సుఖమయమైన, అందరితో సమానమైన జీవిత గమనాన్ని నిర్దేశించేది, దళిత చైతన్యాన్ని వ్యక్తీకరించేది దళిత సాహిత్యంగా పేర్కొన బడుతున్నది. ముఖ్యంగా దళితులే తమ సమస్యలకు స్పందిచి వ్రాయడం ఆత్మాభిమానం దళితులే సృజించిన సాహిత్యంలో వాస్తవికత, అనుభవం, స్వానుభూతి ప్రాణవాయువులుగా ప్రతిబింబిస్తుంటాయి. అటువంటి సాహిత్య స్రష్టలలో ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారు పేర్కొన దగినవారు.

తన సర్వ అస్తిత్వంతో స్పందించిన భావాలేవి వున్నవో అవే ఒక రచయిత స్వంత ముద్రను నిర్ణయిస్తాయి! అలాంటి స్వంత ముద్రతో సాహిత్యరంగ ప్రవేశం చేశారు పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్. కొలకలూరి ఇనాక్‌గారు 1939, జూలై 1వ తేదీన గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం లోని వేజెండ్ల అనే గ్రామంలో జన్మించారు. ఆయన తల్లి తండ్రులు వీరమ్మ (విశ్రాంతమ్మ), రామయ్య దంపతులు. రామయ్యగారు పేద కుటుంబానికి చెందినవారు. ఇనాక్‌గారు తనపేరును గురించి ముచ్చటిస్తూ "నా పేరును ఇంగ్లీషులో రకరకాలుగా రాస్తారు. దాన్ని చూచి తెలుగులో చిత్రవిచిత్రంగా వ్రాస్తారు. ఇంగ్లీషులో పేరుచూచి తెలుగులో, తెలుగులో చూచి ఇంగ్లీషులో రాసే వాళ్ళ రాతను ఎవరు మారుస్తారు? నారాత మారలేదు! ... కొలకలూరి వాళ్ళు చాలగొప్ప వాళ్ళని చాలా గర్వంగా జనం చెప్పేవాళ్ళు. అందువల్ల కొలకలూరి ఇష్టం. ఇనాక్ పదం భిన్న సంకోచ వ్యాకోచాల కూడలి అందువల్ల ఇష్టం లేదు... పేరులో, మతంలోకంటే, కులంలో రోగముందని, దానికి మందు లేదని, నేను జీవించి వున్నంత కాలం ఈ జబ్బుతో కాలం గడపక తప్పదని గుర్తించి, మాదిగల ప్రాచీనత, వైశిష్ట్యం, ఆధిక్యం తెలిశాక గర్వపడ సాగాను" అంటారు. ఇనాక్‌గారి బాల్యం, మూడోతరగతి దాక వేజెండ్ల గ్రామం (మాదిగపల్లె) లో గడిచింది. తగరం దేవదాసుగారు అనే బి.ఎ. చదివిన ఒకాయన మాదిగపల్లే పిల్లలకు ట్యూషన్ చెప్పి గుంటూరులో చేర్పించటానికి కృషి చేసేవారు. వారి సహాయ, సహకారాలతో ఇనాక్ ఎంట్రన్సు పాసై స్కూల్లో ప్రవేశించాడు. తను ఫోర్తుఫారంలో వుండగా ఇనాక్ నాన్న రామయ్య చనిపోయరు. వాళ్ళ అమ్మ విశ్రాంతమ్మ కూలీనాలీ చేసి పిల్లలను పెంచింది. "పిల్లలు చదవాలి, ఉద్యోగాలు చేయాలి, అది ఆమె పట్టుదల. ఆమె మమ్మల్ని అన్నం వడ్డించి పెంచ లేదు. పట్టుదల వడ్డించి పెంచింది... ఆమె పట్టుదల ముందు మేము ప్రణమిల్లాం" అంటారు ఆచార్య ఇనాక్. ఇంటరు

దాకా గుంటూరులోనే చదివారు. 1956-59 సంవత్సరముల మధ్యకాలంలో ఆంధ్రవిశ్వవిద్యాలయం లో బి.ఎ. ఆనర్సు తెలుగు చదివారు. ఆకాలంలో ఇనాక్‌గారికి ఎటువంటి ప్రోత్సాహము లభించలేదు. అయ్యవార్లు రకరకాలుగా ఆయనను హేళన చేసేవారట! "క్లాసు రూము సొంతం అనిపించేది కాదు, అయ్యవార్లు పరాయివాళ్ళలాగా ఉండేవాళ్ళు" అంటారు ఇనాక్.

**రచనా ప్రస్థానం:**

"అందరికి సాహిత్యం ఆనందం కలిగించ వచ్చు... నవ్వు నుంచి నా సాహిత్యము పుట్టలేదు. ఏడుపునుంచి పుట్టింది. నాసాహిత్యం నాకన్నీళ్ళు. నా మొదటి కథ ఉత్తరం 1954 లో మునసబు కొడితే చనిపోయిన మాతాతను గూర్చి వ్రాసిన కథ" అని చెప్పారు ఇనాక్‌గారు తమ రచనా వ్యాసంగాన్ని గూర్చి ప్రసంగిస్తూ. అప్పటి నుండి కథానికలు, పద్యాలు, గేయాలు చాలా విరివిగా వ్రాశారు. ఇనాక్‌గారికి గుర్రం జాషువా, కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు అంటే, చాలా ఇష్టం. జాషువాను ఆయన గురుతుల్యుడిగా భావిస్తారు. జాషువాగారి సాహిత్యమంతా చదివిన తర్వాత తనలో కవితాబీజం పడిందంటారు. అప్పట్లో ఇనాక్‌గారు వ్రాసిన పద్యాలు చదివినవారు, ఆయన కవిత్వంపై జాషువా - కరుణశ్రీల ప్రభావం చాలా హెచ్చుగా ఉందనేవారు. కాని, అట్లా అనిపించుకొనుట ఇనాక్‌గారికి ఇష్టముండేది కాదు. "నా పద్యాలు నావిగా ఉండాలి" అంటారు ఆయన! ఆ ప్రభావం నుంచి తప్పించు కోవటానికి కొంతకాలం పద్య రచన మానేశారు! వచన రచనలోనే ప్రావీణ్యం సాధించారు. తన ఆకలీ, చుట్టూ కనిపించే అస్పృశ్యతా వ్యధ, చుట్టూ జీవితాలు చూచి ఆక్రోశించటానికి ఇనాక్‌గారికి సాహిత్యం అండ అయింది. ఇనాక్‌గారు వ్రాసింది పుస్తకాలు చదివికాదు, సంఘాన్ని చదివి! ఇనాక్‌గారు విశ్వవిద్యాలయంలో ఆనర్సు చదువుతున్న రోజుల్లోనే, అంటే 1957లో ఒక అమ్మాయి కళ్ళ చూపును గురించిన బాధ ఆలోచనగా మారి, ద ృష్టి అనే నాటికగా రూపొందింది, ఇది భారతీయ బాషల్లో యూనివర్సిటీ విద్యార్థుల నాటక రచనల పోటీలో ద్వితియ బహుమతిని అందుకొన్నది. స్థానం నరసింహా రావుగారి దర్శకత్వంలో రేడియోలో ప్రసార మైంది. తర్వాత దానిని పోలిన నాటికలు చాలా వచ్చాయి! కొన్నిటిని దృష్టికి కాపీలని కూడా అన్నారు. అయినా ఇనాక్‌గారు ఎవరి మీద కేసులు పెట్టలేదు! 1958 భారతిలో నవసంధ్య పద్య కవిత, ద ృష్టి నాటిక ప్రచురింప బడ్డాయి. భారతిలో ఆకాలంలో ఒక్క రచన పడితే మహాపండితులు కూడా పరవశ మయ్యేవారు. ఒక సంవత్సరములో నాలుగు రచనలు (18 ఏళ్ళ ఆనర్సు విద్యార్థివి) ముద్రితం కావటం ఆశ్చర్యకరం! ఇనాక్‌గారి రచనా పాటవాన్ని మెచ్చుకొని, వారికి భారతి సబ్‌ఎడిటర్ ఉద్యోగం ఇస్తామని ఆహ్వానించారు. కాని ఇనాక్‌గారు లెక్చరరు ఉద్యోగం మోజులో ఆ ఉద్యోగాన్ని స్వీకరించలేదు. 1961 లో ఆంధ్రప్రభ ఉగాది నవలల పోటీలలో అనాథ అనే ఆయన నవలకు త ృతీయ బహుమతి వచ్చింది. ఆ నవలను ఆంధ్రప్రభలో 16వారాలు సీరియల్‌గా ప్రచురించారు. గూనితో అనాకారి అయిన పోలి అనే పిల్ల ఆ నవలలో కథా నాయిక. వేజెండ్ల గ్రామంలో రచయిత చిన్నతనంలో జరిగిన ఒక జాతరతో నవల మొదలవుతుంది. పోలి పెరిగి పెద్దదై, చదువుకొని జీవితంలో స్థిర పడటంతో నవల ముగుస్తుంది. కష్టాలు తింటూ సుఖాలు పంచడం, ఏడ్పును కళ్ళలో ఖైదీని చేసి, నవ్వును పెదాల మీద పూయించడం పోలిని సౌదర్యవతిగా చిత్రితం చేసింది! ఆచార్య ఇనాక్‌గారు 1972కు పూర్వమే నాలుగు సీరియల్ నవలలు, నాలుగు డైరెక్టు నవలలు ప్రచురించారు. ఈ మధ్య ముప్పై ఏళ్ళ విరామంలో ఇనాక్‌గారు రచించిన నవలలు సర్కారుగడ్డి, అనంతజీవనం. విశ్వవిద్యాలయంలో తెలుగు ఆనర్సు చదువుతున్న రోజుల్లోనే, విశ్వవిద్యాలయం నిర్వహించు కథానికల పోటీల్లో వరుసగా రెండేళ్ళు ప్రథమ బహుమతి పొందిన మంచు శిఖరం, నిశీధిశంఖారావం, భారతి, ఆంధ్రపత్రిక ఉగాది సంచికల్లో ప్రచురిత మైనవి.

ఆచార్య ఇనాక్‌గారి భవిష్యత్తు విశ్వవిద్యాలయంలో ఆయన కృషిమీద ఆధార పడి ఉండే పోటీ పరిస్థితులలో అందుకు తగినట్లు తన్నుతాను మలుచుకోవటంలో విమర్శనా, పరిశోధన దృష్టి పెరిగి, సృజన కృషి తగ్గిపోయింది. ఒకసారి ప్రొఫెసరు అయ్యాక, అందుకు యోగ్యునిగా వర్తించటం ఒక బాధ్యత. ఆచార్య ఇనాక్‌గారు 18 సంవత్సరాలు ఆపదవిని మహాదక్షత తోను, ప్రజ్ఞాపాటవాలతోను నిర్వహించి, ఎనలేని కీర్తిని ఆర్జించారు. ఆ కాలంలో పది ప్రామాణిక గ్రంథాలు ప్రచురించారు. ఇది వారి పరిశోధనా పటిమను, విమర్శనా గరిమను వెల్లడిస్తుంది. కవిగా ఏడు కవితా సంకలనాలు, కథకునిగా తొమ్మిది కథానికా సంకలనాలు, నవలా కర్తగా

పది నవలలు, నాటక కర్తగా ఆరు నాటకాలు, ఐదు నాటికల సంకలనాలు రచించి, స ృజన, విమర్శన, పరిశోధనా సాహిత్యంపై ఏభై పై చిలుకు గ్రంథాలు ప్రచురించారు. ఆ కృషినిబట్టి ఇనాక్‌గారి ప్రతిభను అంచనా వేయవచ్చు. ఇంతటి సృజనాత్మక కృషి చేసిన ప్రొఫెసర్లు యెంతోమంది లేరు!

విదేశాలలో నేను నాటక రచయితను, విమర్శకుణి?, పరిశోధకుణి? అని చెబుతుంటే – వాళ్ళు తెల్లవాళ్ళు కదా – తెల్లముఖం వేసుకొని చూచే వాళ్ళు! అందువల్ల ఇంగ్లీషులో ఉన్న నాటకం, కథలు, విమర్శన గ్రంథం చూపితే వాళ్ళు చూచి తిప్పి, తిరగేసి ఊరుకొనే వాళ్ళు. వీళ్ళకిది సరికాదని 54 శీర్షికలున్న ఆంగ్ల కవిత్వం 2001లో వ్రాశాను. దాని పేరు "Voice of Silence" అని అంటారు ఆచార్య ఇనాక్. "Voice of Silence" కవితా సంకలనాన్ని నిశబ్దస్వరం పేరిట శ్రీ అద్దెపల్లి రామమోహనరావు ఆంధ్రీ కరించారు!

**ఇనాక్ సాహిత్యతత్త్వం – ప్రేరణ :**

ఈ విషయమై ముచ్చటిస్తూ "నేను చూచిన ఒక సన్నివేశం, సందర్భం, సమస్య నన్ను బాధిస్తే కన్నీరు తెప్పిస్తే ఏమైనా వ్రాశాను. ... పీడితులు నాకు సన్నిహితులు. పీడన నా వేదన. ప్రతిఘటన నా లక్ష్యం. నా సాహిత్యం నా స్థితికి ప్రతిబింబం. నా రచనలు కన్నీళ్ళు. అందువల్ల కమ్యూనిష్టు అన్నారు. మార్క్సిష్టు నన్నారు. ... కానీ "తలలేనోడు కథను ఏ విప్లవ రచయిత రాయలేక పోయాడు అని ఆర్.యస్. సుదర్శనంగారు ప్రకటించారు. అరసం నన్ను అభిమానించింది, ఆహ్వానించింది. విరసం నా ఉనికిని గుర్తించింది. ..." అంటారు పద్మశ్రీ ఇనాక్‌గారు. అయితే ఒక విషయం మనం గుర్తుంచుకోవాలి. ప్రధాన జీవన స్రవంతికి దూరంగా జీవిస్తున్న దళితుల్లో ఆత్మగౌరవాన్ని రగుల్కొల్పటం ఆయన సాహిత్యంలో గుర్తించాల్సిన అత్యంత ముఖ్య విషయం.

**పద్మశ్రీ ఇనాక్‌గారికి పేరు గడించిన ప్రముఖ రచనలు :**

**వసుచరిత్ర వైశిష్ట్యం (1996) :**

ఆచార్య ఇనాక్‌గారు ప్రబంధ సాహిత్యం పైన చాలా చక్కటి విశ్లేషణలు చేశారు. వసుచరిత్ర వ్రాసిన రామరాజ భూషణుడు శూద్రకవి శుభమూర్తి అని వీరి పరిశోధన నిష్కర్ష. పరిశోధనలలో సాధారణంగా అన్వేషణ ఏదైనా ఒక కొత్త విషయాన్ని బయట పెట్టడం, సిద్ధాంతాన్ని స్థాపించడం, లేదా ఒక విషయాన్ని సూత్రీకరించడం ముఖ్యం. వీటిలో అంతర్భాగంగానే కనిపిస్తున్నా, గుణ, దోష విశ్లేషణ, నిర్ణయ ప్రకటన విమర్శలో ప్రధానంగా చూడాలి. పరిశోధనలో కనిపించే అన్వేషణ, సమాచార సేకరణ విమర్శలో కనిపించవు. లభించిన సమాచారన్ని విశ్లేషించి, తులనాత్మకంగా పరిశీలించి, తనదైన దృష్టితో వాఖ్యానించి, అదిగుణమో, దోషమో ఒక నిర్ణయాన్ని ప్రకటించటం విమర్శ స్వభావం. పైన పేర్కొనిన రెండు స్వభావాలు సంతరించుకొంటే దానిని పరిశోధనాత్మక విమర్శ అని పేర్కొన వచ్చు. అలాంటి గ్రంథమే వసుచరిత్రవైశిష్ట్యం. తన పేరు "శుభమూర్తి, మూర్తికవి అని వసుచరిత్రకారుడు చెప్పుకున్నా, అతణి? భట్టుమూర్తి, రామరాజ భూషణుడు అని నాటి నుండి నేటి వరకూ పండిత లోకం పిలవడంలో ఒక శూద్రుణ్ణి కవిగా కాని, అతని పేరుతో గాని పిలవడాని కిష్టపడని వర్ణాధిక్యాన్ని సోదాహరణంగా నిరూపించారు ఆచార్య ఇనాక్. శుభమూర్తిలో కవిలోకం పట్ల దళిత, బహుజనులు అలవరచుకో వలసిన ప్రతిఘటన చైతన్యాన్ని గుర్తించేలా సాధికారంగా వ్యక్త పరచారు రచయిత. "ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని పండితులు ఒక దృష్టి నుంచే చూస్తున్నారు. ఇంకో దృష్టి నుంచి చూడవచ్చునని నా అభిప్రాయం. అదే వసుచరిత్ర వైశిష్ట్యం" అంటారు ఇనాక్‌గారు.

**ఆది ఆంధ్రుడు (2008) :**

ఇది పద్యకావ్యం. ఈ కావ్యం దళిత జీవితానికీ, చారిత్రక ఇతివృత్తానికీ సమన్వయంగా వుంది. దీనికి సంబంధించిన చరిత్ర గత 250–150 సంవత్సరాల మధ్య కాలంలో గుంటూరు దగ్గర లోని చింతపల్లి, అమరావతి రాజధానిగా పాలించిన వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడి సంస్థానంలో సేనానిగా సేవలందించిన భుజంగ రాయుడి జీవితానికి సంబంధించిన కథాంశముతో కూడి వుంది. భుజంగ రాయుడు మాదిగల వారసుడు. ఆంధ్రత్వం మూర్తీ భవించిన రాజు కొలువులో చైతన్యం వెల్లివిరిసిన భుజంగ రాయుడు ఆదిఆంధ్రుల వారసుడై వర్థిల్లాడు. వీరుడిగా, సేనానిగా, మంత్రిగా, కవిగా, రాజప్రతినిధిగా, రాజుకు సలహాదారుడిగా వివిధ బాధ్యతలు నిర్వర్తించి, గొప్ప శాంతమూర్తిగా భుజంగ రాయుడు ప్రఖ్యాతి గాంచాడు. ఆచార్య ఇనాక్‌గారు రచించిన ఈ కావ్యేతివృత్తం, కొంత చరిత్ర, కొంత జానపదం, కొంత కల్పనగా భావించాలి. దీనిని గురించి రెండు చారిత్రక గ్రంథాలు తప్ప మరే ఆధారం లిఖితరూపంలో లేదు. జానపథ

గాథలు విశేషంగా ఉన్నాయి. భుజంగరాయుని వంశానికి చెందిన వాళ్ళే రూపొందించిన పూర్ణకలశమే నేటికీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లాంఛనంగా కొనసాగుతుందంటే, నాటికే మాదిగల కళానైపుణ్యం ఎలాంటిదో తెలుసుకోవచ్చు! ఇది తెలుగు సాహిత్యంలో ప్రత్యేకించి, దళిత సాహిత్యానికి నవచైతన్యాన్ని అందించే దిశగా చేసిన నిర్విరామ కృషి. ఈ కావ్యం 27 శీర్షికలలో 505 పద్యాలలో రచించారు ఇనాక్‌గారు. ఆదిఆంధ్ర అనేపదం ప్రాచీనాంధ్రుల్ని గురించి చెప్పడానికి సాధరణంగా వాడుతున్నారు. అయితే, ఈ సందర్భంలో ఆది ఆంధ్రా అనేది ఒక ఉద్యమం స్ఫూర్తితో పెట్టుకున్న ఆలోచనాత్మకమైన పేరు. ఆచార్య ఇనాక్ ఆదిఆంధ్రుడు అనేపేరు అర్వాచీన మని పేర్కొన్నారని స్పష్టమౌతుంది. ఈ పేరు పెట్టడంలో ఈ దేశమూల వాసులను స్ఫురింపజేస్తూనే, దళితుల ఆత్మగౌరవాన్ని నినదించే ప్రయత్నం కనిపిస్తుంది.

**మునివాహనుడు (1976) :**

ఆళ్వారుల సాంప్రదాయం వైష్ణవంలోని ఒక ప్రధానాంశం. వాళ్ళు పన్నెడుమంది. వారిలోని ప్రముఖుడు తిరుప్పాణ్. పేరులోని "తిరు" శ్రీ కి వికృతి. పాణ్ కులం. ఆ కులం ఒకనాడు అస్పృశ్య కులమే! అనంతర కాలంలో, అస్పృశ్య కులంగా మారింది. పాణ్ కులస్థులు సంగీతవేత్తలు. సంగీత సంబంధం వల్ల వీళ్ళకు నట, విట గాయకులతో సాహచర్యం, సామీప్యం కలిగాయి. కాలక్రమాన కళావంతుల స్థితి దిగజారి పోయింది. అప్పుడు పాణ్ కులస్థులు అస్పృశ్యులయ్యారు. ఆళ్వారైన తిరుప్పాణ్ జీవితం ఈ సంధి యుగానికి పరిమితం. భక్తే తిరుప్పాణ్‌గా పరిణమించిన దశ నాటకంలో ప్రసక్తం. తిరుప్పాణ్ నామాంతరము మునివాహనుడు. ఇది ఒక సంగీత రూపకం. కాని వ్యవహారంలో నాటక మంటున్నారు. పౌరాణికం చారిత్రకేతి వృత్తాల సంగమం. ఈ నాటకంలో రచయిత సృజనీకరించిన కొన్ని పేర్లను జాగ్రత్తగా పరిశీలించాలి. వేదదత్తుడు, దేవదత్తుడు, లోకసారంగముని సమాజ స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి ప్రతీకాత్మకంగా పెట్టినవి. నాటకమంతా విని, లేదా చూచిన, లేదా చదివిన తర్వాత లోకం దళితుల్ని ఎలా చూస్తున్నదన్న వాస్తవాన్ని అర్థం చేసుకుని, ఆలోచనలో పడతారు. నాటకంలోని పాటలు, పద్యాలు, సంభాషణలూ రచయిత ప్రతిభాపాటవాల్ని ఈ నాటకం అనేక పార్శ్వాల్లో చూపిస్తుంది. అన్నిటికీ మించి వస్తువులో, దాన్ని నడిపిన తీరులో రచయిత ప్రతిభ పాఠకుణ్ని ఆలోచింప జేస్తుంది. నాటకం ముగిసేటప్పటికి, అందరూ రచయిత వాదనతో పూర్తిగా ఏకీభవిస్తారు. నాటకంలో తాత్త్వికత, తర్కం, కళాసౌదర్యం తొణికిసలాడే సందరాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. తిరుప్పాణ్ ఆళ్వార్ అని పిలువబడే దళితుడు మునివాహను డయ్యాడు, అది అద్భుత కథా సందర్భం! ఈ నాటకం అనేకమంది విమర్శకుల ప్రశంసల నందుకున్నది. ఒక ఏడాది వ్యవధిలో ఈ పుస్తకం అయిదు భారతీయ భాషల్లోకి అనువదించబడింది.

**తెలుగు వ్యాస పరిణామం :**

ఈ గ్రంథం ఆచార్య ఇనాక్‌గారి పరిశోధనా ప్రతిభకూ, విమర్శనా నైశిత్యానికీ అద్దం పడుతుంది. ఇందులో ఆరు అధ్యాయాలన్నవి. తెలుగు వచనం అన్న ప్రకరణం కింద ఇనాక్‌గారు గద్య వచన పద పరిశీలనం చేసి వచన తత్వాన్ని విపులీకరించారు. తెలుగు వచన స్థూల పరిణామాన్ని వివరించారు. వ్యాసం అన్న రెండో అధ్యాయంలో వ్యాస లక్షణాలను నిర్వచించి తెలుగు వ్యాసం సంతరించుకున్న నూత్న లక్షణాన్ని గురించి వివరించారు. సృజన వ్యాసం ప్రకరణంలో ఉపన్యాసం – కందుకూరి యుగం, వ్యాసం – గురజాడ యుగం, అధిక్షేప వ్యాసం – సాక్షియుగం, చెళ్ళపిళ్ళయుగం, చలం యుగం లాంటి ఉపశీర్షికలు ఉన్నాయి. విమర్శన వ్యాసం అన్న నాల్గవ అధ్యాయంలో కావ్యతత్త్వ వ్యాసం, జీవితచరిత్ర వ్యాసం, అనువాద వ్యాసం, పీఠికా వ్యాసం, వేదాంత వ్యాసం, తదితర వ్యాస రూపాల చర్చ ఉంది. ఐదవ ప్రకరణంలో తెలుగు వ్యాస శైలిని వివరించారు. చివరకు ఉపసంహారంతో ముగించారు. ఈ పరిశోధనకు కొలకలూరి గారికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి డాక్టరేటు పట్టా లభించింది.

**అనంతజీవనం (2007) :**

ఇనాక్‌గారు 1972 తర్వాత దాదాపు ముప్పై సంవత్సరాలపాటు విశ్వవిద్యాలయ పరిసరాలకు అవసరమైన కార్యకలాపాలలో తననుతాను సిద్ధ పరుచుకునే యత్నంలో నిమగ్నులై, పరిశోధనా రంగంలో మునిగినవారై, నవలా రచన చేయలేదు. అటు తర్వాత వారి కలం నుండి వెలువడిన నవల అనంతజీవనం. అనంతజీవనానికి నానార్థములు: అనంతపుర జీవితమని, నిరంతర బ్రతుకు యాత్ర అని, అనంతపురంలో నీరనీ, అంతులేని నీరనీ పఠితలు చెప్పుకోవచ్చు. అంతులేని నీరంటే అయిపులేని నీరని భావించుట సమంజసమే! కొలకలూరి

గారి అనంతజీవనము ఒక అద్భుతమైన నవల ఇతివృత్తం అనంతపురంలో ఒకరోజు కురిసిన కుంభవృష్టి! నవలలోని పాత్రధారులు నేలగల్లు జమిందారులైన గంగారెడ్డి కమారులు, తదితరులైన అన్ని వృత్తులవారు. అనంతపురం జిల్లా అంటేనే అనావృష్టికి, కరువు కాటకాలకు పెట్టింది పేరు! అనంతపురం ఎడారిగా మారవచ్చునని శాస్త్రజ్ఞుల అంచనా. ఇనాక్‌గారిది అనంతపురంతో ఐదుదశాబ్దాల పైన పెనవేసుకున్న అనుబంధం! ఎడారి ప్రాంతం కాకూడదని వారి ఆశయం. ఆచార్య ఇనాక్‌గారు అనంతపురం ప్రజల జీవన విధానాన్ని అన్ని కోణాలనుండి జాగ్రత్తగా గమనించారు. వారికి తెలిసినంత అనంతపురం టోపోగ్రఫీ మరెవరికీ తెలియదేమో? స్థానిక ప్రజలతో పాటు తాను కూడా వర్షానికై ప్రార్థన చేశారు. అందరి ప్రార్థనా ఫలితమే 9-11-1996లో కురిసిన కుంభవృష్టి!

వర్షం మూలాన పట్టణం చుట్టూవున్న పండమేరు, తడకలేరు, వంకలు, వాగులు అన్నీ అనంతపురాన్ని జలమయం చేశాయి. పట్టణమంతా అతలా కుతల మైంది. ప్రజా జీవనం అల్లకల్లోల మయింది. లోతట్టు ప్రాంతాల వారు చెరువు గట్టు ఎక్కారు. నేలగల్లుకోట లాంటి పురాతన కట్టడాలు నేల కూలాయి. నిరుపేద ఇళ్ళు, గుడిసెలు, కొట్టాలు కొట్టుకు పోయాయి! ఆ తరుణంలో వృద్ధాప్యాన్ని సహితం లెక్కచేయక, ఆచార్య ఇనాక్‌గారు వీధి వీధి తిరిగి ప్రజల స్థితి గతులు తెలుసుకొని, తను తెలుసుకొనిన వివరాలకు అనంతపురం పూర్వ వైభవాన్ని జోడించి, అనంతజీవనం అనే అతి సుందరమైన నవలారత్నాన్ని మనకంద జేశారు. అనంతపురం జీవన చిత్రణ కోసం అత్యంత పరిశోధనజేసి, అనేక చారిత్రక అంశాలను వెలుగు లోనికి తెచ్చారు. పూర్వపాలకులైన నేలగల్లు ప్రభువుల దురహంకారాలకు, దురాగతాలకు ఆలవాలమైన నేలగల్లు కోటను, ఆ కోటలో నివాస ముండిన గోవిందరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి జీవితాల వుత్థాన, పతనాలను కళ్ళకు కట్టినట్లు చిత్రించారు. ఒక ప్రాచీన సాంప్రదాయానికి, ఒక దుష్ట సంస్కృతికి, ఒక చరిత్ర అవశేషానికి చరమ చిహ్నమైన రెడ్డి బంగ్లా వరద ధాటికి కూలిపోయింది. కోట కూలడంవల్ల అందరూ సజీవ సమాధి చెందారు. వర్షధాటి కలిగించిన వినాశాన్ని హృదయ విదారకంగా చిత్రించారు రచయిత. వర్షం సమానత్వానికి ప్రతీక. రాజు, పేద అనే తేడా వుండదు. నేలగల్లు జమిందారులు, సామాన్య ప్రజానీకం వర్షంలో దిక్కులేని వారైనారు. రాజుపేదా సమాను లయ్యారు. ఇది వర్షం తెచ్చిన సమానత్వం. తాడిత, పీడిత వర్గాల ఆశయం. ఇదే ఈ నవలా సందేశం. అనంతజీవనం అనే ఈ నవలకు 29వ మూర్తీదేవి అవార్డు లభించింది. ఈ అవార్డును భారతీయ జ్ఞానపీఠ్ వారు స్థాపించారు. అవార్డు రూపంలో నాలుగు లక్షల రూపాయల నగదూ, సరస్వతీదేవి విగ్రహం, సన్మాన పత్రం ప్రదానం చేస్తారు. మూర్తీదేవి అవార్డు తెలుగు రచయితకు లభించుట ఇదే మొదటి సారి! ఆ విధంగా తెలుగులో మూర్తీదేవి అవార్డు తొలి గ్రహీత ఆచార్య ఇనాక్‌గారు. ఇది ఆంధ్రులంతా గర్వింప దగిన విషయం.

**కథా సంపుటాలు :**

ఆచార్య ఇనాక్‌గారు ఊరబావి, తలలేనోడు, కాకి వంటి అద్భుత కథలెన్నో వ్రాశారు. వీరి కథలు అప్పట్లో సంచలనాన్ని సృష్టించాయి. సూర్యుడు తలెత్తాడు, అస్పృశ్యగంగ, కాకి లాంటి కథా సంపుటాలు అస్పృశ్యతను భిన్న కోణాలలో చిత్రిస్తాయి. పతితలను ఆలోచింప జేస్తాయి. సమాజాన్ని ప్రశ్నిస్తాయి. కొలకలూరిగారి కథలు ఆంగ్ల, హిందీ, కన్నడం వంటి అనేక భాషల్లోకి అనువాదా లయ్యాయి. ఇనాక్‌గారి శైలి చాలా సున్నితంగా ఉంటూనే కటువుగా సాగుతుంది!

ఈ విధంగా ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి రచనలను గూర్చి చెప్పాలంటే ఎంతైనా వివరించవచ్చు. నిజం చెప్పాలంటే ఆయన రచనలను గూర్చి ఎం.ఫిల్., పి.హెచ్‌డి. సిద్ధాంత గ్రంథాలు వెలువడినట్లు తెలియ వచ్చింది! ఆచార్య ఇనాక్‌గారు ఆయన సుదీర్ఘ జీవిత కాలంలో చాలాదూరం పయనించారు. ఏమీలేనివారు ఎంతో వెనుకనుండి బయలుదేరి, అన్నీఉన్న అందరితో కలవటానికి పడిన కష్టం వర్ణనాతీతం. అతివేగంగా పయనించారు! ఆగని గమనంతో ఆచార్య పదవినే కాక, విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవిని సహితం అలంకరించారు. సాహిత్య వేత్తగాను, రచయితగాను, గుర్తింపును గూర్చి ముచ్చటిస్తూ "ఈ గుర్తింపు చాలనిపిస్తుంది. ఇంకా గుర్తింపు అనుగ్రహిస్తామంటే నాకు సంతోషమే కదా?! నేను అందరి కోసం రాస్తున్నాను. నన్ను అందరూ మన్నిస్తున్నారు. నాకు అదే గౌరవం. నాకా గౌరవం కలకాలం నిలుస్తుంది. పరిమితుల్లో, పరిమితుల వాళ్ళు గుర్తించక పోయినా నేను చింతించను. అపరిమితంగా, అపరిమితుల వాళ్ళు గుర్తిస్తారు. అదిచాలు. ఆలస్యం కావచ్చు. అయినా, సంతోషమే!" అని తన అభిప్రాయం వ్యక్త పరచారు.

ప్రొ. రావినూతల సత్యనారాయణ
హైదరాబాద్. ఫోన్ : 961 852 4702

# వీనుల విందు – లలిత సినీ సంగీతం



రావు బాలసరస్వతి

*స్వయంప్రతిభకు వయస్సు హద్దులుండవు. అరవై ఆరేళ్ళ క్రితం చిన్న వయస్సులో తన పాట వినిపించిన బాల సరస్వతి ఇంతకాలం తెలుగువారి హృదయాలను పరవశింప చేస్తూనే ఉన్నారు.*
*రావు బాలసరస్వతీదేవికి చిన్నప్పుడు తల్లిదండ్రులు పెట్టిన పేరు సరస్వతి. చిన్న వయస్సులోనే పాటలు పాడడంవల్ల బాలసరస్వతిగా పేరుగాంచిన మన గానసరస్వతి.*

అన్ని కళలూ ప్రకృతికి ఛాయారూపాలే! సంగీతం మధురమైన విశ్వభాష. దానికి భాషా భేదాలు, ఎల్లలు లేవు. సంగీతమంటే ఇంగ్లీషులో Music. ఈ పదం గ్రీకు భాష నుంచి తీసుకోబడింది. మొదట్లో దీని అర్థం 'కళ' అని మాత్రమే, 'సంగీత'మని కాదు. అన్ని కళలూ సంగీతం వైపుకే ప్రవహించటంతో Music అనే మాట క్రమేపీ కళలకు కాణాచయిన సంగీతానికి మాత్రమే పరిమితమైంది. తరువాత వచ్చిన ప్రతి కళ తమ అస్తిత్వానికి తలో పేరును ఎన్నుకున్నాయి. ఈ ప్రపంచంలో అడ్డాలలోనున్నపుడే తల్లి పాడే జోలపాటతో బిడ్డ నిద్రపోతాడు. మానవునికి తొలి కళా పరిచయం తల్లి నిద్రపుచ్చేటప్పుడు పాడే ఈ లల్లబీలతోనే! విచిత్రంగా ప్రపంచ వ్యాప్తంగా, ఈ పాటలన్నీ ఒకే రాగంలో ఉంటాయి. తెలుగునాట అన్నప్రాశం నాడే ఆవకాయ పెట్టకపోయినా అన్నమయ వ్రాసిన చందమామరావే పాట పాడుతూ, చందమామను చూపిస్తూ, బువ్వ తినిపించటం ఒకప్పుడు ఇంటింటా కనిపించే సాధారణమైన దృశ్యం.

మానవ సంఘంలో ముఖ్యంగా మూడు రకాల స్థాయిలో జనం ఉంటారు. ఇందులో మొదటిది శిష్ట సంపన్న వర్గం (ఇది అల్పసంఖ్యాక వర్గం). వీరిలో ఆర్థికపరమైన జీవన పోరాటం తక్కువగా ఉంటుంది. వీరు శారీరక శ్రమ ద్వారా అలసిపోయే వర్గం కాదు. వీరు తమ ఉల్లాసం కోసం బుఱ్ఱకు పదును పెట్టే కవిత్వాలను, తీరుబడిగా అంచెలంచెలుగా రాగప్రస్థావన చేసే శాస్త్రీయ సంగీతాన్ని ఇష్టపడతారు. వీరిలో కొందరు శుద్ధ సంగీతానికి సాహిత్యమవసరం లేదని భావిస్తారు. కోయిల పాటకు సాహిత్యమెక్కడిది? వాద్య సంగీతంలో ఏమి సాహిత్యముంది? అని ప్రశ్నిస్తారు.

ఇక రెండవది పనిపాటలతో మునిగితేలే శ్రామిక జనం, పని జరుగుతున్నపుడు అలసట మరవడానికి వారు అందుబాటులోనున్న జానపద శైలిలో, కొంత శృంగారం, కొంత వీరం రంగరించి, తమదైన భాషలో, రీతిలో ఒక జానపద సంగీతాన్ని, సాహిత్యాన్ని తయారు చేసుకున్నారు. ఈ పాటలలో సాహిత్యపరంగా ప్రాస, సంగీత పరంగా లయ ఉంటుంది. ఇది ఎక్కువగా స్వేచ్ఛావాయువులను పీలుస్తూ ఉండే ఒక flexible ప్రక్రియ. ఇందులో నిర్దేశించబడిన రాగానికి కాలపరిమితి అంటూ ఏమీ ఉండదు. ఇది కొన్ని శతాబ్దాలుగా మౌఖికంగా ప్రజల నాలుకపై నిలిచిన ఒక సంగీత స్రవంతి.

మూడవ వర్గం, అతి ముఖ్యమైన మధ్యతరగతి. వీరు 70 శాతం మంది ప్రజలు. వీరి జీవితం ఘర్షణలమయం. వీరు నిత్యం ఈ ఘర్షణలలో కొన్నిటితో యుద్ధం చేస్తూ, మరికొన్నిటితో రాజీపడుతూ, ఇంకొన్నిటి నుంచి పలాయనం చేస్తూ జీవితాన్ని నెట్టుకొస్తుంటారు. ఈ జీవన సంఘర్షణలన్నిటితోనూ విసిగి వేసారే వీరికి దాని నుంచి ఉపశమనం కావాలి. మనసుకు సంయమనం పరిచే ఒక వినోదాత్మక ప్రక్రియ కావాలి. 20వ శతాబ్దిలో ఆ ఉపశమనాన్ని, ఉత్తేజాన్ని కలిగించే ఏకైక సాధనంగా సినిమా అనే మాధ్యమం తన విశ్వరూపాన్ని విస్తృతపరుచుకుంది. గడచిన శతాబ్దమే కాదు

ఇప్పటివరకూ దీనితో ధీటు రాగల మరో మాధ్యమం మన దేశంలో ఇంతవరకూ రాలేదు. సినిమా భారతదేశంలో ప్రాచుర్యం పొందడానికి సంగీతమే ముఖ్యకారణమన్నది అందరూ అంగీకరించవలసిన ఒక చారిత్రక సత్యం.

ఏది ఏమైనా సంగీతం మనం సమగ్రంగా నిర్వచించడానికి వీలుపడని ఒక విషయం. అదొక అనుభవం. ఆస్వాదించినపుడే దాని రుచి తెలుస్తుంది. ఇందులో గొప్పా, బీద, పండిత, పామర తారతమ్యం లేకుండా అందరికీ అందుబాటులోనున్న ఏకైక కళాప్రక్రియ.

భారతదేశంలో మూకీ సినిమా, టాకీగా వస్తూనే పాటలను కథలో ఒక అంతర్భాగం చేసింది. మొదటి టాకీ *ఆలం ఆరాలో* మాటలకంటే పాటలెక్కువ అంటారు శ్యామ్ బెనగల్ (ఇప్పుడీ చిత్రం అలభ్యం). ఆ తరువాత వచ్చిన *ఇంద్రసభ* అన్న చిత్రాలలో మొత్తం 70 కి పైగా పాటలున్నాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ, వేళ్ళమీద లెఖ్ఖ పెట్టవలసిన కొన్ని చలన చిత్రాలు మినహా మిగిలిన వాటన్నిటిలోనూ పాటలున్నాయి. ఒక సామాన్య ప్రేక్షకుడు పాటలు లేని సినిమాను ఊహించలేడు. కేవలం పాటల ద్వారానే ప్రజాదరణ పొందిన చిత్రాలున్నాయి. భారతదేశంలో నుంచి వచ్చిన సినిమాల్లో పాటలొక అంతర్భాగం. ఈ రోజుల్లో సినిమా విడుదలకు ముందు జరిగే అడియో ఆవిష్కరణలో జరిగే హంగూ, హడావుడి మనం ఎరిగినదే!

1920 దశకంలో గ్రామఫోను, 1940 ప్రాంతంలో రేడియోల రాకతో సంగీతం ప్రజలకు మరింత చేరువైయింది. మొదట్లో విరివిగా ప్రదర్శించబడే నాటకంలోని పద్యాలు రికార్డులుగా వచ్చాయి. తరువాత కాలంలో లలిత సంగీతం, ఆ తరువాత సినిమా సంగీతం జనప్రియమైనాయి. సినిమాలో పాటతోబాటుగా దృశ్యం కనబడటంతో అవి ఎక్కువ ప్రజాకర్షణకు లోనుకావటం ఒక సహజ ప్రక్రియగా సాగింది. ఆలిండియా రేడియో ప్రసారాలు హైదరాబాద్, విజయవాడలలో ప్రారంభమయిన తరువాత మొదట్లో లలిత గీతాలు, తరువాత సినిమా పాటలు ప్రజలకు చేరవైనాయి. మొట్టమొదటి సినిమాలన్నీ పౌరాణికాలు కావటంతో అంతవరకు జనరంజకంగా నడుస్తున్న నాటకంలోని పద్యాలను ఇందులో యథావిధిగా ఉపయోగించుకున్నారు. వీటితోబాటుగా సినిమా కోసం కొన్ని పాటలను కూడా వ్రాయించేవారు. సాంఘిక చిత్రాలు కాళ్ళూనడంతో స్వతంత్ర రచనలు మొదలైనాయి. కొన్ని పాటలను వ్రాయించి, సినిమాలలో ఉపయోగించారు. మొదట్లో శిష్టవర్గం వాటిని గాలి పాటలని నిరసించినా, తరువాత కాలంలో వాటిలోని మాధుర్యానికి తలవంచక తప్పలేదు. సుబ్బరామన్, యస్. రాజేశ్వరావు, ఘంటసాల వంటి సంగీత దిగ్గజాలు శాస్త్రీయ సంగీతాన్ని ప్రజాహితానికి సరిపోయేలా మార్పులు చేయటం, సముద్రాలలాంటి రచయితలు తమ గేయరచనలను కవితాత్మకంగా భావపూరితంగా మార్చటంతో సినిమా సంగీతం పండిత, పామరుల మెప్పుపొందే సంగీతంలా క్రమేపీ రూపుదిద్దుకుంది. దేవులపల్లి ప్రవేశంతో *మల్లీశ్వరి* సినిమాలోని పాటలు ఉన్నత వర్గాల ఆదరణను పొందగలిగేయి.

హిందీ భాషపరంగా కుందన్‌లాల్ సైగల్, పంకజ్ మల్లిక్‌లు, తెలుగులో సాలూరు రాజేశ్వరరావు, రజని, ఘంటశాల, బాలసరస్వతి, టంగుటూరి సూర్యకుమారి మున్నగువారి లలిత సంగీతం, భావగీతాలు సినిమా పాటలకంటే ఎక్కువ ప్రాశస్త్యాన్ని పొందాయి.

తరువాత కాలంలో శ్రీశ్రీ, మల్లాది, ఆత్రేయ లాంటి వారు సినిమా సంగీతానికి సాహిత్య పరిమళాన్ని చేర్చి ప్రేక్షకుల మనసులో స్థానాన్ని కల్పించారు. మల్లీశ్వరితో మొదలయి, దేవదాసుతో సినిమాపాటలు అంగరంగ వైభోగాన్ని అందుకున్నాయి. ఇదే సమయంలో డా॥ కేల్కర్ నెహ్రూ ప్రభుత్వంలో ప్రసార శాఖామంత్రిగా పనిచేశారు. ఈయన తిరుగులేని వీరశాస్త్రీయ సంగీతవాది. మనముంటున్నది ప్రజాస్వామ్యంలో అని కాకుండా, రాజరికంలో ఉంటున్నామన్నట్లు అతిశయంతో ఈయన ఆలిండియా రేడియో అన్ని కేంద్రాలలోను సినిమా పాటలతోపాటు హార్మోనియం వాయిద్య వినియోగాన్ని కూడా ప్రసారం కాకుండా నిషేధించారు. కానీ ప్రజాభిమానాన్ని ఒక కలంపోటుతో ఆపలేమని తెలుసుకోలేకపోయారు. ఈ నిర్ణయం పుణ్యమా అంటూ పరోక్షంగా, ఆయన రేడియో సిలోన్ నెత్తిపై పాలు పోసినట్లయింది. రేడియో సిలోన్ వ్యాపార విభాగాన్ని సినిమా సంగీతంతో ప్రారంభించి – ధనం, పేరు గడించింది. ఎవరో కొందరు ఛాందసులు మినహా మిగిలినవారంతా రేడియో సిలోన్‌లో వచ్చే సినిమా పాటలే వినేవారు. దేశమంతా

ఇదే పరిస్థితి. రేడియో సిలోన్ హిందీ, తమిళ, సినిమా పాటలకు ఎక్కువ కాలాన్ని వినియోగించేది. తెలుగు, బెంగాలీ, కన్నడ, మళయాళ చిత్రాల సినిమా పాటలకు కేవలం గణపతి నవరాత్రి పందిళ్ళకు, పెళ్లిళ్ళకు పెట్టే స్పీకర్లలో మాత్రమే వినిపించబడేవి.

అసలు తెలుగు సినిమా పాటల ముందు వెనుకలలో ఏం జరుగుతుందో తెలియక ఎవరిమట్టుకు వారు తోచినట్లు మాట్లాడుకునే సందర్భాలలో *సరాగమాల* పేరుతో వి.ఎ.కె. రంగారావు వార పత్రికలో ఒక శీర్షికను నడిపి, సమగ్ర విశ్లేషణను చేసేవారు. ఈ కాలమ్ కోసం వారం వారం ఎందరో ఎదురు చూసేవారు.

**- కాండ్రేగుల నాగేశ్వరరావు**

# గానసరస్వతి

**నా**లుగేళ్ళ వయస్సులో స్టేజిమీద పాడిన బాలసరస్వతి ఆరేళ్ళ వయస్సులో గ్రామఫోన్ రికార్డు కోసం పాడింది. ఏడేళ్ళ వయస్సులో సినిమాలో నటించి పాటలు పాడింది. 15 ఏళ్ళు వచ్చేసరికి 13 సినిమాలలో నటించింది. మధ్యలో రేడియోలో తెలుగులో మొట్టమొదటి లలిత గీతం పాడింది. తెలుగులో మొట్టమొదటి నేపథ్య గాయనిగా పేరు తెచ్చుకుంది. 16 ఏళ్ళకే కోలంక జమీందారు రావు ప్రద్యుమ్నకృష్ణ మహీపతి సూర్యారావును పాణిగ్రహణం చేసి, రాణి రావు బాలసరస్వతీదేవిగా అంతఃపురం చేరింది.



**ఆరేళ్ల వయసులో రావు బాలసరస్వతి**

బాలసరస్వతీదేవి నాన్నగారికి లలితకళలంటే, ముఖ్యంగా సంగీతమంటే చాలా ఇష్టం. బాలసరస్వతీదేవికి, వారి అక్కకు కూడా ఆయన సంగీతం నేర్పించారు. అయితే అక్కకు పాట వచ్చినా బిడియం ఎక్కువ. అందరి ముందూ పాడడానికి జంకుతూ ఉండేవారు. బాలసరస్వతీదేవి జంకూబొంకూ లేకుండా ఎంతమంది ఉన్నా, నిర్భయంగా పాడేవారు. అందువల్లనే అక్క పాట ఆదిలోనే ఆగిపోయినా, చెల్లెలి పాట చిరంజీవిగా నిలిచింది. బాలసరస్వతీదేవి చిన్నప్పుడు అలత్తూరు సుబ్బయ్యగారి దగ్గర మూడు సంవత్సరాలపాటు కర్ణాటక సంగీతం నేర్చుకున్నారు. గమ్మత్తేమిటంటే, ఆమె ఎక్కడ, ఏ సందర్భంలోను కర్ణాటక సంగీతం పాడలేదు. ఆమె పాడినవన్నీ లలితగీతాలే. చాలావరకు హిందుస్తానీ బాణీలే. తరువాత ఒక దశలో ఆమె సుప్రసిద్ధ సినీ సంగీత దర్శకుడు వసంత్ దేశాయ్ వద్ద హిందూస్తానీ సంగీతం మెళకువలు నేర్చుకున్నారు. పాశ్చాత్య సంగీతంలో కూడా ప్రవేశం ఉంది. డేవిడ్ దగ్గర పియానో అభ్యసించారు.

కొప్పరపు సుబ్బారావు బాలసరస్వతీదేవికి నాన్నగారికి మంచి స్నేహితులు. ఆమె ఆరేళ్ళ వయస్సులోనే పాట బాగా పాడడం చూసి, సుబ్బారావు హెచ్.ఎం.వి గ్రామఫోన్ కంపెనీ వారికి సిఫారసు చేశారు. ఆ రోజుల్లో హెచ్.ఎం.వి వారి కోసం ఓగిరాల రామచంద్ర రావు కుచేల-ప్రహ్లాద జంట నాటకాలు చేయించారు. కుచేలలో 'ఆకలి సహింపజాలనే', ప్రహ్లాదలో 'దొరికె, దొరికె నాకూ నేటికి శ్రీహరి దర్శనమూ' బాలసరస్వతీదేవితో పాడించారు. ఆ తరువాత 'పరమ పురుష పరంధామ' పాటని సోలో రికార్డ్‌గా విడుదల చేశారు.

ఈ పాటలు విన్న సుప్రసిద్ధ దర్శకులు సి. పుల్లయ్య తాము నిర్మిస్తున్న 'సతీ అనసూయ' సినిమాలో బాలసరస్వతీదేవిని బుక్ చేశారు. ఆకుల నరసింహారావు సంగీత దర్శకులు. ఆ సినిమాలో గంగ పాత్రకు బాలసరస్వతీదేవికి 250 రూపాయలు (ఆ రోజుల్లో అది పెద్ద మొత్తమే) పారితోషికం ఇచ్చారట. పాపాలన్నీ దెయ్యాలై తరుముతుంటే, భయంతో పారిపోవలసిన గంగ వేషంలోని బాలసరస్వతీదేవి, చిన్నతనంకొద్దీ దెయ్యాల్నే తరిమికొడుతుండేవారట. 'వాడు భయపెడుతున్నాడు. వీడు బెదిరిస్తున్నాడు' అంటూ మారాం చేసేవారట. అప్పటికి ఆమె వయస్సు ఏడేళ్ళు.

ఈ సినిమా నిర్మాణం కలకత్తాలోని ఈస్టిండియా స్టూడియోలో జరిగింది. మరీ చిన్నపిల్లయిన బాలసరస్వతీదేవిని అందరూ ముద్దు చేసేవారు. కె.ఎల్. సైగల్, కె.సి.డే.లాంటి సుప్రసిద్ధ గాయకులు ఆ రోజుల్లో స్టూడియోకు వచ్చేవారు. వారంతా బాలసరస్వతీదేవిని తీసికెళ్ళి ఆమె పాడుతున్న తీరు చూసి అబ్బుర పడేవారట.

ఆ సమయంలోనే ఈస్టిండియా స్టూడియోలో తమిళ సినిమా తీస్తున్న కె. సుబ్రహ్మణ్యం బాలసరస్వతీదేవిని చూసి ముగ్ధుడై, తాను తీస్తున్న తదుపరి సినిమా 'కుచేల'లో ఆమెను కృష్ణుడు వేషానికి తీసుకున్నారు. *ఇల్లాలు, అపవాదు* సినిమాలలో నటిస్తూనే పాటలు పాడారు. బొంబాయిలో తమిళంలో నిర్మించిన 'డాన్సింగ్ గరల్' సినిమాలో హీరోయిన్‌గా నటించారు.

తెలుగు సినిమాలలో మొట్టమొదటి నేపథ్య గాయని బాలసరస్వతీదేవే. నాగయ్యగారు తీసిన 'భాగ్యలక్ష్మి' సినిమాలో ఆమె కమలాకోట్నీస్‌కు నేపథ్యగానం చేశారు. ఆ పాట 'తిన్నే మీద చిన్నోడా'.... మాయా మచ్ఛీంద్ర సినిమాలో 'వినవోయీ హృదయాలాపన' అన్న పాట మాలతి కోసం పాడారు. అప్పటికి పదహారేళ్ల వయస్సు.

ఆ రోజుల్లోనే ఆమె మొట్టమొదటి లలితగీతం పాడారు. సాలూరు రాజేశ్వరరావుగారితో కలిసి ప్రయివేట్‌గా రెండు పాటలు రికార్డ్ చేశారు. 'పొదరింటిలో నుండి...', 'రావే రావే కోకిలా' పాటలు అప్పుడు వెలువడినవే. 'ఆ తోటలోనొకటి ఆరాధనాలయము...' కూడా ప్రయివేట్ రికార్డుగా రిలీజయింది. రాజేశ్వరరావుగారితో కలిసి పాడిన 'పాట పాడుమా కృష్ణా', 'కలగంటి కలగంటి కలువ రేకుల వంటి కనుల గలవాని...' పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఆ రోజుల్లో వీరి పాటలంటే చెవులు కోసుకునేవారు.

బాలసరస్వతీదేవి 1944లో ఒకసారి తల్లిదండ్రులతో కలిసి మద్రాస్ రేస్‌కోర్సుకు వెళ్ళారు. అక్కడ కోలంక రాజావారు ఆమెను చూశారట. తరువాత ఆయన బాలసరస్వతీదేవి పాట వినాలని, వారింటికి వస్తానని ఆమె తల్లిదండ్రులకు కబురు చేశారట. వెంకటగిరి రాజా కుటుంబానికి చెందిన అంతటి వ్యక్తి మాట కాదనలేక వారు ఆయనను ఆహ్వానించారు. రాజావారు సకల పరివార సమేతంగా వచ్చారు. బాలసరస్వతీదేవిని పాడమన్నారు. ఆమె తాను అప్పటికే పాడిన 'కలగంటి కలగంటి...' పాట పాడారట. రాజా వారివి అందమైన పెద్ద కళ్ళు. ఆమె తన కళ్ళ గురించే పాట పాడారని, తన మీద ఇష్టంతోనే పాడారని అనుకొన్నారట. తరవాత పెళ్ళి ప్రస్తావన తెచ్చారు. పట్టుబట్టి పెళ్ళి చేసుకున్నారు. బాలసరస్వతీదేవి పెళ్ళయిన తరవాత నాలుగేళ్ళు మద్రాసులో ఉండి, కోలంక వెళ్ళారు. అప్పటి నుంచి

*ఆ తోటలోనొకటి ఆరాధనాలయము*
*ఆ ఆలయములోని అందగాడెవరే,*
*అందగాడెవరే, అందగాడెవరే!*

*మన్మథుడనీ చెలియా*
*మనసు ఘోషించేనే*
*మరలీ వచ్చెదమన్నా మరపూ రాకున్నాడే*

*చంద్రబింబపు ముఖమూ*
*గండు కోకిల స్వరమూ*
*పండూ వెన్నెలలోనే*
*పవ్వళించేనమ్మా... చెలియా*
*చుక్కల్లా రేడమ్మా... సఖియా*

*మరునీ శరముల చేతా మనసూ నిలువక నేను*
*మల్లె, మొల్లా, మొగిలీ*
*మాలతీ మందారా*
*మాలికలు వాని మెడలో వైచీనానే*
*మధురామూర్తీ మేల్కొని*
*మందహాసమూ చేయా*
*మకరా కర్ణిక మెరసేనే చెలియా!*
*మది వెన్న చిలికినదే సఖియా!*
*మెరపూలోనా నేను మైమరచీ వెంటనే*
*పేరేమిటనీ వాని ప్రశ్నించగానే     ॥ పేరే ॥*

*మాయాదేవీ సుతునని మధురామూర్తీ పలికె*
*సిద్ధార్థుడే నాకు సిద్ధించెనే, చెలియా!*
*మది కోర్కె నెరవేరె, సఖియా!*

*ఆ తోటలో నొకటి ఆరాధనాలయము*
*ఆ ఆలయములోని అందగాడితడే.."*

*(రచన : సాలూరి సన్యాసిరాజు*
*సంగీతం : సాలూరి రాజేశ్వరరావు)*


1974లో రాజా వారు పోయేదాక అక్కడే గడిపారు. మధ్యమధ్యలో మద్రాస్ వెళ్ళి రావటమే కానీ స్థిరనివాసం అంతఃపురంలోనే. అప్పుడప్పుడూ కొంతకాలం సినిమాలకు పాడారు. కాని ఆ తరువాత మానేశారు.

బాలసరస్వతీదేవి గారు తెలుగులో ముఖ్యమైన సినిమా సంగీత దర్శకులందరితోనూ కలిసి పనిచేశారు. చెంచులక్ష్మి సినిమాలో ఆమె మొదటిసారి సి.ఆర్. సుబ్బరామన్ సంగీత దర్శకత్వంలో పాడారు. దాదాపు సుబ్బరామన్ సినిమాలన్నింటిలో ఆమె పాటలున్నాయి. సుబ్బరామన్‌కు ఆమె అంటే వల్లమాలిన అభిమానం. ఆమె పాట అంటే ప్రాణం. ఒకసారి కృష్ణా పిక్చర్స్ వారి ఒక సినిమాలో ఆమె పాటను తొలగించి తన పాట పెట్టాలని నిర్మాతకు సన్నిహితంగా ఉన్న పి.ఎ. పెరియనాయకి (నటి, గాయని) పట్టుబట్టింది. బాలసరస్వతి పాట తీసివేస్తే తాను అసలు ఆ సినిమాకు సంగీత దర్శకత్వమే చేయనని సుబ్బరామన్ మొండికేశారట. చివరికి ఆయన్ని ఎంతో బతిమలాడి ఒప్పించగా, బాలసరస్వతీదేవి అనుమతితో సినిమా కొనసాగించారట. బాలసరస్వతీదేవి మీద ఆయనకున్న అభిమానం అలాంటిది.

సుప్రసిద్ధ సంగీత దర్శకుడు రమేష్‌నాయుడు సినిమా రంగంలోకి వచ్చిన కొత్తలో తన మొదటి సినిమాకి బాలసరస్వతీదేవితో పాటలు పాడించారు. 'దాంపత్యం' సినిమాలో ఆమె అయిదు పాటలు పాడారు. 'తానేమి తలంచెనో...' అనే పాట ఈ సినిమాలోనిదే. ఈ సినిమాలో పాటలన్నీ బాగా జనాదరణపొందాయి. 'పెద్దరికాలు' సినిమాలో వేణు సంగీత దర్శకత్వంలో బాలసరస్వతీదేవి కొన్ని పాటలు పాడారు.

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి పాట 'సృష్టిలో తీయనిది స్నేహమే నోయీ...' ప్రయివేట్ రికార్డుగా విడుదల చేశారు. దీనికి పెండ్యాల నాగేశ్వరరావు సంగీతం సమకూర్చారు. రికార్డు మార్కెట్‌లో ఈ పాట సూపర్ హిట్ అయింది. ఈ రికార్డు విడుదలయిన తరువాత పెండ్యాలను సినిమా సంగీత దర్శకుడిగా మొదటి అవకాశం వచ్చింది. ఆ తరవాత సినిమాల గిరాకీ పెరిగింది. బాలసరస్వతీదేవి సినిమా పాటలన్నీ పాపులర్ అయినా, ఆమె ప్రయివేట్ సాంగ్స్, లలిత గీతాలు ఎక్కువ ప్రజాదరణ పొందాయి. 'ఆ తోటలో నొకటి ఆరాధనాలయము'తో మొదలుపెట్టి ఈ పాటలన్నీ తెలుగువారి గుండెలలో తీపి గుర్తులుగా నిలిచాయి. ఈ పాటలలో సాహిత్య సంగీతాలు పోటీపడి తేటతేనియలూరించాయి. తెలుగులో పేరు పొందిన భావ కవులందరి పాటలను ఆమె పాడారు. కృష్ణశాస్త్రి 'రెల్లుపూల పానుపుపైన...', 'మల్లెపూలు, మల్లెపూలు'లాంటి పాటలనేకం ఆమె ఆలపించారు. బసవరాజు అప్పారావు పాట, 'తలుపు తీయునంతలోన, తత్తరమదియేల...' మన మనసులలో రసోద్దీపనకు తలుపులు తీస్తుంది. ఆరుద్ర 'చలిగాలి వీచింది', దాశరథి 'నిండు పున్నమి, పండు వెన్నెల', భుజంగరాయశర్మ 'ఆలయమున వినపడునదిగో...' వగైరా పాటలు నిత్యం మన మనసులలో మధురోహలు రేకెత్తిస్తున్నాయి.

'బంగారు పాపాయి బహుమతులు పొందాలి' అనే పాట వింటుంటే మనం పసిపాపలమైపోతాం. బాలసరస్వతీదేవిగారి పెద్దబ్బాయి పుట్టినపుడు మంచాల జగన్నాథరావు ఈ పాట రాసి ఆమెకు బహుమతిగా అందచేశారట. ఈ పాట పాడుతుంటే మాతృమూర్తి ప్రేమ మాధుర్యమంతా పరవళ్ళు తొక్కుతున్నట్టుంటుంది. ఆమె పాడిన జోలపాటలు – 'జోజో వయారికదే జోజో' పసితనపు జ్ఞాపక పరిమళాలను పంచుతాయి.



భర్త శ్రీ రాజా రావు ప్రద్యుమ్న కృష్ణ మహీపతి సూర్యారావుతో బాలసరస్వతీదేవి (1945)

బాలసరస్వతీదేవి పాడిన పాటలలో శ్రీశ్రీ పాటలూ ఉన్నాయి. 'ఆహుతి' సినిమాలో శ్రీశ్రీ పాటలన్నిటికి సాలూరు రాజేశ్వరరావు స్వరకల్పన చేశారు. ఇది డబ్బింగ్ సినిమా అయినప్పటికి అదే బీటు తీసుకుని ట్యూన్ మార్చారు రాజేశ్వరరావు. 'ప్రణయమే పోయెనా బలియై...'లాంటి పాటలు హిట్టయ్యాయి. రాజేశ్వరరావు సోదరుడు సాలూరు

హనుమంతరావు 'రాధిక' చిత్రం కోసం స్వరపరచిన 'గోపాలకృష్ణుడు నల్లన' కూడా విశేషాధరణ పొందింది. సి. నారాయణ రెడ్డి తెలుగులోకి తిరగరాసిన మీరా పాటలు బాలసరస్వతీదేవి పాడగా, రికార్డుగా వచ్చింది. ఇది కూడా సంగీత ప్రియులను అలరించింది. మద్రాస్ రేడియోలో మొట్టమొదటిసారి 1940లో లలితసంగీతం పాడారు. 1948లో విజయవాడ రేడియోకేంద్రం ప్రారంభించినపుడు మొదట ఆమే పాడారు. యాభైసంవత్సరాల తరవాత మొన్న విజయవాడ రేడియో కేంద్రం స్వర్ణోత్సవాలలో మళ్ళీ పాడారు. సినిమా సంగీతమైనా, రేడియో పాటయినా, లలితగీతమైనా, ప్రయివేట్ పాట అయినా ఆమె పాటలో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఆ స్వరంలో ఓ మత్తు ఉంది. గమ్మత్తు ఉంది. కలల గలగల ఉంది. మనకు తెలియని మధుర లోకాల కదలిక ఉంది. మనల్ని ఎక్కడికో మనోజ్ఞ తీరాలకు తీసికెళ్ళే ఊహల ఊయల ఉంది. మన మనసు నిండా తీయ తేనియ మాధుర్యం నింపుతుంది. భావమెంత మధురంగా పలికిస్తారో పదాలనంత లలిత మనోహరంగా ఆలపిస్తారు. ఆమె పాటలు వింటుంటే తెలుగు భాష ఎంత మధురమైందో తెలుస్తుంది.

ఇన్ని సంవత్సరాలపాటు తెలుగువారి లోగిళ్ళలో లలితగీతాల వెన్నెల నింపిన బాలసరస్వతీదేవి 20 సంవత్సరాల పాటు తెలుగుదేశానికి దూరంగా ప్రవాసజీవితం గడపవలసి వచ్చింది. 1974 నుంచి 1994 వరకు ఆమె ఎక్కడో మైసూరులో ఉన్నారు. ఆమె పాటల మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించిన తెలుగువారు ఆమె గురించి పట్టించుకోలేదు. ఆమె ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో కూడా ఎవరికీ పట్టలేదు. తెలుగువారి పాటల సరస్వతిని గౌరవిద్దామన్న భావనే మన ముఖ్యమంత్రులలో, నాయకులలో ఏ ఒక్కరికీ తట్టలేదు. తమ పాటలకు ఆమె గొంతు దివ్యత్వం కల్పిస్తే ఆనందించిన మన సాంస్కృతిక మండలి ఛైర్మన్, మన సంస్కృతీ బంధువులు కూడా ఆమెపట్ల తగిన శ్రద్ధ చూపలేకపోయారు. ఎవరెవరికో ఫిల్మ్‌నగర్ కాలనీ ఇళ్ళస్థలాలు వచ్చాయి కాని, ఆమె పాడిన రెండు వేల సినీగీతాలకు తగిన గుర్తింపు రాలేదు. ఆమె జమీందారీ పొలాలు, స్థలాలు – గద్దలు, కాకులు తన్నుకుపోతుంటే ఆమెకు భద్రత కరువయింది. అనామకులకు, అంగుష్ఠమాత్రులకు డాక్టరేట్లు, అవార్డులు ప్రదానం చేసే మన యూనివర్సిటీలకు ఒక మధుర గాయని గమనంలోకి రాలేదు. కళలకు, మన కళాకారులకు మనం ఇస్తున్న విలువ ఇదా?

ఆమె పాడిన పాటలన్నీ గొప్పగా ఉంటాయి. కానీ తలమానికం అంటూ ఒకటుంటుంది. అలా చెప్పాలంటే ప్రైవేట్ పాటలలో *ఆ తీరులో నొక్కటి* గురించి చెప్పాలి. అలానే సినిమా పాటలలో *మల్లెపూలు.... మల్లెపూలు* గురించి చెప్పాలి. మొదటి పాటకు సాలూరు రాజేశ్వరరావు, రెండవ దానికి సుబ్బరామన్ సంగీత దర్శకులు, రెండవ పాట Capalova అనబడే స్పానిష్ గీతం మాతృక. Sebastian Eradica అనబడే composer భావతరంగమిది. గత 140 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా అలరిస్తున్నాయి.

*ధరణికి గిరి భారమా*
*గిరికి తరువు భారమా*
*తరువుకు కాయ భారమా*
*కనిపెంచే తల్లికి పిల్ల భారమా*

*మును నే నోచిన నానోము పండగా*
*నా వొడిలో వెలిగే నా చిన్ని నాయన*
*పూయని తీవెననే అపవాదు రానీక*
*తల్లిననే దీవెన తనియించి నావయ్య ॥తరువుకు॥*
*ఆపదవేళల అమ్మమనసు చెదరునా*
*పాపల రోదనకే ఆ తల్లి విసుగునా*
*పిల్లల కనగానే తీరేనా స్త్రీ విధి*
*ప్రేమతో పాపలను పెంచని దొకతల్లియా ॥ తరువుక ॥*

(రచన : సముద్రాల రాఘవాచార్యులు,
సంగీతం : ఘంటసాల)

కె. వాసుదేవరావు
(బాలసరస్వతీదేవి అభినందన సంచిక)

(ప్రస్తుతం ఈమె హైదరాబాదు, హౌస్ నెం. 11, సైనిక్‌పురి, రాధాలీగల్ హౌసెస్‌లో నివసిస్తున్నారు. ప్రతి సంవత్సరం 28 ఆగస్టున ఆమె అభిమానులతో కలిసి పుట్టినరోజు జరుపుకుంటారు.)



పద్మశ్రీ

# కవి కోకిల 'హలధర నాగ్'

- *ఉమాదేవి అద్దేపల్లి*

పద్మశ్రీ గౌరవ పురస్కార గ్రహీత హలధర్ నాగ్. ఈ పేరు భారత్ అంతా ప్రస్తుతం హల్‌చల్ చేస్తోంది. ప్రతి ఏడూ ఎందరో కవులు, రచయితలు, కళాకారులు పద్మశ్రీ అవార్డ్ అందుకుంటూనే వున్నారు. మరి పశ్చిమ ఒడిషాకి చెందిన ఒడియా కవి హలధర్ నాగ్ కి పద్మశ్రీ అవార్డ్ వస్తే భారతదేశం ఎందుకంత ఆశ్చర్యపోతోంది...! ఆశ్చర్యమే మరి. దానికి కారణం పద్మశ్రీ పురస్కారం అందుకున్న అనంతరం 'కనక్ ఛానెల్' అనే ఒడియా టి.వి. ఛానెల్‌లో 'ఏఫకాళో (నీళ్ళల్లో నానబెట్టిన గంజి కూడు) నుండి పద్మశ్రీ వరకూ..' అనే శీర్షికతో ఒక గంట హలధర్ నాగ్‌తో జరిపిన ఇంటర్వ్యూ చూస్తే అర్ధమవుతుంది. ఆ ఇంటర్వ్యూ ఆధారంగా నేను సేకరించిన కొన్ని విషయాలు ఇక్కడ పొందుపరుస్తున్నాను.

మొట్టమొదటి ప్రశ్న : ఫకాళో తింటూ, ఒక మారుమూల కుగ్రామంలో, చదువు సంధ్యలు కూడా లేకుండా అతి సామాన్యమైన బతుకు తెరువు సాగిస్తున్న మీకు, భారత దేశంలో అత్యంత ప్రతిష్మాత్మక గౌరవ పద్మశ్రీ అవార్డ్ లభిస్తుందని, భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ఎంతో ప్రముఖులనబడిన వారి ఆధ్యర్యంలో, వారితోపాటు ఈ పురస్కారాన్ని అందుకోగలననికానీ మీరెప్పుడయినా, కనీసం కలలోనయినా ఉహించారా?"

జవాబు : *కవి ఎప్పుడు సన్మానాలను, గుర్తింపులను వెతుక్కుంటూ పరుగులెత్తడు.. గుర్తింపు, సన్మానం అనేవి అతన్ని వెతుక్కుంటూ అతనివెంట పరుగులెత్తి వస్తాయి. అతనిలాగే ఎంత సహజంగా, నిరాడంబరంగా వుందీ జవాబు..!*

రెండవ ప్రశ్న : "కాళ్ళకి చెప్పులు లేకుండా, ధోవతి పై కనీసం చొక్కా అయినా లేకుండా, ఒక ఉత్తరీయాన్ని మాత్రం కప్పుకొని, అత్యంత గౌరవ పురస్కారమైన పద్మశ్రీ అవార్డుని అందుకొనడానికి వెళ్ళిన తొలి భారతీయుడు మీరే అనుకుంటా! పైగా ప్రముఖ హోటల్ 'అశోక్'లో పద్మశ్రీ అవార్డ్ గ్రహీతలందరికి వసతి ఏర్పాటు చేసినపుడు మిమ్మల్ని సెక్యూరిటీవాళ్ళు లోనికి వెళ్ళకుండా మొదట అడ్డుకున్నారట.? నాటి మీ అనుభవాలు, విశేషాలు చెప్తారా!" ప్రకాశవంతమైన చిరునవ్వుతో హలధర్ నాగ్ జవాబు :

*"అది సహజమేకదా! నన్ను, నా అవతారాన్ని, వేషభాషల్ని చూస్తే ఎవరికయినా సందేహం రావడం సహజమే. అందుకే సెక్యూరిటీ వాళ్ళ డ్యూటీ వాళ్ళు చేసారు. ఇంకా నయమే. నా స్వంత రాష్ట్రమైన ఓడిషాలో (రెండు దశాబ్దాల పైమాటే) సంబల్‌పూర్లో నాకు తొలిసారి ఒక ఘన సన్మాన సభ ఏర్పాటు చేసారు. పెద్ద పెద్ద బానర్స్, లైట్స్ అలంకరణతో హంగు, ఆర్భాటంతో ఆవరణ అంతా మెరిసిపోతోంది. సన్మానం అందుకొనే కవి గారు ఏ కారులోనో, కనీసం రిక్షాలోనో, మంచి దుస్తుల్లో దిగుతారని ఎదురుచుస్తున్నట్టున్నారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడు నా అవతారం ఇదే. కాలినడకని చెప్పులు కూడా లేకుండా హడావిడిగా లోనికి వెళ్తుంటే, గేటు వద్ద నన్ను అటకాయించి బయటకు తోలేశారు. చేసేదిలేక వెళ్లి సమీపంలో ఒక చెట్టుకింద కూర్చున్నాను. అసంఖ్యాకమైన కార్లు, పట్ పటీలు (స్కూటర్స్) సూటుబూటు బాబులు, ఇవన్నీ, వీరందర్నీ పరికిస్తూ, కొంతసేపటికి అలా చిన్న కునుకు తీసాను. నేను*

*రేడియో గాయకుడిని. రేడియో స్టేషన్‌లో నన్ను తరుచు పరిచయం చేసే వ్యక్తి ఒకరు చెట్టు కింద వున్న నన్ను చూసి, 'అరె. హల్ధర్ బాబు! మీరేమిటి ఇక్కడ? మీ కోసం మేము ఎదురు చూస్తున్నాము' అంటూ సగౌరవంగా లోనికి తీసుకెళ్ళారు. నేను వేదిక ఎక్కగానే సభలో ఒకటే కలకలం.. హోరే.. చూడండి.. మనం ఎదురుచూస్తున్న, ఇక్కడ సన్మానం చెయ్యాలనుకుంటున్న కవిరాజ్ ఇతనట...! ఎక్కడ నుండి తెచ్చారీ వానరాన్ని... ఇతను నిజంగా కవేనా! లేక కపా! అంటూ ఒకటే గుస గుసలు."* ఎంతో సహజంగా హాయిగా నవ్వేస్తూ, చెబుతున్నారు.

*"నా తొలి అనుభవం అలా ప్రారంభం అయింది. కనుక డిల్లీ అశోక్ హోటల్‌లో సంఘటన సహజమే అనిపించింది. ఇక సన్మాన కార్యక్రమం సందర్భంలో రాష్ట్రపతి నాకు గౌరవ పద్మశ్రీ పురస్కార పత్రాన్ని అందిస్తూ ఎందుకో పాదాల నుండి, శిరస్సు వరకు పరిశీలనగా చూశారు. బహుశా పద్మశ్రీ పతాకాన్ని ఎక్కడ తగిలించాలా! అని అనుకుంటూ. చివరికి నా ఉత్తరీయానికే తగిలించారు. కార్యక్రమం ముగిశాక మా అందరికీ అక్కడ ఫలహారాలు పెట్టారు. నేను ఫలహారం ముగించి, టీ తాగబోతుంటే, పెట్రోలియం శాఖామాత్యులు ధర్మేంద్ర పధాన్ గారు కంగారుగా వచ్చి,*

*'హల్ధర బాబు ! మిమ్మల్ని కలవడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు వస్తున్నారు' అనగానే చటక్కున టీ కప్పు అక్కడ పెట్టేసి లేచి నిలబడ్డాను. వారు రాగానే గౌరవంగా చేతులు జోడించాను. మోడీగారు చెయ్యి చాపారు.. ఎంతో అభిమానంతో, ఆప్యాయంగా నా చేతిని ఊపుతూ, 'హల్ధర్ బాబూ! ఆప్ ఓడిషాకే స్వాభిమాన్ బడాదియా..' అని ప్రశంసించి, వెళ్ళిపోయారు."* అమాయకపు నవ్వుతో తన సహజ పల్లె భాషలో అతను చెప్తుంటే ప్రేక్షకుల కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

ప్రశ్న :- "సరేకానీ, మీరు రాష్ట్రపతి భవన్‌కి కూడా చెప్పులు లేకుండా వెళ్ళారు. అసలు చెప్పులెందుకు వేసుకోరు...? మీ పాదాలుకి నొప్పి పుట్టదా?"

జవాబు:- *చెప్పులు తొడుక్కుంటే నా పాదాలకి నొప్పిపుడుతుంది. నడవలేక తొట్రుపడతాను. ఖాళీ పాదాలతో కొండలు గుట్టలు కూడా అవలీలగా ఎక్కేస్తాను.. మీకు తెలుసా! పాదాలు మట్టిని స్పర్శించాలి. భూమిలో వున్న ఆకర్షణ శక్తి పాదాల ద్వారా శరీరానికి అంది మనల్ని ఉత్తేజితుల్ని చేస్తుంది.. ఆరోగ్యానికి మంచిది అని వైద్యులు కూడా చెప్పడం విన్నాను. ఇప్పుడు వంటింట్లో కూడా చెప్పులు ధరించి వంట చేస్తుంటారు. అందుకే మధుమేహంలాటి వ్యాధుల బారిన పడుతున్నారు.."*

దానికి ఉదాహరణ హలధరుడే అనిపిస్తుంది. అరవై ఐదు సంవత్సరాల వయసులో కూడా ఎంతో ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నాడతను. నల్లగా నిగనిగలాడే సహజ కేశ సంపద. మనిషి అందగాడు కాదు, కానీ అచంచల ఆత్మ విశ్వాసం, జన్మతః సంక్రమించిన అసాధారణ ప్రతిభా సంపత్తి, పెట్టని వజ్రాభరణాలులాగ అతని ముఖ వర్ఛస్సుని పెంచుతున్నాయి. ఒక జర్నలిస్ట్ లేచి అన్నాడు :

"శరీరానికి, మెదడుకి తగిన ప్రోటీన్స్, విటమిన్స్ అందకపోతే జ్ఞాపకశక్తి పెరగదు అంటారు. కానీ హల్ధర బాబు కేవలం ఫకాళో మాత్రమే తింటూ జీవనయానం సాగిస్తున్నారు.. కనీసం ఖరీదయిన ఆహారం కూడా తీసుకోరు. కానీ వేల సంఖ్యలో వారు రాసిన, చదివిన, విన్న కవితలు వారికి ముఖస్తం అయ్యాయి. అడిగినదే తడవుగా ఏ అంశమైనా అవలీలగా, తడుముకోకుండా ఒక ప్రవాహంలా చెప్పుకుపోతారు.. మీకు ఎలా సాధ్యం హల్ధరబాబు! దీని వెనుక రహస్యమేమిటి.?"

*"రహస్యమేమీ లేదు. జన్మతః నాకు లభించిన విద్య. అది భగవంతుడు నాకిచ్చిన వరం"* అన్నాడతను.

ఒక గంట ఇంటర్వ్యూలో అతని జీవితం గురించి, కవిగా అతని జీవితానుభావాలను గురించి ఎన్నెన్నో అసాధారణ విషయాలు చెప్పాడు. అవన్నీ వ్రాస్తే అదొక ఉద్గ్రంథం అవుతుంది. కనుక టూకీగా కొన్ని విషయాలు మాత్రం చెప్తాను.

హల్ధర్ నాగ్... పేరులో ఏముంటుంది.. ? అంటారు కానీ అతని పేరులోనే వుంది పెన్నిధి అనిపిస్తుంది.'' 'హలధరుడు' అంటే శ్రీ కృష్ణుని అగ్రజుడు బలరాముని పేరు. అతను ఆదిశేషువు అవతారం కనుక నాగ్ అంటారు.. ఈ భూభారాన్ని మోస్తున్నది ఆదిశేషుడే... అలాగే ఈ సువిశాల విశ్వాన్ని తన చిన్ని గుండెలో దాచుకొని, తన గళం ద్వారా ఒక విశ్వపతాన్ని మన కళ్ళముందు ఆవిర్భవింపజేస్తాడు మన ఈ కవి రాజ్ 'హలధర నాగ్'.

పశ్చిమ ఒడిస్సా బర్గడ్ జిల్లాలో ఒక చిన్న కుగ్రామంలో, అతి పేద కుటుంబంలో 1950, మార్చి31న జన్మించాడు

హలధర్ నాగ్.. అతని ఏడవ ఏట తలితండ్రులిద్దరూ గతించడంవలన నా అన్నవారు లేని అనాథ బాలుడిగా, ఆదరించి అన్నం పెట్టేవారు లేకపోవడంవల్ల తన చిన్ని పొట్ట పోసుకుందుకు ఒక హోటల్లో కప్పులు, ప్లేట్లు కడుక్కుంటూ జీవనయానం సాగిస్తున్న అతన్ని పరిచయస్తులొకరు ఒక స్కూల్ హాస్టల్‌లో వంటవానిగా చేర్పించారు.

*"ఆ రోజుల్లో అనాథలను ఆదరించి, అన్నం పెట్టి, చదువు చెప్పే పాఠశాలలు లేవు. అందుకే మూడవ తరగతి కూడా పాసవ్వలేదు. కానీ హాస్టల్‌లో వంటవానిగా చేరాక, అక్కడ పదహారు సంవత్సరాలు స్కూల్ విద్యార్థుల మధ్య కలివిడిగా తిరుగుతూ ఎంతో ఆనందాన్ని అనుభవించాను"* అన్నాడతను.

జటాధారి మౌనిలా, సాధువులా ఊడలు తన్నుకొని నిలబడి, తరతరాల తాత ముత్తాతలను వారి జీవిత విశేషాలను వీక్షిస్తూ, భూమి లోతుల్లో పాదుకున్న వేర్లతో, గగన చుంబితంగా ఎదిగిన శాఖోపశాఖలతో విస్తరిల్లి, తన క్రింద, తన చెంత జరుగుతున్న ఎన్నో మంచి చెడులకు తానొక సాక్షీభూతంగా నిలిచిన 'పెద్ద మర్రి చెట్టు' అతని తొలి కవిత. తన తొలి కవితలోనే కవి యొక్క విశ్వరూపాన్ని ఒక విరాట్ వృక్షంతో పోలుస్తూ రాశారు 'హలధర బాబు' అంటూ అతని తొలి కవితకి భాష్యం చెప్పారు సభలోని పండితులు.

*"కవి ఎప్పుడూ విశ్వాన్ని తన గుండెలో నింపుకొని, ప్రపంచాన్నంతనీ ఉద్దేశిస్తూ చెప్తాడే కాని, ఒక ప్రాంతాన్ని, ఒక భాషని, ఒక వ్యక్తిని దృష్టిలో పెట్టుకొని చెప్పడు. కవిలో ఆ విశ్వజనీనత వుంటుంది, వుండాలి"* అన్నాడతను.

హలధర నాగ్ తన కవితలతో స్పృశించని అంశం లేదు. ప్రకృతి సౌదర్యాన్నే కాదు, వేదాలను విశ్లేషించాడు. రామాయణ, మహాభారత, భాగవతాది పురాణ గ్రంథాలకు తనదైన భాషలో భాష్యం చెప్పాడు. అటు చారిత్రాత్మకం, ఇటు ఆధునిక విజ్ఞానం, మహామహుల జీవిత చరిత్రలు శోధించాడు.. *ప్రపంచాన్ని బంతిగాచేసి ఆడిస్తున్న క్రికెట్ మ్యాచ్ గురించి వ్రాసిన కవితలో సున్నితమైన హాస్యంలో కూడిన గొప్ప పాఠం భారతీయులకి నేర్పాడు.* భారత దేశంలో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదంటూ, క్రికెట్ బాట్‌కి శ్రీకృష్ణుడి చేతిలో వున్న మోహనవంశీకి నడుమ ఛేటాఛేటిగా సాగిన సునిసిత హాస్య సంభాషణ రూపంలో, భారతీయ ఆధ్యాత్మికత ముందు ఆధునికత తల వంచేలా చెప్పాడు. స్కూల్ ముఖమెరుగని అతను వైజ్ఞానిక సాంకేతిక పదాలను సందర్భోచితంగా అలవోకగా వాడడం చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది.

*"పద్మశ్రీ అవార్డ్ కోసం హేమాహేమీలు అనబడేవారంతా ఎంతో కసరత్తు చెయ్యవలసి వస్తోంది.. సమాజంలో గొప్ప పేరుప్రఖ్యాతులు కలిగి, ఎంతో గుర్తింపు పొందిన కళాకారులు, కవులు, ఏడు అంతస్తులనధిరోహించి, గొప్పగొప్పవారిచేత రికమండేషన్ చేయిస్తూ, లక్షల రూపాయిలు వెచ్చిస్తేనే కానీ పద్మశ్రీ అవార్డ్ లభించే అవకాశం లేదు అని ఒక మంత్రిగారు చెప్పారు.. కనీసం తల దాచుకోనేందుకు సరయిన గూడు, కూడు కూడా అంతంత మాత్రంగా వున్న మీకు ఈ పురస్కారం ఎలా లభించింది అని అందరు అవాక్కయ్యారు. ఇదెలా సంభవం అయింది? మీ కవితా సంకలనాలపై రిసెర్చ్ చేస్తున్నారని, వాటిని యూనివర్సిటీలలో సిలబస్‌గా పెట్టబోతున్నారని విన్నాము. దానిపై మీ స్పందన? మీరు కోరితే భారత ప్రభుత్వం మీకు అన్ని సౌకర్యాలు సమకూరుస్తుంది. కానీ ఫోటోలలో అతి పేదగా జీవితాన్ని సాగిస్తున్నట్టు కనిపిస్తోంది. మీ జీవన శైలి మార్చుకోవచ్చుకదా!"* ప్రశ్నించారు ఒకరు.

*"అసలు పద్మశ్రీ అవార్డ్ విషయంపట్ల నాకొక అవగాహన,*




రాష్ట్రపతి భవన్‌లో

*ఆసక్తి కూడా లేవు. దశాబ్దాలుగా నా కవితలను అభిమానించేవారు లక్షలాదిమంది వున్నారు. మీరు చెప్పినట్టు నా పుస్తకాలపై గవేషణ (రిసెర్చ్) కూడా జరుపుతున్నారట. వారంతా నా పేరుని సూచిస్తూ వేలాదిమంది సంతకాలు చేసి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ గారికి పంపితే వారు సాహితీవేత్తలతో పరిశీలించి, కేంద్రానికి పంపగా, అక్కడ కూడా పరిశీలించినమీదట నాకు అవార్డ్‌ని ప్రకటించారని చెప్పగా విన్నాను. ఇక గవేషణ విషయానికి వస్తే, ఏదో చెయ్యాలనుకుంటున్నారు, చేస్తున్నారు, వాటిపట్ల నాకు పెద్దగా ఆసక్తి లేదు. ఇక నా జీవన శైలి మార్చుకుందుకు ఏమీలేదు. నా ప్రస్తుత పరిస్థితి నాకు ఆనందాన్ని, శాంతిని ఇస్తోంది. సర్కార్ ఒక ఎకరం పొలం ఇచ్చారు. దానిపై వచ్చే తిండి గింజలు మా కుటుంబానికి చాలు. పదో పరకో వస్తే మిగిలిన ఖర్చులు పెట్టుకుంటాము. మీలాటి వారికి పాకెట్ నిండా డబ్బుకావాలి, సౌకర్యాలు కావాలి. నాకేమిటి కావాలి? తోటలో పెంచే మొక్కకి నీరుపోయ్యాలి, ఎరువు వెయ్యాలి. కానీ అడవిలో మొక్కకి నీరెవరు పోస్తారు? ఎరువులెందుకు..? అలాటి అడవి మొక్కని నేను. పెన్షన్ పేరుతో నెలకి వెయ్యి రూపాయలు వస్తాయి. నా పేరున అనాథపిల్లల స్కూల్ ఒకటి నెలకొల్పారు. యాభై ఒక్క మంది విద్యార్థులు వున్నారు. వెయ్యి రూపాయలు స్కూల్‌కి ఇచ్చేస్తుంటాను..”* అన్నాడు.. ఆ నిరాడంబరత, రుజువర్తన నిజమైన కవుల మూల ధనమని ఈ యుగంలో నిరూపించిన మరొక పోతన అనడంలో అతిశయోక్తి లేదు. చివరగా –

“కవులకి, రచయితలకు మీరిచ్చే సందేశం ఏమిటి?” అన్న దానికి

*“కవి కర్తవ్యం, దృష్టి రచనలు సృష్టించేవరకే పరిమితం అయి వుండాలి. పేరు ప్రఖ్యాతుల మీద, సన్మానాల మీద వుండకూడదు. గుర్తింపు, సన్మానం కవిని వెతుక్కుంటూ అతని వెనుక పరుగులు తీస్తూ రావాలి కానీ, కవి వాటి వెనుక పరుగులెత్తకూడదు. సాహిత్యాన్ని గౌరవించండి, అభిమానించండి. ఉత్కృష్ట సాహిత్యాన్ని సృష్టించుకుంటూ సాగిపొండి. రామాయణ, మహాభారతల్లాగా, వ్యాకరణాలులాగ ఏదో నాటికి అవి వెలుగు చూస్తాయి. అంతవరకు సహనంతో వేచివుండండి..”*

వసంతా గమనాన్ని సూచిస్తూ మావిచిగురు తొడగగానే అంతవరకూ ఎక్కడో దాగిన కోయిల గున్నమామిడి చెట్టు



‘హలధర నాగ్’

గుబురుల్లో చేరి, మావి చిగురు మేసి, చిగురు వగరుకి మత్తెక్కిన కుహుకుజితాలతో ప్రకృతికే శోభనిస్తుంది. తన ఆనందం కోసం తాను గళమెత్తి కూస్తుందే కానీ తననెవరో గుర్తించాలని, సన్మానించాలని, సత్కారాలు జరపాలని అనుకోదు, దానికా అవసరం లేదు. అసలు కోయిల ఎవరి కంట అయినా ఎప్పుడయినా పడుతుందా! దాని రుపురేఖావిలాసాలను ఊహించుకుంటూ మనుషులు ఊహాగానాలు చెయ్యడమే కానీ.. మనిషి అవసరం కోయిలకి లేకపోయినా, కవికోకిల, గాన కోకిల అంటూ లబ్ధప్రతిష్టులు కోయిల పేరుని తమ బిరుదులుగా వాడుకుంటారు. వసంత కోయిల ఆగమనంలా వసంతమాసారంభంలో జన్మించిన మరొక మానవ రూపంలోని ‘కవి కోకిల’ అతను.

ఆ కోకిలలాగే ఏమీ ఆశించని ‘కవి కోకిల’ హలధర నాగ్ కి, అతనిలోని మహోన్నత కవితా శక్తికి శిరస్సు వంచి నమస్కరిస్తూ.

**ఉమాదేవి అద్దేపల్లి**
**శాన్ హోసే, కాలిఫోర్నియా, అమెరికా.**
aurodhruti2020@gmail.com



జాన్ వెర్మీర్

# అట్టమీద బొమ్మలు

డెల్ఫ్ నగరం ఉత్తర నెదర్లాండ్స్‌లో ప్రధాన పట్టణం. అక్కడ రేనియరు జాన్‌సూన్ తన భార్య డైఫ్నాతో మిఖెలిన్ అనే పేరుగల ఇంట్లో నివసించేవాడు. అక్కడే ఒక హోటల్ నడిపేవాడు. కప్పా అనే సిల్కు వస్త్రముల వ్యాపారం కూడ చేసేవాడు. అతనిని 17 సంవత్సరాల వైవాహిక జీవితం తర్వాత జాన్ వెర్మీరు జన్మించాడు. జాన్‌సూన్ లలిత కళ చిత్రాల వర్తకుడు. (క్రీ.శ. 1631లో అంటే వెర్మీర్ పుట్టుటకు ఒక సం॥రం ముందు Guild of St. Luke ఆయనను Master Art Dealer గా రిజిస్టరు చేశారు. Art వ్యాపారాలన్నీ Guild regulation క్రిందకు వస్తాయి కాబట్టి ఈ రిజిస్ట్రేషనుకు ప్రాముఖ్యతవుంది.

వెర్మీరు జీవిత క్రమాన్ని తెలిపే వివరాలు లభించినవి చాల తక్కువ. క్రీ.శ. 1632లో జన్మించిన ఆయన డెల్ఫ్‌ను వదిలి ఎక్కడికీ వెళ్ళిన సూచనలు కూడ లేవు. క్రీ.శ. 5th ఏప్రిల్ 1653 లో తన 20 ఏళ్ళ వయసులో క్యాథరైన్ బొలెనాను పెండ్లాడాడు. భార్య దగ్గరలోని గౌడ (Gouda) నివాసి. వెర్మీరు కంటె ఒక సం॥ పెద్దది. భార్యాభర్తలు యిద్దరు Mechelen లో తలిదండ్రుల ఇంట్లోనే క్రీ.శ. 1672 వరకు వున్నారు. 29 డిసెంబరు 1653 A.D లో వెర్మీరు Guild of St Luke లో చేరాడు. దీని వల్ల ఆయన 'వృత్తి విద్యార్థి'గా క్రీ.శ. 1647 లో తన 15వ సం॥వ వయస్సు నుండి, ఆరు, ఏడు సంవత్సరాలు పనిచేసాడని రుజువు ఉంది. ఇక్కడ ఆయన గురువు Rembrandt శిష్యుడు కరేల్ ఫాబ్రిషియస్ (Carel Fatritius) వెర్మీర్ తన తండ్రి ఆర్ట్ వర్తకంలో భాగస్వామి అయ్యాడు. తండ్రి క్రీ.శ. 1655లో మరణించడం వల్ల ఈ భాగస్వామ్యం చాల రోజులు నడవలేదు. వెర్మీర్ దంపతులుగా నివసించిన 20 ఏళ్ళలో వారికి 11 మంది బిడ్డలు పుట్టారు.

క్రీ.శ. 1654లో 80,000 నుండి 90,000 పౌండ్ల శక్తిగల తుపాకి మందుపేలి వందల కొద్ది ప్రజలు మరణించడమే కాక, ఎన్నో భవనాలు శిథిలమయ్యాయి. క్రొత్తగా నిర్మించిన పెద్ద చర్చి కూడ నామరూపాలు లేకుండ పోయింది. ఈ పేలుడును Delft Thunder Clap అని వ్యవహరిస్తారు. ఈ పేలుడులో వెర్మీర్ గురువు Carel Fabritius తన కుటుంబంతో సహా భవన శిథిలాలు క్రిందపడి మరణించాడు Fabritius తో తన చిత్రం వేయించుకొనడానికి కూర్చొన్న ఒకడు కూడ అదే త్రోవన వెళ్ళాడు. ఆయన అకాల మరణానికి సంతాప సూచకంగా ఒక పుస్తక ప్రచురణ కర్త బాధపడుతూ వెర్మీర్‌ను గుర్తుచేస్తూ ఈ కవిత ప్రచురించాడు.

ఇంగ్లీషు : Thus the Phoenix was extinguished
To our loss at the height of his power.
But happily there arose from his fire
Vermeer, who followed his footsteps
with mastery.

తెలుగు : ఆ విధంగా మా ఆశలను నిరాశ చేస్తూ
ఉచ్ఛదశలో వున్న
ఫీనిక్సు (Phoenix) శాశ్వతంగా దూరమయి
పోయింది.
కాని ఆ జ్వాల నుండి ఆయన అడుగు జాడలలో
గొప్ప నేర్పుతో
సంచరించే వెర్మీరు (Vermeer) ఉద్భవించడం
ఆనందం.
(అరేబియా దేశపు ఎడారిలో ఐదు, ఆరు
శతాబ్దాలపాటు జీవించి తనంతటాను చితిలో
దహనమైపోతుంది ఫినిక్స్).

పై విషయాన్ని గమనిస్తే వెర్మీర్, ఫాబ్రిషస్ శిష్యుడేననే

ప్రేరణ కలుగుతుంది. నిస్సంకోచంగా. ఇద్దరి చిత్రకళా పద్ధతిలో కొన్ని పోలికలు వున్నాయి.

వెర్మీర్ వర్ణ చిత్రాలను ఇతర చిత్రాలతో పోల్చినప్పుడు ఎక్కువ ధర పలుకుతాయి. కాని అతడు మెల్లగ చిత్రించే పద్ధతి వల్ల, పెద్ద కుటుంబ పోషణ కోసం, తను కూడ చిత్రాలుకొని వ్యాపారం చేయడం వల్ల ఆయన ఎప్పుడూ, దారిద్ర్యంతో చింకి గుడ్డలతో వుండేవాడు.

చిన్న చిన్న విషయాలను గూడ లోపరహితంగా చిత్రించడమే వెర్మీరు చిత్రకళాకీర్తి రహస్యం. 'వెర్మీరుకు తను ఏమి చేయగలడో, ఎలా చేయగలడో అన్నది నిర్దుష్టంగా తెలుసు'.

వెర్మీరు చిత్రకళా కౌశలం ఎంత ఉత్సుకతను ప్రేరేపించేదంటే చాల కొద్ది సం॥రాలలో ఆయన పనిని గొప్ప నిపుణుల (Masters) సరసన చేర్చారు. ఆయన వర్ణచిత్రాలను అపూర్వ నిధి సరసన చేర్చబడ్డాయి. ఆయన 40 చిత్రాలు మాత్రమే వెలుగులోకి వచ్చాయి; ఇంకోటేదైన వెలికి వచ్చిందంటే వేలం మార్కెట్టును పిచ్చాసుపత్రిగ చేస్తుంది.

హాన్ వాన్ మీగెరెన్ (Han Van Meegeren) అనే డచ్ వర్ణ చిత్రకారుడు తనకు డబ్బు అత్యవసరమైన కాలంలో వ్యాపారులు తన చిత్రాలను తిరస్కరించారని, వారిపై పగతో 15 సం॥లు నిరంతరం శ్రమించి వెర్మీరు చిత్రాలను ఏ పాటి తేడా లేకుండా నకలు చిత్రాలు సృష్టించి దాదాపు ఇరవై లక్షల డాలర్లకంటే ఎక్కువే సంపాదించాడు. ఒక డచ్ విద్వాంసుడు మీగెరెన్ మోసాన్ని శాస్త్రీయంగా నిరూపించాడు. అయినా మీగెరెన్ 8 సం॥ల వరకు తన మోసాన్ని విజయవంతంగా కొనసాగించాడు. క్రీ.శ. 1945లో – రెండవ ప్రపంచ యుద్ధం అంత్యదశలో మీగెరెన్ డచ్ చిత్ర సంపదను నాజీలకు (NAZI- HITLER'S PARTY IN GERMANY) అమ్మడంలో సహకరించాడని ఫిర్యాదు చేయబడింది. తను వెర్మీర్ చిత్రాలను అనుకరించి చిత్రించనవే అమ్మడం తప్ప ఆయన మౌలిక చిత్రాలను కాదని వాదిస్తూ వారి ముందే ఒక వెర్మీరు చిత్రం తేడా లేకుండా చిత్రించి చూపాడు. రెండు చిత్రాలను Dr. Coremans, బెల్జియం మ్యూజియం ప్రధానాధికారి (Head of the central Laboratories of Belgium Museums) సిబ్బంది సమర్పించిన సాంకేతిక నేర్పు సాక్ష్యం ఆధారంగ వెర్మీరును అనుకరించాడని తీర్పునిచ్చాడు. దీనితో మీగెరెన్ ఆత్మ విశ్వాసంతో మరెన్నో అనుకరణ చిత్రాలు వేసి డబ్బు చేసుకున్నాడు.

ధైర్యం, ఆత్మవిశ్వాసం పెరిగిన కొద్ది తప్పుచేసేవాడు తన సొంత పొరబాటుతో పట్టుబడడం ఆశ్చర్యమేమీ కాదు. మీగెరెన్ విషయంలో ఇదే జరిగింది. క్రీ.శ. 17వ శతాబ్దంలో వేటాడే పద్ధతి చిత్రాలు కాన్‌వాస్ పై అసమగ్రంగ చిత్రించాడు. మితిమీరిన ఆత్మవిశ్వాసంతో కావచ్చు, మీగెరెన్ ఆ కాన్‌వాస్‌ను శుభ్రం చేయకుండా దానిపై వెర్మీరు, Last supper ను చిత్రించాడు. ఆ సమయంలో ఒక వ్యాపారస్తుడు ఒక పాత కాన్‌వాస్ ఫొటోగ్రాఫ్‌ను చూపిస్తూ మూల చిత్రాన్ని తనకు అమ్మినట్టు సాక్ష్యమిచ్చాడు. తర్వాత Radiograph ద్వార పరీక్షిస్తే మీగెరెన్ కొన్న పాత చిత్రఛాయలు ఆ నకిలీ చిత్రంలో స్ఫుటంగా కనిపించాయి. శత్రువులతో చేరి కుట్రపన్నాడన్న ఆరోపణపై మీగెరెన్‌ను బంధించారు. వెర్మీరు సంతకం చేసిన అయిదవ చిత్రం అసలుది (original) 'Women taken in Adultery' వర్ణ చిత్రాలు సేకరించే అలవాటుగల నాజీనాయకుడు హెర్మన్ గోరింగుకు అమ్మడం వల్ల మీగెరెన్ దొరికిపోయాడు. దాదాపు రెండువందల డచ్ వర్ణచిత్రాలను యుద్ధకాలంలో నాజీలు దోచుకున్నారు. ఆ చిత్రాలన్నిటినీ రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత సేకరించారు. మీగెరెన్‌ను ఆరు వారాలు జైలులో వుంచిన తర్వాత అద్దె ఇంటికి తరలించారు. ఆ అద్దె ఇంటిలో అధికారుల కొరకు 'Jesus amongst the Doctors ను చిత్రించాడు. ఈ చిత్రాన్ని చిత్రించడానికి వర్ణ ద్రవ్యాలను (Pigments) క్రీ.శ. 17 శతాబ్దం చిత్రకారులు నూరినట్లే నూరేవాడు. నాజీలు నెదర్లాండ్‌ను ఆక్రమించు కొన్న తర్వాత ఎవరు కూడ బయటకు రావడం మనేశారు. వారి వద్ద వున్న అసలు చిత్రాలు భద్రంగా దాచుకున్నారు. అసలు చిత్రాలు దొరకనపుడు మీగెరెన్ అనుకరణ చిత్రాలకు గిరాకి లభించింది. హిట్లరు దగ్గర వెర్మీర్ అసలు చిత్రాలు రెండు వుండేవి. చిత్రకళాప్రియుడైన Herman Goering కూడ తన నాయకునివలె వెర్మీరు అసలు చిత్రాలు సంపాదించాలనుకున్నాడు. అందువల్ల గోరింగు వెర్మీరు అసలు చిత్రమనుకొని మీగెరెన్ అనుకరణ చిత్రం ఒకటి కొన్నాడు. యుద్ధము ముగిసిన తరువాత వెర్మీరు అసలు చిత్రాలు ఆరు మాత్రమే దొరికాయి. విచారణ జరిపి మీగెరెన్‌కు ఒక సం॥ము కఠిన కారగార శిక్ష విధించారు. కాని ఆయన జైలుకు వెళ్లక ముందే మరణించాడు.

మళ్లీ మనము వెర్మీరు జీవిత చిత్రణకు వద్దాం. ఆయన చిత్రాలు ఎంత అరుదైనవో, ఆయన చిత్రించిన చిత్రాల కౌశలం ఇంకా అరుదైంది. సాంకేతికంగా చెప్పాలంటే వెర్మీరు కేంద్రీకరించిన గొప్ప పరిశీలనతో చిత్రించాడు. ఆయన తన మోడల్‌ను చూస్తాడు. ఏ విధంగా? చిత్రంపై వెలుగునీడలు ప్రసరించే పద్ధతి పరీక్షించడం, అత్యంత వెలుగు, లోతైన చీకటి నుండి ప్రకృతి సాంద్రతలోని హెచ్చుతగ్గులు గ్రహించి, అప్పుడు అవసరమైన రంగుల సమమిశ్రమంతో తన బ్రష్‌కు పని చెబుతాడు. ఒక వెయ్యిమందికి తక్కువ కాకుండ డచ్ వారు ఇదే ప్రయోగం చేశారు. వెలాక్వెజ్ (Velaquez) కూడ పెద్ద ఎత్తున ఎక్కువ ఆకర్షణీయ మోడల్సును విస్తృతంగా చిత్రించాడు. వీరందరూ వెర్మీరు కంటే ఆర్భాటంగా, అద్భుతమైన ప్రకృతి సంబంధమైన చిత్రాలు సృష్టించారనడంలో సందేహం లేదు.

వెర్మీరు వివిధరంగు పదార్థాలను సరైన నిష్పత్తిలో శ్రద్ధగ నూరి ఆ మిశ్రమానికి నీలం, పసుపుపచ్చరంగుల మేళవింపుతో స్వచ్ఛమైన చల్లని నీటి ఉపరితలం పైకి ఏనుగు దంతపు మెరుగు గల పింగాణీ రూపు తెప్పిస్తాడు. ఆయన మిశ్రమ రంగులు తయారు చేసే పద్ధతిని, ప్రకృతికాంతి తనకు తానే నేర్పుతో తన వివిధ రంగులను స్పటికంవలె ఘనీభవింపచేసిందని నమ్ముతారు. పై పద్ధతిలో వెర్మీరు చిత్రించిన Milk Maid చిత్రం డచ్ సామాజిక జీవన వ్యవస్థను అనిర్వచనీయమైన శ్రేష్టతతో కనువిందు చేయడమే గాక అద్భుతమైన ఉపరితల చిత్రణలో కళాఖండం యొక్క రచనా విన్యాసాన్ని విలువైన వస్తువని సూచిస్తుంది.


వెర్మీరు చిత్రకళను, ఒక చిన్న పనిని అందంగా చేశాననుకున్నాడే కాని Michalangelo లాగ విస్తారమైన తత్త్వశాస్త్రానుకరణ అని తలంచలేదు. చిత్రంలో సహజమైన కాంతి లక్ష్యం సాధించగల గొప్ప కళాకారుడు కాబట్టి వెర్మీరు లెక్కించదగని చిన్న చిత్రాలను శాశ్వతమైన ఉన్నత అంతస్తుకు చేర్చాడు. ఆయన తన మనస్సులో ఆలోచించి స్పృశించే తత్త్వం ప్రాథమిక విషయాలమీదే. ఆయన తొలినాటి రచనలు – ఒక పటము లేక చిత్రం తన పెంకుటింటి గదిలో బూడిదరంగు గోడకు వ్రేలాడుతూ వుంటాయి. అందులో ఒక పటం కుటుంబ వంటగది అమ్మిన డబ్బుతో కొన్నాడు. ఎడమ వైపు ఒక కిటికీ, మధ్యలో ఒక బల్ల వద్ద ఒక స్త్రీ నిలబడి పాలు కాస్తూవుంది, లేదా ఒక ఉత్తరం చదువుతూ వుంది.

ఆయన లోపరహిత చిత్రణకు ఉదాహరణ. The letter చిత్రంలో రెండు రూపాలు – నడవగుండా కనిపించే లోపలి గదిలోకి ఒక యవతి బహుశ ఒక ప్రేమలేఖ అందిస్తూ వుండవచ్చు, కాకపోతే సంశయించే భర్తనుండి తెచ్చిన చీటి లేదా జిల్లా న్యాయాధికారి హెచ్చరిక కావచ్చు. కష్టసాధ్యమైన సంతృప్తి సర్దుబాటులో వర్ణఛాయ చిత్రణలో వెలాక్వెజ్ ఒక్కడే వెర్మీరుకు సమానుడు. అయితే మనసులోని సున్నిత భావ రూపాన్ని నిర్మల వ్యవధానంలో వ్యక్తం చేయడంలో ఈ Spaniard Velaquez రెండో ఉన్నతుడుగ నిలుస్తాడు.

వెర్మీరు వర్ణ చిత్రకళ ఎన్నాళ్ళు చేశాడో ఎప్పటికి తెలిసేటట్టు లేదు. కాని అది నెలల కొద్ది కాంతి ప్రసరణపై వేసిన పరిశోధనాత్మకతతో ఒక తలను మాత్రమే గోడ వెనుక భాగం నుండి వేరు చేయడం – అది కూడ పోస్టలు స్టాంప్ (Postal stamp) పరిమాణం కంటే ఎక్కువ లేదు. ఆయన నేర్పు విశ్లేషణకు అందదు. ఒక రచయిత అంటాడు – కాంతి పరివర్తన తీవ్రతను గది అంతటా పరిశీలించడానికి అద్దాలను ఒక క్రమ పద్ధతిలో అమరించి ఏ కోణం నుంచైనా గమనించడానికి ఏర్పాటు చేసుకుంటాడు. అతని బల్లమీది ఆచ్ఛాదనం, వస్తువుల అమరిక పూర్తి సమతల ప్రతికృతి, దృష్టిని ఆకట్టుకుంటాయి. ఇది చిత్రించిన భ్రమ కాదు, నిజంగా వస్తువులు పసుపు, గోధుమ వెన్నతో మెరుస్తాయి.

వజ్రాన్ని సానపట్టేవాడు తన చేతిపనిని ఎంత గొప్ప సామర్థ్యంతో పనిచేస్తాడో, ఒక రత్నవర్తకుడు తన శక్తి యుక్తులతో రత్నాలను ఒకటొకటే కూర్చి ఒక కాంతివంతమైన, ఖరీదైన వస్తువుగ మలుస్తాడో అదే విధంగా వెర్మీరు ద్రవ రూపంలోని రంగు చుక్కలను ఒకటొకటిగ జతజేసి రత్నసమాన చిత్రాన్ని నిర్మిస్తాడు.

వెర్మీరు తలపులో తన చిత్రకళకు చిన్న హక్కు మాత్రమే కోరుకున్నాడు. విస్తారమైన, వికాస చిత్రికలపై ఆయన ఎప్పుడు ప్రత్యక్ష ప్రయత్నం చేయలేదు.




కోడూరు పుల్లారెడ్డి
ఫోన్ : 955 081 8495




"పంట పోయింది..."
'................'
"కాంట్రాక్టు ఎయ్యి, బువ్వ తినాలిగా..."
'.....................'
మావుళ్ళయ్య పాటందుకున్నాడు.
తలెత్తి చూశాను.
ఎండిన బోదిలా ఉన్నాడు.
గొంతులో జీర ఎక్కువైంది.
'సరేలే – కాంట్రాక్టు వేద్దాం...'
"చల్లని తల్లి, చల్లగ ఉండాలి..."

వారం రోజులు – ఎరువుల బస్తాలో రెండు కిలోలు ఎర్రమిరపకాయలు.
"ఇదిగో – ఒక కిలోకి డబ్బులివ్వు – ఇంకో కిలో ఉంచుకో."
రెండు కిలోలకు డబ్బులిచ్చి పంపాను.

ఎర్రని మిరప – ఎండిపోయింది – విత్తనాలు కుండీలో వేసి, నీరుపోశాడు నా పెనిమిటి.
మట్టిని చీల్చుకుని మొక్క పొడుచుకొచ్చింది.
మూడు నెలల్లో, ఎర్రని మిరప పచ్చని మొక్కకు వేలాడుతున్నాయి. తుంచి పోపులో వేశాను, తొక్కి పచ్చడీ చేశాను.
మావుళ్ళయ్య పాటలు – కాంట్రాక్టుతో రికార్డు చేయించాను. ఏడాదిలో ఇరవై వేలు ముట్టజెప్పాను.
ఒకరోజున ఎర్రని అంచు పచ్చని నేత చీర – తెచ్చాడు.
'ఎందుకు?'
"దసరాకు దుర్గమ్మకు సీర బెట్టరా?"
'సరే కనకదుర్గ కొండకు పంపుతాలే–
'నీ కొడుకు పాడతాడా?'
'వాడికి పాట నేర్పినా – కాని ఉజ్జోగం చేస్తాడంట! అరే, పాట వదలొద్దురా – ఏ తల్లయినా అన్నంబెట్టుద్దురా అని చెప్పినా..'

ఎండలు మండిపోతున్నాయి.
కుండీలో మిరపమొక్క వడగాలికి విలవిల్లాడింది.
మా తమ్ముడు, ఇంజనీరింగ్ – ఈరోజే వచ్చాడు.
సాయంత్రం సంగీత కచ్చేరీకి వెళ్ళినప్పుడు వాడు 'కిండిల్' వెలిగిస్తున్నాడు
వచ్చి చూస్తే, మిరపమొక్క పీకి ప్రక్కన పడేసి ఉంది. 'అక్కా – ఎండిపోయిందిగా.'

మర్నాడు మావుళ్ళయ్య కాంట్రాక్టు ముగిసింది.
గొంతు మూగబోయింది.

నా పెనిమిటి ఆ మొక్కనే కత్తిరించి, మళ్ళీ కుండీలో పెట్టి నీళ్ళు పోశాడు. వాడి, ఎండి – మెల్లగా చిగురేసింది.
తర్వాత ఎర్రని మిరపకాయ ఉదయకాంతిలో మెరిసింది.
రేడియోలో 'ఉదయరేఖలు' ప్రోగ్రాంలో మావుళ్ళయ్య పాట వినబడుతోంది.

-ఎ.కె.

(ఒక రైతు ఆత్మహత్య ఆగిపోయింది.)

# నేనెరిగిన చంద్రాపూర్

– కొసరాజు వెంకటేశ్వరరావు

1965లో కేంద్ర పురావస్తుశాఖలో అన్వేషణ సహాయకునిగా ఉద్యోగంలో చేరిన ఈ వ్యాసకర్త 1968లో చంద్రాపూర్ జిల్లాలో ఉన్న పురావస్తు అన్వేషణ కోసం రాజూరాకు బదిలీ చేయబడి ఆ తాలూకాలో ఉన్న పురావస్తు అవశేషాలను రికార్డు చేసి 1971లో కర్నూలుకు బదిలీ చేయబడ్డారు. అక్కడి ప్రజల స్థితిగతులను, తన అనుభవాన్ని ఈ వ్యాసంలో వివరిస్తున్నారు.

భారత ప్రభుత్వం కేంద్ర పురావస్తుశాఖను అనేక సర్కిల్స్‌గా విభాగించి, విశాఖపట్నం కేంద్రముగా South-Eastern circle ను ప్రారంభించారు. ఈ సర్కిల్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాలు కాక మహారాష్ట్రలో ఉన్న చంద్రాపూర్ మధ్యప్రదేశ్‌లో ఉన్న బిలాస్‌పూరు, రాయపూరు బస్తరు, దుర్గ్ జిల్లాలు కూడా ఉండేవి. 1964లో ఆ సర్కిలు కార్యాలయాన్ని హైదరాబాద్ కేంద్రంగా బదిలీ చేశారు. నేను 1965 డిసెంబరు నెలలో అన్వేషణ సహాయకునిగా (Exploration Asst) హైదరాబాద్ కార్యాలయంలో ఉద్యోగంలో చేరాను. నాకు ముందు ఇదే ఉద్యోగంలో ఉన్న శ్రీ మేకా శివయ్యగారు మెదక్ జిల్లాలో ఉన్న అన్ని తాలూకాలు తిరిగి ఆయా గ్రామాలలో ఉన్న పురావస్తు అవశేషాలను D-Form ద్వారా రికార్డు చేశారు. నారాయణ ఖేడ్ తాలూకాలో కొన్ని గ్రామాలు వెళ్ళలేకపోయారు. ఆరోగ్య కారణాలరీత్యా శివయ్య గారు ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ ఖాళీలో నన్ను నియమించారు. నన్ను నారాయణ ఖేడ్ తాలూకాలో మిగిలి ఉన్న గ్రామాలు సర్వేచేసి పురావస్తు సంపదను రికార్డు చేయమని మా అధికారి ఆదేశించగా నేను 1966, 67, 68 సంవత్సరాలలో ఆ గ్రామాల సర్వే పూర్తిచేసి ఆ రిపోర్టును సర్కిలు కార్యాలయానికి అందించాను. అప్పటికే చంద్రాపూర్, బిలాస్‌పూర్ జిల్లాల సర్వేను శ్రీ L.K. శ్రీనివాసన్, శ్రీ బొప్పన రాజారావుగార్లు చేపట్టారు. శ్రీనివాసన్ చంద్రాపూర్‌జిల్లా సర్వే నిర్వహిస్తూ ఉండగా 1968లో పదోన్నతిపై ఢిల్లీ వెళ్ళిపోయారు. అందువలన ఆ జిల్లాలో ఉన్న మిగిలిన గ్రామాల సర్వే త్వరగా పూర్తిచేయమని, నన్ను రాజారామూనిక్ గడ్ తాలూకాకు, నా సహోద్యోగులు D. హనుమంతరావును బ్రహ్మపురి తాలూకాకు, బ్రిజేంద్రకుమార్ సిన్హానం గడ్చిరోలి తాలూకాకు బదిలీ చేశారు. చంద్రాపూర్‌లో అప్పటికే మా కార్యాలయం ఉంది కనుక వారిద్దరూ చంద్రాపూర్‌లో చేరగా నేను ముందుగా రాజూరా వెళ్ళి పిరోజ్ షా రుస్తోంజీ గారి పెంకుటింటిని కిరాయికి మాట్లాడుకుని నెల అద్దె ఆరువందలు నిర్ణయించి, మా కార్యాలయంవారి అనుమతితో నా కార్యాలయాన్ని 1968ఓ రాజూరాలో ప్రారంభించాను. మా భవన యజమాని రుస్తోంజీ (పార్శీ) నిజాం కాలంలోనే ఆ ఊరిలో భూములు కొని, ఆ పొలంలోనే చిన్న ఇల్లు నిర్మించుకుని అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని తన కుటుంబంతో ఉంటున్నాడు. ఆ కుటుంబానికి తోడుగా మేము కూడా వస్తున్నందుకు సంతోషించి తన ఇంటిని తక్కువ ధరకే మాకు కిరాయకు ఇచ్చాడు. నా కార్యాలయం బస్టాండు దగ్గరలో ఉండేది. రాజూరా నుండి ఆసిఫాబాద్ (ఆదిలాబాద్ జిల్లా) వెళ్ళాలంటే ఉదయం, సాయంత్రం మాత్రమే ఆంధ్రా బస్సు ఉండేది. కాని చంద్రాపూర్ వెళ్ళాలంటే మహారాష్ట్ర బస్సులు చాలా ఉండేవి. రాజూరా, చంద్రాపూర్‌ల మధ్య దూరం 35 కిలోమీటర్లే అయినా ప్రయాణకాలం బల్హార్షా ద్వారా గంటన్నర సమయం పట్టేది.

నా వివాహం విజయలక్ష్మితో 1967లో జరిగింది. 1968లో మా పెద్దమ్మాయి (సంధ్య) జన్మించింది. మా అధికారులు నన్ను వెంటనే రాజూరా వెళ్ళి గ్రామాల సర్వే మొదలుపెట్టాలని ఆదేశించారు. ఆ రోజుల్లో చంద్రాపూర్ వెళ్ళాలంటే దక్షిణ ఎక్స్‌ప్రెస్ అనే రైలు మాత్రమే ఉండేది.

కానీ ఆ రైలు మానిక్‌గడ్ స్టేషన్లో ఆగదు కనుక నేను హైదరాబాద్ బల్హార్షా ప్యాసింజరు రైలులో టికెట్లు రిజర్వేషను చేయించుకుని రాజూరా ప్రయాణానికి సిద్ధమైనాను. మేము పరాయి రాష్ట్రం వెళ్ళిపోతున్నామని మా స్వగ్రామమైన మాధవనగరం (నిజామాబాద్ జిల్లా) నుంచీ నా తల్లిదండ్రులు, నా స్నేహితుడు విజయశంకర్ (స్వర్గీయ డా. పల్లా దుర్గయ్య, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖాధిపతి గారి కుమారుడు) మేము ప్రయాణం చేయబోయే రైలువద్దకు (సికింద్రాబాద్) వచ్చి, మాకు కన్నీటి వీడ్కోలు ఇచ్చారు. నేనుకూడా మొదటిసారి రాష్ట్రం వదలి భాష తెలియని రాష్ట్రానికి వెళ్ళిపోతున్నందుకు నా హృదయం బరువెక్కింది. రైలు కదిలేంతవరకు మేము ధైర్యంగానే ఉన్నా రైలుస్టేషను నుంచి కదలగానే నేను, నా శ్రీమతి భోరున ఏడ్చాము. అప్పుడప్పుడే తెలంగాణా ప్రత్యేక రాష్ట్రం కావాలని డా. చెన్నారెడ్డిగారి నేతృత్వంలో తెలంగాణా ప్రజాసమితి నాయకులు, కార్యకర్తలు పలు ఆందోళనలు చేయటం ప్రారంభించారు. నేను, నా శ్రీమతి, మా 4 నెలల కూతురు కొద్ది ఇంటి సామానుతో సెకండ్‌క్లాసు కూపే (ఆ రోజుల్లో ఉండే క్లాసు)లో ప్రయాణించాం. మా రైలు భోనగిరి స్టేషను దాటిన తరువాత మా సామాన్ల భద్రతకోసం మేము ప్రయాణిస్తున్న కూపే తలుపు మూసివేచి బరువెక్కిన గుండెలతో నిద్రలోకి జారుకున్నాం. ఆ రోజు (1969 జనవరి 19వ తేది) ప్రజాసమితి రైల్ రోకో ఉద్యమాన్ని మొదలుపెట్టి, మా రైలు ఆలేరు స్టేషన్లో ఆగినప్పుడు ఒక గుంపుగా వచ్చిన కార్యకర్తలు మూసి ఉన్న మా కూపే తలుపుని తెరవమని కర్రలతో తలుపుని బాదటం మొదలుపెట్టారు. నేను వెంటనే నిద్రనుంచి తేరుకని కిటికీలో నుండి ప్లాటుఫారంవైపు చూడగా కర్రలు చేతిలో ఉన్న అనేకమంది ఉద్యమకారులు జై తెలంగాణా అని అరుస్తూ "తలుపు తీయ్, ఎందుకు బందు చేసినవ్" అంటూ మా పెట్టెముందు గుమిగూడారు. మనమూ తెలంగాణావారిమే కదా. ఉద్యమకారులు మననేమీ చేయరులే అనే ధైర్యంతో నేను తలుపు తీద్దామని లేవగానే నా శ్రీమతి నా చేయి గట్టిగా పట్టుకుని వద్దండీ మన సామానంతా లూటీ చేస్తారు అని భయంతో నన్ను వారించింది. మా రైలు జనగాం స్టేషను చేరేముందు నేను మా కూపే తలుపుతీసి, అక్కడే నిల్చుండగా రైలు ఆగగానే కొందరు మా కంపార్టుమెంటు వద్దకు పరుగెత్తుకుంటూ, వచ్చి "నీవు తెలంగాణోడివేనా, యాడికిపోతున్నావ్" అని నన్ను నిలదీశారు. "అన్నా, నేను మీ తెలంగాణోడినే. మాది నిజాంబాదు జిల్లా" అని నేను కేంద్ర పురావస్తుశాఖలో ఉద్యోగినని బదిలీపై చాందా వెళ్తున్నామని చెప్పగా, ఆ గుంపులో కొందరు "అరే, ఈడు మనోడేరా కుటుంబంతో ప్రయాణం చేస్తుండు. ఈనిని వదిలేద్దామురా" అని అనుకుంటూ ముందు భోగీలవైపు వెళ్ళిపోయారు. అప్పటికి సాయంత్రం ఆరుగంటలు అయింది. ఆ తరువాత మా భోగీవద్దకు ఏ ఉద్యమాకారుడూ రాలేదు.

రేపల్లె (గుంటూరు జిల్లా)కు చెందిన నా శ్రీమతి ఊపిరి పీల్చుకుంది. మేము జమ్మికుంట స్టేషను దాటిన తరువాత మా వెంట తెచ్చుకున్న భోజనం చేసి, నిద్రలోకి జారుకున్నాం. నేను అంతకు ముందే ఆ రూటులో ప్రయాణించాను కనుక సిర్పూర్ టౌన్ దాటిన తరువాత ఆంధ్రా సరిహద్దు దాటగానే మానిక్‌గడ్ స్టేషను కోసం ఎదురుచూస్తూ మేలుకునే ఉన్నాను. మా రైలు తెల్లవారుఝామున 4 గంటలకు ఆ స్టేషన్ చేరుకోగానే మా సామానంతా క్రిందికి దింపి, రైలు వెళ్ళిపోగానే భద్రతకోసం ఆ సామానును స్టేషను మాష్టరు గారి గదిముందు పేర్చి, నా శ్రీమతిని, మా కుమార్తెను ఆ సామాను ప్రక్కనే కూర్చోబెట్టాను. ఆ ప్రక్కనే పత్తిసంచులు కూడా పేర్చి పెట్టబడి ఉన్నాయి. అప్పుడు బాగా చలివేస్తున్నందున మా అమ్మాయి ఆ చలికి తట్టుకోలేక గుక్కపట్టి ఏడ్వటం మొదలుపెట్టింది. వెంటనే ఆ ఏడుపు విని, స్టేషనుమాస్టరు (పేరు హనుమంతరావు, బందరు) మేము కూర్చున్నచోటుకు వచ్చి "ఆప్‌కో కహాజానా హై" అని అడిగాడు. నేను నా పేరు, చేస్తున్న ఉద్యోగం పేరు చెప్పి రాజూరా వెళ్ళాలని చెప్పగా ఆయన "మీరు తెలుగువారా" అని ఆశ్చర్యపోయి "మీ పాప ఇక్కడి చలికి తట్టుకోలేక బాగా ఏడుస్తున్నదికదా, లోపల నా గదిలో కూర్చోండి అక్కడ అంత చలిలేదు" అని అన్నాడు. ఆయన ఆహ్వానానికి, తెలుగువారంటే ఆయనకున్న అభిమానానికి కృతజ్ఞత తెలియచేసి, నా శ్రీమతిని పాపతోసహా స్టేషను మాస్టరు గదిలో కూర్చోమని చెప్పినప్పటికీ కొత్త మనిషి గదిలో కూర్చోవటానికి నా శ్రీమతి అంగీకరించలేదు. నేను కూడా వారితోపాటు వస్తేనే ఆ గదిలోకి వెళ్ళి కూర్చోవటానికి నా శ్రీమతి సంసిద్ధత వ్యక్తం చేసింది. కాని మా ఇంటి సామాను ప్లాట్‌ఫారంపై వదలి వెళ్ళటం నాకు ఇష్టం లేక మా ఇద్దరి మధ్య మా అమ్మాయిని పడుకోబెట్టి రగ్గు కప్పుకుని, తెల్లవారేవరకు అక్కడే

కూర్చున్నాము. తెల్లవారిన తరువాత హనుమంతరావుగారే ఒంటెద్దు బండిని మాట్లాడి, తన కూలీలతో మా ఇంటి సామాన్లు ఆ బండిలో సర్దించి, నాకు ఎంతో ఉపకారం చేశారు. ఆ బండి వెనుక భాగంలో నా శ్రీమతిని, మా అమ్మాయిని కూర్చోబెట్టి, నేను నాతోపాటే హైదరాబాద్ నుంచీ రైలులో తెచ్చిన సైకిలుతో సహా మానిక్‌గడ్ స్టేషనుకు రెండుమైళ్ళు దూరంలో ఉన్న రాజూరా చేరుకుని నా కార్యాలయంలో ప్రవేశించాము. రాజూరాకు తూర్పువైపున పెద్ద చెరువు ఉన్నది. నా కార్యాలయం చెరువుకట్ట దిగువన మెయిన్ రోడ్డు దగ్గర్లో ఉండేది. రోడ్డు ప్రక్కనే కొన్ని తినుబండారాల హోటళ్ళు ఉండేవి. ఒక హోటలులో పనిచేస్తున్న వెంకట్ (సికింద్రాబాద్ నివాసి) తెలుగువాడే కావటంతో ఆయన మాకు చాలా సహాయకారిగా ఉండేవాడు. నేను ఊరిలో లేకున్నా మా కుటుంబపు మంచి చెడులు పట్టించుకుంటూ ఉండేవాడు. రాజూరా 1959కు పూర్వం ఆదిలాబాద్ జిల్లాలోనే ఉండేది. అందువలన ఈ తాలూకాలో తెలుగువారే కాక తెలుగు అర్థం చేసుకునే ఆదివాసీలు (ముఖ్యంగా గోండులు లేక కోయలు) ఎక్కువగానే ఉండేవారు.

ఇక పోతే జిల్లా కేంద్రమైన చంద్రాపూర్ లేక చాందాను గురించి తెలుసుకుందాం. చంద్రాపూర్ $19.50^0$ ఉ., $79.18^0$ తూ అక్షాంశ రేఖాంశాలమధ్య సముద్రానికి 189.90 మీ ఎత్తులో ఉన్నది. ఇది మహారాష్ట్రలోని విధర్భ ప్రాంతంలో ఉన్న ముఖ్యమైన జిల్లా. చాందా అసలుపేరు లోకాపూర్, తరువాత అది ఇందుపురంగా, ఆ తరువాత చంద్రాపూర్‌గా పిలవబడింది. ఈ ప్రాంతం 1853లో బ్రిటీషువారి ఆధీనంలోకి రాగా వారు దీనిని చాందాగా వ్యవహరించేవారు. గోండు రాజైన ఖందఖ్య బల్లాల్‌షా 13వ శతాబ్దంలో చంద్రాపూర్ పట్టణాన్ని నిర్మించి, ఆ పట్టణంలో పెద్ద కోటను నిర్మించాడు. ఈ కోటకు నాలుగు ముఖ్య ద్వారాలు (జత్పురా, అంచలేశ్వర్, పఠాన్‌పురా మరియు బింబాగేట్లు) మరియు నాలుగు చిన్న ద్వారాలు (మరాఠీలో కిడ్కీలు) బాగాద్, హనుమాన్, విఠోబా, చోర్ కిడ్కీలు ఉండేవి. ఈ పట్టణం వైశాల్యం 70 చ.కి.మీ. చంద్రాపూర్ (చందు నివూరు) పట్టణంలో కాళికంకాలి (మహాకాళి) అంచలేశ్వర (పరమశివుడు) దేవాలయాలు ఉన్నాయి. ఈ పట్టణం జార్పట్ మరియు ఇరాయ్ ఉపనదుల మధ్య నిర్మించబడింది. జార్పట్ నది ఒడ్డున ఉన్న అంచలేశ్వర దేవస్థానం ఆవరణలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన గోండు రాజుల సమాధులు ఉన్నాయి. ఈ పట్టణం జార్పట్ మరియు ఇరాయ్ ఉపనదుల మధ్య నిర్మించబడింది. నది ఒడ్డున ఉన్న అంచలేశ్వర దేవస్థానం ఆవరణలో ఈ ప్రాంతాన్ని పరిపాలించిన గోండు రాజుల సమాధులు ఉన్నాయి. ఈ జిల్లాలో బొగ్గునిక్షేపాలే కాక, సున్నపు రాయి విరివిగా ఉన్నది. అందువలననే బొగ్గు గనులేకాక సిమెంటు ఫ్యాక్టరీలు అనేకం ఉన్నాయి. ఈ జిల్లాను వెయిన్‌గంగ (గోదావరి ఉపనది) తన నీటితో సారవంతం చేసింది. గోండు రాజులు ఈ ప్రాంతాన్ని 1951 వరకు పరిపాలించగా మరాఠా రాజులు 1853 వరకు పరిపాలించారు. ఆ వంశంలో చివరి రాజైన రఘూభోంస్లేకు సంతానం లేకపోవటంతో ఈ ప్రాంతం బ్రిటీషువారి ఆధీనంలోకి వెళ్ళింది. చాందా 1854లోనే జిల్లా కేంద్రం అయింది. మూల్, వరోరా, బ్రహ్మపురి, సిరోంచా, గడిరోలి (ఇది 1981లో ప్రత్యేక జిల్లా అయింది) తాలూకాలు. భాషారాష్ట్రాల విభజన తరువాత ఈ జిల్లా 1956లో మధ్యప్రదేశ్ నుండి బొంబాయి రాష్ట్రానికి మార్చబడింది. 1960 నుండి బొంబాయి రాష్ట్రం మహారాష్ట్రగా పిలవబడింది. చంద్రాపూర్ జిల్లాలో చంద్రాపూర్, బ్రహ్మపురి, వరోరా, చిమూర్, గోండ్, పిప్రి, పొంబుర్ణా, సోలి, రాజూరా, కోర్పణ, జవటి, బల్హార్షా తాలూకాలుగా ఉన్నాయి. 2011 నాటి జనాభా లెక్కల ప్రకారం ఈ జిల్లాలో 320379 జనాభా ఉన్నారు. ఈ జిల్లాలో దట్టమైన అడవులు ఉన్నాయి. ఈ జిల్లాలో అనేక వేల తెలుగువారు అనేక సంస్థలలో ఉద్యోగాలు చేస్తూండగా ఇంకా కొందరు వ్యాపారాలు, వ్యవసాయం నిర్వహిస్తున్నారు. రైల్వే (బల్లార్షా డివిజన్)లో బొగ్గుగనుల్లో, సిమెంటు ఫ్యాక్టరీలలో, బల్లార్షా పేపరు మిల్లులో, భద్రావతిలో ఉన్న Ordnance Factory, తపాలాశాఖ, జీవితభీమా, బ్యాంకులలో అనేకమంది తెలుగువారు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ తమ స్వరాష్ట్రానికి తెలుగు జాతికి మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెడుతున్నారు. వీరేకాక రాజూరా తాలూకాలో ఉన్న లక్కడకోట అనే గ్రామంలో ఉన్న తెలుగు రైతులు తమ గ్రామం చుట్టూ ఉన్న బీడుభూముల్ని సాగుచేసి ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలంగా చేసి జిల్లాలోనే ఆదర్శ రైతులుగా మహారాష్ట్ర ప్రభుత్వంచే గుర్తింపబడటం తెలుగువారికి గర్వకారణం. వీరు స్థానిక రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను నేర్పించి, ఆ

ప్రాంతపు రైతుల మన్ననలు పొందారు.

వేము రాజూరా చేరిన కొద్దికాలంలోనే నాకు అనేకమంది (తెలుగువారే కాక, మరాఠీ, కన్నడ, మళయాళీ, మార్వాడీ, గుజరాతీలు) మంచి స్నేహితులు అయ్యారు. రాజూరాలో తహశీల్‌దారుగా ఉన్న చంద్రప్రకాష్ హైదరాబాద్ వాస్తవ్యుడే. ఆయన నిజాయితీకి మారుపేరు. నన్ను పంచాయితీ అధ్యక్షుడు ఆయనకు పరిచయం చేయగా నేను నిజాంబాద్ జిల్లా వ్యక్తిని కావటంతో ఆయన నేనంటే చాలా ఇష్టంగా ఉండేవాడు. తను అధ్యక్షునిగా ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌కు నన్ను కార్యదర్శిగా నియమించి, తాలూకాలో ఆటలను, పరుగుపందాలను ప్రోత్సహించాడు. ఆయనకు సంతానం లేకపోయినందున ఎన్నో పిల్లిపిల్లల్ని తమ ఇంటిలో పోషించేవాడు. ఆయన భార్య కూడా ఎంతో ఉత్తమురాలు. వారు ఎవరి ఇంటికీ వెళ్ళేవారు కాదు. ఏదైనా శుభకార్యానికి ఎవరినైనా ఆహ్వానిస్తే వారు ఆ కార్యానికి వచ్చినా ఏమీ ముట్టుకునేవారు కాదు. ఆయన మా క్లబ్బు అధ్యక్షునిగా ఉన్నా, బాధ్యత అంతా నాకే వదిలేసేవాడు. ఆయన నివాసం మా ఇంటికి దగ్గరలోనే ఉన్నా మా మధ్య రాకపోకలు చాలా తక్కువగానే ఉండేవి. ఆయన నాతో ఎంత సన్నిహితంగా ఉన్నా, క్లబ్బు వ్యవహారాలు తన కార్యాలయంలో చర్చింపటానికి ఇష్టపడేవాడు కాదు. మాజీ శాసనసభ్యులు, రాజూరా పట్టణ మున్సిపాలిటీ అధ్యక్షుడు శంకర్‌రావు దేశాయి గారు కూడా నాకు మంచి స్నేహితుడు అయ్యాడు. మున్సిపాలిటీలో ఏ కార్యక్రమం జరిగినా ఆయన నన్ను తప్పనిసరిగా ఆహ్వానించి నన్ను తన ప్రక్కనే కూర్చోబెట్టుకునేవాడు. తమ ఇంటికి కూడా మమ్మల్ని ఎన్నోసార్లు ఆహ్వానించి మర్యాద చేసేవాడు. ఆయన మా క్లబ్బుకు ఉపాధ్యక్షుడు కావటంతో నాతో చాలా చనువుగా, సన్నిహితునిగా ప్రవర్తించేవాడు. ఆయన నికార్సైన గాంధేయవాది. ఖద్దరు తప్ప వేరే వస్త్రం ధరించేవాడు కాదు. ఆయన గాంధీ టోపీ లేకుండా కనిపించేవాడు కాదు. ఆయన 1959 కు ముందు ఆంధ్ర రాజకీయాలలోనే ఉండేవాడు కనుక తెలుగువారంటే చాలా ఇష్టంగా ఉండేవాడు. ఆయనకు తెలుగు తెలుసు.

రాజూరాలో ఇంకొక ప్రముఖ వ్యక్తి, నా స్నేహితులలో ముఖ్యులైన మాజీ శాసనసభ్యుడు, భూస్వామి శివరావు దేశ్‌పాండేగారు. ఆయనకు రాజూరా పట్టణంలోనేకాక చుట్టుప్రక్కల గ్రామాల్లో వ్యవసాయ భూములు చాలా ఉండేవి. ఆయన పొలంలోనే మంచి ఇల్లు నిర్మించుకుని, ఆ ఇంట్లో ఒంటరిగా ఉండేవాడు. ఆయన కుటుంబం చంద్రాపూర్‌లో ఉండేవారు. ఆయన ఎక్కువ రోజులు రాజూరాలోనే ఉండటానికి ఇష్టపడేవాడు. పనిమనిషి ఆయనకు వంటచేసి పెట్టేవాడు. పనిమనిషి రాకపోతే ఆయనే స్వయంగా వంట చేసుకునేవాడు. ఆయనకు షిరా (పెరుగు వడబోసి చేసే స్వీటు) పురన్‌పోళి (బొబ్బట్టు) అంటే చాలా ఇష్టం. ఆయనది ఆరడుగుల ఆజానుబాహుడైన విగ్రహం. తెల్లటి ఖాదీ లాల్చీ, పంచె, గాంధీ టోపీ లేకుండా బయటకు వచ్చేవాడుకాదు. నేను, A.E. తమ్మయ్య Agriculture officer కుత్తేసాబ్ ఆయనకు మంచి మిత్రులం. పేకాట స్నేహితులం కూడా కావటంతో నేనంటే ఆయనకు ప్రత్యేక అభిమానం. మేము ప్రతి సాయంత్రం ఆయనింట్లో కలుస్తాం. ఆయన మా ఇంట్లో చేసే ఇడ్లీ, దోశ, గారె (వడ)లంటే చాలా ఇష్టంగా తినేవాడు. ఆయనకు అప్పటికే 60 సంవత్సరాల వయస్సు ఉండేది. నాకు ఆయన వయస్సులో సగం కూడా ఉండేది కాదు. ఆయన పర్సనాలిటీ చూడగానే ఎవరికైనా సదభిప్రాయమే కలుగుతుంది. ఆయన రాజూరాలో ఎవరి ఇంటికి వెళ్ళేవాడు కాదు. కానీ నేను టిఫినుకో, భోజనానికో ఆహ్వానిస్తే సంతోషంగా మా ఇంటికి వచ్చేవాడు.

ఆయన వ్యక్తిత్వాన్ని గురించి ఎంత చెప్పినా అది తక్కువే అవుతుంది. ఆయన బజార్లో నడుస్తూ ఉంటే అందరికళ్ళూ ఆయనమీదే ఉండేవి. ఆయనకు కొన్ని వందల ఎకరాల భూమి ఉండేది ఒకప్పుడు. కానీ భూసంస్కరణల పుణ్యమా అని ప్రభుత్వం చాలా భూముల్ని లాగేసుకుంది. తన క్రింద పనిచేసేన నౌకర్లకు తన భూముల్ని కౌలు చేసిన రైతులకు ఆయనే స్వయానా కొంత పంచి ఇచ్చేసి, భూమిపై తరతరాలుగా తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని వదులుకోలేక కొంత భూమిని మాత్రమే తనవద్ద ఉంచుకున్నాడు. అంతటి పెద్ద భూస్వామికి నేను అత్యంత ప్రీతిపాత్రుడనైనందుకు నాకు చాలా గర్వంగా ఉండేది. ఆయన నన్ను చాలాసార్లు చాందాలో ఉన్న తన ఇంటికి తీసుకువెళ్ళి కుటుంబ సభ్యులకు పరిచయం చేసేవాడు. రాజూరాలో ఉన్న ఆయన తోట (బగీచా)లోకి వెళ్ళాలంటే ఎవరైనా జంకేవారు. కానీ ఆయన మిత్రులమైన నాకు, తమ్మయ్యకు, కుత్తేగార్లకు ఆయన ఇంటి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉండేవి. ఆయన వంటగది, పడకగదుల్లోకి మాకు మాత్రమే

ప్రవేశం ఉండేది. ఆయనకు ఎప్పుడైనా బోర్‌గా ఉంటే ఆయన తన నౌకర్ని మా ఇంటికి పంపేవాడు. నన్ను వెంటనే తన ఇంటికి రమ్మని కబురు పంపేవాడు. ఆయన తన అనుభవాల్ని గత జీవిత సంఘటనల్ని నాకు చెప్పి, తన మనస్సులో ఉన్న బరువుని, బాధల్ని తగ్గించుకునేవాడు. ఆయన తోటలో ఉన్న బావి క్రింద కూరగాయలు, పువ్వులు, పండ్లు (ముఖ్యంగా బేనీషా మామిడిపండ్లు) పండించి, కొన్నిటిని మాకు కూడా పంపేవాడు. ఆయనకు ఆవకాయ పచ్చడి అంటే చాలా ఇష్టం. ఆయన తోటలో పండిన మామిడిపళ్ళ రసం నాకూ, తమ్మయ్యకూ రుచిచూపించేవాడు. ఆయన పక్కా శాఖాహారి. మా ఇంట్లో వండే కూరలంటే ఆయనకు చాలా ఇష్టం. ఆయన తోటల్లో కాచిన మామిడికాయలతో ఆవకాయ పచ్చడి చేసి ఆయనకు పంపేవాడిని. రాజూరా తాలూకా పంచాయతీ కార్యాలయంలో Block Development Officer గా పనిచేస్తున్న శ్రీ వజ్జెలవార్ (మరాట్వాడా ప్రాంతానికి చెందిన వ్యక్తి) అదే కార్యాలయంలో సహాయక ఇంజనీర్‌గా ఉన్న శ్రీ తమ్మయ్య (సాలె గ్రామ, మైసూరు జిల్లా) పశువైద్యాధికారి డా. ఠాకరే బాబురావ్ బోబ్డే (యవత్ మహల్ జిల్లా) నా మిగతా స్నేహితులు. వజ్జెలవార్ నాతో చాలా బాగా ఉండేవాడు. ఆయన తాలూకాలో ఏ ఊరు వెళ్ళినా నన్ను కూడా తనతో తీసుకెళ్ళేవాడు. ఆయన తన కార్యాలయం పనులు చూసుకుంటూ ఉంటే నా పురావస్తు సర్వే పని నేను పూర్తి చేసుకుంటూ ఉండేవాడిని. రాజూరా తాలూకా చాలా వెనుకబడిన ప్రాంతం. గ్రామగ్రామానికి రవాణా సౌకర్యం ఉండేది కాదు. ఈ ప్రాంతంలో గిరిజనులు (ముఖ్యంగా గోండులు, వారు తాము రాజగోండులమని గర్వంగా చెప్పుకుంటారు) చిన్నచిన్న గ్రామాల్లో, చిన్నచిన్న ఇళ్ళల్లో, గుడిసెల్లో నివసిస్తూ ఉంటారు. తాలూకా పంచాయతీ అధ్యక్షుడు శ్రీ వెంకట్రావ్ ముసాలే (మాజీ శాసనసభ్యుడు, రాజూరా ప్రక్కనే ఉన్న బోలేగాం నివాసి) గారికి కూడా నేనంటే చాలా ఇష్టం. ఆయన మా క్లబ్బులో టేబిల్ టెన్నిసు ఆడటానికి వస్తూ ఉండేవాడు. నా పద్ధతులు ఆయనకు బాగా నచ్చి, నాతో సాన్నిహిత్యం పెంచుకున్నాడు. శ్రీ వజ్జెలవార్, శ్రీ వెంకట్రావ్‌గార్లతో పాటు నేను దాదాపు అన్ని గ్రామాలు సర్వే చేశాను. రాజూరాంకు దగ్గర్లో ఉన్న కొన్ని గ్రామాలు మాత్రం కాలినడకన, సైకిలు మీద వెళ్ళి సర్వే పని పూర్తిచేశాను. రాజూరాలో నా ఆప్తమిత్రుడు కర్ణాటకలో రైతు (వక్కలిగ గౌడ) కుటుంబానికి చెందిన శ్రీ తమ్మయ్య మా కుటుంబానికి చాలా అండగా ఉండేవాడు. ఆయన నాకంటే చిన్నవాడే అయినా ఆయనవద్ద నేను ఎన్నో మంచి పద్ధతులు, అలవాట్లు నేర్చుకున్నాను. ఆయనను డా. ఠాకరేను మా ఇంటికి భోజనానికి ఆహ్వానిస్తే మా ఆంధ్రాభోజనాన్ని సంతోషంగా ఆస్వాదించేవారు. రాజూరా నుంచి అసిఫాబాద్ వెళ్ళా రూటులో లక్కడకోట అనే ఊరిలో తెనాలి, చిలకలూరిపేట (గుంటూరు జిల్లా) దివి తాలూకా (కృష్ణాజిల్లా)లకు చెందిన రైతు కుటుంబాలవారు ఉండేవారు. వారు కొడాలి గోపాలస్వామి, వారి కుమారులు నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావులు, చిలకలూరిపేట తాలూకాకు చెందిన వసంతరావు, వీరరాఘవయ్య, వారి కుమారుడు బైరాగి, దివి తాలూకాకు చెందిన మైనేని శీతారామయ్యగారు ఇంకా కొన్ని కుటుంబాలు ఆ ఊరిలోనే వ్యవసాయం చేసుకుంటూ స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. గోపాలస్వామిగారు ఆఫీసు పనుల మీద వారంలో కనీసం 2, 3 సార్లైనా రాజూరా వచ్చి వెళ్తుండేవాడు. ఆయన రాజూరా వచ్చేటప్పుడు వాళ్ళకు పండిన కూరగాయలు, పాలు, పెరుగు మా ఇంటికి తెస్తూ ఉండేవాడు. రాజూరా వస్తే మా ఇంటికి రాకుండా వెళ్ళేవాడు కాదు. నా శ్రీమతిని తన స్వంత కూతురులాగే "అమ్మాయ్, అమ్మాయ్" అంటూ పిలుస్తూ మా కుటుంబ సభ్యునిలాగే వ్యవహరించేవాడు. నా శ్రీమతికి రాజూరాలో తెలుగు మాట్లాడేవాళ్ళు లేరనే దిగులు లక్కడ కోటవారితో తీరిపోయింది. ఆదివారంనాడు మమ్మల్ని వారి గ్రామానికి ఆహ్వానించి మంచిమర్యాదలు చేసేవారు. గోపాలస్వామిగారి భార్య కూడా మాతో చాలా ఆప్యాయతగా ఉండేది. మాకు అసిఫాబాద్ నుండి బస్సులో ప్రతిరోజూ తెలుగు పేపరు (ఆంధ్రప్రభ) వస్తూ ఉండేది. నెల్లూరుకు చెందిన వడ్డీవ్యాపారులు కృష్ణయ్యనాయుడు, చెంచురామయ్య, రాజూరాలో వడ్డీవ్యాపారం (నూటికి పదిరూపాయలు వడ్డీ) చేస్తూ రాజూరాలో కిరాయి ఇంట్లో ఉండేవారు. వారిని గుద్దులోళ్ళు (వడ్డీ ఇవ్వకపోతే పిడిగుద్దులు గుద్దుతారట) అని రాజూరాలో పిలిచేవారు. వారు కూడా నాతో స్నేహం చేస్తూండేవారు. వీరేకాక రాజూరా తాలూకాఫీసు ఉద్యోగి నాగేందర్ (పూర్వీకులు తెలుగువారే) వ్యాపారి నందలాల్ సేర్ (గుజరాతు), కిషోర్‌చంద్ రాఠీ (రాజస్థాన్), చాందూరులో ప్రభుత్వ వైద్యుడు డా. కోటేశ్వరశర్మ (తెలుగువారే), ఆయన

నర్సు శ్రీమతి సుమ (కేరళ), రాష్ట్ర కబడ్డీ ఆటగాడు, సుభాష్ షిండే పోలీసు ఇన్‌స్పెక్టరు మాధవ్‌రావ్ బోంస్లే, సంఘ సేవకుడు ప్రభాకర్ వాఘ్మారే మొదలైనవారు కొద్దికాలంలోనే నాకు స్నేహితులయ్యారు.

రాజూరా తాలూకాలో హిందూ, ముస్లిం మతాల ప్రజలు ఉండేవారు. అక్కడి జనాభాలో 80 శాతంమంది గోండులే. వారు అమాయక ప్రజలు. వారు కొండల దిగువన, లోయల్లోనూ చిన్న పూరిళ్ళల్లో నివసిస్తారు. వారు నివసిస్తున్న గ్రామాల్లో కొద్ది ఇళ్ళు మాత్రమే ఉంటాయి. ఈ తాలూకాలో 85 గ్రామాలు మాత్రమే ఉన్నాయి. వీటిలో కొన్ని గ్రామాలకు మాత్రమే రోడ్డు, బస్సు రవాణా సౌకర్యం ఉన్నది. గోండులలో ఎక్కువమంది నిరక్షరాస్యులే. రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు వెళ్ళాలంటే కాలినడకన, సైకిలు, ఎడ్లబండి ద్వారానే వెళ్ళవలసి ఉంటుంది. పురుషులు ధోతి, చొక్కా ధరించి, పెద్ద తలపాగా వేసుకోగా స్త్రీలు చీర, రవిక ధరించి, తమ చేతులకు, చెవులకు, మెడకు అనేక ఆభరణాలు వేసుకుంటారు. వారి ఆచార వ్యవహారాలు మనకు వింతగా కనిపిస్తాయి. వారి వివాహాలు కూడా విచిత్రంగా ఉంటాయి. ఆ ప్రజలు శాంతస్వభావులు, శాంతికాముకులు. మనం వారి ఇంటికి వెళ్తే మనకు చాలా మర్యాద చేస్తారు. వారు చాలా ధైర్యవంతులు. వారికి కారడవులన్నా, క్రూరజంతువులన్నా ఏమాత్రం భయం లేదు. వారు నాగోబా (నాగదేవత)ను ఆరాధిస్తారు. వారు ఉన్న ఊరిలో ఆ దేవత గుడి తప్పనిసరిగా ఉంటుంది. వారు అడవుల్లో లభించే తేనె, విప్పపండ్లు, చింతపండు, వెలగపండ్లు, కుంకుడుకాయలు, గురివింద గింజలు సేకరించి, వాటిని సంత (అంగడి)లో విక్రయించి ఆ ధనంతో ఇంటికి కావలసిన సరుకులు కొనుక్కుంటారు. వారికున్న కొద్దికొద్ది భూముల్లో వ్యవసాయం చేసి జొన్నలు (జవారి), మక్కలు (మొక్కజొన్న), కూరగాయలు పండిస్తూ, మేకల్ని, గొర్రెల్ని, గేదెల్ని, ఆవుల్ని పోషిస్తారు. వారు ఎంత దూరమైనా ఎడ్లబండిపైనే ప్రయాణిస్తారు. తాలూకా పంచాయతీవారు ప్రతీ ఊరికీ రోడ్డు, వాగులపైన వంతెనలు నిర్మించి, బావులు త్రవ్వించి, తాగునీరు సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, సామాజిక భవనాలు, పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నారు. వీరు గోండి భాషను మాట్లాడుతారు. ఆ భాషకు లిపి లేదు. గోండులు నాగరికతకు దూరంగా ఉన్నారు.

నేను రాజూరా చేరిన కొన్ని రోజులకే నాకు సహాయకునిగా గిరిజన ఆదివాసీ కుర్రవాడు దేవిచరణ్‌ను బిలాస్‌పూర్ నుండి రాజూరాకు బదిలీ చేశారు. ఆ తరువాతి వారమే దేవిచరణ్ తన భార్యను, కొంత ఇంటిసామానుతో రాజూరా వచ్చాడు. మా ఆఫీసులో మొత్తం 5 గదులు, ముందు పెద్ద వరండా ఉండేవి. చివరి రెండు గదుల్నీ అతనిని వాడుకోమని చెప్పాను. మేముకూడా మొదట్లో ఆఫీసులో ఉన్నా ఆ తరువాత దగ్గర్లోనే ఉన్న యాదవరావ్ ధోటేగారి ఇంటికి మారినాము. 1969 అక్టోబరు నెలలో మాకు ఇంకొక అమ్మాయి జన్మించింది. ఆమె మహారాష్ట్రలో జన్మించింది కనుక ఆమెకు శైలజ అనే పేరుపెట్టాము. ఆ రోజుల్లో నా నెలజీతం కూడా ఆరువందలే ఉండేది. ఆ రోజుల్లో ఖర్చులు చాలా తక్కువే. మేము నీళ్ళపాలు తాగలేక రైతు కుటుంబానికే చెందిన నేను ఒక పాడిగేదెను రూ. 500/-లకు కొన్నాను. దాని పోషణ భారమంతా దేవిచరణే చూసేవాడు. శివరావ్ దేశ్‌పాండే గారి తోటలో ఉన్న పచ్చిగడ్డిని కోసుకువచ్చి దానికి మేత మేపుతూ ఉండేవాడు. అదే సమయంలో అతనికి కుమారుడు (సంతోష్‌కుమార్) జన్మించాడు. మా గేదె పాలు మేము, దేవిచరణ్ వాడుకోగా మిగిలిన పాలు ప్రక్కనే ఉన్న హోటలుకు పోసేవాళ్ళం. దాని దాణాఖర్చులు పోను ఇంకా కొంత డబ్బు మిగిలేది.

మేము రాజూరాలో ఉన్న 3 సంవత్సరాలు నాకు కొన్ని రోజులలాగే గడిచిపోయినాయి. రాజూరా తాలూకా గ్రామాల సర్వే పూర్తి అయిందని మా హైదరాబాద్ కార్యాలయానికి తెలియచేయగా నన్ను 1971లో శ్రీశైలం ముంపుగ్రామాల (మహబూబ్‌నగర్ జిల్లా) సర్వే చేయమని మా అధికారులు నన్ను కర్నూలు బదిలీ చేశారు. నాకు నా స్నేహితులు రాజూరాలో ఘనమైన వీడ్కోలు సభ ఏర్పాటు చేసి నన్ను ఘనంగా సన్మానించారు. నా రాజూరా అనుభూతుల్ని నేను ఎప్పటికీ మరచిపోలేను. నేను హైదరాబాద్ రైలులో బయలుదేరే రోజు మానిక్‌గడ్ స్టేషన్‌కు మా స్నేహితులు వచ్చి మాకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఆ ఊరు వదలి వచ్చేస్తున్నందుకు నేను, నా శ్రీమతీ మనసారా దుఃఖించాము. స్వరాష్ట్రానికే తిరిగి వెళ్ళిపోతున్నామన్న మా సంతోషం ఆవిరైపోయింది.

కొసరాజు వెంకటేశ్వరరావు
ఫోన్ : 949 063 6659

# క్రోమోసోమ్ కథనమ్ – 10

*– ము.పా.సా.*

**ఒత్తిడి :**

మన దురదృష్టానికి, మన పొరబాట్లకు, మన మూర్ఖత్వానికి చంద్రుణ్ణీ, సూర్యుణ్ణీ, నక్షత్రాలనూ నిందిస్తాం. అంటే, మన చేతలకు, ఆలోచనలకు బాధ్యత మనది కాదు. ఏ నక్షత్రమో మనల్ని చేయి పట్టుకుని నడిపిస్తున్నదంటాం. ఇదే పెద్ద తప్పు.

'కింగ్ లియర్'లో షేక్స్‌పియర్.

జీనోమ్‌లో గత మహమ్మారుల చరిత్రంతా నిక్షిప్తమై ఉంటుంది. మన పూర్వులు మలేరియా, విరేచనాలువంటి జబ్బులతో చేసిన యుద్ధాలన్నీ జీనోమ్‌ను చదివి తెలుసుకోవచ్చు. మలేరియాతో మీరు మరణం సంభవిస్తుందా లేదా అన్న విషయం మీ జన్యువులు, మలేరియా జన్యువులు కలిసి ఎప్పుడో నిర్ణయించాయి. అవసరమొచ్చినప్పుడు, మీ జన్యువులూ, మలేరియా పరాన్నభుక్కులూ పరస్పరం సవాల్ విసురుకుంటారు. ఎవరు బలవంతులైతే, ఎవరు బాగా ఆత్మరక్షణ చేసుకోగలిగితే వాళ్ళు గెలుస్తారు.

కాని, ఈ విషయాలను అర్థంచేసుకోవటం ఇంత సులభమా? రోగక్రిములకు జన్య ప్రతిఘటన ఉండదని కాదు. అయితే, ఇదిగాక, అనేక ఇతర పద్ధతుల్లో కూడా 'ఆత్మరక్షణ' సాధ్యమే. ఉదాహరణకు, దోమలు కుట్టకుండా ఉండాలంటే దోమతెరల్లో పడుకోవచ్చుగదా! చెత్తా, చెదారం, ముకి లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవచ్చు. DDT చల్లుకోవచ్చు. ఆరోగ్యసూత్రాలు పాటిస్తే అంతకన్నా మంచి ఆత్మరక్షణ మరేముంటుంది! జీనోమ్ మాత్రమే యుద్ధరంగం కాదు. జీవితంలో పతీ క్షణం మనం రోగాలతో యుద్ధం చేస్తూనే ఉన్నాం. మన ఇళ్ళు, పరిసరాలు అన్నా యుద్ధరంగాలే. పైగా జన్యువులకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు. అవి శరీరంలోనే ఉంటాయి. "మెదడు, శరీరం, జీనోమ్"ను ఒక యూనిట్‌గా చూడాలి. ఈ మూడింట్లో ప్రతిరెండూ మరోదాన్ని ప్రభావితం చేస్తుంటాయి.

కొలెస్టరాల్! ఆ మాట వింటేనే భయమేస్తుంది గదూ! గుండెజబ్బులకు ప్రధాన కారణమిది. రెడ్‌మీట్ తినగూడదు. కొలెస్టరాల్ పెరుగుతుంది! ఇంతకన్నా అబద్ధం మరొకటి లేదు. రెడ్‌మీట్ అంటే విషమా ఏమిటి! కొలెస్టరాల్ అనబడేది శరీర నిర్మాణంలోని ఒక ముఖ్యమైన అంశం. ఇది కొవ్వులో మాత్రమే కరుగుతుంది. నీటిలో కరగదు. మన ఆహారంలోని శక్కరల నుండి ఇది ఉత్పత్తి అవుతుంది. ఈ కొలెస్టరాల్ నుండి మరో అయిదు హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. అవి : ప్రొజెస్టెరోన్; ఆల్డోస్టెరోన్; కార్టిసాల్; టెస్టోస్టెరోన్; ఓస్ట్రావిడియోల్. ఈ రెండింటినీ కలిపి స్టెరాయిడ్‌లంటారు.

జీవుల మధ్య మొక్కలు, జంతువులు, ఫంగి (శిలీంధ్రాలు)లాంటి విభజన జరగటానికి పూర్వకాలంనుండే, ఇవి స్టెరాయిడ్స్‌ను తమ జీవప్రక్రియతో ఉపయోగిస్తున్నాయి. ఎదిగే క్రమంలో కీటకాలు తమ డ్రై చర్మాలను వదిలించుకుంటాయి. ఈ ప్రక్రియకు అవసరమైన హార్మోన్ ఒక స్టెరాయిడ్. విటమిన్ D లో ఉండే ఒక రసాయనం ఇది. క్రీడాకారులు తమ కండరాలు బలపడటం కోసం ఉపయోగించే స్టెరాయిడ్స్‌ను కృత్రిమంగా తయారుచేస్తారు.

క్రోమోసోమ్ 10 మీద CYP 17 అనబడే జన్యువు ఉంటుంది. ఇది ఉత్పత్తి చేసే ఒక ఎంజెమ్‌వల్ల కార్టిసాల్, టెస్టోస్టె రోన్‌గా మారుతుంది కొలెస్టరాల్. ఈ జన్యువు లేని పురుషులు స్త్రీలలాగా కనిపిస్తారు.

సెక్సు సంగతి కాసేపు పక్కనపెట్టి CYP 17 ఉత్పత్తి చేస్తున్న ఇతర హార్మోన్ల గురించి తెలుసుకుందాం. కార్డిసాల్ మెదడు పని తీరును నియంత్రిస్తుంది. అంటే, శరీరంలోని ప్రతి అవయవానికీ, ప్రతి భాగానికీ దీని అవసరమంటుంది. రోగనిరోధక శక్తిమీద కూడా దీని ప్రభావం ఉంటుంది. చెవులు, కళ్ళు, ఇతర అంగాలు పనిచెయ్యటానికి కూడా ఉపయోగపడుతుంది ఈ హార్మోన్. అయితే మన రక్తప్రసరణలో ఇది ఎక్కువగా ఉన్నదంటేమనం ఒత్తిడికి లోనవుతున్నాయని అర్థం. ఒత్తిడికి పర్యాయపదం కార్టిసాల్. ఒత్తిడికి ఎన్ని కారణాలుంటాయో మనకు తెలుసు. పరీక్షల ఒత్తిడి, ఇంటర్వ్యూల ఒత్తిడి, ఆప్తులకు ఏమైనా అనుకోనిది జరుగుతుందేమోనని ఒత్తిడి. మొత్తంమీద అందరూ ఏదో ఓ

కళాశాలలో ఒత్తిడికి గురవుతూనే ఉంటారు. గుండె కొట్టుకొనే వేగం పెరగటానికే, కాళ్ళు చల్లబడటానికే కారణం ఎపినెఫ్రైన్ అనబడే రెండు హార్మోన్లు. తాత్కాలిక ఒత్తిడివల్ల ఈ రెండు హార్మోన్ల ఉత్పత్తి పెరుగుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడివల్ల కార్టిసాల్ ఉత్పత్తి నెమ్మదిగా పెరుగుతుంది. కాని ఈ ప్రక్రియ చాలాకాలం కొనసాగుతుంది. రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది కార్టిసాల్. మీరు చూసేవుంటారు పరీక్షల ఒత్తిడితో ఉన్నవాళ్ళకు జలుబు ఇతర జబ్బులు త్వరగా వస్తాయి. కోర్టిసాల్ జన్యువులను ప్రభావితం చెయ్యటంవల్లనే ఇది జరుగుతుంది. కణాల్లో కోర్టిసాల్, రిసెప్టర్లుగా ఉన్న జన్యువుల్ని యాక్టివేట్ చేస్తుంది. కోర్టిసాల్ గురించి మరింత తెలుసుకుందాం. తెల్ల రక్తకణాల్లో ఉన్న రోగనిరోధక హెచ్చరికల శక్తిని నిర్వీర్యం చేస్తుందిది. కోర్టిసాల్‌కూ, వ్యాధులకూ ఉన్న సంబంధమే. అయితే జన్యువులకు సంబంధించినంతవరకూ ఇవి నిజమే అనుకున్నా, ఇతర కారణాల ఆప్తుల మరణం, వియోగం, పరీక్షల భయం వగైరా వల్ల వచ్చే వ్యాధుల సంగతేమిటి? ఈ వ్యవహారంలో మెదడు కూడా ఒక ముఖ్య భూమిక పోషిస్తున్నదని తెలిసిపోతూనే ఉంది. ఇలాంటి సందర్భాల్లో మెదడులోని హైపోథాలమస్, పిట్యూటరీ గ్రంధికి ఒక సంకేతం పంపిస్తుంది. అది అడ్రినాల్ గ్రంధికి కార్డిసాల్‌ను ఉత్పత్తి చేసి విడుదల చెయ్యమని ఆదేశమిస్తుంది.

మెదడువల్లే ఇలా జరుగుతోందని అనుకోవచ్చా? అసలు శరీరానికి ఏదో ఒక కేంద్రీయ నియంత్రణ ఉంటుందా? బాహిరమై విషయాలవల్ల ఒత్తిడి పెరుగుతుందనుకున్నా, ఒత్తిడి తీవ్రత ఈ దరిలోనూ ఒకేరకంగా ఉండదు. పరీక్ష రాసినవాళ్ళల్లో ఒకడు టాప్‌రాంక్ రాలేదని కుమిలికుమిలి మనోవ్యాధి తెచ్చుకోవచ్చు. మరొకరు సున్నామార్కులు వచ్చినా పైలాపచ్చీసుగా తిరగొచ్చు. మరి, మనలోని ఈ జన్యు వైవిధ్యానికి కారణమేమిటి? ఏ ఒక్కటీ కారణమని చెప్పలేం. పరస్పర ఆధారిత, సంబంధిత వ్యవస్థల కలయిక ఈ శరీరం అంటే ఒకరకంగా ఆర్థిక వ్యవస్థలాంటిది. చిక్కుల్లో ఉన్నప్పుడు, ఎవరైనా ఈ ఆర్థిక వ్యవస్థను తమ చేతుల్లోకి తీసుకొని నడిపించగలిగితే ఎంత బాగుంటుంది! అనుకుంటాం. ఉత్పత్తి, సరఫరా, ధరల నియంత్రణ, మార్కెట్లు కుదేలు కావటం అన్నీ గడిబిడి విషయాలు. కేంద్రీయ నియంత్రణ ఉన్న సోషలిస్టు దేశాలలో ఏమైంది? రోమన్ సామ్రాజ్యం నుండి యురోపియన్ యూనియన్ దాకా మొత్తం వ్యవస్థ గురించి ఏ ఒక్కరో నిర్ణయం తీసుకోకుండా, చిన్నచిన్న మార్కెట్లకు స్వయంనిర్ణయాధికారం కల్పిస్తే, కొన్ని పాడైనా, కనీసం కొన్నైనా బాగుంటాయి. వికేంద్రీకరణవల్ల కలిగే ప్రయోజనమది. శరీరమూ అంతే. నువ్వంటే హార్మోన్లను ప్రభావితం చేస్తున్న మెదడు మాత్రమే కాదు. హార్మోన్లను నియంత్రిస్తున్న జీనోమ్ మాత్రమే కాదు ఈ శరీరం. ఇలా, సవాలక్ష జీవవ్యవస్థలు కలిస్తే ఏర్పడింది.

"జీనోమ్ ప్రభావంతో శరీరంలో మార్పులొస్తాయి" లాంటి వాదన చేశారు పాత తరం సైకాలజిస్టులు. వాళ్ళ ఉద్దేశంలో జీనోమ్ శరీరంలో భాగం కాదు. జీనోమ్, జన్యువులు, హార్మోన్లు ఇలా దేని గురించి మాట్లాడినా అన్నీ శరీరమేనని ఇప్పుడందరికీ స్పష్టమైంది. మెదడూ శరీరమూ ఒకే జీవవ్యవస్థలోని భాగాలు. ఒత్తిడికి లోనైన మెదడు కోర్డిసాల్‌ను విడుదల చేస్తే దాని ఫలితంగా శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. శారీరక రుగ్మతలకు మానసిక కారణాలంటే ఇవే.

ఈ ప్రక్రియలను అధ్యయనం చేసే శాస్త్రాన్ని సైకో న్యూరోయిమ్యునాలజీ అంటారు. డాక్టర్లు దీనిపట్ల అంత సుముఖంగా లేదుగాని, మంత్ర వైద్యులూ, భూతవైద్యులూ, తాయెత్తులవాళ్ళూ ఇందులో చాలా ఆసక్తి కనపరుస్తున్నారు. అసంతోషంగా, దిగులుగా, ఉండేవాళ్ళకు దగ్గూ, పడిశం తొందరగా వస్తాయని మనకు తెలుసు. ఇలాంటి మరికొందరికి, ఈ దద్దుర్లు, ఇతర అలెర్జీలూ రావచ్చు. ముఖ్యంగా, దీర్ఘకాల రోగులకు సేవచేసే ఆప్తబంధువులు స్వయంగా మంచాన పడటం మనం చూస్తూనే ఉంటాం. అణువిద్యుత్తు కేంద్రాలకు సమీపంలో ఉన్నవాళ్ళలో కోర్డిసాల్ ఎక్కువగా విడుదలవుతుంది. రేడియేషన్ వల్ల కాదు. ప్రమాదం జరుగుతుందేమోనని వాళ్ళ భయం. అలా, ఒత్తిడికి కారణమేమైనా, ఫలితంగా జబ్బుపడటం మాత్రం తరచూ జరుగుతుంది.

మెదడు శరీరాన్ని, శరీరం మెదడునూ ప్రభావితం చేస్తాయన్నాడు తత్వవేత్త రెని డెకార్ట్ (Rene Descartes). కాని మెదడు శరీరంలో భాగమే కాదు, ఇప్పటిదాకా మనం మాట్లాడుకున్నది కూడా ఇదే. సంతోషాన్ని మించిన ఆరోగ్యం లేదు. ఇంకా సందేహమెందుకు? గుండెజబ్బులకు, కొలెస్టరాల్‌కన్నా మనోవ్యాధులే ముఖ్యకారణం. దిగులు,

అసూయా, కోపం, ద్వేషం, అసహనం అన్ని రకాల నెగెటివ్ ఉద్వేగాలు ప్రమాదకరమైనవే (కోలెస్టరాల్ శాతం ఎంత పెరిగినా గుండె జబ్బులు రావని చెప్పటంలేదు. దానివల్ల, అనేక ఇతర సమస్యలు కూడా రావచ్చు. అది వేరే సంగతి). ఒత్తిడి తగ్గించుకోలేనివాళ్ళు ఎన్ని మందులు తీసుకున్నా పెద్ద ఫలితం కనిపించకపోవచ్చు.

ఇప్పటిదాకా మనం కోర్టిసాల్ గురించి మాట్లాడుకున్నదంతా హార్మోన్లకూ వర్తిస్తుంది. రోగనిరోధక వ్యవస్థను బలహీనపర్చటానికి టెస్టోస్టెరాన్ కూడా కార్టిసోల్‌లాగే పనిచేస్తుంది. అన్ని జీవజాతుల్లోనూ పురుష జీవులకు ఎక్కువ రోగాలు రావటానికే, స్త్రీలతో పోల్చితే తక్కువకాలం జీవించటానికీ ఇదే కారణం.

**క్రోమోసోమ్ కథనమ్ – 11**

**వ్యక్తిత్వం :**

*మన జీవన గమ్యాన్ని నిర్ణయించేది మన వ్యక్తిత్వమే*

–*హెరాక్లిటస్*

వ్యక్తి లక్షణాలనూ, మానవజాతి మొత్తానికి వర్తించే లక్షణాలకూ ఉన్న సంబంధాన్ని తెలియచేస్తుంది హ్యూమన్ జీనోమ్. మన సామాజిక ప్రవర్తనకూ, ప్రైవేటు ప్రవర్తనకు కూడా కారణం ఇదే. ఎప్పుడో అప్పుడు అందరం ఒత్తిడికి గురవుతాం. అధికమొత్తంలో కార్టిసాల్ విడుదలవుతుంది. రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అంటే, బాహిర పరిస్థితులు మన మానసిక జీవితంమీద ప్రభావితం చూపిస్తూనే ఉంటాయి. అయినప్పటికీ, ఎవరి విలక్షత వాళ్ళదే. కొందరికి ఎప్పుడూ ముక్కుమీదే ఉంటుంది కోపం. కొందరు అసూయతో రగిలిపోతుంటారు. మరికొందరు ఎన్ని కష్టనష్టాలు వచ్చినా సరే, నిండు కుండలా ఉంటారు మానసిక స్థైర్యం కోల్పోరు. మనిషికీ మనిషికీ తేడా ఉంటుందంటే ఇదే మరి. ఈ లక్షణాలకే మరో పేరు వ్యక్తిత్వం.

వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసే జన్యువుల గురించి తెలుసుకోవటానికి మనం హార్మోన్లకు బదులు మెదడులోని రసాయనాల గురించి అధ్యయనం చెయ్యాలి (ఈ రెంటిమధ్యా ఖచ్చితమైన, స్పష్టమైన తేడా ఏమీ లేదు). క్రోమోసోమ్–11 మీద $D_4DR$ అనబడే జన్యు ఉంటుంది. డోపామైన్ అనబడే ప్రోటీన్‌కిది మాతృస్థానం. మెదడులో కొన్ని భాగాలలో ఉన్న కణాల మీద ఇది పనిచేస్తుంది. డోపామైన్ ఒక న్యూరోటానిక్స్ మీటర్. ఇతర న్యూరాన్‌ల నుండి వచ్చిన ఎలక్ట్రికల్ సిగ్నల్స్ ద్వారా ఇది విడుదలవుతుంది. మెదడు పనిచేసే పద్ధతి ఇదే. ఎలక్ట్రికల్ సిగ్నల్స్‌ను ప్రేరేపిస్తాయి. కనీసం యాభై కెమికల్ సిగ్నల్స్‌ను ఉపయోగించటం ద్వారా మెదడు వివిధ రకాల సంభాషించగలదు. ప్రతీ న్యూరో ట్రాన్స్‌మీటర్, ఒక కణ సముదాయాన్ని ప్రేరేపిస్తుంది. మెదడును కంప్యూటర్‌తో పోల్చటం తప్పు. ఎలక్ట్రికల్ స్విచ్ ఆఫ్ చేసే కంప్యూటర్ పనిచెయ్యటం మానేస్తుంది. కాని మెదడులో ఉన్న సినాప్స్, ఎలక్ట్రికల్ స్విచ్‌లాగ పనిచేస్తుంది.

$D_4DR$ జన్యువు, మెదడులోని డోపామైన్‌ను గుర్తిస్తుంది (మెదడులోని రక్తప్రసరణను నియంత్రిస్తుంది డోపామైన్). మెదడులో డోపామైన్ పరిమాణం తగ్గితే శరీరం పనిచెయ్యటానికే ఇబ్బంది ఏర్పడుతుంది. ఈ స్థితి ముదిరితే వస్తుంది పార్కిన్సన్స్ డిసీజ్ (నరాల వ్యాధి. కండరాలు బలహీనపడతాయి. కాళ్ళూ, చేతులూ కూడా కదల్చలేరు). ఎలుకలలో డోపామైన్ ఉత్పత్తి కాకుండా చేసినప్పుడు, అవి ఆహారం ముందరే ఉన్నా తినలేని స్థితిలో ఆకలితో మరణించాయి. అలాగే, డోపామైన్ ఉత్పత్తిని పెంచినప్పుడు, హుషారుగా, దూకుడుగా సంచరించాయి. మనుషులకు షై స్కిజోఫ్రీనియా (మానసిక వ్యాధి, ఆలోచనాశక్తి తగ్గిపోతుంది. ఎవరికీ కనిపించని దృశ్యాలు వాళ్ళకు కనిపిస్తుంటాయి). కొకెయిన్‌కు అలవాటు పడిన ఎలుకలు ఆహారంకన్నా మాదకద్రవ్యాలనే ఇష్టపడ్డాయి. మాదకద్రవ్యాలు సేవించేవాళ్ళందరికీ ఈ ఆనందధామం (ప్లెజర్ సెంటర్) చేరుకోవటమే లక్ష్యం. డోపామైన్ ఉత్పత్తిని, విడుదలను నియంత్రించగలిగితే ఈ అలవాటు మాన్పించటమూ సాధ్యమే.

అంటే, ఒక్కమాటలో దీన్ని మెదడుకు సంబంధించిన ఉత్ప్రేరక రసాయనం అని చెప్పవచ్చు. డోపామైన్ తగ్గితే వ్యక్తిలో ఉత్సాహం, చైతన్యం కూడా తగ్గిపోతుంది. ఎక్కువైతే "ఎవడు చెప్పినా వినడు". ఇక్కడే ఉత్పన్నమవుతుంది వ్యక్తిత్వాన్ని గురించిన కొందరు ప్రతిక్షణం 'థ్రిల్స్' కోరుకుంటారు. మరికొందరు ఉన్నదారిలో తృప్తిపడతారు.

ఈ రెండు రకాల వ్యక్తుల మధ్య ఉన్న జన్యు వైవిధ్యాన్ని తొలుత జెరూసలేంలో రిచర్డ్ ఎబ్‌స్టైన్ $D_4DR$ రూపంలో కనుగొన్నాడు. ఇదో మినీ సేటిలైట్. పొడవు 48 అక్షరాలు. రెండు నుండి పదకొండుసార్లు పునశ్చరణ అవుతుంది. సాధారణంగా, అందర్లోనూ సీక్వెన్స్ ప్రతులు 4 లేదా 7 ఉంటాయి కాని కొందర్లో 2, 3, 5, 6, 8, 9, 10, 11

ప్రతులు కూడా ఉంటాయి. పునశ్చరణ ఎంత ఎక్కువ జరిగితే డోపామైన్ సామర్థ్యం అంత తగ్గుతుంది.

కొందరు ఎప్పుడో ఏదో ఓ అడ్వెంచర్ కోసం తపిస్తుంటారు. తిని కూర్చోవటం వాళ్ళకు సరిపడదు. మరికొందరు "ఎందుకొచ్చిన గొడవ. ఏదో ఈ రోజలా గడిచిపోతే చాల్లే" అనుకుంటారు. ఇందులో మొదటిరకం వాళ్ళకు పొడుగాటి $D_4DR$ జన్యువులూ, రెండో రకంవాళ్ళకు పొట్టివే ఉంటాయి. అయితే వ్యక్తిత్వాన్ని నిర్ణయించేది కేవలం ఈ ఒక్క జన్యువు మాత్రమే అనుకోవటం కూడా ఈ విషయాలన్నీ ఆవిష్కరించినవాడు డీన్‌హేమర్. ఇప్పుడు మనం గట్టిగా వాదించవచ్చు. వ్యక్తుల ప్రవర్తనను సవాలక్ష కారణాలు ప్రభావితం చేస్తాయి. కాని జన్యువులు  కూడా అందులో ఒక ప్రధాన పాత్ర పోషిస్తాయని మాత్రం అంగీకరించాలి. అయితే, జన్యువులు ప్రవర్తనను నియంత్రిస్తామనుకున్నా అది శాశ్వతంగా అలాగే ఉండవలసిన అవసరం లేదు. సిగ్గుతో ముడుచుకుపోయే కోతి పిల్లల్ని, ధైర్యంగా సంచరించే పెద్దకోతుల సంరక్షణలో, పెంచినప్పుడు, అవి త్వరలోనే తమని సగ్గరితనాన్ని వదిలించుకుని ఛాతీ విరుచుకుని నడవటం ప్రారంభించాయి. కోతులకు సాధ్యమైంది మనుషులకు కాదా / సైకాలజిస్టుల కౌన్సెలింగ్‌వల్ల అనేకమంది తను ప్రవర్తనను మార్చుకోగలుగుతున్నారు.

న్యూరో కెమిస్ట్రీకీ, వ్యక్తిత్వానికీ సంబంధముందని 1980లలో గుర్తించాడు హార్వర్డ్ సైకాలజిస్ట్ జెరోమ్ కాగన్. నాలుగు నెలల పసిపిల్లల్లో ఎవరు ధైర్యవంతులుగా ఎదుగుతారో, ఎవరు మొహమాటస్తులవుతారో చెప్పటం సాధ్యమన్నాడు. పోషణ,  పిల్లల్ని పెంచే పద్ధతివల్ల పిల్లల స్వభావాల్లో మార్పు రాదని కాదు. కాని, వీటిని మించి, మౌలిక వ్యక్తిత్వమనేది ఒకటుంటుంది అందర్లో. ఇదేదో కొత్తగా తెలుసుకున్న సత్యమని చెప్పటం లేదుగాని, బిడియస్తులైన యూరోపియన్లకు నీలికళ్ళుండే అవకాశమెక్కువ అని తేలింది. అలెర్జీలు కూడా రావచ్చు. సన్నగా, పొడుగ్గా ఉంటారు. కోలమొహాలు. కుడివైపు నుదుటి భాగం ఎక్కువ వేడిగా ఉంటుంది. గుండె ఎక్కువ వేగంగా కొట్టుకుంటుంది. అంటే, బిడియస్తులు కానివాళ్ళతో పోల్చితే ఇవన్నీ వీళ్ళలో అధికం అని అర్థం. ఈ లక్షణాలన్నీ పిండంలోని న్యూరోక్రెస్ట్‌లో కనిపించాయి. మెదడులోని ఏమిగ్డాలా ప్రాంతానికి సమీపంలో ఉంటుందిది. కాగన్ ప్రకారం, ఛాలెంజ్ ఎదురైనప్పుడు, సన్నగా, పొడుగ్గా ఉండేవాళ్ళలో ఆదుర్దా పెరుగుతుంది. పెద్ద ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు చేస్తున్నప్పుడు అభ్యర్థుల ఈ ప్రవర్తనను పరిగణనలోనికి తీసుకుంటున్నారు. సామాజిక కార్యకర్తలు, అభ్యర్థులను శారీరకపరమైన కారణాలతో తిరస్కరిస్తే నిరసన తెలుపుతున్నారు. కాని యజమానులు, అభ్యర్థుల ప్రవర్తనను / ప్రతిస్పందనలను పరిగణనలోనికి తీసుకుంటున్నారని గ్రహించారా? వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యటంలో శరీరం ఎంత ముఖ్యమో, మానసికమో అంతే.

డోపామైన్, నోరెపినెఫ్రైన్ రెండూ మోనోఏమైన్‌లే. వీటికి సంబంధించిన సెరోటోనిన్ (మెదడులో ఉంటుందిది) కూడా మరో మోనోఏమైన్ మాత్రమే. వ్యక్తిత్వాన్ని నిర్ణయించటంలో ఇవన్నీ ప్రధానపాత్ర పోషిస్తున్నాయి. అయితే సెరోటానిన్, డోపామైన్, నోరెపినెఫ్రైన్‌లకన్న సంక్లిష్టమైంది. దీని గురించి ఖచ్చితంగా మాట్లాడటం కష్టమే. కొందరు ఎప్పుడూ మడి, శుచి, శుభ్రం అంటూ కడిగిన గిన్నెల్నే కడుగుతూ, తుడిచినచోటే తుడుస్తూ ఉంటారు. లేదా రోజంతా మురికిగా ఉన్నాయని చేతులు కడుగుతూ ఉంటారు. ఇక మరికొందరు, రోజుకెన్నిసార్లు స్నానం చేస్తారో వాళ్ళకే తెలియదు. ఇలాంటివాళ్ళ మెదళ్ళలో సెరోటానిన్ పాలెక్కువుంటుంది. ఈ అబ్సెసివ్ – కంపల్సివ్ ప్రవర్తనను సరిచెయ్యాలంటే వాళ్ళ మెదడు ఉత్పత్తి చేస్తున్న సెరోటోనిన్‌ను కాస్త తగ్గిస్తే చాలు. క్షణికోద్రేకంలో పనులు చేసేవాళ్ళకు, ఎప్పుడూ ఆత్మహత్యల గురించి ఆలోచించేవాళ్ళకు సెరోటోనిన్ ఉండవలసినవన్నీ తక్కువగా ఉంటుంది. సెరోటోనిన్‌ను నియంత్రిస్తుంది ప్రోజాక్ (ఇది డిప్రెషన్ కోసం ఉపయోగించే మందు పేరు). ఇది ఎలా పనిచేస్తుందో స్పష్టంగా తెలియదుగాని, దీని ఆవిష్కర్తలలో ఒకడు ఎలిలిలీ ప్రకారం, విడుదలైన సెరోటోనిన్ తిరిగి న్యూరాన్‌లలోకి ఇంకిపోకుండా అడ్డుపడుతుంది ప్రొజాక్ : ఫలితంగా మెదడుకు ఎక్కువ సెరోటోనిన్ లభిస్తుంది. అలా ఇది తీసుకున్న వ్యక్తుల్లో డిప్రెషన్ తగ్గి ఉత్సాహంగా ఉండే అవకాశముంది. అయితే, పోజాక్‌వల్ల పూర్తి విరుద్ధమైన ఫలితాలు కూడా లభించే అవకాశం లేకపోలేదు. అదెలాగో ఇప్పుడు తెలుసుకుందాం.

(Matt Ridley రచన ఆధారంగా)

తెలుగు : ము.పా.సా.

హైదరాబాదు. ఫోన్ : 917 767 8708

# ఆ మనుషులేరి?

– మహీధర రామశాస్త్రి

*తెరమరుగైన గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, శ్రీ కాలనాధభట్ట సూర్యనారాయణమూర్తి (1899–1963).*

ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగఫలం నేటి ప్రజాస్వామ్యానికి మూలబలం. కొందరు అందలాలు ఎక్కారు; మరికొందరు మట్టికొట్టుకొని పోయారు! పేరైనా మిగలని భాగ్యహీనులైనారు.

అట్టివారిలో శ్రీ కాలనాధభట్ట సూర్యనారాయణమూర్తి ప్రముఖులు. వీరు తూ.గో. జిల్లా పాశర్లపూడి గ్రామంలో వైదిక సాంప్రదాయ కుటుంబంలో శ్రీ సూరయ్య దీక్షితులు శ్రీమతి యజ్ఞమ్మ దంపతులకు 1899 సంవత్సరంలో జన్మించారు. పాశర్లపూడిలో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. తండ్రి సూరయ్యగారి వద్ద వైదిక విద్యనభ్యసించారు. స్మార్తం పూర్తిచేశారు.

నర్సాపురంలో 8వ తరగతి వరకు చదివి, టీచరలు ట్రైనింగు పూర్తిచేశారు. దేశంలో స్వరాజ్య ఉద్యమం ఉధృతంగా సాగుతున్న రోజులవి. గాంధీ పిలుపునందుకొని ఉద్యమంలోకి ఉరికిన ఉద్దండమూర్తి సూర్యనారాయణమూర్తి! అనేక కార్యక్రమాల్లో కాంగ్రెసు కార్యకర్తగా సేవలందించి, జీవితాన్ని పండించుకున్న మహోన్నత వ్యక్తి.

1920 నాగపూరు కాంగ్రెసు మహాసభలకు బెంగాలీస్వామి నాయకత్వాన కాలినడకన వెళ్ళి వాలంటీరుగా పనిచేశారు. 1921లో శ్రీ యర్రబండి కామరాజుతో కలిసి కాశీ విశ్వవిద్యాలయంలో జరిగిన పికెటింగ్‌లో పాల్గొని, 50 కొరడా దెబ్బలు, 6 మాసాల జైలుశిక్ష అనుభవించారు!

1922లో భీమవరం సమీపంలో 'పెద అమిరం' గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉద్యోగం లభించింది. సహాయనిరాకరణం ఉద్యమంలో పాల్గొని అనేకసార్లు ఉద్యోగం పోగొట్టుకున్నారు.

1930లో సర్దారు దండు నారాయణరాజుగారి నాయకత్వంలో జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని రెండుసార్లు లాఠీదెబ్బలు, ఆరుమాసాల జైలుశిక్ష అనుభవించారు. విడుదలైన తర్వాత ఏలూరు, తణుకు, పాలకొల్లు, నర్సాపురం ప్రాంతాల్లో పర్యటించి యువకుల్లో ఉద్యమస్ఫూర్తిని కలిగించారు.

1932లో భీమవరం తాలూకా కాంగ్రెసు తరఫున పికెటింగ్‌లో పాల్గొని భయంకరమైన లాఠీఛార్జ్‌కి గురైనారు.

***వీరభారతి స్వరాజ్యోద్యమ పత్రిక :***

శ్రీ మదనమోహన్ మాలవ్య ఆదేశాన్ని పాటించి, కాశీ విశ్వవిద్యాలయం ప్రొఫెసరు శ్రీ కాళీపట్నం కొండయ్య తమ స్వగ్రామమైన తణుకు సమీపం నుండి *వీరభారతి* స్వరాజ్యోద్యమ పత్రికను రహస్యంగా నడిపారు. ఆ పత్రికకు వ్రాయసగాడుగాను, పంపిణీదారుడుగానూ పనిచేసి యువ సంఘంలో సూర్యనారాయణమూర్తి ప్రముఖపాత్ర వహించారు. ఆ గ్రామంలోని ప్రజలు పత్రిక కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూసేవారు. విజయవాడ – కాకినాడ మహాసభలకు కార్యకర్తగా వెళ్ళారు. ఆ సందర్భంగా ఒక సంవత్సరం కఠిన కారాగారశిక్షను అనుభవించారు. జొన్నకూడుకి వ్యతిరేకంగా జరిగిన 11 రోజుల నిరాహార దీక్షలో రెండుసార్లు లాఠీదెబ్బలు తిన్నారు. మారుమూల గ్రామాల్లో సైక్లోస్టైలు చేసి ప్రతులను అన్ని ప్రాంతాలకు పంచేవారు. దానిలో దేశభక్తి భావాలు, యువతను జాగృతం చేసే ఉద్వేగపూరిత వ్యాసాలు, గీతాలు ఉండేవి. ప్రభుత్వం వారి నిఘా కూడా చాలా గట్టిగా ఉండేది. దాని జాడ తెలుసుకొనేందుకు కార్యకర్తలను హింసించేవారు కానీ తెలుసుకోలేకపోయేవారు!

కాశీలోను, హిమాలయ ప్రాంతాల్లోను సాధుసన్యాసుల వెంట తిరిగిన అనుభవంతో ఆయనవద్ద దండ కమండలాలుండేవి. సూర్యనారాయణమూర్తి గడ్డం పెంచి,

సాధువేషంలో పత్రికను పంచేవారు. 'గడ్డం మేస్టారు' అనే తప ఆయన అసలు పేరు చాలామందికి తెలియదు. వారిని పట్టుకోవాలని పోలీసులు ఎంత ప్రయత్నించినా సాధ్యపడేది కాదు. చివరకు కేశవరంలోని ఒక దేశద్రోహి కారణంగా 1932లో అరెస్టు చేసి, రాజమండ్రి సెంట్రలు జైలులో ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించింది ప్రభుత్వం.

**ఆనాటి వారి సహఖైదీలు :**

1. డా. పాలకోడేటి సత్యనారాయణశర్మ
2. చెరుకువాడ సుబ్బారావు
3. వేమూరి ఆంజనేయశర్మ
4. పుచ్చలపల్లి సుందరయ్య
5. భూపతిరాజు లక్ష్మీనరసింహ రాజు
6. సుబ్బరాజు, సుబ్బాయమ్మ దంపతులు.

వీరిలో కొందరు ఎమ్.ఎల్.ఏ., ఎం.పి.లుగా ఎన్నికైనారు.

**వివాహం :**

జైలు నుంచి విడుదలైన తరువాత శేషమ్మతో వివాహం జరిగింది. సంసార బంధంలో పడిన తర్వాత సూర్యనారాయణ మూర్తి హిందీ ప్రచారం, వయోజన విద్య, హరిజనోద్ధరణ మొదలైన సామాజిక కార్యక్రమాలను తమ జీవితాన్ని పరిమితం చేసుకున్నారు.

**హిందీ ప్రచారం :**

ఆ రోజుల్లో హిందీ ప్రచారం దేశభక్తిలో ఒక భాగంగా పరిగణింపబడేది. స్త్రీలు, పిల్లలు హిందీని నేర్చుకొనేవారు. ఉద్యోగిస్తూనే విరామ సమయంలో సూర్యనారాయణమూర్తి గ్రామాల్లో అందరికీ హిందీ నేర్పేవారు. వీరివద్ద చదివిన పలువురు హిందీ పండితులై హైస్కూళ్లలో, కాలేజీలో పనిచేశారు. తమ సంతానాన్ని కూడా హిందీ పండితులుగా తీర్చిదిద్దారు. ప.గో. జిల్లా భీమవరంలోని "బలుసుమూడి"లో వీరి పేరున హిందీవిద్యాలయం ఏర్పడి అనేకులకు హిందీ నేర్పుతుంది. ప్రతి సంవత్సరం వందలాది విద్యార్థులు దక్షిణ భారత హిందీ ప్రచార సభ వారి పరీక్షలకు హాజరై ఉత్తీర్ణతను సాధిస్తున్నారు. వీరి శిష్యులలో ప్రముఖులు గోపరాజు రంగరాజు ఎం.ఎల్.ఏ.గాను, టి.టి.డి. చైర్మన్‌గానూ పనిచేశారు. గొట్టుముక్కల రామచంద్ర రాజు ఎం.ఎల్.ఏ.గాను, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రెసిడెంటుగాను పనిచేశారు.

**వయోజన విద్య :**

సూర్యనారాయణ ఉపాధ్యాయునిగా పల్లెల్లో పనిచేసిన రోజుల్లో రాత్రి పాఠశాలలు నడిపారు. రాత్రి 7.00 గం॥ల నుండి పాఠాలు ప్రారంభమయ్యేవి. అరుగులమీద అరికేన్ లాంతర్ల ముందు కూర్చుని వయోజనులు పాఠాలు నేర్చుకొనేవారు. పాఠాలతోపాటు దేశభక్తి ప్రబోధం ముఖ్యాంశంగా ఉండేది. ఆనాటి యువకులు చాలామంది ఈ రాత్రి పాఠశాల వలన ప్రయోజనం పొంది ఉద్ధరింపబడ్డారు.

**హరిజనోద్ధరణ :**

గాంధీ ఆదేశానుసారం అనేకమంది యువకులు హరిజన వాడలకు వెళ్ళి ఆరోగ్యం ప్రాథమిక విద్య గురించి బోధించేవారు. ఒక డాక్టరు గారు హరిజనవాడకు వెళ్ళి ఉచిత వైద్యసహాయాన్ని అందించేవారు. 'హరిజన డాక్టరు'గా పేరుపడ్డ ఆ డాక్టరుతో వెళ్ళి సూర్యనారాయణమూర్తి మందులను పంచడంలో సాయపడ్డారు.

**మహాత్మాగాంధీ అనుయాయిగా :**

గాంధీజీ అనుయాయిగా కడవరకూ జీవించినవారు సూర్యనారాయణమూర్తి. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులొచ్చినా సరకుగొనక, గౌరవంగా బ్రతికారు. పిత్రార్జితంగా వచ్చిన మూడెకరాల భూమిని తాను నమ్మిన సేవాసిద్ధాంతాల నిమిత్తం వ్యయపరచారు. సమయం చిక్కినప్పుడల్లా తన అనుభవాలను యువకులతో పంచుకొని, వారిలో దేశభక్తి భావాలను రగుల్కొలిపేవారు.

గాంధీజీ మరణవార్త విని, వారు కృంగిపోయారు. ఆ సమయంలో సూర్యనారాయణమూర్తి భీమవరం తాలూకా ఏలూరుపాడులో ఉండేవారు. కొంతమంది యువకులతో కలసి, గాంధీగారి బొమ్మను ఊరేగించి దహనకాండను నిర్వహించి, కొంతమందితో కలసి పదిరోజులు మైలపట్టారు. కర్మకాండను శాస్త్రోక్తంగా జరిపించిన గాంధీ భక్తుడు సూర్యనారాయణమూర్తి!

వీరేశలింగం ప్రభావంతో రెండు వితంతు వివాహాలను జరిపించారు. రాజమండ్రిలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో శ్రీ సూర్యనారాయణమూర్తి చిత్రపటాన్ని పలువురు ప్రముఖుల సమక్షంలో ఆనాటి రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి

డి. శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు.

**శ్రీరామభక్తి సామ్రాజ్యం :**

శ్రీరాముడు వారి ఇష్టదైవం. రామకోటిని మూడుసార్లు వ్రాసి, భద్రాచల దేవస్థానానికి సమర్పించిన భక్తులు. రామనామస్మరణ శ్వాసగా జీవించారు. భార్యను 'రాముడూ' అని, పెద్దకుమారుని 'రామా' అని పిలిచేవారు.

రామనామ జపం వారిని ఎలా రక్షించిందో చిన్న ఉదాహరణ : భీమవరంలో పోలీసు ఆపీసరు లాఠీచార్జ్ ఉపదేశించి ఎదురుగా కూర్చొని చూస్తున్నాడు. ఒక కానిస్టేబులు ఆ శిక్షను అమలుబరుస్తున్నాడు. ఆ కానిస్టేబులు సాతానిజియ్యరు, వైష్ణవ సాంప్రదాయస్థుడు. రామభక్తుడు. అతను లాఠీచార్జ్ చేస్తూంటే, సూర్యనారాయణమూర్తి అందరిలా అయ్యోయ్, బాబోయ్ అని అరవకుండా దెబ్బదెబ్బకు 'రామా! రామా!' అంటూ అరిచారు. ఆ కానిస్టేబుల్ చలించిపోయి, కొన్ని కొట్టి కొన్ని కొట్టకా కొట్టీకొట్టనట్లు నటించాడు!

**సమాజ సేవ :**

చుట్టుప్రక్కల వారికి ఎలాంటి అవసరం కలిగినా ఆదుకొనేవారు. తుఫాను సమయంలో కష్టంలో ఉన్న పేదలకు తాను ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా శక్తివంచన లేకుండా సాయపడేవారు. ఒక అగ్నిప్రమాదంలో చిక్కుకున్న ముదుసలిని రక్షిస్తూ తను గాయపడ్డ దయార్ద్ర వ్యక్తి సూర్యనారాయణమూర్తి. ఒకసారి చిరుగు పంచెతో హరిజనుడైన ఒక జైలు సహచరి ఎదురవగా, తన కుమారుడు తనకోసం కొన్న పంచెల జతను సమర్పించిన సహృదయులు!

115వ జయంతి సందర్భంగా నిష్కళంక దేశభక్తుడు, త్యాగమూర్తి, స్ఫూర్తిప్రదాత అయిన కాల్నాధభట్ట సూర్యనారాయణమూర్తిని (గడ్డం మేస్టారిని) స్మరించుకొని నివాళులర్పించడం మనందరి కనీస కర్తవ్యం!

ప్రశ్న : మీ నాన్నగారికి సంతానం ఎంతమంది?

జ : మేము ముగ్గురం సంతానం. మా పూర్వీకులు సూర్యోపాసకులు. అందుచేత మా గృహనామం ''కాలనాధభట్టు'' అయి, కాలాంతరంలో "కాలనాథభట్ట"గా మారింది. అందుకే నాకు "భాస్కరం' అని నామకరణం చేశారు నాన్నగారు. నాన్నగారు దేశభక్తులు గనుక, నా సోదరికి ''భారతి'' అని పేరుపెట్టుకున్నారు. మా తర్వాతి సోదరుడు అకాలమరణం చెందాడు.

? : మీ నాన్నగారికి స్థిరాస్థులు ఏమైనా ఉండేవా?

జ : పిత్రార్జితంగా 3 ఎకరాలు పొలం, ఓ ఇల్లు వచ్చాయి. అవన్నీ స్వాతంత్ర్య సమరంలో తిరగటంవలన కరిగిపోయాయి.

? : వారి సంతానంగా మీకు ప్రభుత్వ సహాయం ఏమైనా అందిందా?

జ : టీచరుగా పనిచేసినంతకాలం సంసారం క్రింద జీతం ఖర్చు అయేది. మరణానంతరం ఇప్పటిలా పెన్షను సదుపాయం ఉండేది కాదు. ప్రభుత్వం భీమవరం తాలూకా బొండాడు గ్రామంలో అయిదు ఎకరాల ముంపు భూమి ఇచ్చింది. దానిని సాగులోకి తేవాలని ప్రయత్నించి, చేతులు కాల్చుకుని అయినకాటికి అమ్ముకున్నాము.

? : మీ నాన్నగారు రచనలు ఏమైనా చేశారా?

జ : కొన్ని ఆధ్యాత్మిక వ్యాసాలు, పద్యాలు వ్రాశారు. వాటిని మేము అచ్చువేయించాము.

? : వారి ప్రభావం సంతానంమీద, మీలో ఎవరిపైనైనా పడిందా?

జ : కుటుంబ పెద్దగా బాధ్యతలు నిర్వహిస్తూ హిందీ ప్రచారం మాత్రం చేయగలిగాను. రిటైరయాక, ఉడుతాభక్తిగా సమాజసేవ చేస్తున్నాను.

ప్రతి సంవత్సరం ఒక నెల పెన్షను పేదవిద్యార్థులకు, ఇతర సామాజిక కార్యక్రమాల క్రింద ఖర్చు చేస్తున్నాను.

మా సోదరి భారతికి నాన్నగారి ఆధ్యాత్మిక తత్త్వం అలవడింది. తెలుగు నుండి హిందీలోకి, హిందీనుండి తెలుగులోకి కొన్ని గ్రంథాలను అనువదించింది. ఆధ్యాత్మిక వ్యాసాలు, శ్రీరామ తత్త్వము, వేదాంత పంచదనం వ్యాసాలు వ్రాసింది.

మా నాన్నగారి పేరిట భీమవరం తాలూకా

'బలుసుమూడి' గ్రామంలో 'హిందీ విద్యాలయం' నడుపుతూ ప్రతీ సంవత్సరం వందలమంది విద్యార్థులను పరీక్షలకు పంపుతుంది.

ఆదివారాల్లో పాఠశాల విద్యార్థులకు భగవద్గీత తరగతులు నడుపుతుంది.

? : మీరు చెప్పదలచుకున్న అనుభవాలు ఏమయినా ఉంటే చెప్పండి.


జ : నిస్వార్థ స్వాతంత్ర్య సమర యోధుని సంతానంగా మేము చాలా గర్విస్తున్నాము. వారి తపఃఫలితంగా మేము సుఖంగా ఉన్నాము. ముఖ్యంగా మూడు విషయాలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను.

మొదటి స్వాతంత్ర్య దినోత్సవం నాటి సంబరం గురించి. 1947-08-16 నాటికి నాకు 12 సంవత్సరాలు. మేము జువ్వలపాలెం అనే గ్రామంలో ఉన్నాము. గ్రామం అంతటా పెళ్ళిసందడి నెలకొంది. ఎక్కడ చూసినా తోరణాలు, రంగురంగుల కాగితాలు కట్టారు. ప్రతి ఇంటి ముంగిటా జెండాలు నిలిపారు. పిల్లల చొక్కాలకు పిన్నీసులతో జెండాలను తగిలించారు. ఊరంతా ఊరేగింపు అయ్యాక మిఠాయిలు పంచారు. సాయంత్రం సభ జరిపి, నాయకులు మాట్లాడారు. స్వాతంత్ర్య సమరంలో జైలుశిక్ష అనుభవించినవారినందరినీ సన్మానించి వారి సేవలను పొగిడారు. మా నాన్నగారికి కూడా సన్మానం జరిగింది. మా కుటుంబం అంతా చాలా ఆనందించింది. స్వాతంత్ర్య సమరయోధుని సంతానంగా నాకు కలిగిన మొదటి ఆనందానుభవం అది. ఆనాటి దేశభక్తి ఇప్పుడు లేదు. ఈ విషయాలు నేటి ప్రజలకు తెలియాలని చెప్పాను.

రెండవ ఘటన. ఒకరోజు భీమవరం బజారులో వెడుతున్నాను. ఒక ఖద్దరు వేషధారి నన్ను ప్రక్కనున్న పొడుగాటి వ్యక్తికి పరిచయం చేశాడు. వెంటనే ఆ పెద్దమనిషి రోడ్డు అని కూడా సందేహించకుండా, నా పాదాలపై పడి సాష్టాంగ నమస్కారం చేశాడు. తర్వాత కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ మా నాన్నగారిమీద తన ఉద్యోగ నిర్వహణలో లాఠీఛార్జ్ చేసానని చెప్పి బాధపడ్డాడు. ఆయన సాతాని, విష్ణుభక్తుడు! బాధతో నాన్నగారు 'రామా రామా' అని అంటూంటే, రెండు మూడు దెబ్బలు కొట్టాక, తేలికగా కొట్టినట్టు నటించినట్లుగా చెప్పాడు. ఆయన చర్యకు నాకు ఒళ్ళు గగుర్పొడిచింది!

ఈ మధ్యనే రాజమహేంద్రవరంలోని 'స్వాతంత్ర్య సమరయోధుల భవనం'లో మా నాన్నగారి చిత్రపటాన్ని ఆనాటి మంత్రివర్యులు శ్రీ డి. శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. ఆ సందర్భంలో సభలోనున్న ఒక మేస్టారు మా నాన్నగారు గాంధీగారు మరణించినప్పుడు మైలపట్టి కర్మకాండలు నిర్వహించడం గురించి, చెప్పగానే మంత్రిగారు ఒక దండను తెప్పించి, నా మెడలోవేసి, 'మీ నాన్నగారు మహనీయులు. వారి సంతానమైన మీరు చాలా అదృష్టవంతులు' అన్నారు.

ఇంతకంటే ఆనందం ఏముంటుంది? *మిసిమి* పత్రిక కోసం మీరిలా నన్ను ఇంటర్వ్యూచేసి, గతంలోని మధురానుభూతులను జ్ఞప్తికి తెచ్చినందుకు *మిసిమి* పత్రికాధిపతులకు, మీకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.




మహీధర రామశాస్త్రి
ఫోన్ : 988 526 7370



# రెడ్ ఇండియన్లు : వ్యథాకవిత్వం

– నాగరాజు రామస్వామి



### నేటివ్ అమెరికన్ ఇండియన్లు నిసర్గ ఆత్మిక కవిత్వం

“భయానకమైన గాలివానల బతుకు బాటలో నడుస్తున్నాను. ఓ మహోత్కృష్ట మహితాత్మా! నేను సదా మనిషిలా నడచేలా నన్ను అనుగ్రహించు” – ఇది నేటివ్ అమెరికన్ ఇండియన్ చెరోకీ తెగవాళ్ల ప్రార్థనా గీతం. ఆ ‘మహోత్కృష్ట మహితాత్మ’ అన్ని తెగలవాళ్లు సమానంగా ఆరాధించే అత్యంత శ్రేష్టమైన మూల దైవం; 'The Great Spirit' – ప్రపంచాన్ని సృష్టించిన సర్వాత్మ , సకల జీవితాలను సంరక్షించే ఆత్మదేవత.

17,000 ఏళ్ల క్రితం, హిమ యుగానంతరం ధ్రువ ప్రాంతాలలో మంచు కరిగిననాడు, ఖండాంతర సేతువులై తలఎత్తిన భూభాగాల మీదుగా నడచివచ్చి, ఉత్తర అమెరికా విస్తృత మైదానాలలో స్థిరపడిపోయిన ప్రాత రాతియుగపు యురోపియన్లే (Solutreans) మూలవాసులైన నేటివ్ అమెరికన్లు. అలనాటి ఆర్కటిక్ ప్రాగ్ దిగంతాలలో ప్రతిఫలించిన అద్భుత అరోరా కిరణపుంజం కెనడా కొత్త భూములకేసి వంగి దారి చూపిందని, ఆ అలౌకిక ఘటన వెనుక ఆ మహాచైతన్య అదృశ్య హస్తమే ఉందన్న అచంచల ఆత్మ విశ్వాసం ఆనాడే ఆ జాతి మూలాలో పాతుకుపోయి ఉంటుంది.

యురోపియన్ల రాకకు ముందు సువిశాలమైన అమెరికా నేలమీద 500 పైచిలుకు మూలజాతి తెగలు ఉండేవి. ఈనాడు నామమాత్రంగా మిగిలిపోయిన తెగలలో నవహో (Navajo), అపాచే (Apache), చెరోకీ (Cherokee), సూ (Sioux), కికాపో (Kikaapoo), ఇరోక్వోయిస్ (Iroquois), మోహాక్ (Mohawk) కొన్ని. నేటి అమెరికన్ జనాభా లో నేటివ్ జాతి మూలవాసులు కేవలం 3.5% మాత్రమే.

నేటివ్ అమెరికన్లు స్వతహాగా మృదుస్వభావులు. స్వేచ్ఛాప్రియులైన వాళ్ల జీవితం కోలంబస్ రాకతో తలకిందులైపోయింది. వెల్లువలా వచ్చిపడిన వలసల ధాటికి వాళ్ల సంస్కృతి ఛిన్నాభిన్నమైపోయింది. యూరోపియన్లు వెంట తెచ్చుకున్న కుక్కలు, పందులు, ఆవులు, గుర్రాల వంటి పెంపుడు జంతువులు, గొధుమ, పీచ్, ఆపిల్ వంటి మొక్కలు కొత్త ప్రపంచాన్ని ముంచెత్తాయి. ఈ జీవ సామ్రాజ్యవాద దాడికి పర్యావరణం కలుషితమైపోయింది. వాళ్లు తెచ్చుకొన్న జీవ సంపదతో దిగుమతైన వ్యాధులు సోకి రోగనిరోధక శక్తి లేని వేలాది నేటివ్ ఇండియన్లు మరణించారు. తెల్లవాళ్లు భూములను ఆక్రమించుకొని వాళ్లను నిర్వాసితులను చేసి తరిమి కొట్టారు. అప్పనంగా వచ్చిన వేల ఎకరాల అటవీ ప్రాంతాలను సాగుచేసేందుకు అడవులను కొట్టేసారు. గడ్డి మైదానాలను కాల్చివేసి, సాగుభూములుగా మార్చుకున్నారు. పర్యవసానంగా, అదుపులేని వాన, నీరు కోసిన మట్టితో నదులన్నీ పూడుకుపోయాయి. మొత్తం పర్యావరణ సమతుల్యం దెబ్బతింది. వ్యవసాయానికి కావలసిన కూలీలకోసం లక్షలాది ఆఫ్రికన్లను బానిసలుగా తీసుకొచ్చారు. నదీజలాల చేపలను విపరీతంగా పట్టివేసి యురోప్‌కు ఎగుమతి చేయడంవల్ల మత్స్యసంపద అడుగంటింది. అమెరికా మైదానాలలో విస్తృతంగా ఉన్న బైసన్లను చంపి, విచ్చలవిడిగా ఉన్నిని విదేశాలకు పంపడంతో

ఇండియన్ల వేట కుంటుపడింది.

వలసవాదుల అమానుషమైన ఈ సాంస్కృతిక దాడి అనేక సంఘర్షణలకు దారితీసింది. సెట్లర్ల ఇండియన్ల మధ్య ఏళ్ల తరబడి యుద్ధాలు కొనసాగాయి. సెట్లర్లు స్వంత మాఫియాలను పోషించుకొని దాడులు జరిపారు. నేటివ్ ఇండియన్లు జరిపిన మెరపు దాడులకు సెట్లర్లు సైతం కాలనీలను వదలి, పారిపోవలిసి వచ్చింది. చెదిరిపోయిన వాళ్ల గుర్రాలు అడవులను ఆశ్రయించి, అనూహ్యంగా వృద్ధి పొంది మేలుజాతి అశ్వాలై (Appaloosa) ఇండియన్లకు అందివచ్చాయి. ఆ అశ్వబలంతోనే వాళ్లు సెట్లర్లపై యుద్ధాలు చేశారు. 18 వ శతాబ్దంనాటికి ఉత్తర అమెరికాలో స్పానియన్ల ప్రభుత కొంత స్థిరపడింది. అయినా ప్రభుత్వ ప్రతినిధులకూ సెట్లర్ మాఫియాలకూ మధ్య ఘర్షణలు కొనసాగాయి. ఇండియన్లకూ మఫియా మూతాలకూ మధ్య ఎన్నో పోరాటాలు జరిగాయి. 1609/1610 భయంకర శీతాకాలపు కరువు రోజులలో ఇండియన్లు యురోపియన్ సెట్లర్ల గ్రామాలను చుట్టుముట్టి నిషేధించారు. వాళ్లు ఆకలికి ఆగలేక, దొరికిన జంతువులను, బూట్ల చర్మాన్ని, బెల్ట్‌లను, తుదకు కొందరు సహ సెట్లర్లను కూడా తినేశారని అంటారు. డకోటాలో జరిగిన Wounded Knee నరమేధంలో ‘"Ghost Dance" ఉద్యమం ద్వారా తెల్లవాళ్లను ఎదిరించిన 150 మంది ‘సూ’లు (Sioux) నిర్దాక్షిణ్యంగా వధింపబడ్డారు. పత్తి పండే భూముల కోసం 1830లలో ఫ్లోరిడా, జార్జియా, టెన్నెసీ, అలబామా, నార్త్ కారోలినాలో స్థిర నివాసులైన ఇండియన్లను పశ్చిమ ప్రాంతాలలో ఏర్పరచిన "Indian Territory"కి ప్రభుత్వం బలవంతంగా పంపించింది. సుదీర్ఘమైన ఆ దుర్భర ప్రయాణంలో 3500ల మంది క్రీక్ తెగలవాళ్లు అసువులు బాసారు. వాళ్లు వెళ్లిన ఆ మార్గానికి "Trail of Tears" అన్న పేరు నిలిచిపోయింది. 1610 నుండి 1775 దాకా అనేక యుద్ధాలలో సుదీర్ఘకాలం పోరాడినా లాభం లేకపోయింది. ఆధునిక మారణాయుధాల ముందు, కుటిల యుద్ధ తంత్రాల ముందు ఇండియన్ జాతులు ఓటమిని అంగీకరించక తప్పలేదు. నాటి అమెరికన్ నేటివ్ ఇండియన్ల అస్థికలమీద నాగరిక అమెరికా రాజప్రసాద నిర్మాణం జరిగిపోయింది.

నేటివ్ అమెరికన్ తెగల సాంస్కృతిక భూమిక వాళ్ల ‘ద గ్రేట్ స్పిరిట్’. చరాచర జగత్తులోని ప్రతి ఒక్క అంశం ఆ బృహదాత్మ చైతన్య స్వరూపమే. ప్రకృతిలోని పర్వతాలు,



వృక్షాలు, జంతువులు, అడవులు, ఆకాశం, సముద్రం అన్నీ ఆ ఆత్మ స్ఫురద్రూపాలే. ఈ పృథివి, పృథివిలోని ప్రతి ఒక్క భౌతిక వస్తువునూ ఆ సర్వాత్మానుబంధ అలౌకిక చేతనా రూపంగానే వాళ్లు కొలుచుకున్నారు. వాళ్ల తాతముత్తాతల మృతాత్మలుసైతం ఆ విశ్వాత్మ చిద్రూపాలే; ఆ అనంత ఆత్మతో అనుసంధించే ఆత్మిక సంబంధాలే. వాళ్ల ఆచారాలు, రిచువల్స్, ఆటపాటలు, నృత్యాలు అన్నీ ఆ సర్వాత్మతో అనుసంధించేవే. ‘మిథ్’ వాళ్ల ఎథీరియల్ లింక్. పూర్వీకులపై వాళ్ళకున్న అచంచల భక్తి భావం అద్వితీయం.

కాలికింది నేలానూ, కలకాలపు కలలనూ, అపూర్వ ఆత్మసంస్కృతినీ కోల్పోయిన ఈనాటి అధునిక అమెరికన్ నేటివ్ ఇండియన్ ఇంకా లోలోన రగులుతూనే వున్నాడు. 20 వ శతాబ్దపు కవిగా ఇంకా పొగలు గక్కుతూనే వున్నాడు. అధునిక నేటివ్ అమెరికన్ కవితాధార ద్వివేణి. ఒకటి సనాతన సాంస్కృతిక స్రవంతి. రెండవది చల్లారీ చల్లారని రక్త తరంగిణి. వాళ్లు రాసుకున్న కవితలు, వాళ్ల ఆత్మప్రబోధ గీతాలు వాళ్ల జీవిత కథలను అత్యంత ప్రతిభావంతంగా అభివ్యక్తీకరించే సిసలైన ఉపకరణాలని భావించి, నా ఈ అనువాదాలను పొందుపరుస్తున్నాను:

**‘సూ’ల ప్రార్థనా గీతం**

(Sioux Indian Prayer)

*ఓ బృహత్ చైతన్యమా !*
*నీ కంఠ స్వరం గాలిలో తేలుతున్నది,*
*నీ శ్వాస ప్రపంచపు ప్రాణమౌతున్నది.*
*బహుళమైన నీ సంతానంలో*
*ఒక్క చిక్కినవాణ్ని నేను;*
*బహూకరించు నీ శక్తిని, నీ సంబుద్ధిని.*
*ఈ మలిసంజ కెంజాయలను దర్శింపనిమ్ము,*
*నీ గొంతు పలికించిన శ్రావ్య గీతాలను విననిమ్ము,*
*నీ సృజనాత్మక సృష్టికి నమస్కరింపనిమ్ము.*
*నీవు నా వాళ్లకు బోధించిన జ్ఞానోపదేశాలు*

*ఆకు ఆకునా, గుట్ట గుట్టనా నిక్షిప్తమై వున్నవి -*
*నన్ను ఆవిష్కరించుకోనిమ్ము.*
*నేను కోరుకుంటున్న సత్తువ*
*నా సోదరులను మించిపోయేందుకు కాదు;*
*నా ఆంతర శత్రువును - నా అహాన్ని*
*గెలిచేందుకు,*
*చరమ చరణంలో నిన్ను నేను ఆశ్రయించిననాడు*
*నిర్మలమైన ఆత్మగా*
*నీ ముందు సగర్వంగా నిలిచేందుకు.*

(ఇది 16 ఇండియన్ తెగలవాళ్లు అరిజోనా సమావేశంలో ఉమ్మడిగా ఎంచుకొన్న 'సూ' తెగవాళ్ల (Sioux) ప్రార్థనా గీతం. Cabot's Old Indian Museum in Desert Hot Springs, Californiaలో లభించిన ఈ గీతం Los Angeles పత్రికలో "World day of Prayer" 1958 లో ప్రచురించబడింది.)

### స్వర్గ ధామాలు రోదించాయి

### And The Heavens Cried (Trail Of Tears)

*ఆ సందిగ్ధ అసుర సంధ్యలో*
*ఈ వ్యధాభరిత నేలమీద*
*కారు మేఘాలు కమ్మిన ఆకాశం*
*రక్తాశ్రువులను వర్షిస్తున్నప్పుడు,*
*మేమంతా*
*ఆ తెల్లదొర తెలివి తేటలకు తెల్లబోయాం.*
*మా సర్వస్వం దగ్ధమైపోతున్నప్పుడు*
*అచేతనంగా అసహాయ స్థితిలో ఉండిపోయాం.*
*నా లోకాలన్నీ*
*ఆ కన్నీటి కాలి బాటమీద*
*కడకంటి కవోష్ణధారలు కురిపించాయి.*
*మా జనసంద్ర తీరాలను చేరినవాళ్ల పడవలు*
*తాతలనాటి మా భూములను కాజేస్తున్నా,*
*కాగితం మీది రాతలన్నీ నీటి మీది గీతలౌతున్నా*
*కళ్లు మూసుకోక తప్పలేదు మాకు.*
*మా కాళ్లకింది నేల మాది కాదని*
*వాళ్లు మమ్మలను తరిమేస్తున్నప్పుడు*
*ఆ 'కన్నీటి కాలి బాట మీద'*
*కన్నీరు కార్చాయి స్వర్గ సీమలు.*
*వీర యోధులు నడయాడిన మా నేలను*
*తెల్లోడి పేరాశ*
*మా కళ్లముందే మా రక్తంతోనే తడిపేస్తున్నా*
*ప్రయత్న మాత్రంగానే మిగిలిపోక తప్పలేదు.*
*వేలాది వీరుల రక్తం చిమ్ముతున్న ఆ సంజలో*
*ఆ 'కన్నీటి కాలి బాటమీద'*
*అశ్రువులు ధారబోశాయి ఆకాశాలు.*
*వాయు దేవతల ఆదేశాలమేరకు పోరాడి*
*మా ఆత్మధనులు అసువులుబాసిన*
*ఆ కటిక చీకటి వేళలో*
*ఆత్మదఘ్నంగా రోధించాయి స్వర్గ ధామాలు.*

### ఇండియన్ ఇంక్

### (Indian Ink)

*లోన*
*ఏవో గుసగుసల ప్రతిధ్వనులు*
*ఏనాటివో*
*ఇండియన్ నుడికారాల స్తోత్ర ఉచ్ఛారణలు*
*అనాది మృదుల కాంతుల మీద జోగుతూ*
*లోనికీ బయటికీ పచార్లు చేస్తున్నవి.*
*మెత్తని ఆటమన్ పర్వతాల*
*మంత్రముగ్ధ పొడి నీలి నయనాలు*
*మాంత్రిక గీతాలు పాడుతున్నవి.*
*ఆకాశం నుండి రాలుతున్న నాదోక్తులు*
*పైకి లేస్తున్న ప్రార్థనా గీతాలు ఆత్మను కమ్మిన పాత భూతాలను*
*పారద్రోలుతున్నవి.*
*వెన్నెల నీడల కింద నివసించే పూర్వీకుల*
*అధోలోకాల అభౌతిక ఆత్మ శరీరాలు,*
*నేల బొరియలను చీల్చుకొని పైకి వస్తున్న*
*లిమొకాసిన్ చర్మకారుల అశరీర ఆత్మలు,*
*నింగికెగిసే ఆదిమ ధూమాలను నేసే*
*ఇండియన్ హస్తాలు,*
*మెరిసే గవ్వలు, దంతపు బూటాలు చుట్టిన*
*లిలికలల సంరక్షక వినమ్ర శిరస్త్రాణాలు*
*ఎర్రని పువ్వుల చుంబనాలను వెంబడిస్తున్నవి.*
*ఉద్వేగాల మద్దెలలు మోగుతున్న గాలులలో*
*ఎండిన గొంతుకలు వర్షం కోసం విలపిస్తున్నవి.*
*ఉన్మత్త వేణుగానం రగిలించిన సనాతన ద్వేషం*
*ఉద్విగ్న అగ్నిజ్వాలై జ్వలిస్తున్నది.*

*అడవి దున్నలు చిమ్మిన రక్తపు వాసనల బర్రీలు*
*నా కంటి పొరలను, నా కళ్లను మూస్తున్న నా చేతులను*
*తూట్లు పొడుస్తున్నవి.*
*నా పగిలిన తల కార్చిన రక్తంతో తడిసిన నా అరచేతులు*
*నా పాత జ్ఞాపకాల కన్నీళ్లకు దోసిలి పడుతున్నది.*

(Moccasin - నేటివ్ ఇండియన్ల సాంప్రదాయ పాదరక్షలు కుట్టే మోచీ.

Dream Catcher - చెడు కలలు రాకుండా ఉంచేందుకు తలలకు తగిలించుకునే పూసల దండలు. రంగుల దారాలతో, రకరకాల ఈకలతో అల్లిన గొండలు.)

**సనాతన వీర యోద్ధ**
(The Warrior)

*ఎండకు మాడిన నీ నొసటి ముడతల్లో*
*అలనాడు నీవు మోసిన బరువులున్నవి*
*రెండు శతాబ్దాలు పాటు కొనసాగిన*
*నీవాళ్ల బాధామయ రోదనలు,*
*వర్షంలా కురిసిన వాళ్ల కన్నీళ్లు*
*నిన్ను కలచి వేసినవి.*
*ఇప్పుడు,*
*నీ రోషకషాయ విషాద నేత్రాలలో*
*ఆకాశం ప్రతిఫలిస్తున్నది.*
*అక్కడ,*
*రెక్క విప్పిన మీ గరుడపక్షి,*
*మీ అపలూసా పంచకళ్యాణి గుర్రం,*
*అందరితో మమేకమైన ఆ ఉత్కృష్ట భూతాత్మ*
*నీ చెంత నిలిచి వున్నది.*
*ఇక్కడ,*
*రాత్రంతా శక్తిపూజా ఆవహనా దరువు మోగుతున్నది,*
*ఆత్మలన్నీ ఏకమైన ఆ తొలిసంజ మిగిల్చిన చీకట్లలో*
*అగ్ని జ్వాలలు స్వర్ణ హరిణాలై ఎగసి పడుతున్నవి,*
*నీ వాళ్లంతా నిన్ను పిలుస్తున్నారు వచ్చి*
*రక్షించమని.*
*రా ! దిగి రా !*
*ఆప్తహస్తాలు చాచి వచ్చి హత్తుకో నీ ఆపన్నులను;*
*ఆరాధ్య అధిదేవత ఆ ప్రకృతి మాతలో ఐక్యమైన*
*ఆదివాసుల ఆది చైతన్యమంటి ఆనాటి నీ చిరునవ్వుతో.*
*స్రవంతులు, సరస్సులు, వనభూములు*
*ఇప్పుడు వణకిపోతున్నవి బాధతో భయంతో.*
*చూడు,*
*ఆనాడు నీ తలపాగను అలంకరించిన 'తెగల' తూలికలకు*
*సర్దుకోక తప్పకున్నది కొత్త గాలుల మసక భవితవ్యంలో.*

(ఆనాటి అమెరికన్ ట్రైబల్ లాండుకు చెందిన మేలుజాతి (తెల్ల మచ్చల) అశ్వం – Appaloosa.

వాళ్ల జీవనధారలోని అన్ని పార్శ్వాలలో వేళ్లూనిన దైవీయ విశ్వాసాల అవిభాజ్యమైన గ్రేట్ స్పిరిట్.)

**సనాతన శిలలు**
(Ancient Stones)

*ఏనాటివో ఈ ఎరుపెక్కిన శిలలు –*
*ఈ పురాతన రక్తపు చారల రాళ్లలో*
*మొనదేలిన కొరవి బొగ్గుల*
*శరాగ్రాలున్నవి.*
*గాలిలో*
*వెంటాడే మంత్రఘోషలు !*
*భీతిగొలిపే డోలు ధ్వనుల గుండె దడలు !*
*ఇక్కడ*
*పొడచూపుతున్నవి నా రక్త ప్రసరణలో*
*పొంగులెత్తే నీ రుధిర ధారలు,*
*చితుకుతున్న కాల ఝురులు !*
*ఎన్ని పాత కథలు వింటూ మనం*
*ఎన్నెన్ని దూరాలు నడచి వచ్చాము*
*అమలిన ఆత్మరూపాలమై !*
*మేఘాలు గర్జించినప్పుడు*
*ఎన్ని రాత్రులు నేను చలించిపోయాను !*
*నెగళ్ల చుట్టు రౌద్ర నర్తనలు చేస్తున్న ఎందరి*
*వీర యోద్ధల దృశ్యాలను దర్శించాను !*
*తారాచంద్రులు మనను తిలకిస్తున్న రేయిలో*
*ప్రతిధ్వనిస్తున్న గొంతుకలతో వాళ్ళు*
*పర్వతాత్మల చుట్టూ పరిభ్రమించడం చూచాను !*
*అందుకే*
*ఆరాధించు మాతృభూమిని,*
*అభిమానించు అనంతాకాశాన్ని,*
*అర్పించు*
*అమేయమైన సుందర సృష్టికి నీ*
*సర్వస్వాన్ని.*

*ఏ నాటివో ఈ ఎర్రెర్రని పురాతన శిలలు –*
*ఈ రాళ్ల మధ్య నా ఆత్మదర్పణం*
*ఆనాటి అమర జీవులను ప్రతిబింబిస్తున్నది.*

### అశ్రుపథం

(A Trail of Tears)

*అశ్రుపథాలను,*
*ఆకలి బాటలను, కష్టాల కఠిన దారులను*
*గడచి వచ్చాము –*
*కొత్త నేలలను వెతుక్కుంటూ.*
*సుదీర్ఘమే మా ప్రయాణం,*
*కాని, దృఢమైనవి మా నిశ్చయాలు.*
*వాళ్లు మా భూములను కొల్లగొట్టారు;*
*కాని,*
*త్రెంచలేరు మా ఆత్మలను,*
*త్రుంచలేరు మా బాణాలను.*
*మా పాదాలు చీలిపోవచ్చు,*
*మా కంబళ్లు చిరిగిపోవచ్చు*
*కాని, మాకు వెన్నుదన్నుగా ఉన్నవి*
*వెన్నంటి వస్తున్న మా పూర్వీకుల ఆత్మలు.*
*ఇక ఆపేద్దాం కన్నీటి ధారలను,*
*హత్తుకుందాం ఈ నవజీవన ఆరంభాలను,*
*అశ్రుపథాల మీద మొలచిన కొత్త తావులను;*
*పుడమితల్లి అందించిన ఈ ఆత్మీయ కానుకను.*

### హోనలూలులో వర్షం

(Its Raining In Honolulu)

*కొండ బొమముడి మీద మంచురేక పేరుకున్నది;*
*టారో చెట్ల ఆకు ఆకు, పూలపొదల రేకురేకు*
*ఉన్మత్త పత్రమై ఊగిపోతున్నది.*
*వికసిస్తున్న పూల ఎదల పాటల కెరటాల కింద*
*వర్ష గీతాలు వర్ధిల్లుతున్నవి.*
*దూపిల్లిన పువ్వులా, దాహంగొన్న ధాత్రిలా*
*వాన విచ్చుకుంటున్నది.*
*మేము మాట్లాడడం మానేసి, ఆలోచనలకు స్వస్తి పలికి*
*తాదాప్మ్య మార్మికతను తాగుతున్నాం,*
*మా శ్వాసల కింది నిశ్వాసాలను వింటున్నాం.*
*ఇదే కదా*
*వాన వానయ్యేందుకు, మనిషి మనిషయ్యేందుకు మార్గం!*
*అంతా తడితడిగా వుంది –*
*దారుణ విద్రోహులు నిండిన ఈ తడి నేలలతో సహా;*
*ఇక, పాటలను నాటాలి పాపాలు నడచినచోట.*

(నేటివ్ అమెరికన్ ఇండియన్ల భూములను ఆక్రమించి, వాళ్ల సంస్కృతిని ధ్వంసం చేసి, వాళ్ల జాతిని నిర్మూలించి, వాళ్లను నిర్వాసితులనుచేసి తరిమికొట్టిన యురోపియన్ కాలనైజర్లు.)

### తోడేలు ప్రార్థన

(Wolf Prayer)

*ఓ ధీర గంభీర వృకచేతనా!*
*అడవి దారులలో, నిశ్శబ్దపు నీడల్లో,*
*నాచు తీగలు అల్లుకున్న వృక్షఛాయల్లో*
*చలన చైతన్యమై చెంగలించే*
*ఓ తోడేటి ఆత్మ చైతన్యమా!*
*అందించు నాకు*
*నీ నిజ శాక్తిక ఆదిమ తేజాన్ని,*
*నీ మెరుపు కనుల వివేకాన్ని .*
*నేర్పు*
*నా ఆకాంక్షలను తీర్చుకునే మెలకువను,*
*నా ఆప్తులను రక్షించుకునే*
*కౌశలతను.*
*చూపించు గుప్త పథాలను, వెన్నెల క్షేత్రాలను.*
*ఓ బీభత్స ధృఢ సచేతనా!*
*నా ఏకాంతాలలో*
*నా వెన్నుదన్నువై ఉండు,*
*నా సంతోష సమయాలలో*
*ఉత్సాహంగా ఊల వేస్తూ నన్ను వెన్నంటి ఉండు.*
*సంరక్షించు నన్ను*
*ఈ ప్రమాదాల ప్రపంచంలో సాగిపోతున్నపుడు.*

### హరిణ తార

(The Deer Star)

(ఇది అనగా అనగా, అనేక ఏళ్ల క్రితం ఒక యువ వేటకాడు జింకను వెంటాడిన కథ)

*విల్లబులు లేవు, ఏనాడూ వేటాడింది లేదు;*
*ఐనా, నీలి వేకువలో నిదుర లేచాడో వేటకాడు.*
*ఫక్కున నవ్వారు ఊరి వనితలు,*
*కొలను చెంత వనితలు.*

*రోషం పట్టలేక ఓ ఎర్ర జింకను పట్టుకునేందుకు యువకుడు*
*ఉట్టి చేతులతోనే ఉన్నట్టుండి పరుగందుకున్నాడు.*
*ముందు ఉరుకుతున్న లేడి, వెనుక వెంటాడుతున్న యువకుడు–*
*వనాలను దాటారు, వనగిరులను దాటారు, పూల పొదలను దాటారు,*
*బెదిరిన హరిణాలు చెదరుతున్న హరిత శాద్వలాలను దాటారు.*
*ఉదయ రాగాల తుహినాలను పులుముకున్న తడి ఎడారులను దాటి*
*భూగోళపు అంచుల ఆవలి ఆకాశ సీమలో నక్షత్రాలై రూపొందారు.*
*ఈనాటికీ,*
*ఆ వేసవి ఆకాశాల కింది పర్వత సానువులలో,*
*సారంగాలు తిరుగాడే ఆ ఉదయ మైదానాలలో*
*వేగుచుక్క పొడిచేదాకా వేటకాళ్లు వేచి ఉంటారు .*

## స్వప్నచక్ర వాహకులు
## (Carriers of the Dream Wheel)

*వాళ్లు స్వప్న చక్ర వాహకులు !*
*ఇది వాళ్ల కంఠ స్వరాలను పొదుగుకున్న*
*కలల చక్రం –*
*తాను తిరుగుతూ*
*వాళ్ల గొంతులను*
*అస్తిత్వ భ్రమణ కేంద్రం మీద నిలుపుతూ*
*ఆదిమ లోకాలచుట్టూ పరిభ్రమిస్తున్నది.*
*వాళ్లు పాత పాటలను చెక్కుకుంటూ*
*కలలచక్రం మీద పేర్చుతున్నారు;*
*భౌమ్యాకాశాల ఆదివాసుల నామధేయాలను*
*భ్రమణ చక్రం మీద తిప్పుతున్నారు;*
*వాళ్లను ముసలాళ్లు అనేకన్నా*
*ముసలివాళ్ల గొంతుకలవాళ్లు అనడం సబబు.*
*తమ తమ శిబిరాలలోకి*
*స్వప్న చక్రాన్ని మోసుకుంటూ తిరుగుతున్నారు*
*"రండి రండి, పురాతన కథలను చెప్పుకుందాం,*
*కమ్మని సనాతన గీతాలను పాడుకుందాం" అంటూ.*

(20 వ శతాబ్దపు అధునిక నేటివ్ అమెరికన్ విద్యావంతులు తమ పురాసంస్కృతిక మౌఖిక సంప్రదాయాన్ని ఉద్ధరించాలని తపిస్తున్న అభ్యుదయవాదులు.)

## మోహాక్ గీతాలు
## (Mohawk Prayers)

*కొన్ని నిషిద్ధ వర్ణాలు,*
*కొంత తళతళల కాంతి,*
*ఒక కప్పెడు ఉదయం,*
*ఓ కట్టె కోలకు చుట్టిన రేయి*
*మోహాక్ గాలిలో గుసగుసలాడుతూ*
*కాంతి కప్పును పంచుకుంటున్నవి.*
*నది ఒడ్డున*
*ఒక మోహాక్ వనిత*
*వీర యోధుని గుడ్డలను ఉతుకుతున్నది.*
*సనాతన సూర్యుని నీరెండలో*
*నున్నని బండమీద సుతారంగా*
*లయబద్ధంగా బాదుతున్నది.*

## దిగి రండి, గీత పథాల గుండా
## (Come On The Trail Of Song)

*ఓ నవాహో దేవతలారా !*
*రండి, గీత పథాల గుండా;*
*నిశ్శబ్దంగా, నింపాదిగా.*
*ఆకాశ భూముల నుండి*
*పంచ పాతాళాల లోకాల నుండి*
*పర్వత పాద నిశ్రేణినెక్కి*
*సింగిణీ సేతువు మీదుగా;*
*ఓ నవాహో దేవతలారా !*
*దిగి రండి, గీత పథాల గుండా.*

(నవాహో (Navajo) అమెరికన్ నేటివ్ ఇండియన్ల ఒక ముఖ్యమైన తెగ.

అధోలోకాలు అయిదు ఉన్నవని వాళ్ల నమ్మకం. అధోలోకాలనూ, అవనినీ, స్వర్గధామాలను కలిపి కట్టే సర్వాత్మిక సార్వత్రిక ఆత్మ వాళ్ల అధిదైవం – The Great Spirit.)

ఇది కాల ప్రవాహంలో కొట్టుకుపోయిన ఒక జీవ జాతి విషాధ గాథ – ముగింపులేని ఒక ముగిసిన కథ.



నాగరాజు రామస్వామి
హైదరాబాద్.
ఫోన్ : 837 448 6186

# నన్నెచోడుని జానుతెనుగు

– డా. జి. నాగయ్య

తెలుగు తొలిసారిగా జనుతెనుగు, వస్తుకవిత్వ అను పదములను పేర్కొనినవాడు నన్నెచోడుడే. జానుతెనుగు, వస్తుకవితాస్వరూప స్వభావములను వివరింతము.

**ఎ) జానుతెనుగు :**

దీనిని నన్నెచోడుడు ఏ అర్థమున వాడెనో తెలుపుటకు పలువురు పండితులు ప్రయత్నించిరి. చిలుకూరి నారాయణరావుగారు జానుతెనుగును గురించి వ్రాసిన వాక్యములివి. ‘‘జాను అనేది చదును శబ్దమునకు రూపాంతరము చదును చదురునకు రూపాంతరము. ఇది చతుర శబ్దభవము జానుతెనుఁగు లేక చదునైన తెనుఁగు అంటే లోక వ్యవహారములోనున్న సర్వజన సుబోధమైన తెనుఁగు. దీనినే సోమనాథుడు తేటతెనుఁగు తిన్నని సూక్తి అన్నారు. అది కవుల విద్వత్తును ప్రకటించటానికి నిఘంటు వ్యాకరణముల మూలముగా బోధపడే సంస్కృత పదభూయిష్టముకాక, అదేవనిగా వికారముగా, బలవంతముగా ఏరి కూర్చిన అచ్చతెనుఁగు మాటలతో మాత్రము కూడిన భాషయున్నుగాక, లోక వ్యవహారబద్ధములైన సంస్కృతాంధ్ర పదములతో వెలయువలెను.’’

కాని జానుతెనుగు వారిచ్చిన వ్యుత్పత్తికిని, వివరణమునకు సమన్వయము కుదురుటలేదు. పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకములో జాను తెనుగును సూచించు పద్యమిది :

*‘బలుపొడ తోలు సీరయును బాపసరుల్ గిలు పారు కన్ను వె*
*న్నెల తల సేదు గుత్తుకయు నిండిన వేలుపు టేఱువల్లు పూ*
*సలుగల తేని లెంకవని జాను దెనుంగున విన్నవించెదన్.’*

పై పద్యముననున్నవి శుద్ధాంధ్రపదములే. వీనినిబట్టి జానుతెనుగనగా అచ్చతెనుగని శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారు స్పష్టముగా ఇట్లనినారు. ‘‘తెనుఁగుదేశిలో వాడుకలోనున్న తెనుఁగుమాటలను జానుతెనుఁగని వాడిరి. అదే యచ్చతెనుఁగు జానుతెనుఁగున కుదాహరణముగా నీయఁబడిన సోమనాథుని పద్యమచ్చ తెనుఁగుననే రచింపఁబడెనుగదా!’’ మూలఘటిక కేతన ఆంధ్రభాషా భూషణమున చూపిన పట్టికలను బట్టి దేశి తెనుఁగు అచ్చ తెనుగుకంటే విలక్షణమైనదని తెలియుచున్నది. అచ్చతెనుగు ‘ఎల్లవారికిఁ దెలిసెడి యా పలుకు’ లని కేతన పేర్కొనినాడు. విన్నకోట పెద్దన దేశ్యము, అచ్చ తెనుగులను ఇట్లు నిర్వచించినాడు.

*‘శ్రేయములై బహుదేశా నేయములై చక్కఁదనము నెఱదనములు నై / యాయా నెలవులఁ జెవులకుఁ దీయములగు పలుకులెల్ల దేశ్యములరయన్’*

– కావ్యాలంకార చూడామణి. 9–16

*‘ఈ మూడు తెఱంగులలో నేమిటనున్ దొరలకున్న నెల్లజనులకున్ / లో మిగుల దేటపడియెడు నా మాట యచ్చ తెనుఁగులన నేగడొందున్’*

– కావ్యాలంకార చూడామణి. 9–18

దేశ్యము, అచ్చతెనుగుల విషయమునకేతన, విన్నకోట, పెద్దనల అభిప్రాయములొకటే అని తెలియుచున్నది. విన్నకోట పెద్దన ప్రకారము దేశ్యపదములందు అన్యదేశ్యములుండవచ్చును. కాని అవి స్థానికుల చెవులకు తీయముగా నుండవలెను. కనుక విన్నకోట పెద్దన చెప్పిన దేశ్యము నన్నెచోడుని జానుతెనుగు ఒకటే అయియుండవచ్చును. విన్నకోట పెద్దన ఉదహరించిన దేశ్యపదములలో చాలా భాగము నన్నెచోడుడు వాడినవే. ఈ దృష్టితో చూచిన పాల్కురికి సోమన వృషాధిప శతకములో జాను తెనుగును కిచ్చిన ‘‘బలుపొడతోలు సీరయును’’ అను లక్ష్యపద్యములోని పదములు అచ్చ తెనుగు పదములుకావని, కేతనమతము ప్రకారము అవి దేశి తెనుగు పదములని చెప్పవచ్చును. కూచిమంచి తిమ్మకవి అచ్చతెనుగును గురించి చెప్పిన పద్యమిది.

*‘‘సూరి జనుల్లోక వ్యవహారంబగు బాస దేశ్య మంద్రదియో హితం*
*బారఁగ నచ్చ తెనుంగని యారూఢిగఁ గొంద రందు రగజాధీశా’’*

– లక్షణ సార సంగ్రహము. 1–69

కూచిమంచి తిమ్మకవి మతమున అచ్చతెనుగు, దేశ్యము

ఒకటియేకాని వేరు కాదు. దేశ్యములో తద్భవము, గ్రామ్యము అంతర్భవించును. నన్నెచోడుడు పేర్కొనిన జానుతెనుగు విన్నకోట పెద్దన కావించిన దేశ్యనిర్వచనమునకు దగ్గరగా నుండుటచే జానుతెనుగు, దేశ్యము, అచ్చతెనుగు అను మూడును ఒకే అర్థమున ప్రయోగింపబడినవని చెప్పవచ్చును. కాని నన్నెచోడుని కవిత్వములో తత్సమశబ్దములు కొల్లలు. పాల్కురికి సోమనాథుని గ్రంథములందు సయితము తత్సమ శబ్దములు లెక్కకు మించియున్నవి. కనుక జానుతెనుగు యయాతి చరిత్రాదులలోని అచ్చతెనుగు కానేరదు. దానికంటే విలక్షణమైనది. జానుతెనుగు కన్నడ 'జాణ్నుడి'కి ప్రత్యామ్నాయమగు తెలుగు పదమని కొందరి భావము. కన్నడమున నాగవర్మ, గుణవర్మలను వారు 'జాణ్నుడి'కి ప్రసిద్ధులు. నయసేనకవి తన ధర్మామృతమునందును, జన్న కవితన యశోధర చరిత్రములోను గుణవర్మ 'జాణ్ణుడి'ని ప్రశంసించి యున్నారు. కన్నడ కవులు కొందరు 'జాణ్ణుడి' అను పదమును ప్రయోగించి యున్నను, దాని స్వరూపమును స్పష్టముగ వారు తెలుపలేదు. జాణతనముతో చమత్కార యుక్తముగా ప్రయోగింపబడిన కన్నడమే 'జాణ్ణుడి' అని విమర్శకుల అభిప్రాయము. మొత్తముమీద 'జాణ్ణుడి' అనునది కన్నడమున భాషావిషయికముగా దేశీయుత నభిమానించు రచనావైఖరి అని చెప్పబడుచున్నది.

'జాను' శబ్దము దేశ్యమని సీతారామాచార్యులు గారభిప్రాయపడిరని, ఇది 'జ్ఞాన' శబ్దభవమని, 'జాణ'కు తోబుట్టువని నేలటూరి వేంకట రమణయ్యగారు తలచినారు. జానుతెనుగు శిష్టపండితులు వ్యవహరించు మేలి తెనుగు. 'జాను' శబ్దమునకు అందము, సౌందర్యము అన మామిడి వేంకటచార్యుని ఆంధ్ర దీపిక యందును, శబ్దరత్నాకరము నందును అర్థములు కలవు. 'జాను' శబ్దమును 'స్పష్టము' అను నర్థమున తిక్కన ప్రయోగించియున్నాడు. 'ఈ ఖగము జానుగ నన్ను నెఱిగె.' వీనినిబట్టి జాను తెనుగనగా అందమైన తెనుగని, ఇంపైన తెనుగని, స్పష్టమైన తెనుగని అర్థము. దీనికి డా. సి. నారాయణరెడ్డిగారిచ్చిన వివరణమిది. "ఏదీ ఒకానొక దుర్బోధక విషయమునుగూడ సామాన్య జనులకు సైతము సుబోధకముగా, సుప్రసన్నముగా అందించునో అది జానుతెనుగు, దేశి శబ్దములను, జన వ్యవహారములో నలిగిపోయిన సంస్కృత శబ్దములను, సముచిత ప్రమాణములో మేళవించినప్పుడే తెనుగునకు 'జానుతనము' సిద్ధించును. నిఘంటువులను మాత్రమే ఆశ్రయించి బ్రతికెడు పదములను ప్రయోగించినచో ప్రజల కవి బోధపడవు. 'ప్రవాహినీ దేశ్యా'యని కదా పండితోక్తి. కావున నైఘంటిక సంస్కృత పదములుకాక, మారుమూలలోని అచ్చతెనుగు పదములు కాక నిత్య వ్యవహారములో సుపరిచితములైన సుందర సంస్కృతాంధ్ర శబ్దములనేర్చి కూర్చిన రచనారీతిని 'జాను తెనుగు'గని నిద్దరింపవచ్చును. నన్నెచోడుడు "సరళముగాగ భావములు, జానుతెనుంగున నింపుపెంపుతో బిరిగొన వర్ణనల్" అన్న పద్యభాగమువలన తేలుచున్నది. భావములు సరళముగాగ, వర్ణనలు జాను తెనుగులో ఇంపు పెంపుతో పెనగొనగా అని దీని తాత్పర్యము. భావములు వస్తుతః సరళముగా నుండవలెనని దీని అభిప్రాయముకాదు భావ ప్రకటనము సరళముగా నుండవలెననియే. భావములు సరళముగా ప్రకటింపబడుటయనగా జనవ్యవహారమునకు సందర్భముగానుండు భాష కావలెననియే అభిప్రాయము. అదే జాను తెనుగు. ఇంతకు తేలినదేమనగా జాను తెనుగనగా 'ఇంపు పెంపు'గల తెనుగు నన్నెచోడుడిదే తెలిపెను. బహుశః నన్నయ భారతములోని సంస్కృత పద బాహుళ్యమును, సమాసాధిక్యమును చూచి నన్నెచోడుడిట్టి ప్రతిజ్ఞ చేసెనేమో? నన్నెచోడుని అభిప్రాయమునకేది హేతువైనను అతడే తన ప్రతిజ్ఞ నిల్పికొనలేక పోయెను. కెలసము, వెంచలు, కండవడము, కొలవేళ్లు మున్నగు కన్నడ పదములను, పోండిగ, మూండు, వీండు, పుడమిపుడు, ఎయిదనేరమి వంటి వింత పదములను ప్రయోగించి తన రచనను అనవసరముగా కొంత క్లిష్టపరచెను. ఐనను నన్నయ ప్రయోగించని కొన్ని దేశి పదములను ప్రయోగించి కొంతవరకు తన 'జాను తెనుగు' ప్రతిజ్ఞను నిల్పికొన్నాడని చెప్పుటలోగూడ విప్రతిపత్తి యుండదు."

తెలుగు భాషలో స్వభావసిద్ధముగ వాడెడి సంస్కృత సమాసములు, జనసామాన్యమున వ్యవహరింపబడు దేశిపదములతో నొప్పి అన్వయ క్లిష్టత లేక మంజులమై, సరసమై, ప్రసన్నమైన తెలుగు జానుతెనుగు. పాల్కురికి సోమనాథుడు జానుతెనుగును ఒక సిద్ధాంతముగా చేసి తరువాతి కాలములో సమధిక ప్రాశస్త్యమును కూర్చినాడు. జానుతెనుగు వ్యవహారములో నన్నెచోడునికి పాల్కురికి సోమనకు కొంత భేదము కలదు. స్పష్టముగా అర్థమగు దేశికవితనే నన్నెచోడుడు జానుతెనుగని పేర్కొనినాడు. పాల్కురికి సోమన "ఉరుతరగద్య

పద్యోక్తులకంటె, సరసమై పరఁగిన జానుతెనుగు చర్చింపగా సర్వసామాన్యమగుట" అని బసవపరుణావ తారికలోను, "ఆరూఢ గద్య ప్రబంధ, పూరిత సంస్కృత భూయిష్ఠరచన, మానుగా సర్వసామాన్యంబుగామి జాను తెనుఁగు విశేషము ప్రసన్నతకు" అని పండితారాధ్య చరిత్రావతారికలోను జానుతెనుగును పేర్కొనినాడు. పాల్కురికి సోమన అర్థములో జానుతెనుగనగా సంస్కృత భూయిష్ఠ రచన కానిది, దేశీయ నిబద్ధమైనది అయిన తెలుగు పాల్కురికి సోమన ప్రకారము తత్సమము కాని, తద్భవముకాని, దేశ్యము కాని, అన్యదేశ్యముకాని తుదకు సంస్కృత సమాసభూయిష్ఠ రచన కాని అది దేశీయచ్ఛందో నిబద్ధమైయుండినచో జాను తెనుగు అగునని చెప్పవచ్చును. పాల్కురికి సోమన భాషాపద నిర్వచనము ప్రకారము జానుతెనుగనగా ప్రామాణికముగా దేశితెనుగేనని వాఙ్మయ మహాధ్యక్ష వడ్లమూడి గోపాలకృష్ణయ్య గారు 'జాను తెనుగు' అను ఈ గ్రంథమున వివరించి యున్నారు.

**2. వస్తుకవిత :**

నన్నెచోడుడు వస్తుకవీశ్వరుడు. అతనిది వస్తుకవిత, వాల్మీకిని 'వస్తు కావ్యాబర్హరవి' అనియు, 'భారవియు వస్తుకవితను భారవియను బరఁగి'రనియు ఉద్భటుని కుమారసంభవము 'గూఢవస్తుమయ కావ్యమ'నియు, తనది 'జంగమ మల్లయ వరమునందు గనిన వస్తుకవిత' అనియు నన్నెచోడుడు కుమార సంభవ కృత్యావతారికలో పలుమార్లు ప్రస్తావించినాడు. నన్నెచోడుని వస్తుకవితా స్వరూప స్వభావములెట్టివో వివరింతము.

కన్నడమున నృపతుంగుడు (క్రీ.శ. 814-817) కవిరాజమార్గమునందు వస్తు విస్తర రచనను పేర్కొనినాడు. పంపకవి (క్రీ.శ. 941) విక్రమార్జున విజయమునందు 'వర్ణక', 'వస్తువిద్య' అను పదములను, ఆదిపురాణమునందు 'వస్తుకృతి' అను శబ్దమును వాడినాడు. నాగవర్మ (క్రీ.శ. 10 శతాబ్ది) చందోంబుధిలో తన్ను గురించి 'వస్తుకవి'నని చెప్పికొనినాడు. కన్నడమున 'వస్తుక, వర్ణక'ములను రెండు కావ్యభేదములున్నట్లు రత్నాకర వర్ణి (క్రీ.శ. 16వ శతాబ్ది) భారతదేశ వైభవమునుబట్టి తెలియుచున్నది. అతడు పేర్కొనిన లక్షణముననుసరించి వస్తుకావ్యము సర్వలక్షణ సంపన్నమైన మహాకావ్యమని తెలియుచున్నది. "వస్తుక మనగా సంస్కృత చంపూ లక్షణము ననుసరించి వ్రాయబడిన గద్యపద్యాత్మక కావ్యము. వర్ణకమనగా ఏ కావ్యలక్షణముగాని, సంస్కృత కావ్య మర్యాదనుగాని అనుసరింపక వ్రాయబడిన పద్యకావ్యము" ఇట్లు వస్తుకవితను గురించిన ప్రస్తావన ప్రాచీన కన్నడ వాఙ్మయమునందు కన్పట్టుచున్నను అందు దానిని గురించి స్పష్టముగా లేదు. పంపాది కన్నడ కవుల ననుసరించియే నన్నెచోడుడు వస్తుకవితా శబ్దమును వాడియుండును. తెలుగులో ఆశు, మధుర, చిత్ర, విస్తర అను చతుర్విధ కవితలు ప్రచారము పొందినవి. వార్తాకవి రాఘవయ్య తన లక్షణదీపికలో వీనికి లక్షణములు చెప్పినాడు. నన్నెచోడుని "వస్తుకవిత విస్తరకవితలో అంతర్భాగము కావచ్చునని" తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారి తలంచినారు. "అస్మదీయానూన ప్రతిభార్ణవోదీర్ణరుచిర వస్తువిస్తారితోత్తమ" కావ్య రత్న విభూషణంబు అని నన్నెచోడుడు విస్తరకవితా విషయమును కుమార సంభవ కృత్యవతారికలో ప్రస్తావించినాడు. వస్తువుచే తన కావ్యము విస్తారిత మగునని నన్నెచోడుడు సూచించినాడు.

వస్తుప్రధానమైన కవిత వస్తుకవిత అని విన్నకోట పెద్దన చెప్పినాడు. సామాన్యముగా అలంకారికుల సంప్రదాయమున కథ ఇతివృత్తమనియు, వస్తువనియు వ్యవహృతమైనట్లు కన్పట్టుచున్నది. ఇతివృత్త ప్రధానమైన కవిత వస్తు కవిత అని చెప్పినచో వ్యాసుడు కూడా వస్తుకవి కావలసియుండును. నన్నెచోడుడు వ్యాసుని వస్తుకవిగా పేర్కొనియుండలేదు. నన్నెచోడుని కుమారసంభవముకూడ ఇతివృత్తముతోపాటు వర్ణనా ప్రాధాన్యముగల కావ్యము. "భారతభాగవతాది పురాణములవలె భిన్నవస్తు ప్రతిపాదకముకాక యేకవస్తు ప్రతిపాదకమై, కథావస్తు ప్రాధాన్యముతో వెలయుచుండుట చేతఁ కుమారసంభవము వస్తుకావ్యమనియు, నతనిది వస్తు కవిత యనియు మనము చెప్పుకొనవచ్చును" అని తిమ్మాజ్జల కోదండరామయ్యగారు అభిప్రాయపడిరి. దీనినిబట్టి సంస్కృత మహాకావ్య కవిత యొక్క వస్తు కవిత అని చెప్పవచ్చును.

నన్నెచోడుని కుమారసంభవము సర్వలక్షణ సంపన్నమైన మహాకావ్యము. కుమార సంభవ కృత్యాదిని ఆశీరూపమగు మంగళాచరణమును, సత్కవిస్తుతియు, కుకవినిందయు కలవు. ఇందు పన్నెండాశ్వాసములున్నవి. మహాకావ్యమునకు ధర్మార్థ కామమోక్షములందొక్కటి ప్రయోజనముగా నుండవలెనని అలంకారికులు చెప్పినారు. కుమార సంభవమునకు ఈ నాలుగు పురుషార్థములును ప్రయోజనములైయున్నవి. అందు ఉత్తమ ధర్మబోధ, ఉత్తమ

కామము, అర్థవివేచనము, మోక్షపాయము వర్ణితములగుటచే మహాకావ్య ప్రయోజనమందు పాటింపబడినది. నాటకము నందువలె మహాకావ్యమునందును పంచసంధులు పాటింపవలెనని అలంకారికులు చెప్పినారు. నారదాగమమున ఆరంభమై, పార్వతిచే సపర్య మూలమున ప్రయత్నింపబడి, తపస్సుచే ప్రాప్త్యశ కలిగి, ప్రత్యక్షమున నియతాప్తి నిర్ణయింపబడి వివాహముచే కార్యము నిర్వహింపబడుట కుమార సంభవమునందు కానగును. 'వస్తుకవిత్వమనగా వర్ణనాత్మకమైన ఫణితియని ఈతని భావమైయుండును' అని ఖండవల్లి లక్ష్మీరంజనముగారు వ్రాసిరి, ఇక కోరాడ రామకృష్ణయ్యగారు "భావ ప్రధానమయిన దానికి భిన్నమై వస్తు ప్రాధాన్యము కలిగి వర్ణనీయ వస్తువును గూర్చి చమత్కార వర్ణలతోఁగూడిన కవిత"ను వస్తుకవితగా పేర్కొనిరి. కాని నన్నెచోడుని కవితలో భావములకు ప్రాధాన్యమున్నది. వర్ణనలను చేసిన కాళిదాస బాణులను అతడు వస్తుకవులుగా పేర్కొని స్తుతింపకపోవుటచే వర్ణనలను ప్రాధాన్యము కలదను అర్థములో వస్తుకవితా శబ్దమును నన్నెచోడుడు వాడలేదనుట స్పష్టము.

నన్నెచోడుని సూక్తులు వస్తుకవి స్తవనీయములు. కనుక 'వస్తుకవిత'ను 'నిసర్గకవిత' అని నిసర్గకవితయన 'సహజకవిత' అని అమరేశం రాజేశ్వర శర్మగారు పేర్కొనినారు. వస్తు శబ్దమునకు 'సహజమ'ను అర్థము రూఢమైనది కాదు. కాబట్టి ఈ అభిప్రాయము సమంజసమైనది కాదు. అమరేశం రాజేశ్వరశర్మగారు వస్తుకవితకిచ్చిన మరియొక అర్థము. 'ప్రకృతి కవిత' అని నందసాగర పండితుని 'శబ్దసాగరము' అను నిఘంటువులో 'వస్తు' శబ్దమునకు 'ప్రకృతి'యని అర్థము కలదు.

కాబట్టి 'వస్తుకవిత' యనునది 'ప్రకృతిని గూర్చి వర్ణించు కవిత' అని అమరేశం రాజేశ్వర శర్మగారు అభిప్రాయపడిరి. ఇది ఖండవల్లి లక్ష్మీరంజనము, కోరాడ రామకృష్ణయ్యగార్ల నిర్వచనములకు సన్నిహితముగా నున్నది. నన్నెచోడుని కవిత్వమునగల వన, ఋతు, సముద్ర, చంద్రోదయ, సూర్యోదయ జలకేళ్యాది వర్ణన అను ప్రకృతి వర్ణనలుగానే పరిగణింపవచ్చును. ప్రకృతి వర్ణనాత్మకమైన కవిత 'వస్తుకవిత' అను అభిప్రాయము నన్నెచోడుని కవిత్వమునకే కాక భారవి ఇంద్రకీల నగారోహణ వర్ణనమునకు, వాల్మీకి కవితకు, ఉద్భటుని కవితకు కూడా వర్తించును. వస్తుకవీశ్వరుల నూత్న రుచిర కావ్యపద్ధతి ఇట్లుండవలెనని నన్నెచోడుని ఉద్దేశ్యము.

*'మృదురీత సూక్త లింపొదవింప మేలిల్లు భావమ్ము నెలమి క్రీడావహముగ / ఋఁగులఁ గన్నులు మిఱుమిట్లు వోవంగఁ గాంతి సుధా సూతి కాంతిఁజెనయు / వర్ణన లెల్లచో వర్ణన కెక్కంగ రసములు దళుకొత్తి రాలు వాఱ / దేశి మార్గంబుల దేశీయములుగా నలంకారములఁ దానలంకరింప / నాదరించి విని సదర్థాతిశయమున బుధులు నెమ్మనమున నిధులు నిలువ వలవదే సమస్త వస్తు కవీశ్వర నూత్న రుచిర కావ్యరత్న వీధి.'*

*– కుమార సంభవము. 1-36*

ఈ పద్యమునుబట్టి నన్నెచోడుని వస్తుకవిత మృదుల సూక్తులు, మేలిభావములు, మిఱుమిట్లుగొలుపు మెఱుగులు, మనోహరకాంతులు, వర్ణనకెక్కు వర్ణనలు, తళుకొత్తు రసములు, దేశిమార్గంబులు దేశీయములుగా, నలంకరించు అలంకారములు గలది; బుధులు మెచ్చునది అని తెలియుచున్నది. నన్నెచోడుడు తన కావ్యమును అష్టాదశ వర్ణనాత్మకముగ, నవరసభావ భరితముగ, అలంకారసమన్వితముగ సంతరింపవలెనని సంకల్పించినట్లు క్రింది పద్యమునుబట్టి గ్రహింపవచ్చును.

*"వన జలకేళీ రవి శశి తనయోదయ మంత్ర గతి రత క్షితిప రణాం / బునిది మధు ఋతు పురోద్వాహ నగ విరహ దూత్య వర్ణనాష్టాదశమున్ / పరిపూర్ణంబై దశప్రాణంబుల సప్రాణంబై నవరసభావభరితంబై షట్త్రింశ / దలంకారాలంకృతంబై రమణీయంబైన దివ్యకథారంభమున కభిముఖుండనై'*

*– కుమార సంభవము 1-44, 45*

పార్వతి వీనులను సుకవికావ్యమునకు పోల్చి నన్నెచోడుడు వ్రాసిన విధమిట్టిది :

*'హారము లాశ్రిత భాషా సారము లా సకలవస్తు సంపూర్ణాలం కారంబులు శ్రీ వర్ణాకారంబులు చెవులు సుకవి కావ్యము వోలెన్.'*

*– కుమారసంభవము, 3-67*

"వస్తుకవిత యన ప్రబంధ కవితయేగాని యన్యము గాదు." అని వేదము వేంకటరాయశాస్త్రి (ఎమ్.ఎ) గారు తెల్పియున్నారు. నన్నెచోడుడు తన కుమార సంభవమును 'దివ్యసుకృతి', 'దివ్యకథ', 'ఉత్తమ కావ్యము', 'దివ్యకావ్యము' అనుటయేకాక 'సద్రసబంధురమగు ప్రబంధము' అని కూడ పేర్కొనినాడు. ''ఒక విధముగా ఊహించినచో ఫస్తు కావ్యమనగా ప్రబంధమనియే చెప్పవచ్చును" అని డా. సి. నారాయణరెడ్డిగారును, ''కావ్యములో ప్రధాన కథను గుణాలంకార వర్ణనాదులతో రసవంతము చేయుటేకాక తదవయవ స్థానీయములైన ఇతర కథాంశములనుగూడ ఆ

విధముగానే పరిపోషించి రసవంతములు చేయుటయే వస్తుకవిత్వము చెప్పుట. అదియే ప్రబంధ రచన చేయుట అని ఈ కవి (నన్నెచోడుని) యూహ' అని ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారును ఊహించియున్నారు. తెలుగులో నన్నెచోడునికి పూర్వము 'ప్రబంధ' శబ్దమును ఎవ్వరుగాని ప్రయోగింపలేదు. నన్నెచోడుడు ప్రబంధ శబ్దమును పేర్కొనినవారిలో ప్రథముడు. అతడు ప్రబంధ పదమును కావ్యసామాన్యార్థములోనే ప్రయోగించినాడు. ప్రత్యేకార్థమున ప్రయోగింపలేదు. కాని తరువాతి రాయల కాలమున ప్రబంధములుగా పిలువబడిన కావ్యములలో ఉండవలసిన లక్షణములను ప్రాయికముగా సంతరించుకొని యుండుటచే కుమార సంభవమే తొలి తెనుగు ప్రబంధము. "పురాణేతిహాసములలోని కథనో, యుపాఖ్యానమునో చేపట్టి, స్వకపోల కల్పనలచే దానిఁబెంపుచేసి, యష్టాదశ వర్ణనలందందు జొన్పించి, రసాభివ్యక్తికిని బాత్ర చిత్రణమునకును నెక్కుడు ప్రాధాన్యమొసఁగి శబ్దార్థాలంకార సహితముగా రచింపఁబడిన స్వతంత్ర గ్రంథము ప్రబంధము."

నన్నెచోడుని కుమార సంభవ కథకు మూలము శివ, స్కంధ, వాయు, బ్రహ్మాండ పురాణములందును, భారత రామాయణములలో సంగ్రహముగాను ఈ కథ కలదు. సంస్కృతములోని కాళిదాసు కుమార సంభవ కావ్యమునకుగాని, ఉద్భటుని గూఢవస్తుమయమైన కుమార సంభవమునకుగాని నన్నెచోడుని కుమార సంభవము అనుకృతి లేదా అనుసృతి మాత్రము కాదు. స్వకపోల కల్పనాదిక్యతనుబట్టి ఇది ఇంచుమించుగా స్వతంత్ర కావ్యము. భాషాంతరీకరణముకాదు. నన్నెచోడుడు శివపురాణములోని కథకు ప్రబంధానుకూలమగు మార్పులను కూర్చినాడు. "వస్త్వైక్యమున కొంత లోపమున్నను ఈ కుమార సంభవమే యథార్థముగా మన ప్రథమ ప్రబంధము అని ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు వ్రాసినారు. కుమారసంభవమున మొదటి రెండాశ్వాసములలోని సతి జన్మము, గజానన జన్మ వృత్తాంతము, దక్షాధ్వరధ్వంసము చివరి రెండాశ్వాసములలోని కుమార విజయము అనునవి, ప్రధాన కథకంతగా సంబంధించిన'వని వాని మూలమున వస్త్వైక్యము లోపించినదని ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారభిప్రాయ పడినారు. కాని వీనివలన కావ్యమున కైక్యము, కథకొక నిండుదనము చేకూరుచున్నది. దక్షాధ్వర ధ్వంసము శివుని తపస్సుకు కారణమును తెలుపుట కుద్దేశింపబడినది. దానికి కారకుడౌన గజానను జన్మవృత్తాంతమందు చెప్పబడినది. ఇక అంగిరసమగు శృంగారమునకు పోషకముగా కుమార విజయమున వీరరసము నిర్వహింపబడినది. వీనివలన వస్తువు స్పష్టముగా విస్తరింపబడినదేకాని వస్త్వైక్యము చెడలేదు. దీనినిబట్టి పరిశీలించినచో మహాప్రబంధమని వినుతికెక్కిన మనుచరిత్రయందలి వరూధినీ ప్రవరుల వృత్తాంతము వస్త్వైక్యమునకు భంగము కలిగించునట్లే కదా; ఏ కథకు ఆ కథగా వ్రాయబడి అతి కష్టముపైన సంబంధము కల్పింపబడిన అముక్తమూల్యదను ప్రబంధము కాదనవలసియుండును. కనుక కుమార సంభవమునందు వస్త్వైక్యము లేదనుట సమంజసముకాదు. కుమారసంభవములోని దీర్ఘవర్ణనలు వస్త్వైక్యమునకు భంగము కలిగించునని కొందరి వాదము. కాని అట్టి వర్ణనాచాపల్యము రాయలకాలమునాటి ప్రబంధములందును కలదు.

కుమారసంభవమున ప్రబంధమునకు ఉచితము కానట్టియు, పురాణములయందు మాత్రమే చెప్పదగినట్టియు కథాంశములు కొన్ని కలవనియు, కుమార జననమునకు పూర్వము జరిగిన కార్యకలాపమంతయు పౌరాణికమేకాని, ప్రాబంధికము కాదనియు, అందువలన నన్నెచోడుడు పౌరాణిక గాథను పురాణముగాగాక వర్ణనాదులచే నలంకరించి ప్రబంధముగా రచించెననియు, ఈ అర్థముననే అది ప్రబంధమని ఆచార్య పింగళి లక్ష్మీకాంతముగారు తెల్పినారు. కుమార సంభవము ఏకనాయకాశ్రయము అందు నాయకుడు శివుడు, దివ్యుడు, ధీరోదాత్తుడు, నాయిక పార్వతి, నాయికా నాయకుల పరస్పరానురాగము, విప్రలంభ సంభోగములును ఇందు వర్ణింపబడినవి. కుమారసంభవము చివరి రెండాశ్వాసములంధు నాయికానాయకులు ప్రసక్తి లేకున్నను వారికి సంబంధించినదే అయిన ఇతివృత్తముకలదు.

కుమారసంభవమున శృంగారరస మంగి, వీరరసమును తక్కిన రసములును అంగములుగా ఆయాస్థలములందు యథోచితముగా పోషింపబడినవి. ఇట్లు కుమారసంభవము తదనంతరాంధ్ర ప్రబంధ లక్షణక్షితమై, ప్రబంధ రచనా సంప్రదాయమునకు మార్గదర్శకమైనది. అది ప్రథమాంధ్ర ప్రౌఢ ప్రబందము కనుకనే కోరాడ రామకృష్ణయ్యగారు కుమారసంభవ పీఠికలో వాస్తవానికి ఆంధ్ర సాహిత్యములో ప్రప్రథమ ప్రబంధ పరమేశ్వరుడు కవిరాజ శిఖామణి నన్నెచోడుడే యని చెప్పక తప్పదు" అని చెప్పియుండుట.

(తెలుగు సాహిత్య సమీక్ష)

# పుష్పాంజలి కథలు :
# స్త్రీల సమస్యలు

– పి. వరలక్ష్మి

సామాజిక స్పృహతో మహిళల సమస్యల గురించి కథలు రాసిన అతి కొద్ది మందిలో పుష్పాంజలి ఒకరు. మహిళల్లో కూడా ముఖ్యంగా ఉద్యోగినులైన వారి సమస్యల్ని ప్రధానంగా చిత్రించారు. ఒంటరిగా జీవిచేవారు కావచ్చు, ఒంటరితనంతో ప్రత్యేక సమస్యలు కలిగినవారు కావచ్చులేదా తన కుటుంబ పరిస్థితులను అధిగమించి ఎదగాలని తపన ఉండేవారు కావచ్చు, ఇలా అనేక విదాల స్త్రీల సమస్యల్ని విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. వృత్తిరిత్యా ఈమె ప్రభుత్వ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకురాలైనా ప్రవృత్తి మాత్రం సాహిత్య రచనకే అంకితమైంది. ఈమె 'వాళ్ళిద్దరూ ఇంకా కొందరు, అమ్యూజింగ్స్' పేరుతో రెండు సంపుటాలు వెలువరించారు. వాటిలోని ఓ మూడు కథల్లో కన్పించే మూడు భిన్న పార్శ్వాల్ని పరామర్శించడానికి ప్రయత్నం జరుగుతున్నది.

మొదటి కథ మరకల్లో మెరుపులు – శ్రావణి, కరుణ అక్కచెల్లెలు. వీరిద్దరి భర్తలూ అన్నదమ్ములు. పెళ్ళైన ఆరునెలలకే ఏర్‌క్రాష్‌లో ఒకేసారి మరణిస్తారు. ఈ విషాదం మరచిపోవడానికి శ్రావణి మొదట భక్తిమార్గాన్ని ఆశ్రయిస్తుంది. కానీ కరుణకు భక్తిమార్గంలో ప్రశాంతత కన్పించకపోవడంతో చక్కటి స్నేహంతోనూ ఆత్మీయమైన మానవ సంబంధాలతోనూ విషాదాల్ని మరిచిపోవడానికి ప్రయత్నిస్తుంది. తనతోపాటు ఆఫీసులో పనిచేసే భానూతో తరువాత మధూతో పరిచయం పెంచుకుంటుంది. తద్వారా ప్రశాంతతను పొందుతూ ఉండేది. మొదటి స్నేహితుడు భానూ ప్రేమతో కరుణ హృదయం ద్రవించిపోయేది. ఆ ప్రేమతో అందరినీ ప్రేమిస్తూ కోపమనేదే తనలో లేకుండా పోయి చాలా ప్రశాంతంగా ఉండసాగింది. 'ప్రేమకున్న శక్తి పూజకులేదా?" అని తనలోతానే అనుకునేది కూడా. పైగా అక్క ఎంత పూజలో లీనమైనా ఎప్పుడూ, అశాంతిగానే, కోపంగానే విసుగుగానే ఉండేది. ఎంతకోపమంటే తననే నమ్ముకుని అనేక సంవత్సరాలుగా తమ ఇంట్లోనే పని చేస్తున్న పనిపిల్లను –

"కౌసల్యా సుప్రజారామా పూర్వాసంధ్యా..... ఛీ ఛీ, మాడు ముఖం నువ్వూను, నీ ముఖం లాగానే ఉన్నాయి నువ్వు కడిగిన గిన్నెలు...... ... పూర్వా సంధ్యా ప్రవర్తతే......పో ...పో... పోయి తగలడు. మీ అమ్మగార్ని నిద్రలేపు. రాత్రి పన్నెండింటికఘోరించింది.... ఉత్తిష్ట నరశార్దూలా కర్తవ్యం దైవ..." ఇది ఒకే గొంతుక నుంచి వినిపిస్తున్న ఈ పరస్పర వ్యతిరేక ధోరణులు.

శ్రావణిలో రోజురోజుకు అసహనం తారాస్థాయికి చేరుకుంది. ఆఫీసుకెళ్ళొస్తానక్కా అంటూఎంతో ప్రేమతో చెప్పేచెల్లెలు కరుణ వంక కనీసం చూడనైనా లేదు శ్రావణి. అదీ ఆమె మానసిక పరిస్థితి. అంతేకాక తమ పెరట్లో ఇరుగుపొరుగు పిల్లలు వచ్చి పూలుకోసుకుంటున్నారని ఊగిపోతూ వారిని బెత్తంతో కొడ్తుంది.అలాగే చంద్రికను కూడా. 'అక్కహృదయం పాషాణ సదృశ్యం" అనుకొంటూ లోలోపల కుమిలిపోతుంది కరుణ"

ఇదిలా ఉండగా తన స్నేహితుడు మధుకి ట్రాన్సఫర్ రావడంతో "నిన్ను విడిచి పోలేను మనం పెళ్ళి చేసుకుందాం. నాతో పాటు వచ్చేయ్, నా భార్యను ఒప్పిస్తాను."అంటాడు. అందుకు కరుణ "అక్కనొదిలి నేనొక్కతినే రాలేనని తెలుసుగా పైగా ఇలాంటి పెళ్ళిళ్ళు చెల్లవు" అంటూ ఒప్పిస్తుంది. మరోవైపు ఇంట్లో అక్కలో అశాంతి ఎక్కువై గిన్నెలు విసిరికొట్టడం, చంద్రికను తిట్టుకోవడంలాంటివి కరుణను బాధిస్తోంది. ఆమె జీవితాన్ని కేవలం ఒకే కోణం నుంచి చూస్తోంది. జీవితానుభవాలన్నిటినీ స్పృశించిన మనసులు దేన్నయినా సులభంగా శోషణం చేసుకోగలవు. అందుకని అక్కడ చూసి ఎంతో పెద్దమనసుతో 'పడడమే తన బాధ్యత'

అనుకుంటూ మరింత ఓర్పుగా భరిస్తుంది. ఇదిలా ఉంటే ఒకరోజు చంద్రిక పనికిరాకపోవడంతో ఆమె మనసు కలత చెందింది. చంద్రిక తనకన్నా 25ఏళ్ళ పెద్దవాడితో మోసపోయి గర్భవతి అయ్యింది. కారణం వరుసకి మామ క్రానిక్ టిబీ పేషంటుగా అనారోగ్యంతో బాధపడుతుండగా తాను బతకడని తెలిసి తన భార్య తెగదెంపులు చేసుకుంది. ఆ పరిస్థితుల్లో అతను చంద్రికనాశ్రయించాడు. ఆశ్రయము, మందులు, సేవా అన్నీ సమకూర్చింది. చివరకు తనను తానే అర్పించుకుంటుంది.

కరుణ చంద్రిక ఇంటికెళ్ళి చూడగానే పురిటినొప్పులతో ఒంటరిగా బాధపడుతోంది. అరోగ్యం బాగైనాక తన భార్య గుర్తుకొచ్చి చంద్రికకు అన్యాయించేసివెళ్ళిపోతాడు ఆ పెద్దాయన. ఈ పరిస్థితుల్లో కరుణ తనతో దగ్గరుండి హాస్పిటల్లో చేర్చి అంతా చూసుకుంటుంది. అయినా గాయమైపోయిన చంద్రిక మనసు బిడ్డను కడచూపు చూసకోకమునుపే ప్రాణాలొదిలింది.

మరో అమ్మాయిని సీతమ్మను పనిలో పెట్టుకొని కరుణ ఆ పసికందును తన కన్న బిడ్డలా చూసుకుంటుంది. "అయినా ఆ మాయదారిబిడ్డతో నీకేంపని వాణ్ని కన్నోణ్నిలా పిలిపించు, చంటిపిల్లల్ని చాకడం తేలిక కాదు'' అంటూ విసుక్కుంటునప్పుడు, "అక్కా దయచేసి చంద్రికనేమీ అనకు" దిక్కులేనివాళ్ళను కనికరించమని నీ దేవుళ్ళు చెప్పడం లేదా అక్కా! అంటూ అక్కకు కరుణ బుద్ధిచెప్తుంది. ఇంట్లో పరిస్థితి అదుపుతప్పడంతో పక్కనే మరో ఫ్లాటు అద్దెకు తీసుకొని సీతమ్మ కూతుర్ని బాబు దగ్గరపెట్టించి అటు అక్కను ఇటు బాబును చూసుకుంటుంది. ఆ బిడ్డకు తన భర్తపేరే "రమణబాబు" అని పెట్టుకుంటుంది. "వీడి ఏడుపులో పేరుకందని రాగముంది. వీడి బుగ్గల్లో కోటి కుసుమాల మెత్తదనం. నవ్వులో కమనీయమైన కమ్మదనం. ఇవన్నీ కూడా అక్కను మార్చలేకపోయాయా? మానసిక పేదరికంతో బాధపడే ఆమెకు విముక్తి ఎప్పుడు?" అంటూ అక్క మార్పు కోసం ఎదురుచూస్తోంది కరుణ. ఒకరోజు హఠాత్తుగా శ్రావణి రాత్రిపూటొచ్చి తలుపు తట్టి, చెల్లెల్తో వాణ్ని ఎవరో సాకడం ఎందుకు? ఇక నుంచి నేనే చూసుకుంటానని, బాబును పనమ్మాయిని తీసుకొని తన ఇంట్లోకి వెళ్ళిపోతుంది. ఇంత నిశ్చలంగా ఉన్నది అక్కేనా? అనే సందేహం కల్గేలా వచ్చిన శ్రావణిలోని మార్పు ఎంతో ఆదర్శం.

ఈ కథలోని కరుణ పాత్ర ఎంతో ఉదాత్తమైనది. రచయిత్రి శ్రావణిలో మార్పు తీసుకరావడంతో ఈ కథ పతాకస్థాయికి చేరుకుంది. ఆ మార్పే సమాజంలో అన్ని విషయాల్లోనూ, అన్నీ రంగాల్లోనూ కలిగితే ఎంత బావుంటుంది!!?? అందుకే ఆలోచనా దిశలు మారాలి, అసలు తత్త్వం చెలరేగాలి, అతర్మథనం జరగాలి, అంతరంగంలో మార్పుకల్గాలి. ఈ కథ మనకు బోధించే అంశం ఇదే. ఇక చంద్రిక పాత్రలోని ఔన్నత్యం ఏ స్థాయిలోదో మనం గమనించవచ్చు. ఎంతో ఆరోగ్యంగానూ, వయసులోనూ ఉన్న అమ్మాయి అనారోగ్యంతో తనను ఆశ్రయించిన వ్యక్తిని మానవత్వంతో చేరదీసి సేవచేసింది. అది కూడా తన శారీరక వ్యామోహంతోనో డబ్బుకోసమో అందం ఐశ్వర్యం మొ॥ స్వార్థపూరిత ప్రయోజనాలకోసమో కాదు. కేవలం మానవతా దృక్పథమే. ఎదుటి వ్యక్తి ఆలోచనలకు అవసరాలకు, ఆరోగ్యానికి ప్రాధాన్యమిచ్చిందే కాని తన గురించి తన జీవితం గురించి ఆలోచించలేకపోయింది. నిస్వార్థంగా సేవచేసింది. చివరకు మోసపోయింది. "దిక్కు లేనివాడికి దిక్కుగా ఉండటమే మానవ జన్మకు సార్థకత" అంటాడు బుద్ధుడు. అలా మానవతా పరిమళాల్ని

వెదజల్లిన పాత్ర చంద్రికది. మరోకోణంలో చూస్తే తన జీవితాన్ని వృథా చేసుకొని, మరొకర్ని సంతోషపెట్టాల్సిన అవసరమే లేదు. అనే కచ్చితత్వస్వభావం ఉండి ఉంటే చంద్రిక అలా మోసపోయేది కాదేమో. ఏది ఏమైనా చంద్రిక పాత్ర మానవతకు మారుపేరు. అయితే స్వార్థపూరితమైన వారు ఇలాంటి వారికి హానికల్గించే ప్రమాదముంది. కనుక చంద్రికలాంటి మనస్తత్వమున్న వారు చాలా జాగురూకతతో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇంకా ఈ కథలోని సీతమ్మ, ఆమె కూతురు ఇద్దరూ ఎంతో విశ్వాసంతో కరుణకు, శ్రావణికి ఆ ఇద్దరికీ బిడ్డైన రమణబాబుకు అన్ని రకాలుగా సేవచేయడం, ఒక్కమాటలో చెప్పాలంటే ఈ కథలోని ప్రతీ స్త్రీ పాత్ర కూడా అమ్మను తలపిస్తుంది, మరపిస్తుంది. అమ్మను మించిన అమ్మను గుర్తుకుతెస్తుంది. అన్నింటినీ మించి ఈ త్యాగమూర్తులలోని అమ్మతనం అమ్మ అనే పదానికి మరో అర్థం ఇచ్చింది. ఎందుకంటే ఎప్పుడూ కూడా కరుణ చంద్రికను గాని, సీతమ్మకుగాని, ఆమె కూతుర్ని కాని, పనిపిల్లలా చూడలేదు. అమ్మలా అన్ని అవసరాలు తీర్చేది. అలాగే వారుకూడా ఏ

రోజూ పనివాళ్ళలా కాక అమ్మలా ఆఫీసుకి వెళ్ళొచ్చేసరికి అన్నీ సమకూర్చి పెట్టేవారు. ఒకరోజు చంద్రిక పనికిరాకపోయే సరికి ఏకంగా ఇంటికెళ్ళి దగ్గరుండి ఎన్నో రోజులు సెలవులు పెట్టి హాస్పిటల్లో చేర్చి అమ్మలా చూసుకుంది. తల్లి చనిపోయిన బిడ్డకు తానే అమ్మైంది.

శ్రావణి మొదట్లో భర్తలేని కారణమైతేనేమీ, వయసులో ఉన్నకారణంగానైతేనేమి, శరీరంలోని కోరికల్ని అదుపులో ఉంచుకునే క్రమంలో విసుగు,కోపం, ద్వేషం రావడం సహజం. చివరకు తాను కూడా ఈ బిడ్డను నేను పెంచుకుంటాననిచెప్పి అమ్మతనం ఆపాదించుకుంది. ఇవన్నీ మనం గమనిస్తే ఈ కథలో ఐదుగురు పరిపూర్ణమైన అమ్మతనం ఉట్టిపడే అమ్మల్ని మనం చూడవచ్చు.

అంతేకాదు సమాజిక న్యాయం, బాధ్యతను కూడా అవగాహన చేసుకునే మనస్తత్వం కరుణది. ఆఫీసులో పరిచయమైన తన స్నేహితులు మొదట భాను, ఆతర్వాత మధు అయినా కూడా తన బాధ్యతను కుటుంబాన్ని విస్మరించలేదు. సహజంగా వారితో మాట్లాడుతూ, చనువుగా ఉంటూ తన ప్రేమను పంచిందే తప్ప. ఏనాడు వారిపై అజమాయిషీగానీ అధికారం గాని చెలాయించలేదు. ఇదే పరిపూర్ణమైన, స్వచ్ఛమైన ప్రేమ, స్నేహం.అందుకే తన స్నేహితులు ఇద్దరూ కూడా ఎంతో బలవంతం చేసినా తన హద్దుల్లో తానుంటూ చాలా జాగ్రత్తగా ఉండగల్గిన చైతన్యవంతమైన పాత్ర కరుణ. అందుకే చంద్రికను ఆ పెద్దాయిన వదిలిపెట్టిపోయిన సందర్భంలో "స్త్రీ ఎంత టన్నుల కొద్దీ ప్రేమించినా ఒక చిన్న పసుపుతాడుకే లొంగిపోతాడు మగాడు. సామాజిక న్యాయం ముందు మానవతా విలువలు లొంగిపోవాల్సిందేనా?'' అంటూ లోతుల్లోకి వెళ్ళి ఆలోచించుకుంటుంది. ఈ కథలోని కరుణ పాత్ర అన్నీ రకాల పరిస్థితుల్ని అవలీలగా అవగాహన చేసుకొని గొప్ప స్వభావం కల్గిన పాత్రగా మనకు కన్పిస్తుంది. ఒక స్త్రీ ఎంత చైతన్యంతో మెలగాలో, ఎంత క్లిష్టపరిస్థితుల్లో అయినా సంసారంలోని ఒడిదుడికుల్ని ఎలా అధిగమించాలో నేర్పుతుంది. అనివార్య పరిస్థితులో ప్రకృతి నిర్ణయాలకు ఎలా తలవంచి ఆత్మవిశ్వాసాన్ని నింపుకోవాలో నేర్పుతుంది.

రెండవకథ ఈక్వేషన్: పేరులేని 'యువతి' లో నిజాయితి, ఆత్మవిశ్వాసం, గౌరవం ఎదుటి వ్యక్తి ఎంత దుర్మార్గుడైనా మౌనంగా సున్నితంగా, ధైర్యంగా ఎదుర్కొనే మనస్తత్వం గలది.యువతి చాలా రోజులుగా ఒంటరిగా ఆఫీసుకి రావడం, పోవడం ఎవరితోనూ మాట్లాడకపోవడంతో ఆమె ఒంటరిగానే ఉంటుందన్న నిర్ణయానికి వచ్చి అనాలోచితంగా ఎంతటి సాహసం చేశాడు? పైగా ఆమెకంటే అతనుపై ఆఫీసర్ అనే ధైర్యం కూడా. గర్వంతో ఫీలైపోయి ఏకంగా ఇంటికే వస్తాడు.

అతను ఇంట్లో ఎవరూ లేరా? అనగానే ఆమె మీకెవరుకావాలి చెప్పండి? అంటుంది నవ్వుతూ. అతనిలోని దుర్మార్గాన్ని గమనించిన ఆమె "పిల్లలూ మీ వారు ఏది?" అని అతను అడిగితే ఇప్పుడు వాళ్ళసంగతెందుకులేండి? అంటుంది. ఆ జవాబువిని అతను తనలోనే "నిజమే ఈ సమయంలో భర్తలనీ, పెళ్ళాలనీ తలచుకుంటే మూడ్ పోదూ" అందుకే అలా అంటుంది. అనుకుంటాడు. అతను ఇంటినంతా ఓవైపు గమనిస్తూనే ఇల్లు చూడచ్చా? ఎన్ని పోర్షన్లు? అంటాడు. అందుకు నాలాంటి అజ్ఞానుల అనుమానాలు మీలాంటి జ్ఞానులే నివృత్తిచేయాలిగా అంది నవ్వుతూ. "అలా అనకండి ప్లీజ్. మీ అందముందు అన్నీ దిగదుడుపే" అంటాడు. అయినా మీరే ఇంత అందంగా ఉంటే మీ బెడ్‌రూమ్ ఎంతందంగా ఉంటుందో చూడాలని ఉవ్విళ్ళూరుతున్నాను" అంటాడు.

"చూద్దురుగాని ముందిది చెప్పండి.మీరు చాలా విశాల హృదయులని నాకు గట్టినమ్మకం. లేకుంటే ఇంత చొరవగా ఇలా రాలేరే..... మీకు బెరుకు లేదా. బాగా అలవాటా?మీ భార్య కూడా ఎంప్లాయి అంటున్నారుగా! ఆమె కూడా ఎవరినైనా ఇష్టపడితే...... మీరు.......మీరు కాదనరు. చాలా విశాల హృదయులు ఊరికే అడిగానంతే. రండి ఇల్లు చూద్దురుగాని" అంటూ మామూలుగానే లేచి బెడ్ రూమ్‌వైపు తీసుకెళ్తుంది. అప్పటికే అతని ఒళ్ళు చల్లబడ్డది. బాగా షాక్ తగిలినట్లైంది. ఇంతకీ ఆమె అమాయకంతో అడుగుతోందా, లేక నన్ను దెబ్బ తీయడానికి అడుగుతోందా అనుకుంటూ ఆమెని వెంబడిస్తాడు. రండి అంటూ తీసుకెళ్తుంది. లోపలికి అడుగు పెట్టాడు.ఎదురుగా పెద్దపెద్ద ఎగ్జిగ్యూటివ్ టేబుల్స్. వాటిపై సిస్టమ్స్. ఆ వెనకాల ఒకతను సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు. ఆ అలికిడి విని ఒక చేత్తో విష్ చేసి మళ్ళీ తన పనిలో నిమగ్నమైపోయాడు.

అంతే 'ఎవరు??!! అతన్ని నేను చాలాసార్లు చూసాను' అంటాడు. ''మావారు'' అని పరిచయపూర్వకంగా చెప్పింది.అంతలో అతనెవరో గుర్తుకొచ్చింది. ఆయన

చీఫ్‌సెక్రటరీ తనలాంటి ఎందరో ఆఫీసర్లకుపై అధికారి. అంతే అతని గొంతు తడారిపోయింది. అడుగులు తడబడ్డాయి. ఒక సెకండులో అతని మానసికస్థితి పూర్తిగా తారుమారైపోయింది. మా ఆయన చాలా బిజీగా ఉంటారు. మీరేమనుకోకండి? అంటూ రండి ఇటువైపు చూద్దురుగానీ అని పిలుస్తూనే ఉంది. "ఓ ఈయన ఈమెకి భర్తా? ఎవరికీ తెలియదే! అసలు ఉద్యోగం చేసే ఆడాళ్ళకు ఎంత పెద్ద భర్తలు, ఛ.. ఛ.. ఇంత పెద్ద భర్తలున్న భార్యలు కూడా ఉద్యోగాలు చేస్తారా! అసలు ఉద్యోగినుల భర్తలు....ఛఛ.. తన భార్యకు తను భర్తేగా" అంటూ తన ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

అన్నీ రూములల నిండా పుస్తకాలే అవన్నీ చూసిన అతను ఆమె పిలుస్తున్నా పట్టించుకోకుండా అస్పష్టంగా ఏదో గొణుక్కుంటూ గుమ్మం దాటిపోయి నడుస్తున్నాడు. అప్పటివరకు ఆమె అందాన్ని తడిమిన కళ్ళు, శరీరం అంతా నిప్పుకొరడాలా అతనిని ఝుళిపిస్తున్నట్లు చెంపచెళ్ళు మనిపించినట్లు బుద్ధి చెప్పింది. నేటి సమాజంలోనూ ఇలాంటి వారిని మనం చూస్తూనే వుంటాం. జలగల్లా స్త్రీలను వేపుకుతినేవారు, అనుమానంతో బాధపెట్టేవారు, కుటుంబ భారాన్నంతా స్త్రీపైనే వేసి ఇలా పైపై జూలాయిలా ఇతర స్త్రీల చుట్టూ తిరిగేవారు. ఇలాంటి వారందరికీ ఈ కథలో యువతిలా బుద్ధి చెప్పగల్గితే సమాజాన్ని చాలావరకూ సంస్కరించవచ్చు. కళ్ళతోనే తడుముతూ ఇతర స్త్రీలను కామంతో శారీరక వ్యామోహంతో చూసే ప్రతి స్త్రీ ఇదే స్థాయిలో మాటలతో కాదు ప్రవర్తనతో బుద్ధి చెప్పాలి.

మూడవ కథ నన్నెదగనివ్వండి ప్లీజ్: సృష్టిలోని అన్ని జీవులకూ స్వేచ్ఛ ఉన్నా స్త్రీకి మాత్రం లేదని, తన ఆశయాలు,లక్ష్యాలు చేరుకోవడానికి వీలులేని 'వృశ్చీ' అనే అమ్మాయిలోని ఆవేదన ఈ కథలో మనకు కన్పిస్తుంది. ఎంతో ఎత్తుకి ఎదగాలనుకునే అమ్మాయిని క్షణంక్షణం తన ఎదుగుదలకు భంగం కల్గేట్లుగాచేసే తన ఇంట్లోని పరిస్థితుల్ని కళ్ళకుకట్టినట్లు చిత్రించారు రచయిత్రి.

ఈ విషయం వృశ్చీ మాటల్లో "దేవుడా! నన్నింత మరుగుజ్జుగా ఎందుకు పుట్టించావు? ఎవరి శాపం స్వామీ ఇది? సృష్టిలో చెట్లు, జంతువులు వీటి సహజస్థితికి ఎదగగలిగినప్పుడు నేనెందుకిలా మరుగుజ్జుగా ఉన్నాను..? ఎందుకిలా నేల కంటుకుపోతున్నాను...? పెరగడానికి వాటికిచ్చిన అవకాశం, స్వేచ్ఛ నువ్వు నాకెందుకు ఇవ్వలేదు దేవుడా? మా నాన్న ఆరడుగుల పొడవు. నా తర్వాత పుట్టిన నా తమ్ముడు కూడా చూస్తూండగానే నాకన్నా పొడవు ఎదుగుతున్నాడు. మా అమ్మ మరుగుజ్జు. అమ్మమ్మ, నాన్నమ్మ అందరూ అంతే! ఐతే..నాకీ మరుగుజ్జుతనం వంశపారంపర్యంగా వచ్చిందేమో! ఎదగాలని నేనెంతగా అనుకున్నా వీళ్ళంతా నన్నెందగనిస్తేగా?! ఈ కంప్యూటర్ యుగంలోనూ, సైన్స్ అండ్ టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో కూడా నాలాంటి మరుగుజ్జులుంటారా!" అని ఆవేదనచెందుతూ ఉంటుంది. స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోలేనందుకు ఈ పొల్యూషన్‌లో నేనెలా జీవించడం? అని నిత్యం తనను తాను ప్రశ్నించుకుంటూ లోలోపల కుమిలిపోతూంటుంది.

అలాగే తన పక్కింట్లోని 'సరస్వతి' అనే ఆమె ఎప్పుడూ తన భర్త దగ్గర తన్నులు తింటూ తాను పెట్టే హింసల్ని గమనిస్తూంటుంది. ఒక రోజు అలా తన భర్తతో దెబ్బలు తిన్న సరస్వతక్క గోడకానుకొని ఏడుస్తూవుంటుంది. అప్పుడు వృశ్చీ "వాణ్ణి తన్నలేవా సరస్వతక్కా..?" అంటుంది. "అమ్మో చంపేయరూ?! అంది సరస్వతక్క భయం భయంగా. ఏంకాదు ఒకసారి తన్ను అంటూ ధైర్యం చెప్పింది. కొన్నాళ్ళ తర్వాత వృశ్చీ చదువుకుంటా ఉంటే పక్కింట్లో గొడవ బాగా వినిపిస్తుంది. చూస్తే సరస్వతక్కని తన భర్త తరిమితరిమి కొడుతున్నాడు. ఆమె భయపడిపోయి పరుగెత్తి పరుగెత్తి. అలసిపోయి జామచెట్టెక్కి కూర్చుంది. అంతే వృశ్చీ మాటలు గుర్తుకొచ్చాయోమో! చెట్టుకొమ్మపట్టుకుని వేలాడుతున్న ఆమె చేతికి కొమ్మ విరిగి చేతిలోకొచ్చింది.

అంతే వెంటనే "తనలో తాను ధైర్యం తెచ్చుకొని తన భర్తను ఎదిరించింది, దెబ్బకు దెబ్బకొట్టడం ప్రారంభించింది. అమ్మో... కొట్టకే... కొట్టకే అంటూ అరుపులు ప్రారంభించాడు. అంతే ఆ అక్క తర్వాతెప్పుడూ కన్పించలేదు. కొద్దిరోజుల తర్వాత మళ్ళీ అనుకోకుండా మార్కెట్లో వృశ్చీకి సరస్వతక్క కనిపిస్తుంది. "అక్కా ఇప్పుడెక్కన్నావు? గొడవ జరిగిన రోజునుంచి కనిపించడమే లేదు. మీ అమ్మవాళ్ళింట్లో ఉన్నావా?"అని అడుగుతుంది. "లేదు నేను చాలా అవమానమైన పని చేశానట. అందుకు నన్ను వాళ్ళు రానివ్వలేదు. ఒక ప్రైవేటు స్కూల్లో అటెండరుగా పనిచేస్తున్నాను. రూము బాడుక్కి తీసుకున్నాను. సాయంత్రం పదిమంది పిల్లలకి ట్యూషన్ చెప్తున్నాను." అంది.

వృశ్చీ మాటలు సరస్వతక్కలో ఎంతో ధైర్యాన్ని నింపడమేకాక స్వతంత్రంగా బతకడానికి కారణమైంది. అనునిత్యం భర్తతో దెబ్బలు తింటూ హింసలకు గురౌతూ ఉండే సరస్వతక్కకు కాస్త ఊరట కల్గింది. తన కాళ్ళపై తాను నిలబడగల్గింది. తన కష్టపడి సంపాదించి తననుతానే పోషించుకోసాగింది.

ఎప్పుడూ ఎదగాలి....ఎదగాలి....అని తపించే వృశ్చీతో వాళ్ళమ్మ "నీవు ఎదిగి ఏం సాధిద్దామనే? ఎదిగిన వాళ్ళంతా ఎలా కష్టాలు పతుతున్నారో చూట్టం లేదా? సమాజం వాళ్ళని ఏమాత్రమైనా గౌరవిస్తోందా? ఎదిగిన వాళ్ళ జీవితాలు మిగతా వాళ్లలా లేకపోవడంతో అసహ్యం పాలవుతున్నారు. ఇంకెప్పుడూ ఎదక్కు, ఎదిగావంటే కష్టాలు తప్పవు!" అంది.

అంటే ఆడపిల్లలలోని స్వేచ్ఛను, ఆశయాల్ని ఎలా అడ్డుకుంటున్నారో మనం గమనించవచ్చు. అంటే స్త్రీలోని భావాలను,లక్ష్యాలను గౌరవించేవారు సమాజంలో అతి తక్కుమంది. వారు ఎన్ని కష్టాలు అనుభవించినా సమాజం ఏమనదు. కాని సరస్వతక్కలాగా తనకుతాను హింసల బారినుండి కాపాడుకున్నా సమాజం భరించలేదు. ఆడది భర్తను వదలి పోతే ఎలా అని ఎదురు ప్రశ్న వేస్తుంది. కాబట్టి సమాజంలోని ఇలాంటి వారు మంచి చెడుల్ని ఆలోచించి భాధితుల పక్షాన నిలబడి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవాలనే వారి ఆశయాల్ని గౌరవించలేని సమాజం ఏరకంగా అభివృద్ధి చెందగలదో కూడా ఆలోచించాలి. కనుక అలాంటి వారి పట్ల సానుభూతి చూపించకోపోయినా వారిని తప్పపట్టకుండా ఉంటే చాలు. అదే మనం వారికిచ్చే గౌరవ మర్యాదలు.

వృశ్చీని తనతో చదువుకొన్న అజీజ్ అనే అబ్బాయి ప్రేమిస్తాడు. వృశ్చీ కూడా ప్రేమించాలనుకుని ఆ ప్రయత్నాన్ని మానుకుంటుంది. కానీ ఇంట్లోవారికి భయపడి తన ఆలోచనను పంచుకోలేక పోయింది. అతను చూసిచూసి మరో అమ్మాయిని చూసి వివాహమాడతాడు. తన స్నేహితురాలు లత షరీఫ్ అనే అబ్బాయిని ప్రేమించి ఇంట్లోవారికి చెప్పకుండా పెళ్ళి చేసుకుంది.సంవత్సరం తరువాత లత కనిపిస్తే "ఏమిటి లతా? ఎందుకిలా ఐపోయావ్" అడిగింది. నాపేరు లత కాదు అంది దిగులుగా. అదేమిటంటే షరీఫ్ నా పేరు మార్చేశాడు.ఇప్పుడు నా పేరు షకీల. నేను ఇప్పుడు గుళ్ళకి పోకూడదు మన దేవుళ్ళకు మొక్కకూడదు. బొట్టు పెట్టుకోకూడదు. ఇలా జరుగుతుందని తెలిస్తే ఈ పెళ్ళి చేసుకునేదాన్నేకాదు, అంటూ తన కష్టాలన్నీ చెప్పుకొస్తుంది. అజీజ్‌ను ప్రేమిస్తే నేనెదుగుతానేమో అనే భ్రమ నుంచి బయటకొచ్చింది వృశ్చీ.

దీనిబట్టి మనిషిని మనిషిగా ప్రేమించే వారు చాలా అరుదుగా ఉంటారు. ప్రేమ వివాహమైనా, పెద్దలు నిశ్చయించిన వివాహమైనా శరీరాన్ని, ఆస్థుల్ని పంచుకోవడానికో, పెంచుకోవడానికో లాగున్నాయి. అంతేగాని మనిషి మనసుని అర్థం చేసుకోవడం ఇందులో లేదు. ఈ పరిస్థితులు మారాలి. వ్యక్తిని, వ్యక్తిత్వాన్ని గౌరవించేదిగాను అభిమానాన్ని పంచుకునేదిగాను వివాహ వ్యవస్థ ఉండాలేగాని అభిమానాన్ని, ఆత్మగౌరవాన్ని చంపుకునేదిగా ఉండ కూడదనే వాస్తవాన్ని గ్రహించాలి.

వృశ్చీకి హిస్టరీ అంటే చాలా ఇష్టం. మొదటి ప్రపంచ యుద్ధం, రెండో ప్రపంచ యుద్ధం మొ॥ అన్నీ విషయాలమీద మంచి అవగాహన ఉంది. ఒకసారి ఈజిప్షియన్ హిస్టరీ చదవాలనుకుంటుంది. ఆ పుస్తకం కోసం తనకు తెలిసిన శారదా మేడమ్ ఇంటికెళ్తుంది. తన దృష్టిలో శారదమేడమ్ బాగా ఎదిగిన వ్యక్తి. అలాగే వృశ్చీవాళ్ళను తరగతిగదిలో బాగా ప్రోత్సహించేది కూడా!ఇంటికెళ్ళినప్పుడు అక్కడి పరిస్థితుల్ని చూసి ఎదిగిందనుకుంటున్న ఆమె కూడా ఇంత మరుగుజ్జు అయిపోయిందా అనుకుంటుంది. అక్కడ పరిస్థితి యదాతథంగా "మొన్న నేనిచ్చిన ఐదొందలూ ఏమైనాయి?" అచ్చం మగ గొంతు. చెప్పడం మర్చిపోయానండీ...నిన్న మా తమ్ముడొస్తే ఫీజుకోసం ఇచ్చాను" చాలా ఒబీడియంట్‌గా వినిపించింది శారదగారి గొంతు. "ఆఁ...ఐదొందలు దారపోశావా?చెప్పనక్కర్లా? ఫీజులకోసం ఇక్కడ డబ్బులచెట్టు వేస్తున్నామటనా?" వృశ్చీ అవన్నీ వినలేక పుస్తకం అడగలేక ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?! ఆ క్షణంలో తన భర్త ప్రశ్నలకు ఎంత భయపడ్తూ సమాధానం చెప్పింది?అనుకుంటూ వెళ్ళిపోతుంది. అంటే ఆమె సమాజానికి భయపడుతుందే కాని భర్తకు కాదు. సమాజంలో భార్యభర్తలు కలిసుంటేనే గౌరవం.లేకపోతే తెగించినవారని, తిరుగుబోతని....నానారకాలుగా దుమ్మెత్తి పోస్తారు. ఇదీ పరిస్థితి. ఎంతో కష్టపడి తాను సంపాదించిన డబ్బును కూడా తనకు ఖర్చుపెట్టుకునే అవకాశం లేకపోయిన స్త్రీ పరిస్థితి ఎంతదారుణం. సమాజంలో చాలా వరకు ఇదే పరిస్థితి. స్త్రీ

తను సంపాదించే డబ్బు అన్నీ భర్త అనే పదివిని అనుభవించేవారికి కావాలి. కాని వారిలోని ఆత్మాభిమానాన్ని మాత్రం కనీసం గౌరవించాలనివారికి తెలియదు. అదేమంటే సమాజం.ఇదీ మన సామాజిక పరిస్థితులు.

ఈనాడు కూడా మహిళా ఎమ్.ఎల్.ఎ లు (శాసనసభ సభ్యురాలు), అధ్యాపకులు ఏ పదవిలోనివారైనా ఎవరైనాసరే ఎక్కువశాతం తన భర్తలే పక్కనుండి నడిపిస్తూవుంటారు. దీనికి వృశ్చీ కళాశాలలో జరిగిన సంఘటనను చూద్దాం." 'కాలేజీ డే' నాడు మేమంతా పూలదండలు పట్టుకొని గేటుదగ్గర నిలుచునివుండగా....కారు దిగింది మా 'మహిళా మరుగుజ్జు ఎమ్.ఎల్.ఎ.' నేనెంతో నిరాశపడ్డాను. ఆమెతోబాటు ఆమె భర్త కూడా వచ్చాడు. ఆయన కూడా దండలు వేయించుకుంటున్నాడు. స్టేజీమీద కూర్చుంటున్నాడు. మీటింగ్ తర్వాత కాలేజీ డెవలప్‌మెంట్ గురించి ప్రిన్సిపాల్‌గారూ, ఇతర స్టాఫూ వివరిస్తూంటే ఆమె ప్రతిసారీ భర్త ముఖంలోకిచూసి సమాధానం చెప్తోంది. ఆయన అప్రూవల్ లేకుండా ఒకవేళ ఆమె సమాధానాలు చెప్పినా,వాగ్దానాలు చేసినా ఆయన ఖండిస్తున్నాడు. ఒక శాసనసభ్యురాలే కాదు – అనేకమంది డాక్టర్లు, లెక్చరర్లు, సర్పంచులూ, కలెక్టర్లు, డి.యస్.పి.లు, యస్.పి.లూ అందరూ ఎందుకు మరుగుజ్జులో నాకు క్షణంలో అర్థమైంది."

అంటే భర్తలనే మహావృక్షాల కింద పసివాడే గడ్డిపోచలు వీళ్ళు కాబట్టి చదువు, డబ్బు, పదవులు మొ॥వాటివల్ల స్త్రీలు ఎదుగుతున్నారనుకోవడం వట్టి భ్రమేనని ఈ కథ నిరూపిస్తోంది. వృశ్చీ దృష్టిలో బాగా ఎదిగిన వ్యక్తి అనుకునే మరొక స్త్రీ జెన్నీఫర్ టీచర్. ఈ కథలో జెన్నీఫర్ టీచర్ అంటే వృశ్చీకి చాలా ఇష్టం అయితే ఆమె అంటే సమాజానికి అసహ్యం. తెలిసో తెలియకో పెళ్ళికాకుండానే ఒక వ్యక్తి ద్వారా ఒక బిడ్డను కన్నది. తర్వాత అతను పట్టించుకోలేదు. ఇక టీచరు చేసేదిలేక తన బతుకేదో తాను ధైర్యంగా బతుకుతూ ఆ బిడ్డను పెంచుకుంటూఉంది. అయితే ఆ బిడ్డకు తండ్రి లేదని ఆమె అంటే సమాజానికి చులకన.

ఆ పురుషబీజ కణం ఏదో ఒక తండ్రి నుంచే వచ్చుంటుంది. ఆ తండ్రి దగ్గర లేకపోవచ్చు.కానీ, ఎక్కడో ఓ చోట తప్పక ఉంటాడు. జంతువుల్లో మగజీవితో ప్రమేయంలేకుండా ఆడజీవులే పిల్లల్ని సాకుతాయి. వాటికన్నా ఉత్తములమని చెప్పుకునే మనంమాత్రం అదేపని చేసిన ఓ మనిషిని ఎద్దేవా చేస్తున్నాం.ఏ కైసా అన్యాయ్ హై? ఏ కైసా ధర్మ్ హై? అంతమాత్రాన తనెవరో చేసిన తప్పులో ఆమెకు భాగస్వామ్యముండవచ్చు. తరువాత తనను తాను తెలుసుకొని ధైర్యంగా జీవితాన్ని గడుపుతోంది కదా! మరైతే ఎందుకు సమాజం ఇలాంటివారిని వెలివేయడం. లేకపోతే జరిగినదానికి ఆమె ఆత్మహత్య చేసుకోవాలా, ఆ బిడ్డను అనాథగా వదిలేయాలా? కాబట్టి ఆ తల్లి లోలోపల ఎంతో బాధను అనుభవిస్తూనే ఆ బిడ్డను పోషించుకుంటోంది. ఇలాంటివారిని ప్రోత్సహించాల్సిన అవసరం లేదు.వారిని నిందించ కుండాఉంటే అదే మనం సమాజాన్ని గౌరవించినట్లు లెక్క. నిజానికి సమాజం ఏమైనాచేయాలంటే అలా వదిలి వెళ్ళిపోయినవాడ్ని నిలదీయాలి.వాడిని సమాజంనుంచి వెలివేయాలి ఏమాత్రం బాధ్యత లేకుండా బిడ్డనుసైతం వదలి ఆమెను అనాధనుచేసిన వాడిపై చర్యలు తీసుకోవాలి. ఈ కథలో తన సమస్యను అధిగమించి ధైర్యంగా జీవించిన పాత్ర ఈ టీచర్ .

ఈ పరిస్థితుల్లో సామాజిక గౌరవం ఆశించే స్త్రీలు అన్నింటికీ సర్దుకునిపోవాలనే పేరుతో అనేక మంది స్త్రీలు లోలోపల మండి మాడి మసైపోతున్నారు. ఇదిలా ఉంటే ఈ కథలోని వృశ్చీ నెనెలా ఎదగాలి? సమాజాన్ని ఎలా ఛేదించాలి? నాకల నిజమౌతుందా? అని ఆలోచిస్తున్న తరుణంలో పెద్దలు పెళ్ళి చూపులు ఏర్పాటు చేశారు. చూడటానికొచ్చిన ఆ అబ్బాయి వృశ్చీతో ఒంటరిగా మాట్లాడాలంటాడు. వారి సంభాషణ చూద్దాం– "మీరు చాలా అందంగా ఉన్నారు." అన్నాడు. ఇంచుక సంతోషించాను. "ఇంత చదివారు...తర్వాత ఏం చేయాలనుకుంటున్నారు? చదువుకున్న ఆడవాళ్ళు సొంతంగా నిర్ణయాలు తీసుకోవాలి. అటువంటి ఇండివిడ్యువాలిటీ ఉండే స్త్రీలు నాకిష్టం." "నిజంగా..? అనుకున్నా మనసులో". "లేడీస్ వంటింటికి పరిమితం కావడం నాకసలునచ్చదు. వాళ్ళకి ఆల్‌రౌండ్ నాలెడ్జ్ అవసరం.అందుకే ప్రతి స్త్రీ ఉద్యోగం చేయాలి." "ఆహాఁ....నేనెదగడానికి సాయపడే మేలుమగడు నిస్సందేహంగా ఇతడే! (మనసులోప్రకాశంగా) నాకు జాబ్ చేయాలనే ఉంది!" అన్నాను. "గుడ్..!" భళ్లున నా పెళ్ళైంది."

అంతలోనే పెళ్ళి, అతనొక ఉద్యోగం చూసిపెట్టాడు. ఒకటో తేదీ జీతం రాగానే అంతా అడిగి తీసుకొని నెలకు 500 పాకెట్‌మనీ చేతికిస్తూ వచ్చాడు. డబ్బులింట్లోనో,

పర్సులోనో పెట్టుకోకూడదు. బ్యాంక్‌లో పెడ్తాను. అవసరమైతే చెప్పు డ్రా చేసుకొస్తాను అనేవాడు. వృశ్చీకి తన భర్తను పేరు పెట్టి పిలవాలంటే ఇష్టం. అయితే అతను ఆ స్వేచ్ఛను కూడా హరించాడు. "చూడు..అమ్మ నాన్నని అలా పిలవదు. చెల్లాయిలు బావగార్లని 'ఏమండీ' అని పిలుస్తారు నువ్వలా పిలిస్తే ఎబ్బెట్టుగా ఉంటుంది." అంటూ ఆమెకు కనీసం తాను అనుకున్నట్లుగా పిలుచుకోవడానికికూడా అవకాశంలేకుండా చేస్తాడు.


ఒకరోజు అనుకోకుండా తన తోటి ఉద్యోగులతో కలసి తోటి ఉద్యోగి కూతురు పుట్టినరోజు ఉత్సవాలకు వెళ్తుంది. ఒక గంట ఆలస్యంగా ఇంటికొచ్చింది. విషయం చెప్పింది. అంతే "ఎవరా కొలీగ్? ఆడా?మగా?,వాళ్ళాయన ఏం చేస్తాడు? చెప్పివెళ్ళొచ్చుగా?! కనీసం ఫోన్‌కూడా చేయలేదు. ఇంతకీ వాళ్ళిల్లెక్కడా? అబ్బో..ఆ వీధా? ఆ ఏరియా అంతా రౌడీ కొంప....!" వినేవాళ్ళకివన్నీ మంచి ప్రశ్నలే. నాకు మేలొనగూర్చేవే! కానీ, ఇవే నన్ను ఉక్కిరిబిక్కిరిచేసేవి. ఇంకా కొన్ని."ఈ లెటరెవ్రాశారు?" "మా క్లాస్‌మేట్..అతనికేదో అప్లికేషన్ కావాలంట!"ఐతే మాత్రం బోలెడంత మంది మగ క్లాస్‌మేట్సు ఉండగా ఆడవాళ్ళనెందుకు ఇబ్బంది పెట్టడం? మగాళ్ళని నమ్మకూడదు."

ఇదీ పరిస్థితి. కొన్నాళ్ళకి ఇలాంటి మానసికవేధింపులతో అలసిపోయిన వృశ్చీ "ఇక్కడేదో దొరుకుతుందని భ్రమించాను. నేనిలా చచ్చిపోవాల్సిందేనా? నన్నెదగనివ్వరా ప్లీజ్....!" ఇంతలోనే వృశ్చీ ఆడపిల్లకు తల్లి అయింది. తొందరగా మగపిల్లాడ్ని కనాలని భర్త, అత్తమామలూ తొందరపెట్టసాగారు. ఇప్పుడే వద్దు అంటే భర్త పెద్ద జోకేసి విరగబడి నవ్వాడు. అంతే గాయపడిన మనసుతో వృశ్చీ పొద్దున్నే బీరువాలోంచి ఎవర్నీ అడగకుండా డబ్బు తీసుకుంటుంది."ఇంక ఎవరేంచెప్పినా వినదల్చుకోలేదు స్టెరిలైజేషన్ కోసం డాక్టరు దగ్గర అపాయింట్మెంట్ తీసుకున్నాను. ఇంకో మగ పిల్లాడు పుట్టి మరీ ఏపుగా ఎదిగితే ఈ ఆడపిల్ల మరుగుజ్జు కాక మానదు మరింక పిల్లల్ని కనకూడదు." అంటుంది. ఇది ఈ కథలో ముగింపు.

స్త్రీలకు పురుషులు, పురుషులకు స్త్రీలు ఒకరికొకరు తోడుండాలి. ఇద్దరూ సమానమే అనే భావాన్ని తల్లులైన మనం వారిలో బీజంగా నాటాలి. ఆ విషయం గాలికొదిలేసి సమస్య ఎక్కడొచ్చిందో ఆలోచించకుండా నిందలు మగవారిపై వేయకూడదు. ఈ కథలో వృశ్చీ చేసినట్లు మగపిల్లల్ని కనడం మానేస్తే వ్యవస్థ బాగుపడిపోతుందా? మరి ఇలాంటి అత్తల్ని, ఇదే ఆలోచనలతో కుళ్ళుతున్న స్త్రీలను ఏంచేయాలి? కాబట్టి స్టెరిలైజేషన్ చేయించుకోవడం సమస్యకు పరిష్కారమా? కానేకాదు. ఈ నిర్ణయం సబబుకాదు. తాను ఎదగాలనుకుంటే వృశ్చీ ఏంచేయాలి? మగబిడ్డనుకూడా కని ఇద్దరినీ సమాన స్థాయిలోపెంచి ఇద్దరూ ఒకటే అని నిరూపించి సమాజానికి ఆదర్శమై ఉండాలి. అలాగే సమాజం కూడా వీరిని ఆదర్శంగా తీసుకొని మనం కూడా వృశ్చీలాగా పిల్లల్ని పెంచాలి అనే నిర్ణయానికొచ్చే విధంగా వృశ్చీ ప్రవర్తన ఉండి ఉంటే ఈ కథ మరింత ఉన్నతంగా ఉండేదేమో! అంటే ఇక్కడ ఆమె తీసుకున్న నిర్ణయం ప్రతీకారం తీర్చుకోవడమే తప్ప మరొకటి కాదు. కానీ సమన్వయం చేసుకోవడమే కథానాయిక లక్షణం. సామాజిక ప్రయోజనం. కాబట్టి కూతురుతో పాటు కొడుకునూ ఎలా సమభావంతో చూడాలో నిరూపించి ఉంటే వృశ్చీ పాత్ర మరింత ఆదర్శవంతమయ్యేది.

ప్రతి ఒక్కరు ఉద్యోగం అనేది బాధ్యత తప్ప అధికారం కాదు అనే అవగాహనను కల్గివుండాలి. ప్రతి మహిళ వివేకంతో, జాగరూకతతో, సామరస్యంతోవుండి తన వృత్తిపరమైన నిర్ణయాధికారం తన చేతుల్లోనే ఉండేట్లుగా చూసుకోవాలి. ఇవన్నీ చాలా సున్నితమైనవి, సంక్లిష్టమైనవి, మౌలికమైనవి కూడా. కాబట్టి స్త్రీలకు అన్ని విషయాలపట్ల, సమస్యలపట్ల తగిన జాగ్రత్త అవసరం.

స్త్రీవాద సాహిత్యంలో నేటి వరకూ స్త్రీవాదులు ఎన్ని కథల్లో, ఎన్ని వ్యాసాల్లో ఏమేమి చెప్పాలనుకున్నారో అవన్నీ ఈమె కథల్లో ప్రతిబింబిస్తాయి. ఇలా స్త్రీలపట్ల సంఘం చూపుతున్న బాధ్యతా రాహిత్యాన్ని స్త్రీకి జరుగుతున్న అపకారాన్ని అనేక పార్శ్వాలలో ఎత్తి చూపేవి పుష్పాంజలి కథలు. వీటన్నినీ మనం గమనిస్తే సమాజంలోని స్త్రీల పట్ల ఈమె ఎంత బాధ్యత వహించిందో మనకు అవగతం కాగలదు.



డా. పి. వరలక్ష్మి
తెలుగు ఉపన్యాసకులు,
ప్రభుత్వ మహిళా కళాశాల, చిత్తూరు
ఫోన్ : 900 087 4713

# రాణీ చిన్నమాంబ

- ఎమ్.వి. భారతలక్ష్మి

కాల యవనిక మరుగున పడిన మాణిక్యాల్లాంటి మహిమాన్విత మహిళల యశోదీపికలు భావితరాలకు కరదీపికలుగా భాసిస్తాయి. అటువంటి స్ఫూర్తి ప్రదాత, పిఠాపురం మహారాణి చిన్నమాంబదేవి. 'పుట్టుసిరి'లా నూజివీడు సంస్థానానికి చెందిన కపిలేశ్వర పురాధీశులు రాజా వేంకట రంగయ్యప్పారావు గారింట 1895లో ఉదయించనదీ ఆండాళ్‌దేవి. చిన్నతనం నుండి అసాధారణ ప్రజ్ఞాపాటవాలను ప్రదర్శించినదామె. ఇంటివద్ద సంస్కృతాంధ్ర భాషలతోపాటు ఆంగ్ల విద్య కూడా కొంత నేర్పినది. 1906లో ఆమె గుణ, శీల, సౌందర్యాలకు తగిన విధంగా పీఠికాపురాధీశులు రావు వేంటక కుమార మహీపతి సూర్యారావు బహద్దురు వారితో వివాహం జరిగినది. ఆండాళ్‌దేవి, అత్తవారింట చిన్నమాంబాదేవిగా అడుగిడింది. ప్రజాహిత కార్యాలే జీవన విధానంగా మలచుకొన్న భర్తకు అన్నింటా తోడునీడయి నిలిచినదామె. పిఠాపురం కోటను ఆధ్యాత్మిక, సాహితీ, సంగీత, సామాజిక సేవలకు కేంద్రబిందువుగా చేసుకొని, సంసార తారకమైన ప్రేమతత్వాన్ని ఆకళింపు చేసుకొని జన్మసాఫల్యాన్ని సాధించిన సాధ్వీమణి చిన్నమాంబాదేవి.

భగవద్భక్తి, పాతివ్రత్యం, హృదయసౌశీల్యం, భావసౌకుమార్యం విజ్ఞానం, వైదుష్యం, వదాన్యం కలబోసికొని రూపుదిద్దుకొన్న సమున్నత వ్యక్తిత్వం రాణీవారిది. పదారు వన్నెల బంగారం కరిగించి పోతపోసినట్లుండే అయిదున్నర అడుగుల నిండైన విగ్రహం. నుదుట మెరిసే కుంకుమబొట్టు, కళ్ళకు తీర్చిదిద్దిన కాటుక, మెడలో సౌభాగ్య చిహ్నాలు, మాంగల్యాలు గ్రుచ్చిన బంగారు సూత్రం, నల్లపూసల దండ, చేతులకు బంగారు గాజుల మధ్య గలగలలాడే మట్టిగాజులు, కాలివ్రేళ్ళకి, మృదురవళి తోడి మట్టెలు, ఉప్పాడ జరీనేత చీర ధరించే తీరైన ఆంధ్రగృహిణి స్వరూపం ఆమెది. తమ చిరంజీవులనందరినీ చక్కని సంస్కారవంతులుగా మలచి, కుమార్తెలను వాద్యసంగీతంలో నిష్ణాతులుగా, వర్ణచిత్రాలు గీయగల చిత్రకారిణులుగా తీర్చిదిద్దిన మహోన్నత ఆదర్శమూర్తి. ఇదీ ఆమె వ్యక్తిగత జీవితం, కుటుంబ జీవితం.

తమ ఆశ్రిత కోటిలోని అన్ని తరగతుల కుటుంబాలకు చెందిన స్త్రీలు, పిల్లలు చదువుకొని సంస్కారవంతమైన జీవితం గడపాలనేదే రాణి గారి చిరకాల కాంక్ష. అందుకుగాను పిఠాపురంలో వారికి ఓ స్కూలు, స్త్రీ సమాజాన్ని, ప్రార్థనా మందిరాన్ని స్థాపించారు. పాఠశాలలో మంచి సమర్థులైన ఉపాధ్యాయులను నియమించి బాలికలకు సంస్కృతాంగ్లాది భాషలతోపాటు, సంగీతం, నాట్యం, కుట్టుపని మొదలైన కళలు నేర్పించారు. హరిజనుల మీద ఆమెకు ప్రత్యేకమైన దయ. వారి పిల్లలకు ఓ పాఠశాల పెట్టి పలకలు, పుస్తకాలు ఇచ్చి వారికి చక్కగా చదువుకొనే వీలు కల్పించారు. ఇదీ పిఠాపురం రాణీ సాంఘిక జీవన సరళి.

చిన్నమాంబాదేవి లలితా కళాకోవిద. వీనుల విందుగా వీణ వాయించగల దిట్ట. స్వయంకృషితో సంస్కృతాంధ్రాలలో కవిత్వం చెప్పగల సామర్థ్యం. ఆంగ్లంలో మంచి పాండిత్యం, బెంగాల్ భాషలో చక్కని పరిచయం ఏర్పరచుకొన్న విదుషీమణి. రచయిత్రులను, కవయిత్రులను పిలిపించుకొని సత్కరించి వారితో కావ్యగోష్ఠులను నెరపుతూ కవితా రసానందాన్ని తనివితీరా గ్రోలిన సాహితీ పిపాసి. రాజారామ్మోహనరాయ్, రఘుపతి వేంకటరత్నం నాయుడు గార్ల బోధనలను బాగా అర్థంచేసుకొని ఏకేశ్వరోపాసనకు అంకితమైన ధన్యజీవని. యోగినులను సందర్శించుకొని ఆత్మ, పరమాత్మల తత్త్వాన్ని గ్రహించేందుకు యత్నించిన పుణ్యశీలి. ఇదీ పీఠికాపుర ప్రభ్విణి చిన్నమాంబాదేవి మనోజ్ఞ కళాజీవితం, ఆధ్యాత్మిక జీవన రాగం. అనంత ముఖాలుగా సాగిన రాణీ జీవన కల్యాణ రాగానికి కేవలం ఆలాపనలాంటిది మాత్రమే మీరు చూడబోయే ఈ చిన్ని ప్రదర్శన. అష్టదిగ్గజ కవుల కావ్యగానాలతో నినదించిన శ్రీకృష్ణదేవరాయల 'భువన విజయం' సభలను మీరు చాలాసార్లు చూసే ఉంటారు.

చేమకూర వేంకటకవి, రంగాజమ్మ, మధురవాణి మొదలగువారితో పరివేష్టితుడైన తంజావూరు రాజు రఘునాధనాయకుని, 'ఇందిరా మందిర' సందర్శనాభాగ్యం మీలో చాలామందికే సమకూడి ఉంటుంది. కవి పండితులతో నిండుకొలువుండిన సరస్వతీ సభాప్రాంగణాన్ని మీలో కొందరు తిలకించే ఉంటారు.

అలాంటి రసజ్ఞులైన మీ అందరిముందూ ఇదిగో ఇది ఒక చిన్న సరికొత్త ప్రయోగం. ఆశుకవిత్వం, సమస్యాపూరణం, కవితాపఠనం, కావ్యవివేచనం, సాహిత్యవిమర్శ, సంగీత వాద్య విన్యాసం, నాట్యోల్లాసంతో కూడిన ఈ చిన్ని ప్రదర్శన రాణీ చిన్నమాంబాదేవి లలిత కళామయ జీవితాన్ని ప్రతిబింబింపచేసే మనోజ్ఞదర్పణం. సంగీత, సాహితీ సౌరభాలు గుబాళించే అలనాటి ఓనాటి పీఠికాపుర మహారాణి చిన్నమాంబాదేవి కళాదర్బార్ సొబగులలోని ఓ చిన్న మెరుపును మీ కనులకు కట్టించే ఓ చిన్ని యత్నం. రమణీమణుల రమణీయ కవితాగోష్టిని సాహితీ సమారాధకులైన సదస్యులు సహృదయంతో సమాదరిస్తారని ఆశిద్దాం.

పీఠికాపుర ప్రభ్విణి – చిన్నమాంబాదేవి
కళాదర్బార్, కళాదర్బార్, కళాదర్బార్!
జయజయ ఆండాళ్ మహాదేవికీ
జయజయ చిన్నమాంబదేవికీ
జయజయ పీఠికాపురి రాణీమతల్లికీ
జయీభవ – దిగ్విజయీభవ
జయీభవ – దిగ్విజయీభవ

(జయధ్వానాలు అయ్యాక రాణీ చిన్నమాంబాదేవి ప్రవేశం)

జూలూరి తులసమ్మగారు, కొటికలపూడి సీతమ్మగారు కూర్చుని సాహిత్యం గురించి మాట్లాడుకొంటూ ఉంటారు. రాణీ ప్రవేశించగానే లేచి నిల్చుంటారు.

రాణి : అమ్మా! నేనెంత రాణీనైనా, మీరిరువురూ నాకు గురువులు, గురుతుల్యులు కదా! నేను రాగానే కూర్చున్నవారు లేవడమెందుకు? మీరు కూర్చుని ఉండి నన్నాశీర్వదిస్తేనే నాకు ఆనందం.

జూ.తు. : తల్లీ! ఎంత గురుతుల్యులమైనా, మా మహారాణీకి చూపించవలసిన మర్యాదకదా ఇది. అయినా నిర్మలమైన, నిడారంబమైన ప్రవర్తనతో మీరు ప్రజలందరి మనస్సులను ఆకుట్టుకొన్నారు.

"నిత్యమై, నిర్మలంబై నెగడు నాత్మ
దృశ్యమగుచున్న జగమెల్ల వశ్యమగున
దేన సర్వవస్తు తత్త్వంబు తేటపడునా
అదియే, సమ్యగ్వివేకం బటంద్రుబుధులు."

అన్నారమ్మా శ్రీ శంకరభగవత్పాదులు

రాణి : తులసమ్మగారూ! అది నా పూర్వజన్మ సుకృతం. కనుకనే మీవంటి విద్యావంతులకు, విదుషీమణులకు శిష్యురాలినయ్యాను.

కొ.సీ. : అమ్మా, మహారాణీవారూ! మీవంటి ఉత్తములు మాకు శిష్యులవటం మా అదృష్టం తల్లీ!

స్త్రీలు విద్యనేర్వజెడిపోదురనుమాట
కల్ల యనుచు దోప నెల్లరకును
విశద పరతు నొక్క విద్యావతి చరిత్ర
సంగ్రహంబు గాగ చదువుడయ్యా!

రాణి : స్త్రీ విద్య ప్రాముఖ్యతను ఎంత స్పష్టంగా చెప్పారమ్మా! మీరు స్త్రీ విద్యావ్యాప్తికి చేస్తున్న కృషి అమోఘం.

జూ.తు. : చాలా చక్కగా చెప్పారండీ సీతమ్మగారు! ఇది మీరు రచించిన 'అహల్యాబాయి' కావ్యంలోనిది కదూ! ఈ పద్యం మన చిన్నమాంబాదేవిగారికి చక్కగా అన్వయించవచ్చును సుమా!

కొ.సీ. : అవును తులసమ్మగారూ! విద్య నేర్చిన వనిత ఎంత బాగా తన భర్తను, పిల్లల్ని, సంఘాన్ని సంస్కరించగలదో మన రాణీగారు నిరూపిస్తున్నారు కదా!

జూ.తు. : అందుచేతనేకదా సీతమ్మగారూ! మన రాణీగారు ఆడపిల్లలందరూ చదువుకోవాలని ప్రత్యేకంగా వారికో స్కూలు పెట్టించారు పిఠాపురంలో

(కృష్ణవేణమ్మ, పాటల వెంకమ్మ ప్రవేశం)

కృవే,పా.వెం : మహారాణీవారికి నమస్కృతులు

రాణి : నమస్కారమమ్మా కృష్ణవేణమ్మగారూ!

నమస్కారం, వెంకమ్మగారూ! రండి కూర్చోండి.

కొ.సీ. : నమస్కారం కృష్ణవేణమ్మగారూ, పాటల వెంకమ్మగారిని వెంటబెట్టుకొని వచ్చారే! ఇంకేం ఈ రోజు అమ్మవారి కొలువు కవితాగానంతోపాటు గాన మాధుర్యంతో రక్తికడుతుంది.

పా.వేం.: నాదేముందమ్మా సీతమ్మగారూ! వీణ కృష్ణవేణమ్మగారు మన రాణీవారి సంగీత గురువులు. మనకు వారి వీణావాదనంతో వీనులవిందు చేస్తారు.

జూ.తు. : వెంకమ్మగారూ! మీరుమాత్రం తక్కువేమిటి? తలుపు దగ్గర పాటల నుండి తరంగాలవరకు భావయుక్తంగా పాడి రాణీవారిని ఉల్లాసపరుస్తారు.

పా.వెం. : నా పాటకేంలెండి, ఎప్పుడూ వినేదేగా, ముందు కృష్ణవేణమ్మగారి వీణావాదనాన్ని విని ఆనందించాలి.

చెలి : అమ్మా, వీణలు అందించమంటారా!

పా.వెం.: కమలనేత్రి అందించు వీణలు, రాణీవారి చేతిమీటు అమృతపు ఊట

కృ.వే. : అమ్మా రాణీగారూ! ఏ రాగం ఆలపించుదామమ్మా?

రాణి : అమృతవర్షిణి రాగాలాపన చేయండమ్మా

పా.వేం.: ఆహా! అద్భుతమైన రాగం, 'సుధామయీ, సుధానిధే' అనే కీర్తన అందర్నీ ఆనంద సుధలో ఓలలాడిస్తుంది.

రాణి : కృతి ఏది వాయించాలో వెంకమ్మగారు సెలవిచ్చారే!

(కృతి అవుతుండగా వింజమూరి వేంకటరత్నమ్మ గారి ప్రవేశం)

కృష్ణవేణమ్మ వీణపై ఆలాపన చేయగానే రాణిగారు కృతిని వాయిస్తారు.

విం.వేర. : మహారాణీవారికి నమస్సులు. ఎంత అద్భుతంగా వాయించారమ్మా, అమృతపు జల్లులా ఉంది!

రాణి : అనసూయ పత్రికా సంపాదకురాలు వింజమూరి వేంకటరత్నమ్మగారా! రండి, కూర్చోండమ్మా ఈ చిరంజీవి పేరు కూడా అనసూయకదా! రా తల్లీ! ఇలా దగ్గరకు రా (పాపను దగ్గరకు తీసుకొని ప్రేమతో తల నిమురుతారు)

విం.వేర. : ఔనమ్మా, చిన్నది సీత, మా అక్కయ్య దగ్గరుంది.

పా.వేం. : ఆడవాళ్ళు కూడా పత్రికలు నడిపేస్తున్నారే!

విం.వేర. : వెంకమ్మగారూ! నేనే కాదండోయ్, ఇంకా చాలామంది ఉన్నారు. 'సావిత్రి' పత్రికను పులగుర్త నరసమాంబగారు, 'హిందూసుందరి'ని బాలాంత్రపు శేషమ్మగారు, ఇలా ఎన్నో పత్రికలు ఆడవారు నడుపుతున్నారు సుమండీ!

రాణి : వేంకటరత్నమ్మగారూ! మీ పత్రికలో మంచి రచనలు ప్రచురిస్తున్నారు. ఆడవారి విజ్ఞాన వికాసానికి మీరెంతో దోహదం చేస్తున్నారమ్మా

విం.వేర. : ఏదో ఉడతాభక్తిగా చేస్తున్నానమ్మా కానీ, రాణీవారి కొలువున జరిగే సాహిత్య గోష్టికి సాటిరాదు. కందుకూరి వీరేశలింగం గారి శిష్యురాలు కొటికలపూడి సీతమ్మగారు సామాన్యురాలా? ఆమె పాండిత్య ప్రకర్ష చూసి తరించాలని వచ్చాను. కాని...

రాణ : సీతమ్మగారూ! మీ 'అహల్యాబాయి' గ్రంథం కొంతభాగం విన్నాం, తరువాత భాగం ఎప్పుడు వినిపిస్తారు?

కొ.సీ. : తరువాతి ఘట్టం ఇంకా పూర్తి కాలేదు తల్లీ! ఈవేళ తులసమ్మగారి కవిత విందాం. 'గులేబకావళి' నాటిక కూడా వ్రాశారామె ఈ మధ్యనే.

రాణి : సరేనమ్మా, తులసమ్మగారూ, 'శీలము లేని సౌందర్యం' అనే అంశం మీద ఆశువుగా పద్యం చెప్పి సభను సంతోషపరచవలసిందని మా కోరిక.

జూ.తు. : సరేనమ్మా (గొంతు సదరించుకొని)
చక్కదనమును, ధనమును, సరసవచన
రచనయుగల్గ సద్గుణ రాశియగునే?
కాంతి, యందంబు, మృదుతయు గల్గు
పూవు
సౌరభముగల్గు సుమముతో సాటియగునే?
(అందరూ చప్పట్లు కొడతారు)

రాణి : 'శీలము లేని సౌందర్యం', 'సౌరభం లేని సుమము' అంటూ చక్కని ఉపమానం ఇచ్చారు. మీ కావ్యసారాంశం అంతా ఒక్క పద్యంలో చెప్పారు.

విం.వేర. : చాలా బాగా చెప్పారు. ఇప్పుడొక సమస్యాపూరకం.

పా.వేం. : అవును సుమా! సమస్యాపూరణం లేనిదీ రాణీవారి దర్బారు రక్తికట్టదు.

రాణి : వేంకటరత్నమ్మగారూ! మీరే ఇవ్వండమ్మా సమస్యను మా గురువుల ప్రతిభను మీరే పరిరక్షించాలి.

విం.వేర. : ఎంతమాట సెలవిచ్చారు మహారాణీవారూ! మీ గురువుల పాండిత్యాన్ని నేను పరిక్షించడమా? తమ కొలువులో సాహితీ కళారాధననుచూసి తరించాలని వచ్చాను. కానీ...

కొ.సీ. : అమ్మా! రాణీగారూ! సమస్యను ఇవ్వడంలో మీరు చాలా చతురులు. వేంకటరత్నమ్మ గారు దేవులపల్లి తమ్మన్న శాస్త్రిగారి పుత్రిక, భావకవి కృష్ణశాస్త్రి సోదరి. కవితా వల్లరి ఆమె సొత్తు కదా!

రాణి : సీతమ్మగారూ! సరిగ్గా చెప్పారు. కవుల ఇంట పుట్టి పెరిగిన వేంకట రత్నమ్మ గారూ! ఇదీ సమస్య! "రతిపై చతురాస్యున కనురాగము హెచ్చెన్!

జూతు : (సన్నగా నవ్వుతు) 'బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు' మరి వేంకటరత్నమ్మ గారేమంటారో?

విం.వేర. : (ఆలోచిస్తున్నట్లు) 'రతిపై చతురాస్యున కనురాగము హెచ్చెన్' సరసంగా ఉందమ్మా సమస్య! మహారాణీవారు అవధరించండి.
కతుకముతో వీణను గొని
శ్రుతి హితముగ పాటపాడి
సుస్మిత ద్యుతులను ప్రసరించెడి, భా
రతిపై చతురాస్యున కనురాగము హెచ్చెన్
॥ భారతి ॥

రాణి : అద్భుతం! మీ కవితాచాతుర్యాన్ని సమస్యాపూరణంలో చతురంగా చూపించారు.

కొ.సీ. : భేషుగ్గా పూరించారు అయినా వేంకటరత్నమ్మగారు వచ్చే సమయంలో మన రాణీగారు వీణ వాయిస్తున్నారుకదా! అందుకే వేంకటరత్నమ్మగారి కవితావేశం భారతిపై ప్రసరించింది.

జూతు,
కృవే : బాగుంది, చాలా బాగుంది.

పా.వేం. : కుతుకముతో వీణను గొని మరొక్క కృతిని వినిపిస్తారా రాణీగారితో పాటు కృష్ణవేణమ్మ గారూ!

కృవే : పాటల వేంకమ్మగారూ, ఈ రోజు పాట పాడకుండా దాటేస్తున్నారు. పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తననొకటి అందుకోండమ్మా, వేంకమ్మగారూ!

పా.వెం. : చక్కని తల్లికి ఛాంగుభళా.
తన చెక్కర మోవికి చాంగుభళా...
(అన్నమయ్య కీర్తన పాడుతారు)

కృవే,
జూతు. : భళా, భళా!

రాణి : వేంకమ్మగారూ! మీరు తరంగాలు పాడగా విన్నాను. అన్నమయ్య పదాన్ని ఎంత అద్భుతంగా పాడారమ్మా!

కొ.సీ. : అన్నమయ్య పదాలు తేటతెలుగు పదాలతో తేనె జాలువారుతుంది.

రాణి : మీ అందరి సాన్నిహిత్యంలో సంగీత సాహిత్య గోష్టులు రసభరితంగా సాగుతున్నాయి ఇక్కడ. మన దివాన్‌గారి (మొక్కపాటి సుబ్బారాయుడుగారు)

తోబుట్టువు కామమ్మగారు సామాజిక సేవ ఎంతో చేస్తున్నారమ్మ. మన పిఠాపురంలో ఉన్న మిషనరీ ఆసుపత్రిలో చేరిన పేదలు, అనాథలకు ఆమె తిండి, బట్టలు ఇచ్చి ఎన్నో విధాలుగా ఆదుకొంటున్నారు. అన్నట్లు ఈ రోజు ఉప్పులూరి అగ్గమ్మగారు రాలేదేం?

జాతు : ఆమె స్త్రీ సమాజంలో చదువు చెప్పడంలో నిమగ్నులై ఉన్నారనుకొంటాను. మన సీతమ్మగారు, బాలాంత్రపు శేషమ్మ గారు కాకినాడలో బాలికలకు పాఠశాల నడుపుతున్నట్లే, పిఠాపురంలో అగ్గమ్మగారు ఆడపిల్లలకు పాఠాలు చెప్తున్నారు.

విం.వే. : అమ్మా! తమరు పులుగుర్త లక్ష్మీనరసమాంబగారికి వ్రాసిన పద్య లేఖలు ఆమె నాకు చూపించారమ్మా. తమరి సాహిత్యపటిమను ఆమె ఎంతగానో శ్లాఘించారు. మీ లేఖలను భద్రపరచుకొన్నారు.

కొ.సీ. : వేంకటరత్నమ్మగారూ! మీతోపాటు నరసమాంబగారిని కూడా తీసుకు రావలసినది. ఆమె విద్యార్థినీ సమాజం అనే ప్రథమ స్త్రీ సమాజాన్ని స్థాపించి అనేక గద్యరచనలు చేసిన రచయిత్రి కదా! ఈ మధ్యనే 'మహిళా కళాబోధిని' రచించారు. ఆంధ్రదేశం తరపున జాతీయ సభలకు ప్రతినిధిగా వెళ్ళారటకదా!

విం.వే. : అవునమ్మా! వచ్చే ఏడాది జరుగబోయే అఖిలాంధ్ర మహిళా సభకు మన కొటికలపూడి సీతమ్మగారు అధ్యక్షత వహించాలని ఆదేశించారు.

రాణి : మన సీతమ్మగారు అఖిలాంధ్ర మహిళాసభకు అధ్యక్షత వహిస్తారంటే పిఠాపురానికే కాదు, యావదాంధ్రదేశానికీ గర్వకారణం. నాకెంతో సంతోషంగా ఉందమ్మా.

కొ.సీ. : అమ్మా! మీ ముందు నేను ఏపాటి? స్త్రీల సభలలో మీరు అనర్గళంగా ఉపన్యసిస్తోంటే నేను విని, ఎంతో ఆనందిస్తూ ఉంటాను. ఆంగ్లభాషలో మీ పాండిత్యం, విమర్శనా కౌశలం చూసి నేనెంతో ముగ్ధురాలినవుతాను తల్లీ!

జూతు : అవును సీతమ్మగారూ! సంస్కృతాంధ్ర ఆంగ్ల భాషలలో రాణీవారి పాండిత్యం అనమానం. ఈ మధ్య విశ్వకవి రవీంద్రులు పిఠాపురం కోటకు విచ్చేసినపుడు వంగభాషలో చక్కని పరిచయం సంపాదించి రవీంద్రుని కవితలు ఆస్వాదించారు.

కొ.సీ. : అమ్మా! మహారాణీవారూ! గుదిమెళ్ళవారు యువరాజావారికి ఉపనిషత్తుల బోధిస్తుంటే, తమరు విని గ్రంథస్థం చేశారటకదమ్మా! అందులో కొంత భాగం వినిపించండి తల్లీ!

రాణి : (వినయంలో) గురువులు, మీ ఎదుట నా అల్పజ్ఞానాన్ని ఎలా ప్రదర్శించనమ్మ!

కొ.సీ. : చూశారా తులసమ్మగారూ! మా శిష్యురాలి వినయం. అదే మరొకరైతేనా, మా రాణీగారి చదువులో వందోవంతు రాకపోయినా అంత ఎత్తు ఎగిరిపడేవారు.

జూతు : తల్లీ! ఆండాళ్ మహాదేవీ! నీవు సాక్షాత్తూ ఆ గోదాదేవివే! లేనిచో అంత ఆధ్యాత్మిక జ్ఞాన సంపత్తి ఎలా లభిస్తుందమ్మా. సీతమ్మగారన్న మాట నూటికి నూరుపాళ్ళు నిజం. బాలరామాయణానికి మీరు చెప్పిన అనువాదం ఎంత లలితంగా ఉంది! ఒక్కటి వినిపించు తల్లీ!

రాణి : అమ్మా! మీ ఇద్దరికంటే పండితురాలినా? చూడండి కృష్ణవేణమ్మగారూ! సీతమ్మగారి భగవద్గీత రచన, తులసమ్మగారి ఉపనిషత్తులు – స్త్రీలు అనే మహత్తర రచనల ముందు నా వచన గ్రంథమెంత?

కృవే : అదెంతమాట తల్లీ! మీ విద్వత్తు ఆస్థాన పండితులందరికీ విదితమే!

**విం.వేర. :** అమ్మా! మన పిఠాపుర ఆస్థాన కవులు పానుగంటి నరసింహారావుగారు తమ కృతిని 'ఆండాళ్మహాదేవికిన్' అని అంకితమిచ్చి ధన్యులయ్యారట.

**రాణి :** పానుగంటి వారి అభిమానానికి కృతజ్ఞురాలిని వేంకటరత్నమ్మగారూ! బ్రహ్మర్షి (రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు) బోధనలు బ్రహ్మసమాజానికే వన్నెతెచ్చాయి. మీ తమ్ముడు కృష్ణశాస్త్రి కూర్చిన బ్రహ్మసమాజ గీతాలు నాకెంతో ఇష్టం.

**పా.వెం. :** మహారాణీగారెంతో మక్కువతో బ్రహ్మసమాజ గీతాలు నేర్చుకొన్నారు. అమ్మా! మీరు దయతలచి ఓ పాట వీణమీద వాయిస్తే విని తరిస్తాం తల్లీ!

**రాణి :** పెదనాయనగారి ఏకేశ్వరోపాసన ఉపన్యాసాలు విన్నాక నాకే ప్రార్థనాగీతాలు వ్రాయాలనిపించేది. కృష్ణశాస్త్రిగారి ''మధురనామం బెవరు వినిచిరో'' నన్నెంతగానో ఆకట్టుకుంది.

**విం.వేర. :** తులసమ్మగారూ! పెదనాయనగారంటే ఎవరమ్మా?

**జూ.తు. :** బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడుగారు రాజావారు కాకినాడలో పెట్టిన 'కరుణాలయం' అనే అనాథ ఆశ్రమంలో పిల్లలు ఆయనకు 'పెదనాయన' అని పిలుస్తారమ్మా.

**విం.వేర. :** మా కృష్ణశాస్త్రి నాయుడుగారి అనుంగు శిష్యుడు మా తమ్ముడి పాటలు రాణిగారంతటి విదుషీమణి స్వయంగా పాడుతూ వీణమీద వాయిస్తున్నారంటే మా తమ్ముడి సాహిత్య జీవితం తరించింది.

**కొ.సీ. :** అమ్మా! వేంకటరత్నమ్మగారూ, మీ చిన్నారి చక్కగా నాట్యమాడుతుందని విన్నాను. రాణీగారి సముఖంలో అభినయింపజేసి రాణీగారి ఆశీస్సులు అందుకొన్నట్లయితే మీ చిరంజీవి నాట్యం మరింత రాణిస్తుంది.

**విం.వే. :** ఈ మధ్యనే నేర్చుకోవటం ప్రారంభించినదమ్మా. రాణీగారి ఆశీస్సులు మా అమ్మాయికి లభించాలనే ఇక్కడకు తీసుకువచ్చాను. ముందు రాణీవారికి నమస్కరించి మొదలుపెట్టమ్మా. కృష్ణవేణమ్మగారూ! 'కస్తూరీతిలకం' శ్లోకం అందుకోండమ్మా.

**కృ.వే. :** వెంకమ్మగారూ, నాతో గొంతు కలపండి
కస్తూరీతిలకం, లలాటఫలకే
వక్షస్థలే కౌస్తుభం, నాసాగ్రే నవమౌక్తికం
కరతలే వేణుం, కరేకంకణం, సర్వాంగే
హరిచందనం చ కలయం, కంఠే చ
ముక్తావళీం, గోపస్త్రీ పరివేష్టితే
విజయతే గోపాల చూడామణీ ॥విజయ॥

**రాణి :** ఎంత చక్కగా నాట్యమాడావుతల్లీ! ఈ చిన్నారి అనసూయ మీ వంశానికి ఘనకీర్తి తెస్తుందమ్మా, వేంకటరత్నమ్మగారూ!

**విం.వే. :** తమ ఆశీర్వాదం అమోఘం. మా అనసూయ జీవితం ధన్యమైంది.

**జూ.తు. :** సంగీత సాహిత్య గోష్ఠులేకాక, నాట్యంతో ఈనాటి కొలువు నిజంగా రాణీగారి కళాదర్బారుగా విరాజిల్లుతోంది.

(కరుణాలయం పిల్లలు రాణీగారి దగ్గరకు కోలాహలం రాబోతుంటారు. మందారమాల మెట్ల దగ్గరకి వెళ్తుంది.

**మం.మా. :** పిల్లలూ! అటు వెళ్ళకండి. పెద్దవాళ్ళంతా ఉన్నారు. మీరు దూరంగా వెళ్ళి ఆడుకోండి

**రాణి :** మందారమాలా! పిల్లల్ని అలా తరిమివేయకు, రండమ్మా! అమ్మాయిలూ అక్కయ్యలతో కలిసి ఊయలలూగారా?

**పిల్లలు :** అమ్మా! ఇప్పటివరకు ఉయ్యాలలూగి, మిఠాయిలు తినివచ్చాం. మళ్ళీ మమ్మల్ని పిఠాపురం ఎప్పుడు తీసుకువస్తారు?

**రాణి :** మీ పెద్దన్నయ్య పుట్టినరోజు అంటే అట్లతద్దినాడు మళ్ళీ వచ్చి ఆడుకొందురు గాని. మీరంతా కరుణాలయంలో బ్రహ్మసమాజ గీతాలు నేర్చుకొంటున్నారట

కదా! ఏదీ ఒకటి పాడండి (పిల్లలు మొహమాటంగా ఒకరి మొహాలు ఒకరు చూసుకొంటారు) అలా చూస్తున్నారేమిటీ దగ్గరగా కూర్చుని పాడండి. 'మధురనామంబెవరు వినిచిరో' పాడదామా! (పిల్లలతో కలిసి గొంతు కలుపుతారు).

రాణీగారు

పిల్లలు : మధురనామం బెవరు వినిచిరో
మరగి నిముసము వదలలేరు
అధమ జీవిక కెటుల దొరకునో
అంతులేని అమూల్య భాగ్యము

1. మెలుకవను మేమరచు నిద్దుర
మొరయు పవళుల మొరగు రాత్రుల
వెలుగుగా నెల మల్లెకలగా
వేయి విధముల విరిసిపోయెడు
|| మధుర ||

2. దారి పొడుగున బాటగా
నా ధైర్యబలముల యూతగా నా
యూతగా, విడరాని చెలిగా
ఉచ్ఛశాంతిగ, దీపకాంతిగ || మధుర||

3. తలపులోపల తళకుగా
నా పలుకు లోపల పరమార్థముగ నా
పనుల లోపల పటిమగా
విడివడని దీక్షగా, రక్షగా || మధుర ||

రాణి

మం. మా.: అమ్మా (మందారమాల పళ్ళబుట్ట తీసుకువస్తుంది. రాణీగారు పిల్లలకు స్వయంగా పళ్ళుపంచిపెడతారు)

రాణీ : జాగ్రత్తగా వెళ్ళిరండి నాయనా, తల్లులూ!

జూ. తు. : అమ్మా రాణీగారూ! ఈ అనాథ బిడ్డలెంత అదృష్టవంతులో కదా!

రాణి : అనాథబిడ్డలు కారమ్మా! ఆ (పైకి చూపి) నాథుని బిడ్డలు. భగవంతుడు ప్రసాదించిన వరాల మూటలు. ఈ బిడ్డలు తర్వాతనే నా బిడ్డలు.

విం. వే. : తులసమ్మగారూ! ఓసారి మా తమ్ముడు చెప్తే విన్నాను. రాజావారు ఓసారి యువరాజావారిని ఎత్తుకొని వీళ్ళెవరు బాబా అని అడిగారట, ఈ పిల్లల్ని చూపించి వెంటనే మూడేళ్ళ యువరాజావారు అక్కలు, అన్నలు అన్నారట.

జూ. తు. : ఏ గూటి చిలక, ఆ గూటి పలుకు పలుకుతుందికదమ్మా.

చెలి : అమ్మా! రాణీవారూ! కుంతీ మాధవస్వామి ఆలయంలో నర్తకీమణి పెండేల సత్యభామ 'నవజనార్ధన పారిజాతం' అభినయించనున్నారని, తిలకించడానికి రాణీ వారిని రావలసిందని శ్రీశ్రీశ్రీ మహారాజా సూర్యారావు బహద్దురు వారు కబురు పంపించారు.

రాణి : మంచిది. మేము వస్తున్నామని చెప్పి, శ్రీ కుంతీ మాధవస్వామి ఆలయంలో జరుగనున్న నాట్యోత్సవాన్ని వీక్షించడానికి వెళ్ళేముందు సభవారి అనుమతి కోరుతున్నాం. మీరందరూ సత్యభామమ్మ నాట్యాన్ని తిలకించడానికి తప్పక రావలసిందిగా కోరుతున్నాం.

కొ. సీ.

జూ. తు. : అలాగేనమ్మా! శుభమస్తు

రాణీ : మందారమాలా! (తాంబూలపళ్ళెంతో వస్తుంది, రాణీగారు పండిత తాంబూలాలను ఒక్కొక్కరికి ఇస్తారు).

జూతు : వచన రామాయణము వ్రాసి, వన్నెగాంచి దత్తపదులు, సమస్యలు తరుణులకునిచ్చి, పూరింప, వారిని మెచ్చి భూరి సత్కృతులు సేసి, వారలు సంతసింప,

కొ. సీ. : కావ్యముల సంకితము పొంది, కాంతలందు / కావ్యభీజములు నాటి, సద్గ్రంధములను / వెలయజేసిన చిన్నాంబ పృధ్వియందు / తా విరాజిల్లు నెపుడు ధర్మబుద్ధి || చిన్నాంబ ||

రాణి : గురువులు ఆశీస్సులకు ధన్యవాదాలు.

డా. ఎమ్.వి. భారతలక్ష్మి
కాకినాడ. ఫోన్ : 944 021 5330



జహా హదీద్

# కాంక్రీట్‌ను మైనంలా మలచిన జహా హదీద్


- కాండ్రేగుల నాగేశ్వరరావు

శిల్పం, వాస్తుశాస్త్ర నిర్మాణం, ఈ రెండు పురుషాధిపత్యంలో నడుస్తున్న కళలు. ఈ రెంటికీ శరీర ధారుఢ్యం ముఖ్యం. ప్రపంచవ్యాప్తంగా తక్కువ శాతంలో మాత్రమే స్త్రీలు ఇందులో పనిచేయడానికి ఉత్సుకత చూపుతారు. అటువంటి పురుష ప్రపంచంలోకి అడుగుపెట్టింది జహా హదీద్. అడుగు పెట్టడమేకాదు, ఆ రంగంలో కాకలు తీరిన యోధాను యోధులెందరినో పక్కకు పెట్టి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.


'Pritz Ren Architectural Prize'. ఇది వాస్తు కళా రంగంలో నోబెల్ బహుమతిలాంటిది. 2004లో ఆమె దీనిని కైవసం చేసుకుంది. దీని తరువాత బ్రిటీష్ యాన్యువల్ స్టెర్లింగ్ ప్రైజ్ ను 2010, 2011, 2012 సంవత్సరాలలో వరుసగా మూడుసార్లు గెలుచుకుని Hat trick సాధించింది.

జెమ్స్‌వాట్ ఆవిరి యంత్రం కనుగొనడంతో మానవశక్తికి ప్రత్యామ్నాయంగా అలసట ఎరుగని, వేగంతో కూడిన యంత్ర యుగంలోనికి పశ్చిమదేశాలు ప్రవేశించాయి. రైలు రాకతో వాణిజ్య సరుకులు ఒకచోటునుంచి మరొకచోటుకు వేగంగా, తక్కువ ఖర్చుతో చేరవేయబడటంతో వ్యాపార రంగం వందింతలుగా పెరిగింది. వ్యాపార కేంద్రాలయిన పట్టణాలకు మానవ వలసలు వెల్లివిరిశాయి. తక్కువ చోటులో ఎక్కువమందికి నివాసావకాశమేర్పరచే అవసరం కలిగింది. 1850 దశాబ్దాలలో ఇనుమును తక్కువ ఖర్చుతో తయారుచేసే విధానం బిస్మిల్లర్ కనుగొన్నాడు. 1789 నాటికే పోర్టు లాండ్ సిమెంట్ తయారులోకి వచ్చింది. Otis అనే కంపెనీ 1859లో Lift అనే పేరుతో క్యాబిన్‌లను (గది) తయారుచేసి మనుష్యులను, సరుకులను ఎంత ఎత్తుకైనా తీసుకునిపోగల సామర్థ్యాన్ని శాస్త్రీయంగా రూపొందించింది. ఈ శాస్త్రీయ నేపథ్యంలో న్యూయార్క్‌లాంటి నూతన నగరాలలో కొత్త భవనాలు నిర్మించబడ్డాయి. క్రమంగా భూమికి, ఆకాశానికి మధ్య త్రిశంకు స్వర్గం లాంటి జీవనాలకు ప్రజలు అలవాటుపడ్డారు. అగ్గిపెట్టెలు, సిగరెట్ పెట్టెలు నిలబెట్టినట్లుండే కళావిహీనమైన నిర్మాణాలవలన కళాత్మక నిర్మాణాలకు చరమగీతం పాడబడిందని కళాప్రియులు వాపోయారు. ఇంగ్లండ్, పారిస్, డెన్మార్క్‌లాంటి కొన్ని ఐరోపా దేశాలు ఎంతో అవసరమయితే తప్ప Sky Scrappers కు అనుమతినివ్వకుండా నిరోధించాయి.

Dull and Drab అని అందరిచేత ఈసడించబడే ఈ కాంక్రీట్ నిర్మాణాలను సైతం సౌందర్యవంతంగా



అజర్ బైజన్‌లోని కళానిలయం
(బయట)



లోపలి ఆడిటోరియం

☞



ఇసుక పొరల్లాంటి హర్మ్యాలు

రూపుదిద్దివచ్చుని, మారుతున్న ఈ కంప్యూటర్ యుగంలో, అందివచ్చిన డిజిటల్ టెక్నాలజీతో వాస్తుకళను తిరిగి పూర్వపు వైభవాన్ని తీసుకుని వచ్చేవిధంగా కొందరు ఆలోచనాపరులు కొత్త డిజైన్‌తో సరికొత్త నగర నిర్మాణాలను చేపట్టారు.

జహాః ఇరాక్‌లోని బాగ్దాద్‌లో 1950 వ సంవత్సరంలో జన్మించింది. తండ్రి జన్మతః ముస్లిం మతస్థుడైనా ఆధునిక భావాలుగల హేతువాది. తల్లి కళాకారిణి, మతఛాందసాలకు ఆమడ దూరంలో జీవితం. జహాః బీరుట్‌లోని అమెరికన్ యూనివర్శిటీలో గణితంలో పట్టభద్రురాలయింది. 1972వ సంవత్సరంలో లండన్‌లోని ఆర్కిటెక్చురల్ అసోసియేషన్‌లో వాస్తుశాస్త్రం అభ్యసించింది. 1977వ సంవత్సరం అనంతరం ఆఫీసు ఆఫ్ ది మెట్రోపాలిటన్ ఆర్కిటెక్చర్‌లో పనిచేసింది (ఒ.ఎమ్.ఎ.). 1980వ సంవత్సరంలో లండన్ నగరంలో హాంకాంగ్ పీక్ క్లబ్ వారి బహుమతి అందుకోవటంతో ఆమెకు మొదటిసారిగా అంతర్జాతీయ గుర్తింపు లభించింది. 1983లో జరిగిన అంతర్జాతీయ డిజైన్ కాంపిటీషన్‌లో ప్రథమ బహుమతినందుకుంది. అందరూ ఆమె డ్రాయింగ్‌ను మెచ్చుకున్నారు. కానీ అవి ఆచరణలో అసాధ్యమన్నారు. ఈ విమర్శను తట్టుకుంటూ ఆమె తనకున్న గణితశాస్త్ర అనుభవంతో కొత్త Geometrical materialను తయారుచేసుకుంది. ప్రారంభ దశలో క్రియాత్మకంగా, అవసరమైన వనరులు ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. నెమ్మది, నెమ్మదిగా ఒక్కొక్క భవన నిర్మాణం పూర్తయేసరికి ఆమెలో సృజనాత్మకతకు, కళాసౌందర్యానికి అందరూ మంత్రముగ్ధులైనారు. రెక్కలు తొడిగిన ఊహలకు క్రియాత్మకంగా రూపునిచ్చి సరికొత్త వాస్తుకళకు జవసత్వాలందించింది. తల్లి కడుపులో బిడ్డ నిద్రించినంత ప్రశాంతంగా ఉంటాయి ఆమె నిర్మాణాలు. భూగర్భం చీల్చుకొని నిశ్శబ్దంగా ఆకాశంలోకి విస్తరిస్తున్న కాంక్రీట్ పూలచెట్లలా, ఒక శిల్పి చెక్కిన పాలరాతి ముగ్ధగా ఆమె కళాకృతులు కానవస్తాయి.

అడవిలోని నదీప్రవాహపు వంపులు, ఇసుక తిన్నెలపై ఎడారి గాలులతో ఏర్పడిన అలలు తనను ప్రభావితం చేశాయని ఆమె చెబుతారు. మార్చి 31, 2016న హృద్రోగంతో అమెరికాలోని మియామీలో ఆమె తనువు చాలించింది. మరణించేనాటికి ప్రపంచం మొత్తం మీద 13 భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. బ్రిటీష్ ప్రభుత్వం ఆమెను Art commandar of the British గా 2015లో సత్కరించింది. ప్రపంచవ్యాప్తంగా ఆమె అందుకున్న ప్రశంసలు, బహుమతులకు లెక్కలేదు. షాంగైలోని ప్రభుత్వ సెక్రటేరియట్ Brood Art museum of London, అజర్ బైజన్‌లలో ఆమె గట్టిగా ఉండే కాంక్రీట్‌ను వెన్నెలలా ద్రవింప చేసి, భవని నిర్మాణం కొనసాగించింది. ఆర్కిటెక్చర్‌లో ఆమె జామెట్రీ నుంచి విడుదల చేసింది, The unbuildable Builder అంటూ ప్రఖ్యాత వాస్తు ఇంజనీర్లు ఆమెను ప్రశంసలతో ముంచెత్తారు.



గగన్ హౌమర్ ఫౌండేషన్ - న్యూయార్క్ - కార్ పార్కింగ్

కాండ్రేగుల నాగేశ్వరరావు
హైదరాబాద్. ఫోన్ : 994 808 3387

## వేదిక

*మిసిమి* ఏప్రిల్ సంచికలో ‘గీతం-సంగీతం’ శీర్షికన ఇచ్చిన వ్యాసం ఆలోచనాత్మకంగానే ఉంది. ‘సినిమా సంగీతమే సంగీతమని సంతృప్తిపడుతున్నాం’ అన్నారు ఇది పాక్షిక నిజం.

ఇప్పుడు సినిమాల్లో పాడుతున్నవాళ్ళను, ముఖ్యంగా అమ్మాయిలను ఇంటర్వ్యూ చేసినప్పుడు అమ్మదగ్గర నేర్చుకున్నాననో, అమ్మ ప్రోత్సాహంతో నేర్చుకున్నాననో, కర్ణాటక, హిందూస్తానీ సంగీతాలను కూడా ఆరేళ్ళపాటు నేర్చుకుని పాడేదాన్ని అనో చెబుతూనే ఫలానా సినీ సంగీత దర్శకుల దగ్గర పాడి సంగీత రంగంలో స్థిరపడడం అదృష్టం అంటూ వదిలేసిన జుట్టును పైకెరగేస్తూ స్టేట్‌మెంట్లిస్తుంటే పై వాక్యంలోని ‘సంతృప్తి’ పదం సరిపోతుంది. సినిమా పాట పాడితేనే అదీ రహమాన్ దగ్గర పాడితేనే ‘సంగీతం’ ధన్యమైపోతుందని గట్టిగా నమ్మే యువతరాన్ని మందలించేదెవరు?

కాని రహమానాదులు ఇలా అనుకున్నవాళ్ళు కాదు. వాళ్ళు సంగీతాన్ని ప్రేమించారు, ఆరాధించారు. ఇళయరాజా తమిళ వాసనలతో చేసినా పాటను పాశ్చాత్య చట్రంలో బంధించలేదు. సినిమా పాట మార్గాన్ని మరో సముజ్జ్వల మార్గం వైపు మళ్ళించాడు. ఆయన గీతానికి చరమగీతం పాడాడనడం తొందరపాటు తనమే అవుతుంది. నిజానికి చరమగీతం పాడింది ఏ ఒక్కరో కాదు, ఇళయరాజా తరువాత వచ్చినవారిలో 90 శాతం మంది అలా చేశారు. మిగిలిన 10 శాతం మంది గుర్తింపు లేకుండా మిగిలిపోయారు.

‘శాస్త్రీయ సంగీతాన్ని సామాన్య జనానికి అందుబాటులో లేకుండా చేసినవారు సంగీత పండితులు’ అనే అభిప్రాయం పూర్తిగా అసంబద్ధం. ఒక కళగాని, శాస్త్రంకాని ప్రతీ మనిషి దగ్గరికి వెళ్ళి తలుపులు తెరుచుకుని కూర్చోదు. కావలసిన సామాను కొనుక్కోవడానికి షాపుకు వెళతాంకానీ షాపును ఇంట్లోకి తీసుకురాలేం. శాస్త్రీయ సంగీతాభిరుచిని ఆస్వాదించే సంస్కారాన్ని అలవరచుకోవాలి, తెలుసుకోవాలి. అంతేకాని కిటుకు లేదు, కిటికీ లేదు. ఫ్యాషన్ కోసమని ఇలాంటి భావాలను ప్రచారం చేయటం తగదు.

**డా. ఎం. పురుషోత్తమాచార్య, నల్లగొండ**

*1. మనమందరూ సంగీత ప్రియులమే. ఇళయరాజా చేసిన పదిపాటలు మీకు గుర్తున్నాయా? అదే గీతాలతోసహా? తర్వాత వచ్చినవారు ఎంతమంది ఇళయరాజా స్థాయికి ఎదిగారు? మనం మంచి సంప్రదాయాన్ని, ప్రతిభను ఉత్సాహపరచాలి. కీర్తికి సొమ్ముకు కొమ్ముకాయకూడదు. త్యాగయ్యకు తిండికే లేదు. రామదాసు కారాగారంలో మగ్గిపోయాడు. అన్నమయ్య ఏ పురస్కారాలు ఆశించలేదు. సంగీత ఆరాధికులంటే వీరు.*

*భావవ్యక్తీకరణతో ఉద్వేగభరితం కాని సంగీతం ప్రజలకు చేరదు.*

*2. ఇప్పుడు ఏది కొనాలన్నా షాపుకు పోనవసరంలేదు. ఆన్‌లైన్ కొనుగోళ్ళు వచ్చి కావలసినవన్నీ వొళ్ళో వాలుతున్నాయి. ఈ సామ్యం సంగీతానికి చెల్లదు. ‘గీతం-సంగీతం’ ఉద్దేశ్యం - ఆవేదనే కాని - ప్రచారం కాదు, పాడిన పాటలే - పాచిపాటలు అందామా - పాడుతూ - పాడుతా తీయగా అనే టి.వి. కార్యక్రమాల సంగతి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత ఆరోగ్యం. వీరు చెప్పే ‘గొప్ప సాహిత్యం’ వేటూరి రెండర్థాల పదాలతోనే ‘సుసంపన్నం’ అయింది.*

*3. ఫ్రాంక్ సినాత్ర, ఎల్విస్ ప్రెస్లీ, బీటిల్స్, మైఖేల్ జాక్సన్, మెరియా కెరీ - వీరి గీతాలు, సంగీతం, పిచ్చి కేకలు అనుకునే శంకరశాస్త్రిది ఎంత పొరపాటో - అలాగే శంకరశాస్త్రిది అంతా శాస్త్రీయ సంగీతం అనుకోవటం మనదీ అంత పొరపాటే! ఇంతకీ చెప్పవచ్చేది - మన శాస్త్రీయ సంగీతం సంగీత ప్రేమికులకు చేరటంలేదు. అలాగే సినిమా సంగీతం, ముఖ్యంగా ’80ల తర్వాత మధ్యతరగతి సంగీత ప్రేమికులను అలరించలేకపోతోంది. మెలోడీ తగ్గి, మెకానిక్స్ పెరిగాయి. వాయిస్ వెనక్కుపోయి, వాయిద్యాల హోరు హెచ్చింది. ఇది ఎవరి పుణ్యమో - వినేవారి పాపం.*

*దానికి కారణాలు ఎన్నైనా వెతకవచ్చు. మనకు సినిమా నుంచి దూరంగా సోలో సింగర్స్, గ్రూప్‌లు ఎందుకు లేవు? దీనికి సమాధానం చెప్పుకోవటం అంత తేలిక కాదు. ఎంతో సొమ్ము సంపాదించిన సంగీత దర్శకులు దీనిమీద దృష్టిపెట్టరు. వారికి సినిమానే లోకం. అది సముజ్జ్వలం ఎలా అవుతుంది? సినిమా - సినామాయే కదా! ఈ సంచికలోనే ప్రచురించిన ఆకెళ్ళ వారి ఆవేదన, వారి సాధన చదవండి. మన పండితులు చేసిన కిటుకులు కొంతవరకైనా అర్థమవుతాయి. ఇంతవరకూ ‘కర్ణాటక సంగీతా’నికి సంతృప్తికరమైన వివరణే ఇవ్వలేకపోయారు పండితులు. ఒక్కవిషయం సూటిగా చెప్పండి - వీరి శాస్త్రీయ సంగీతాన్ని విని, ఆనందించాలంటే మనం శాస్త్రీయ సంగీతం నేర్చుకోవాలా? అలా అయితే ముందు చెప్పినట్లు సారా షాంగ్, ఆంద్రీ రూయి ల కన్సర్ట్‌లు విని, ఆనందిస్తున్న నాకు కనీసం వారి నోట్స్‌ను చూసే అవకాశం కూడా లేదే! మరి, అదంతా శాస్త్రీయం కాదా?! పావరోటీని ఎన్నిసార్లు విన్నా - అతని లిరిక్ ఒక్క ముక్క తెలియదు, కానీ ఇటీవల లిరిక్‌లతోపాటు వీడియోలు వస్తున్నాయి - అందులో ప్రేమ, విషాదం అతని గొంతులో పర్వత సానువుల్లో మారుమ్రోగే జలపాతంలా వినిపిస్తుంది కదా! మన అదృష్టం - ఇటీవల బాలమురళీకృష్ణగారు జయదేవుని అష్టపదులు కొన్ని పాడారు. ఎంత వినసొంపుగా ఉన్నాయి! ఎంత భావగాఢతతో తొణికిసలాడాయి! వీటికోసం ఎన్ని దశాబ్దాలు ఎదురు చూడాలి?!*


**- ఎ.కె.**





# చదవండి...

**- ఎన్నార్కె**


✧ **నిశ్చల :** ఉండవల్లి ఎమ్. నవల. ఇందులోని కథానాయకి పేరు నిశ్చల. ఒక వ్యక్తిని ప్రేమించి అతను కనబడ కుండా పోయేసరికి, మోసపోయి, జీవితానుభవం నుంచి పాఠాలు నేర్చుకుని తిరిగి ప్రియుణ్ణి పెళ్లాడటంతో కథ ముగుస్తుంది. రచయిత్రి యొక్క సులభ శైలి ఆకట్టుకుంటుంది.
అట్టమీద బొమ్మ లక్స్ ప్రకటనను తలపింపజేసేదిలా ఉంది. దీనిపై కొంచెం శ్రద్ధ కనపరిస్తే బాగుండేది.
*పేజీలు : 188, వెల : ₹ 100/-, ప్రతులకు - ఫోన్ : 9441347679.*




✧ **దోసిలిలో నది :** దాట్ల దేవదానం రాజు కవిత్వం. బహుముఖ ప్రజ్ఞాశాలి దాట్ల వారి కలం నుంచి జాలువారిన కవితా సంపుటి. దాట్ల దేవదానం రాజులో మానసికమైన వాస్తవిక ప్రతిబింబాల్లో మార్క్సిస్టు అవగాహన, సమకాలీన ప్రపంచీకరణ వాటి చుట్టూ పెనవేసుకున్న మానవీయత కనిపించడానికి ఈ సంకిష్టమైన అల్లికే కారణంగా కనిపిస్తుంది.
*పేజీలు : 86, వెల : ₹ 60/-, ప్రతులకు - అన్ని ప్రముఖ షాపులలో లభ్యం.*




✧ **సాత్విక భావాల సౌందర్య శిల్పి దాట్ల దేవదానం రాజు :** ఈ పుస్తక రచయిత్రి "సౌభాగ్య. నేను ఎవరు రాయమన్నా ఎప్పుడూ రాయలేదు. నాకు నచ్చితే ఎవరు వద్దన్నా రాయడం మానలేదు. దాట్ల వారి కవిత్వాన్ని చదివి పులకించి, ఆనందించి ఈ పుస్తకం రాశాను. ఇందులోని దాట్ల వారి అంతరంగం నేను ఆవిష్కరించింది సాహిత్యకారులకు ఆహ్లాదం కలిగిస్తుందని నమ్ముతున్నాను" అని అన్నాడు. దేవదానం రాజులోని కవిత్వాంశాను పట్టుకోవటం అందరికీ సాధ్యంకాదు. అది సౌభాగ్యకే చెల్లింది.
*పేజీలు : 74, వెల : ₹ 60/-, ప్రతులకు - అన్ని ప్రముఖ షాపులలో లభ్యం.*




✧ **బొడ్రాయి :** భారతీయ సాహిత్యంలో రైతులను పట్టించుకున్న రచయితల్లో మేరెడ్డి యాదగిరి రెడ్డి. ఈనాటి చాలామంది రచయితలు రైతు ఎడ అవగాహన లేకుండానే రైతుజీవితాన్ని జీవించడం దుస్సాహసమే. రైతు జీవితాన్ని సమగ్రంగా చిత్రించడానికి రైతు వెతను సామాజికలు తెలుసుకోవడానికి ఈ *బొడ్రాయి* చాలా తోడ్పడుతుంది. పాఠకులేకాక చాలామంది రచయితలూ ఈ గ్రంథాన్ని ఎంచి చూడవచ్చు. భారతీయ సాహిత్యంలో రైతులను పట్టించుకున్న రచయితల్లో ప్రథముడు మేరెడ్డి యాదగిరి రెడ్డి. ఈనాటి చాలామంది రచయితలు రైతు ఎడ అవగాహన లేకుండానే రైతు జీవితాన్ని చిత్రించడానికి పూనుకోవటం దుస్సాహసమే. రైతు జీవితాన్ని సమగ్రంగా చిత్రించడానికి రైతు వెతలను సామాజికులు తెలుసుకోవడానికి ఈ ***బొడ్రాయి కథలు*** బాగా తోడ్పడతాయి. పాఠకులే కాకుండా రైతులూ ఈ గ్రంథాన్ని తరచి చూడవచ్చు.
*పేజీలు : 144, వెల : ₹ 100/-, ప్రముఖ పుస్తక కేంద్రాలలో లభ్యం.*



✧ భారతీయ సాహిత్యంలో పిల్లలకోసమని ప్రత్యేకంగా రచనలంటూ ఏవీ లేవు. కొంతకాలంగా రచయితలు పిల్లల సాహిత్యం పేరుతో చిన్నచిన్న కథలు *చందమామ, జాబిలి* లాంటి పిల్లల పత్రికలలో కేవలం బాలల కోసమే కథలు వ్రాస్తూ వస్తున్నారు.
ఆ కోవలోదే ఈ పిల్లల నవల ***ఉనిమా లోకంలో.*** రచయితలూ రచయిత శ్రీ హరికోట అక్షర ముద్రలో శాస్త్రవేత్తగా పనిచేస్తూనే కంప్యూటర్ చేసే పనులు పిల్లలకు ఉత్సాహం కలిగించడమే కాదు ఆలోచింపచేస్తాయి. తన ఈ రచనలో కంప్యూటర్ ఎడల పిల్లలకూ, పెద్దలకూ పూర్తి అవగాహన కల్పించడానికి ప్రయత్నించారు. బావుంది ఆలోచన.





- ✧ శ్రీ చెరుకుపల్లి రామమూర్తి ***స్నేహపూర్ణిమ*** పేరుతో పిల్లల నవల రచించారు. పిల్లలకు ఆనందం హుషారూ కలిగించే ప్రగతిలో అప్పటికప్పుడు ఊహించి కథలు చెప్పే హాయీ కలిగినవారు. జంతువులలో కథలు నడిపించడం భారతీయ సాహిత్యంలో కొత్తేంకాకపోయినా రచయిత రామమూర్తి, చాలా జంతువులలోనే కథ నడిపించి పిల్లలను ఆనందింపచేయడానికి చేసిన కృషి అభినందనీయం.
- ✧ ***రాంబాబు జలుబు మందు*** పిల్లల నవలను ముంజులూరి కృష్ణకుమారి గారి రచన. వీరు మూడు దశాబ్దాల పిల్లల కథలు రాస్తూ వస్తున్నారు. ప్రత్యేకించి వీరు పిల్లలకోసమని, రేడియో ద్వారా గూడా గ్రామీణ బాలల కోసమని ప్రసారం చేసినవారు. వీరి రచనలకు ఎంతో ఎన్.సి.ఇ.ఆర్.టి. బరచమని, డాక్టర్ మరో దేవి పురస్కారాలు లభించాయి. గొప్ప మందు కనుగొన్న చిన్నారి పరిశోధమని పాఠకులు తప్పకుండా చదివితీరాలి.



- ✧ ముంజులూరి కృష్ణకుమారి మరో రచన ***చిన్నారితో కబుర్లు.*** ముంజులూరి కృష్ణకుమారిగారు రచయిత, రచయితలు చాలామందికి తెలిసినవారు. రచయిత ఆంధ్రప్రభలో చిన్నారి పేర శీర్షిక నిర్వహించారు. పిల్లల ఎడ ఎంతో వాత్సల్యంగల వీరు పిల్లలకోసమే ప్రత్యేకించి రచనలు చేశారు. అందులో ఈ చిన్న గ్రంథం ఒకటి. పిల్లలు ఆసక్తిచూపే డాల్ఫిన్స్ మాటలు వినపడతాయి. సైన్సు ప్రాజెక్టు చేయాలంటే సంగీతంలో జ్ఞాపకశక్తి కాస్తంత ఇలాంటి విషయాలు పిల్లలకు వేలల్లో అర్థమయ్యే భాషలో రచించారు. తప్పక చదవాల్సిన గ్రంథమిది. ఇది పిల్లల నవల.



**ముంజులూరి కృష్ణకుమారి**



- ✧ మంజులూరి కృష్ణకుమారివారి మరో రచన ***డాక్టర్ కాకి.*** ఇదీ పిల్లల నవలే. పిల్లలకు ఆసక్తిదాయికంగా ఉండేట్లు రాయటంలో కృష్ణకుమారిగారిది అందెవేసిన చేయి. ఎగురలేక పాపాయి పిచ్చుక బిక్కుబిక్కుమంటుంది. పొట్ట ఉబ్బి లేగదూడ బాధపడుతూంటేను కుక్కపిల్ల కుయ్యోమని ఏడుస్తుంటేనూ డాక్టర్ 'కాకి చేసిన వైద్యం' తప్పక చదవండి. పిల్లలు ఊహలు ఎలా ఉంటాయో తెలుస్తుంది.



- ✧ త్రిమూర్తి గారి రచన ***వెండి గుట్ట – బంగారుపుట్ట.*** ఇది పూర్తి పిల్లల నవల. రచయితల పిల్లలకు సైన్సు ఎలా బోధించాలో బాగా తెలిసినవారు. వీరి రచనల్లో కొన్ని సైన్సు కథలు, రెడియోకి కూడా కొన్ని సైన్సు నాటికలు రచించాలి. లక్షదీవుల్లో పిల్లలు ఏం చూశారు. అక్కడికి విషపు చీమలు, బంగారం, ఎలా వచ్చాయి. అసలాదీవుల రహస్యం ఏమిటి? అన్న విషయాలతో ఎంతో ఆసక్తికరంగా చెప్పారు. పెద్దలు ఆసక్తిగా చదవాల్సిన చిన్న గ్రంథం ఉంది.



- ✧ **చిచ్చర పిడుగులు** : హకీల్ బేరీ ఫిన్ సాహసాలు. ఆంగ్లమూలం – మార్క్‌ట్వేన్ – తెలుగు అనువాదం : ఎమ్.వి.వి. సత్యనారాయణ. అమెరికన్ సాహిత్యకారుల్లో ప్రముఖుడైన మార్క్‌ట్వేన్ రచనలలో టామ్‌సాయర్ సాహసాలు ఎన్నో భాషలలోకి అనువాదం అయింది. టామ్‌సాయర్ నవలకు కొనసాగింపే ఈ నవల. 175 సంవత్సరాలనాటి కథ. అంతర్జాతీయ కీర్తినార్జించిన ఈ నవలకు తెలుగు స్వేచ్ఛానువాదం. సులభమైన భాషేకాదు, పిల్లలను ఆకర్షించే విధంగా బొమ్మలు కూడా ఉన్నాయి. *పేజీలు : 110, వెల : ₹ 60/-, ప్రతులకు – 949 074 6614 కు ఫోన్ చేయండి.*



- ✧ **మూడు కోరికలు** : మరికొన్ని కథలు – ఐజక్ బషీవిష్ సింగర్ మూలరచనకు అనువాదం కె.బి. గోపాలం. ఇందులో మొత్తం 16 కథలున్నాయి. అన్ని కథలకు ఆకర్షించే బొమ్మలున్నాయి. *పేజీలు : 112, వెల : ₹ 60/-, ప్రతులకు – 949 074 6614 కు ఫోన్ చేయండి.*



- ✧ **పువ్వులకు రంగులు ఎందుకు?** : జీవుల తీరు గురించి, ప్రకృతిలో అవి బ్రతికే పద్దతి గురించి అర్థం చేసుకోవటం మనకు ఎంతో అవసరమని చెబుతుందీ పుస్తకం.

*పేజీలు : 110, వెల : ₹ 20/- ప్రతులకు – 944 050 3061 కు ఫోన్ చేయండి.*

*(పై రెండు పుస్తకాలు మంచిపుస్తకం, తార్నాక, హైదరాబాద్ వారి ప్రచురణలు.)*

# మిసిమి

మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹ 300/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింది గడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

## బహుమతిగా పంపండి

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో**
**మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధ-ధమ్మ-సంఘ (జె. లక్ష్మీరెడ్డి), 4. బుద్ధుని సూత్రసముచ్ఛయం, 5. మానవీయ బుద్ధ, 6. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 7. అంతర్వీక్షణం, 8. దూరతీరాలలో, 9. అగాధం, 10. ఓ ఖైదీ వీరగాథ, 11. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 12. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).


**పేరు :** ........................................................................
ఇం.నెం.....................................వీధి...........................
ఊరు.......................................పిన్ ..........................
సెల్ ........................................................................
**సంతకం :** ..........................................................

మీ చిరునామా ఇక్కడ రాసి, వాట్సాప్ (994 951 6567)గానీ, ఇ-మెయిల్ (misimi_monthly@yahoo.in) ద్వారాగానీ పంపండి.

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | **STATE BANK OF INDIA** |
| Account | : | **MISIMI** |
| A/c. No. | : | **10261569316** |
| Branch | : | **Saifabad, Hyderabad, INDIA** |
| IFS Code | : | **SBIN0007315** |

(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 50/- బ్యాంకు ఛార్జీలు కలపండి.)




**రెండు సంవత్సరాల చందాదారులకు (₹ 600+50/-) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి**



**నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ 1200+50/-) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి**





**మూడు సంవత్సరాల చందాదారులకు (₹ 900+50/-) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి**



**అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ 1500+50/-) మిసిమి 2013/2014 సంచికల బౌండ్ పుస్తకం బహుమతి**


మిసిమి
మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**




కుశలమే!

MISIMI / **మిసిమి** / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.05.2016




డెల్ఫీ వీధి